
'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 317

సోమవారం 31-7-2023




బౌలింగ్‌లోనూ తడబాటే..
రెండో వన్డేలో టీమిండియా ఓటమి.. విండీస్‌ను గెలిపించిన హోప్ - 12లో



ఫారిన్ టూర్‌కు ఫారెక్స్ కార్డు!
అన్ని దేశాల్లోను ఆమోదనీయం.. సౌకర్యంగా చెల్లింపులు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నా మట్టి.. నా దేశం
దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి గౌరవార్థం ఆగస్టు 15 వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రధాని మోదీ చెప్పారు.
వివరాలు 6లో ▸



హింస నివారణలో విఫలం
మణిపూర్ హింసాకాండను అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విపక్ష 'ఇండియా' కూటమి ఆరోపించింది.
వివరాలు 6లో ▸




అమెరికా పరికరాల్లో మాల్‌వేర్!
తమ రక్షణ పరికరాల్లో చైనా హ్యాకర్లు ఓ మాల్‌వేర్‌ను ప్రవేశపెట్టారని అమెరికా సైనిక అధికారులు అనుమానిస్తున్నారు.
వివరాలు 6లో ▸



మాస్కోపై మళ్లీ డ్రోన్ దాడి
రష్యా రాజధాని మాస్కోలో ఆదివారం డ్రోన్ దాడి జరగ్గా.. ఒకరు గాయపడ్డారు. దీంతో గగనతలాన్ని కొద్దిసేపు మూసివేశారు.
వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్



'పట్టు' తప్పిన రాతలు

- పట్టుగూళ్ల సగటు ధర కిలో రూ.470–620లు
- ధరల నియంత్రణకు ఈ–మార్కెటింగ్ వ్యవస్థ
- నాలుగేళ్లలో ఈ రైతులకు 19.41 కోట్ల బైవోల్టిన్ కకున్
- పట్టు రీలర్లకు రూ.8.20 కోట్ల రాయితీలు చెల్లింపు
- మరో రూ.13.12 కోట్లు విడుదలకు చర్యలు.. నాలుగేళ్లలో కొత్తగా 39,640 ఎకరాల్లో సాగు
- అదనంగా 13,905 టన్నుల బైవోల్టిన్ రకం పట్టుగూళ్ల ఉత్పత్తి.. వీటికి కిలోకి రూ.300కు మించి దక్కడం లేదంటూ విషపు రాతలు
- పట్టు రైతుకు కుచ్చుటోపీ పెట్టిందంటూ గుండెలు బాదుకున్న ఈనాడు

3లో

అమ్మ ప్రేమతో 'గోరుముద్ద'

44 వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలల్లో పక్కాగా అమలు

- ఉదయం 9.30కే మధ్యాహ్న భోజనం లెక్కలు సిద్ధం
- వేడివేడిగా ఆహారం.. ఆన్‌లైన్‌లో ఫొటోలతో నమోదు.. స్వయంగా రుచి చూస్తున్న ఉపాధ్యాయులు
- మూడంచెల్లో ఆహారం నాణ్యత పరిశీలన.. రాగి జావ పంపిణీతో విద్యార్థుల్లో ఉత్సాహం
- ప్రతి గురువారం క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు
- కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్



అల్లిపూడి, నాతవరం నుంచి
నానాజీ అంకంరెడ్డి, సాక్షి ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా 44,392 ప్రభుత్వ పాఠశాలల్లో 'జగనన్న గోరుముద్ద' కింద పోషక విలువలతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. విద్యార్థులు ఉదయం బడికి రాగానే హాజరు తీసుకుని అందుకు అనుగుణంగా ఆహారాన్ని సిద్ధం చేసేందుకు మెనూ సరుకులు అందచేస్తున్నారు. పిల్లల అభిప్రాయాలను అడిగి తెలుసుకుంటూ అందుకు తగ్గట్టు వంట చేస్తున్నారు. వివరాలను పారదర్శకంగా రిజిస్టర్‌లో

మిగతా 2వ పేజీలో ▶

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

అనకాపల్లి జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాన్ని ఆనుకుని ఉండే నాతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు నుంచి 10వ తరగతి వరకు 590 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంకా ప్రవేశాలు కొనసాగుతున్నాయి. ఉదయం 9.30 గంటలకల్లా ఆన్‌లైన్‌లో విద్యార్థుల హాజరు పూర్తి చేశారు. ఆ వెంటనే అందుకు తగ్గట్టుగా నిర్దేశిత కొలత ప్రకారం మంగళవారం మెనూ అనుసరించి రాగి పిండి, చింతపండు పులిహోర కోసం బియ్యం, ఇతర సరుకులను వంట సిబ్బందికి అందజేశారు. ఉదయం 10.20 గంటలకు బెల్లంతో చేసిన రాగిజావ ఇచ్చారు. మధ్యాహ్నం 12.20కి పులిహోర, దొండకాయ చట్నీ, ఉడికించిన గుడ్డు అందించారు. ఆరోజు బడికి హాజరైన 500 మంది విద్యార్థులు బడిలో అందించిన ఆహారాన్నే తీసుకున్నారు. మండల విద్యాశాఖాధికారి అమృత కుమార్ పులిహోరను రుచి చూసి పిల్లల అభిప్రాయం తెలుసుకుని రిజిస్టర్‌లో నమోదు చేశారు.

ఇస్రో మరో వాణిజ్య విజయం

పీఎస్‌ఎల్‌వీ సిరీస్‌లో 56వ సారి విజయకేతనం



షార్ నుంచి పీఎస్ఎల్‌వీ సీ–56 ఉపగ్రహ వాహకనౌక ఆదివారం ఉదయం 6.31 గంటలకు విజయవంతంగా అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. దీంతో ఈ ఏడాదిలో ఇస్రో మూడో వాణిజ్య విజయాన్ని సొంతం చేసుకుంది. ఇస్రో శాస్త్రవేత్తలు 23 నిమిషాల వ్యవధిలో సింగపూర్‌కు చెందిన ఏడు ఉపగ్రహాలను భూమికి 535 కిలోమీటర్ల ఎత్తులోని నియో ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టారు.

- వివరాలు 6లో

భారీ ప్రాజెక్టులతో విశాఖ కళకళ



ఏయూ డిజిటల్ జోన్ అండ్ స్మార్ట్ క్లాస్ రూమ్స్ కాంప్లెక్స్

- రేపు సీఎం జగన్ చేతుల మీదుగా ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన
- జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- రూ.135.88 కోట్ల విలువైన పనులకు సీఎం భూమి పూజ
- రూ.129 కోట్లతో ఏయూలో నిర్మించిన ప్రాజెక్టుల ప్రారంభం
- నగర వాసులకు సదుపాయాలు.. ఆహ్లాదం.. ఆరోగ్యం.. ఆవిష్కరణలే లక్ష్యం

- వివరాలు 14లో

కొత్త కోర్టులతో సత్వర న్యాయం అందాలి

జ్యుడిషియల్ సిబ్బందికి హైకోర్టు న్యాయమూర్తుల సూచన

విజయనగరంలో అదనపు సీనియర్ సివిల్ కోర్టు ప్రారంభం

- వివరాలు 14లో

ఇదండీ సంగతి



మరోసారి ఇక ఎవ్వరూ దరఖాస్తు చేయరు సార్!

కోటికి చేరువలో 'జగనన్న సురక్ష'

నేటితో ముగియనున్న కార్యక్రమం

- 15,002 సచివాలయాల వద్ద క్యాంపులు పూర్తి
- రాష్ట్రవ్యాప్తంగా 1.38 కోట్ల కుటుంబాల వద్దకు వలంటీర్లు
- 40.52 లక్షల మందికి కుల ధ్రువీకరణ పత్రాలు
- 38.52 లక్షల మందికి ఇన్‌కమ్ సర్టిఫికెట్లు



తిరుపతిలో జరిగిన 'జగనన్న సురక్ష'లో తాము అందుకున్న సర్టిఫికెట్లతో లబ్ధిదారులు

సాక్షి, అమరావతి: ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా నెల రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 1.38 కోట్ల కుటుంబాలను ఇంటి వద్ద కలుసుకోవడం ద్వారా పెండింగ్ సమస్యలు లేకుండా అధికార యంత్రాంగం ప్రతి ఇంటినీ జల్లెడ పట్టింది. జూన్ 23వ తేదీన సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం నేటితో (జూలై 31వ తేదీ) ముగియనుంది. రాష్ట్రవ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా శనివారం నాటికే 15,002 సచివాలయాల వద్ద మండల స్థాయి అధికారుల స్థాయిలో ప్రత్యేక వినతుల పరిష్కార క్యాంపులు పూర్తయ్యాయి. సోమవారం మిగిలిన రెండు సచివాలయాల వద్ద క్యాంపులు కొనసాగుతాయని సచివాలయాల శాఖ అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి అర్హులు ఏ ఒక్కరూ మిగిలిపోరాదనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. విద్యాసంస్థల్లో అడ్మిషన్లు జరుగుతున్న తరుణంలో

మిగతా 2వ పేజీలో ▶

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక ఓఎన్జీసీ కాలనీలో పడవపై తాగునీరు సరఫరా చేస్తున్న గ్రామ వలంటీర్లు



వరద బాధితులకు కొండంత అండ


ఆగమేఘాల మీద సహాయక చర్యలు చేపట్టిన ప్రభుత్వం

- 79 పునరావాస కేంద్రాల్లో 48,345 మంది బాధితులు
- ప్రభావిత ప్రాంతాల్లో వారికి నిత్యావసరాలు పంపిణీ
- పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి ప్రత్యేక ఆర్థికసాయం
- ముమ్మరంగా జరుగుతున్న పారిశుధ్య పనులు

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూత అందిస్తోంది. వరద వచ్చే అవకాశం ఉందని తెలిసినప్పటినుంచే అప్రమత్తమై ఏ ఒక్క కుటుంబానికి ఇబ్బంది కలగకుండా చూసేందుకు రంగంలోకిదిగి అవసరమైన ఏర్పాట్లు చేసింది. ఉన్నతాధికారులు, ఆ జిల్లాల కలెక్టర్లతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకుని యుద్ధప్రాతిపదికన పునరావాస ఏర్పాట్లకు

మిగతా 5వ పేజీలో ▶

కృష్ణాలో తగ్గిన వరద



పరీవాహక ప్రాంతంలో వర్షాలు తెరిపివ్వడంతో కృష్ణా నదిలో వరద ప్రవాహం తగ్గింది. ఆదివారం సాయంత్రానికి శ్రీశైలం ప్రాజెక్టులోకి 82,055 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి మట్టం 846.7 అడుగులకు పెరిగింది. నీటి నిల్వ 73.23 టీఎంసీలకు చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టు నిండాలంటే ఇంకా 142 టీఎంసీలు అవసరం.

5లో

ధవళేశ్వరం వద్ద గోదావరి దూకుడు



ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గోదావరి వరద ఉధృతి దూకుడు ప్రదర్శిస్తోంది. ఆదివారం సాయంత్రం బ్యారేజ్‌లోకి 16,43,480 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటిమట్టం 16 అడుగులకు చేరుకుంది. దీంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు కొనసాగిస్తున్నారు. గోదావరి డెల్టాకు 10,700 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగిలిన నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.

5లో

ప్రభుత్వంపై ఆరోపణలు రామోజీకి మామూలే




'ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ఈనాడు రామోజీరావుకు సర్వసాధారణమైపోయింది. ఈనాడుపై ఎప్పుడైనా దివంగత సీఎం వైఎస్సార్ గానీ ఆయన తనయుడు, సీఎం జగన్ దాడులు చేయించారా?. రామోజీకి ఏమైనా జరిగితే చంద్రబాబు, బీజేపీ, కమ్యూనిస్టులు, కాంగ్రెస్ నేతలకు కోపం వస్తుంది' అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు.

10లో

భూగోళం.. ఇక మండే అగ్నిగోళం

గ్లోబల్ వార్మింగ్ యుగం ముగిసింది



- బాయిలింగ్ శకం మొదలైంది.. ప్రపంచానికి ఐక్యరాజ్యసమితి హెచ్చరిక
- జూలైలో ప్రపంచవ్యాప్తంగా రికార్డు ఉష్ణోగ్రతలు నమోదు
- 1.20 లక్షల సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- హీట్‌వేవ్‌ను ఎదుర్కొన్న ఐరోపా దేశాలు.. ఉష్ణోగ్రతల కట్టడికి ఐరాస చర్యలు

సాక్షి, అమరావతి: భూగోళం మండే అగ్నిగోళంగా మారుతోంది. శీతల దేశాల్లో సూర్యుడు సెగలు పుట్టిస్తున్నాడు. ఎండల ధాటికి ఓ వైపు అడవులు దగ్ధమైపోతుండగా.. మరోవైపు మంచు కరిగిపోయి వరదలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. గ్లోబల్ వార్మింగ్ యుగం ముగిసిపోయిందని.. ఇక గ్లోబల్ బాయిలింగ్ శకం వచ్చేసిందని ఐక్యరాజ్యసమితి సైతం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇందుకు తగ్గట్టుగానే ఈ ఏడాది జూలైలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని యూరోపియన్ కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్, ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించాయి. సాధారణంగా జూలైలో ప్రపంచ సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 16 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యేదని.. కానీ, ఈ ఏడాది దాదాపు 17 డిగ్రీలకు పెరిగిందని వెల్లడించాయి. 1.20 లక్షల సంవత్సరాల్లో భూమి ఇంత వేడెక్కడం ఎప్పుడూ లేదని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. దక్షిణ అర్ధగోళంలో విపరీత వేడి కారణంగా మంచు కరిగి

మిగతా 14వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఇస్రోకు గవర్నర్ అభినందనలు



సాక్షి, అమరావతి: పీఎస్ఎల్వీ–సి56 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రోను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అభినందించారు. ఈ విజయం ఇస్రో కీర్తి కిరీటంలో మరో కలికి తురాయి అని గవర్నర్ అభివర్ణించారని రాజ్‌భవన్ వర్గాలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపాయి.

ఇస్రో మరిన్ని విజయాలు అందుకోవాలి



సాక్షి, అమరావతి: పీఎస్ఎల్వీసీ–56 వాహననౌక ద్వారా 7 ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ఇస్రో శాస్త్రవేత్తల బృందాన్ని సీఎం వైఎస్ జగన్ అభినందించారు. భవిష్యత్తులో మరెన్నో అద్భుతమైన విజయాలను ఇస్రో అందుకోవాలని ఆకాంక్షిస్తూ ఆదివారం ప్రకటన విడుదల చేశారు.

కరికాల వలవన్ సర్వీసు మరో ఏడాది పొడిగింపు




సాక్షి, అమరావతి: దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఆయన ఈ నెల 31తో పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కరికాల వలవన్ పదవీకాలాన్ని మరో ఏడాది కొనసాగిస్తూ సీఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఏఐసీటీఈతో ఇన్‌స్సెల్ ఒప్పందం

సాక్షి, న్యూఢిల్లీ: విద్యార్థుల నైపుణ్యం పెంచుకోవడానికి, వారి అర్హతల సమాచారం నిక్షిప్తం చేసుకోవడానికిగాను వినూత్న పోర్టల్‌కు సంబంధించి హైదరాబాద్‌కు చెందిన ఇన్‌స్సెల్ సంస్థతో ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) అవగాహన ఒప్పందం చేసుకుంది. రెండురోజులపాటు ప్రగతి మైదాన్‌లో నిర్వహించిన అఖిల భారత శిక్ష సమాగం–2023లో భాగంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఏఐసీటీఈ చైర్మన్ సీతారాం, ఏఐసీటీఈ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ బుద్ధా చంద్రశేఖర్ సమక్షంలో అధికారులు, సంస్థ ప్రతినిధులు ఎంవోయూ చేసుకున్నారు. సంస్థ సీఈవో కిరణ్ మాట్లాడుతూ గతేడాది నుంచే ఎస్ఆర్ఏఎన్ అనే పోర్టల్ తీసుకొచ్చామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విద్యార్థుల ధ్రువపత్రాలు సరిచూసుకోవడానికి, డాటా స్టోర్ చేసుకోవడానికి, విద్యార్థుల పూర్వసమాచారం, నైపుణ్యం తెలుసుకోవడానికి ఈ పోర్టల్ ఉపకరిస్తుందన్నారు. పాస్‌కార్డు మాదిరిగా విద్యార్థికి ఓ గుర్తింపు నంబర్ డాటాబేస్ ఈ పోర్టల్ ద్వారా రూపొందించొచ్చని తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా విద్యార్థులు, ఉద్యోగార్థులు, ఉద్యోగులు రూ.1,200 కే నిర్దిష్టమైన ప్రొఫెషనల్, పలు కోర్సులు, ఫారిన్ లాంగ్వేజ్‌లు, పోటీ పరీక్షల అంశాలు నేర్చుకొని ప్రావీణ్యం పరీక్షించుకోవచ్చని కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కృష్ణ, ప్రత్యూష, సాహిత్య, వన, చరణ్ పాల్గొన్నారు.

బైలింగువల్ పుస్తకాలకు కేంద్ర మంత్రి కితాబు


స్టాల్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న ధర్మేంద్ర ప్రధాన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న బైలింగువల్ టెక్స్ట్ బుక్స్, మాతృభాషా పుస్తకాలను అందించడంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభినందనలు తెలిపారు. ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో 'అఖిల భారతీయ శిక్షా సమాగం'లో భాగంగా ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ, సమ గ్ర శిక్షా విభాగాలు ప్రత్యేక స్టాల్‌ను ఏర్పా టు చేశాయి. దీనిని ఆదివారం కేంద్ర విద్యాశాఖ మంత్రి సందర్శించారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి మాతృ భాషాధారిత బహుభాష (సవర, కొండ, కువి, ఆదివాసీ ఒడియా, కోయ, సుగాలి), బైలింగువల్ పాఠ్య పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించారు. జాతీయ విద్యావిధానం–2020 మూడో వార్షికోత్సవంలో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహించిన 'అఖిల భారతీయ శిక్షా సమాగం' శనివారం ప్రధాని మోదీ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆదివారం సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఏపీలో నూతన జాతీయ విద్యా విధానం అమలు తీరు, డిజిటల్ విద్యా బోధన, విద్యా ర్థులకు ట్యాబ్‌ల పంపిణీ, బైలింగువల్ టెక్స్ట్ బుక్స్, తరగతి గదుల్లో ఐఎఫ్‌పీ స్క్రీన్ల ద్వారా బోధన, విద్యా కానుక, మనబడి నా డు–నేడు వంటి విద్యా సంస్కరణలను కేంద్ర మంత్రికి వివరించగా ఆయన విద్యాభివృద్ధికి ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందించారు.

డిసెంబర్‌కు రెడీ!


పూర్తయిన నార్త్ బ్రేక్ వాటర్ పనులు

శరవేగంగా సాగుతున్న రామాయపట్నం పోర్టు నిర్మాణం

- పూర్తయిన బ్రేక్‌వాటర్, డ్రెడ్జింగ్ పనులు.. బల్క్‌కార్గో హ్యాండ్లింగ్ బెర్త్ పనులు ప్రారంభం


సాక్షి, అమరావతి: రామాయపట్నం పోర్టును డిసెంబర్‌కి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకనుగుణంగా పటిష్టమైన ప్రణాళికతో పనులను శరవేగంగా పూర్తి చేస్తోంది. రూ.3,736 కోట్లతో 850.79 ఎకరాల విస్తీర్ణంలో ఏడాదికి 34.04 మిలియన్ టన్నుల సామర్థ్యంతో రామాయపట్నం తొలి దశ పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంగతి తెలిసిందే. రూ.2,634.65 కోట్ల విలువైన పోర్టు నిర్మాణ కాంట్రాక్ట్‌ను నవయుగ–అరబిందో భాగస్వామ్య కంపెనీ చేపట్టింది. జూన్, 2022లో నిర్మాణ పనులు ప్రారంభించిన ఈ సంస్థ తొలి దశలో డిసెంబర్‌కి బల్క్ కార్గో బెర్త్‌ను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. మొత్తం 4 బెర్తులు నిర్మిస్తుండగా అందులో 2 మల్టీపర్పస్ బెర్తులు జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా, ఒక మల్టీపర్పస్ బెర్తు ఇండోసోల్ క్యాపిటివ్ (సొంత) అవసరాలకు ప్రభుత్వం కేటాయించింది. బల్క్ కార్గో హ్యాండిల్ చేసే నాలుగో బెర్త్‌ను ఏపీ మారిటైమ్ బోర్డు నిర్వహించనుంది. పోర్టు నిర్మాణంలో కీలకమైన బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్ పనులు పూర్తి కావడంతో పాటు నార్త్ బ్రేక్ వాటర్‌ను ఆనుకొని బల్క్ కార్గో బెర్త్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీనికి అదనంగా సముద్రపు ఒడ్డుపై (ఆఫ్‌షోర్) అవసరమైన కస్టమ్స్, సెక్యూరిటీ, అడ్మినిస్ట్రేషన్ పనులతో పాటు కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను చేపట్టింది. డిసెంబర్‌కి పోర్టులో వాణిజ్య పరంగా కార్యకలాపాలను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారని, దీనికనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు రామాయపట్నం పోర్టు మేనేజింగ్ డైరెక్టర్ పి.ప్రతాప్ 'సాక్షి'కి తెలిపారు. బెర్తుల నిర్మాణంలో కీలకమైన అప్రోచ్ ట్రెస్టెల్ నిర్మాణ పనులు 80% పూర్తయ్యాయని, పోర్టు నిర్వహణకు అవసరమైన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ లేఖ రాయడంతో పాటు కస్టమ్స్ కార్యకలాపాల కోసం 27.88 ఎకరాలను కేటాయించినట్లు చెప్పారు. కస్టమ్స్ నిబంధనలు అనుసరించి సరుకు నిర్వహణ చేపట్టడం, రామాయపట్నం పోర్టును ఇమ్మిగ్రేషన్ ల్యాండింగ్ పాయింటింగ్ ప్రకటించడం వంటి దానికోసం కేంద్ర సంస్థలతో సంప్రదింపులు చేస్తున్నట్లు చెప్పారు. పోర్టు నిర్వహణకు అవసరమైన అన్ని అనుమతులు నవంబర్‌లోగా తీసుకువస్తామని తెలిపారు.

మౌలిక వసతుల కల్పన

పోర్టు నిర్మాణంతో పాటు పోర్టుకు అవసరమైన రహదారి, రైలు మార్గం, నీటి వసతి వంటివాటిపై ఏపీ మారిటైమ్ బోర్డు వేగంగా అడుగులు వేస్తోంది. జాతీయ రహదారి నుంచి రామాయపట్నం పోర్టును అనుసంధానిస్తూ 4 లైన్ల రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. 5.5 కి.మీ పొడవైన రహదారి మార్గాన్ని కొత్తగా అభివృద్ధి చేస్తున్నారు. 5 కి.మీ రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించి రైల్వేతో చర్చిస్తున్నారు. పోర్టు నిర్వహణకు అవసరమైన నీటిని కావలి వాటర్ ట్యాంక్ నుంచి వినియోగించుకోవడానికి ప్రభుత్వం అనుమతించింది.


జాతీయ రహదారిని అనుసంధానిస్తూ నాలుగులైన్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్ నిర్మాణ పనులు


బల్క్ కార్గో బెర్త్ నిర్మాణం చేస్తున్న దృశ్యం



ఎస్సీలకు సాయంలో

ఏపీ అగ్రగామి

రాష్ట్రంలో గత ఆర్థిక ఏడాది 51.91 లక్షల కుటుంబాలకు లబ్ధి

- కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ వెల్లడి
- 24 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కలిపి 53.86 లక్షల కుటుంబాలే
- ఈ లెక్కన ఒక్క ఏపీలోనే 96.39 శాతం లబ్ధిదారులు.. ఈ ఏడాది జనవరి–మార్చిలో అదనంగా 15.99 లక్షల ఎస్సీ కుటుంబాలకు సాయం
- జాతీయ ఆహార భద్రత చట్టం నూటికి నూరు శాతం అమలు
- రాష్ట్రంలో 99.98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే
- 7.24 లక్షల మంది పట్టణ పేదలకు సాయం
- లక్ష్యానికి మించి పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్లు
- పూర్తి స్థాయిలో పని చేస్తున్న అంగన్‌వాడీలు, ఐసీడీఎస్‌లు
- లక్ష్యానికి మించి కొత్తగా స్వయం సహాయక సంఘాల ఏర్పాటు

సాక్షి, అమరావతి: ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు ఎస్సీ కుటుంబాలకు సహాయం అందించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా దేశంలోని 24 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 53,85,270 ఎస్సీ కుటుంబాలకు సహాయం అందించగా.. ఇందులో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 96.39% అంటే 51,91,091 ఎస్సీ కుటుంబాలు ఉన్నాయి. మరే రాష్ట్రం కనీసం లక్ష మంది ఎస్సీ కుటుంబాలకు కూడా సహాయం అందించలేదు. ఈ విషయాన్ని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక స్పష్టం చేసింది. 2022–23 ఆర్థిక ఏడాదిలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వివిధ పథకాలు, కార్యక్రమాలు అమలు పురోగతిపై విశ్లేషణాత్మక నివేదికను విడుదల చేసింది. లక్ష్యాల కన్నా 90% పైగా అమలు చేసిన రాష్ట్రాల పనితీరు చాలా బాగుందని, లక్ష్యాలలో 80% నుంచి 90% మధ్య సాధిస్తే మంచి పనితీరు చూపిందని.. 80% లోపు ఉంటే ఆ రాష్ట్రాల పనితీరు పేలవంగా ఉందని నివేదిక విశ్లేషించింది. గతంలో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు విడుదల చేసిన నివేదికలో రాష్ట్రంలో 33.57 లక్షల ఎస్సీ కుటుంబాలకు సాయం అందించిందని, అనంతరం జనవరి నుంచి మార్చి వరకు అదనంగా మరో 18.34 లక్షల కుటుంబాలకు సాయం చేసిందని నివేదిక స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ తర్వాత అత్యధికంగా కర్ణాటకలో 59,345 ఎస్సీ కుటుంబాలకు సహాయం అందింది.

పట్టణ పేదలకూ చేయూత

గత ఆర్థిక ఏడాది పట్టణ పేదలకు సాయం చేయడంలో కూడా దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉన్నట్లు కేంద్ర నివేదిక స్పష్టం చేసింది. దేశంలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలన్నింటిలో కలిపి మొత్తం 8.49 లక్షల మంది పట్టణ పేదలకు సాయం అందగా, అందులో 7,24,776 మంది ఏపీ వారేనని నివేదిక పేర్కొంది. పట్టణ ప్రాంతాల్లో తక్కువ ఆదాయం గల కుటుంబాలకు 2.67 లక్షల ఎల్ఐజీ గృహాలను రాష్ట్రంలో నిర్మించగా, ఇతరత్రా దేశ వ్యాప్తంగా 9.15 లక్షల గృహాలు నిర్మించారని తెలిపింది. 2022–23 ఆర్థిక ఏడాదిలో ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ ఆహార భద్రత చట్టాన్ని నూటికి నూరు శాతం అమలు చేశారని ప్రశంసించింది. 18.47 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను పంపిణీ చేశారని తెలిపింది. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద లక్ష్యానికి మించి కొత్తగా 33,122 స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించారని స్పష్టం చేసింది. గత ఆర్థిక ఏడాదిలో ఏపీలో 24,852 వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్నది లక్ష్యం కాగా, 1,24,311 పంపు సెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు నివేదిక స్పష్టం చేసింది. ఇది లక్ష్యానికి 500 శాతం మేర అధికం అని తెలిపింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 99.98 శాతం డెలివరీలు (ప్రసవాలు) ఇన్‌స్టిట్యూషన్లలోనే జరిగాయని నివేదిక పేర్కొంది. ఇలా రాష్ట్రంలో 7,61,629 డెలివరీలు జరిగాయని తెలిపింది. ఏపీలో 55,607 అంగన్‌వాడీ కేంద్రాలు నూటికి నూరు శాతం చాలా మంచి పనితీరు కనపరిచాయని, 257 ఐసీడీఎస్ బ్లాక్‌లు (సమగ్ర శిశు అభివృద్ధి కేంద్రాలు) చక్కగా పని చేశాయని ప్రశంసించింది.

కోటికి చేరువలో 'జగనన్న సురక్ష'

▶ మొదటి పేజీ తరువాయి

విద్యార్థులకు అవసరమయ్యే ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు మొత్తం 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఈ క్యాంపుల ద్వారా ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండా ఉచితంగా అందజేశారు. ప్రతి సచివాలయం పరిధిలో వారం పాటు వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజల అవసరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయం వద్ద మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపు నిర్వహించి వినతులను అక్కడికక్కడే పరిష్కరించేలా నెల రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్విరామంగా కొనసాగింది.

59 లక్షల కుటుంబాలకు ప్రయోజనం..

వివిధ కారణాలతో ఎక్కడైనా మిగిలిపోయిన అర్హులకు మేలు చేయడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 59 లక్షల కుటుంబాలకు చెందిన దాదాపు కోటి మందికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రయోజనం చేకూర్చారు. 99.80 లక్షల టోకెన్లు జారీ కాగా క్యాంపులు జరిగిన రోజు అధికారుల వద్దకు 95.96 లక్షల వినతులు ప్రస్తావనకు వచ్చాయి. ఇందులో 92.97 లక్షల వినతులను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవి వివిధ దశల్లో పరిశీలన కొనసాగుతోంది.

ఒకేరోజు 7,37,638 వినతుల పరిష్కారం..

జగనన్న సురక్ష ద్వారా అత్యధికంగా 40.52 లక్షల మంది కుల ధ్రువీకరణ పత్రాలను పొందగా 38.52 లక్షల మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. 2,70,073 మంది తమ వ్యవసాయ భూములకు సంబంధించి 1 బీ ధ్రువీకరణ పత్రాలను పొందగా మరో 139,971 మంది కంప్యూటరైజ్డ్ అడంగల్ సర్టిఫికెట్లు పొందారు. ఈ నెల 18వ తేదీన జరిగిన క్యాంపులో ఒక్క రోజులో అత్యధికంగా 7,37,638 వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు.

అల్లూరి జిల్లాలో అత్యధికం



జగనన్న సురక్ష కార్యక్రమం కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలకు సంబంధించి పలు ధ్రువీకరణ పత్రాలు వేగంగా మంజూరయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యధికంగా 57.4 శాతం కుటుంబాలు ప్రత్యేక క్యాంపుల ద్వారా ప్రయోజనం పొందాయి. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 53.51 శాతం కుటుంబాలు, తూర్పు గోదావరి జిల్లాలో 51.01 శాతం కుటుంబాలకు వివిధ ధ్రువీకరణ పత్రాలతో పాటు సమస్యలు పరిష్కారమయ్యాయి. ఈ కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తుల్లో 77 శాతం గ్రామీణ ప్రజలకు సంబంధించినవే ఉన్నాయి.
– లక్ష్మీ శ, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్

రేపటి నుంచి క్లాస్ బేస్డ్ అసెస్‌మెంట్

షెడ్యూల్‌ను విడుదల చేసిన పాఠశాల విద్యా శాఖ



సాక్షి, అమరావతి: 1–10 తరగతి విద్యార్థులకు ఆగస్టు 1–4వ తేదీ వరకు క్లాస్ బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ–1) పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఈ మేరకు ఆదివారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. మంగళ, బుధ, గురువారాల్లో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం తెలుగు, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఓఎస్ఎస్‌సీ (మూడు నుంచి ఐదు తరగతులకు), మధ్యాహ్నం గణితం, ఇంగ్లిష్ పార్ట్–ఏ, మూడు, నాలుగు, ఐదు తరగతులకు పార్ట్–బి అసెస్‌మెంట్ నిర్వహించనున్నారు. 6,7,8 తరగతులకు మంగళవారం మధ్యాహ్నం సెషన్‌లో తెలుగు, గణితం, బుధవారం హిందీ, జనరల్ సైన్స్, గురువారం సోషల్ స్టడీస్, ఇంగ్లిష్ పార్ట్–ఎ, పార్ట్–బి, శుక్రవారం ఓఎస్ఎస్‌సీ–1, 2 పేపర్లు ఉంటాయి. 9,10 తరగతులకు మంగళవారం ఉదయం తెలుగు, మ్యాథ్స్, బుధవారం ఉదయం హిందీ, జనరల్ సైన్స్, గురువారం సోషల్ స్టడీస్, ఇంగ్లిష్, ఇంగ్లిష్ పార్ట్–బి (తొమ్మిదో తరగతికి), శుక్రవారం ఓఎస్ఎస్‌సీ–1, 2 ఉంటాయని పేర్కొంది.

తుది దశకు గిరి ఆదర్శ గ్రామాల కసరత్తు

- ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, మౌలిక వసతులకు ప్రాధాన్యం
- 564 గ్రామాలను ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదర్శ గ్రామాలను తీర్చిదిద్దే కసరత్తు తుది దశకు చేరింది. రాష్ట్రంలో 564 గిరిజన గ్రామాలను ఆదర్శ గిరిజన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. వాటిని ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ఎటువంటి చర్యలు చేపట్టాలనే అంశంపై ప్రాథమిక సర్వే నిర్వహిస్తున్నారు. వాటి ఆధారంగా ఆదర్శ గిరిజన గ్రామ అభివృద్ధి ప్రణాళికను రూపొందించి గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సమర్పించాల్సి ఉంది. ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రధానంగా విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. దశల వారీగా గిరిజన గ్రామాలను అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దనున్నారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలు పథకాల ద్వారా వనరులను సమకూర్చనున్నారు. ప్రధానంగా షెడ్యూల్డ్ ట్రైబ్ కాంపోనెంట్ (ఎస్టీ ఉప ప్రణాళిక) నిధులను వినియోగిస్తారు. కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ రూపొందించిన 'ప్రధాన మంత్రి ఆది ఆదర్శ్ గ్రామ యోజన (సీఎంఏఏజీవై)' పథకం ద్వారా గిరిజన గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఇందుకోసం మూడు దశల్లో కమిటీలను ఏర్పాటు చేసింది. గ్రామ పంచాయతీ స్థాయి కమిటీ (జీపీఎస్‌సీ), జిల్లా ప్రణాళిక, పర్యవేక్షణ కమిటీ (డీసీఎంసీ), గ్రామాభివృద్ధి ప్రణాళిక (వీడీపీ) రాష్ట్రస్థాయి వర్కింగ్ కమిటీలను ఆయా దశల్లో గిరిజన గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలను ఆమోదించి, అమలుకు చర్యలు తీసుకుంటాయి.

250 గ్రామాల్లో పూర్తైన సర్వే

రాష్ట్రంలో ఆది ఆదర్శ్ గ్రామ యోజన పథకానికి 564 గ్రామాలను ప్రతిపాదించగా మూడేళ్లలో కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ 318 గ్రామాలకు ఆమోదం తెలిపింది. కాగా, మొత్తం ప్రతిపాదిత 564 గ్రామాల్లో ఇప్పటివరకు 250 గ్రామాల్లో ప్రాథమిక సర్వే పూర్తైంది. మరో 267 గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది. గిరిజన అభివృద్ధి సంస్థ (విశాఖపట్నం) పర్యవేక్షణలో ఏపీ గిరిజన సంస్కృతి పరిశోధన, శిక్షణ సంస్థ (టీసీఆర్–టీఎం) ఈ సర్వేను నిర్వహిస్తోంది. సర్వే ద్వారా గుర్తించిన అంశాలను పరిగణలోకి తీసుకుని ఆయా గ్రామాలకు చెందిన అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వానికి అందించాల్సి ఉంది.

జిల్లా	ప్రతిపాదించిన గ్రామాలు	సర్వే పూర్తి అయినవి	సర్వే జరుగుతున్నవి
శ్రీకాకుళం	66	30	36
విజయనగరం	104	41	63
విశాఖపట్నం	225	122	103
తూర్పు గోదావరి	116	34	82
పశ్చిమ గోదావరి	26	15	11
కృష్ణా	7	1	6
గుంటూరు	6	1	5
ప్రకాశం	6	1	5
చిత్తూరు	1	1	0
వైఎస్సార్	1	1	0
అనంతపురం	4	1	3
కర్నూలు	2	2	0

అమ్మ ప్రేమతో 'గోరుముద్ద'

▶ మొదటి పేజీ తరువాయి

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

నమోదు చేస్తూ పిల్లలకు పూర్తి స్వేచ్ఛ కల్పించారు. వారంలో 6 రోజులు రోజుకో మెనూ చొప్పున 37,63,698 మంది విద్యార్థులకు ఆహారాన్ని సమకూరుస్తున్నారు. ఉపాధ్యాయుల వద్దనున్న యాప్‌లో విద్యార్థుల హాజరుతో పాటు భోజనం చేసేవారి సంఖ్యను తెలుసుకునేలా 'ఇంటిగ్రేటెడ్ మానిటరింగ్ సిస్టమ్ ఫర్ మిడ్ డే మీల్స్ అండ్ శానిటేషన్' (ఐఎంఎంఎస్) యాప్‌ను అందుబాటు లోకి తెచ్చారు. ఇందులో ప్రతిరోజు బడిలో ఉన్న సరుకుల స్టాక్‌తో పాటు భోజనం వివరాలను ఫొటోలతో సహా అప్‌లోడ్ చేస్తున్నారు. జగనన్న గోరు ముద్ద పథకం అమలుకు ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వం రూ.1,689 కోట్లు కేటాయించిందంటే పిల్లలకు పౌష్టికాహారం పంపిణీకి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తోందో అర్థం చేసుకోవచ్చు. పిల్లల్లో రక్తహీనతను తగ్గించేందుకు వారంలో 3 రో జులు బెల్లంతో చేసిన రాగిజావ, మరో 3 రోజులు చిక్కీ ఇస్తున్నారు. వారంలో 5 రోజులు ఉడికించిన గుడ్డు తప్పనిసరి. సోమవారం వేడి పొంగల్, ఉడికించిన గుడ్డు లేదా వెజిటబుల్ పలావ్, గుడ్డు కూర, చిక్కీ, మంగళవారం ఉదయం రాగి జావ, మధ్యాహ్నం చింతపండు పులి హోర, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, బుధ వారం వెజిటేబుల్ అన్నం, ఆలూ కుర్మా ఉడికించిన గుడ్డు, చిక్కీ, గురువారం ఉదయం రాగిజావ, మధ్యాహ్నం సాంబార్‌బాత్ లేదా నిమ్మకాయ పులిహోర, టొమాటో పచ్చడి, ఉడికించిన గుడ్డు, శుక్రవారం అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ, శనివారం ఉదయం రాగి జావ, మధ్యాహ్నం ఆకుకూరతో అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగల్ మెనూగా అందిస్తున్నారు. విద్యార్థుల్లో రక్తహీనతను నివారించేందుకు ఫోర్టిఫైడ్ సార్టెక్స్ బియ్యాన్నే వాడుతున్నారు. ప్రతి గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల, విలేజ్ క్లినిక్ సిబ్బంది పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రక్తహీనత నివారణ మాత్రలు అందించడంతోపాటు మోతాదు ప్రకారం తీసుకునేలా పర్యవేక్షిస్తున్నారు.


కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య 104 కాగా బుధవారం రోజు 86 మంది హాజరయ్యారు. మెనూ ప్రకారం కూరగాయల అన్నం, బంగాళాదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ విద్యార్థులకు ఇవ్వాలి. 10 గంటలకల్లా సరుకులు తీసుకున్న వంట సిబ్బంది పాఠశాల ప్రాంగణంలోని కిచెన్‌లో 12.15 గంటలకు భోజనాన్ని రెడీగా ఉంచారు. తెలుగు ఉపాధ్యాయుడు గోవిందు భోజనాన్ని రుచి చూసి విద్యార్థుల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. వారు సంతృప్తి వ్యక్తం చేశాక మరో ఉపాధ్యాయుడు ఎస్‌వై నాయుడు వేడివేడి భోజనం ఫొటోను ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసి విద్యార్థుల సంఖ్యను కూడా నమోదు చేశారు.

మా పిల్లలూ ఇక్కడే..



మా పిల్లలు కూడా ఇదే స్కూల్లో చదువుతున్నారు. మా బిడ్డలకు వండినట్లే అందరు పిల్లలకు వండి పెడుతున్నాం. గతంలోనూ మధ్యాహ్నం బడిలో భోజనం పెట్టినా ఇంత చక్కగా పెట్టడం ఇప్పుడే చూస్తున్నాం.
– దుర్గాభవాని, మిడ్ డే మీల్స్ తయారీదారు, నాతవరం జెడ్పీహెచ్ఎస్

టీచర్లకూ అదే భోజనం..



మా స్కూల్లో 590 మంది పిల్లలు, 21 మంది ఉపాధ్యాయులున్నారు. మా పర్యవేక్షణలోనే వంటలు చేస్తారు. ప్రతిరోజు ముగ్గురు టీచర్లు ఇక్కడ వండిన ఆహారమే తింటారు. ఏనాడూ బాగోలేదన్న ఫిర్యాదు రాలేదు. – శాంతికుమారి, నాతవరం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం

రాగి జావ చాలా బాగుంటుంది




వారంలో 3 రోజులు ఉదయం ఇంటర్వెల్ టైంలో బెల్లంతో చేసిన రాగిజావను వేడివేడిగా ఇస్తారు. చాలా బాగుంటుంది. మధ్యాహ్నం భోజనం కూడా కావాల్సినంత పెడతారు.
– ఏ.కిరణ్‌కుమార్, రామ్‌ప్రసాద్, చిట్టినాయుడు (పదో తరగతి, సెక్షన్ 'సి'), నాతవరం జెడ్పీహెచ్ఎస్

ఇంట్లో తిన్నట్టుగానే




స్కూల్లో వండే ఆహారం ఇంట్లో ఉన్నట్టుగానే రుచిగా ఉంటుంది. అన్నం తినేటప్పుడు ఎలా ఉందని మా మాస్టారు రోజు అడుగుతారు. బాగో లేకపోతే అదే విషయం చెబుతాం. దాన్ని రిజిస్టర్‌లో రాస్తారు.
– వి.స్నేహశ్రీ, 9వ తరగతి బి–సెక్షన్, నాతవరం జెడ్పీహెచ్ఎస్

నచ్చకపోతే 'బ్యాడ్' అని రాస్తాం



స్కూల్లో వండిన ఆహారం ఎప్పుడూ బాగుంటుంది. తిన్న తర్వాత ఎలా ఉందో మా టీచర్లు అడుగు తారు. బాగుంటే 'గుడ్' అని బాగో లేకపోతే 'బ్యాడ్' అని రిజిస్టర్‌లో రాస్తాం.
– కె.మహేశ్వరి, (పదో తరగతి), అల్లిపూడి జెడ్పీ హైస్కూల్

ప్రతి విషయంలో ప్రభుత్వం జాగ్రత్తలు



ఉపాధ్యాయుల నుంచి పిల్లల చదువు, ఆహారం, ఆరోగ్యం వరకు అన్ని అంశాల్లో ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. పిల్లల అభి ప్రాయాల మేరకే గతంలో మె నూ మార్చారు. – కే గోవిందు, తెలుగు ఉపాధ్యాయుడు, అల్లిపూడి జెడ్పీహెచ్ఎస్

క్లుప్తంగా...

గురుకుల పాఠశాల, కళాశాల భవనాలు ప్రారంభం


పశ్చిమ గోదావరి జిల్లా ఆరుగొలనులో రూ.22.17 కోట్లతో నిర్మాణం



మాట్లాడుతున్న మంత్రి నాగార్జున, పక్కన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో రూ.22.17 కోట్లతో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల భవనాలను రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖమంత్రి మేరుగు నాగార్జున, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. మేరుగు నాగార్జున మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను వాడుకుని వదిలేసిన ఏకైక వ్యక్తి చంద్రబాబు అని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్ చొరవతో విజయవాడ నడిబొడ్డున 19 ఎకరాల్లో రూ.400 కోట్ల వ్యయంతో బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేయనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రానికి దిక్సూచిగా అంబేడ్కర్ విగ్రహం నిలవనుందన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు.


రేపు నందికొట్కూరులో చంద్రబాబు రోడ్‌షో



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు ఎన్.చంద్రబాబు ఆగస్టు ఒకటి నుంచి చేపట్టనున్న ప్రాజెక్టుల సందర్శన షెడ్యూల్ ఖరారైనట్లు ఆ పార్టీ కార్యాలయం తెలిపింది. ఒకటో తేదీన కర్నూలు జిల్లా నందికొట్కూరులో రోడ్ షో నిర్వహిస్తారని, ఆ తర్వాత ముచ్చుమర్రి ప్రాజెక్టు, బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలిస్తారని పేర్కొంది. రెండవ రోజు వైఎస్సార్ జిల్లా, మూడవ రోజు అనంతపురం, నాలుగో రోజు చిత్తూరు జిల్లాలో ఆయన పర్యటన ఉంటుందని తెలిపింది. ఆ తర్వాత కూడా మిగిలిన జిల్లాల్లో పర్యటిస్తారని పేర్కొంది.

పని తక్కువ.. పబ్లిసిటీ రాజకీయం ఎక్కువ

టీడీపీపై బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి ఫైర్



సాక్షి, అమరావతి: వందశాతం కేంద్రం నిధులతో నిర్మాణం చేసే జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం తాము కడతామని నాటి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తీసుకుందంటూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కేంద్రం సరే.. ప్రతీ పైసా ఇస్తాం మీరే నిర్మించుకోండని భరోసా ఇస్తే 2014–19 వరకూ టీడీపీ ప్రభుత్వం చేసింది 'పని తక్కువ.. పబ్లిసిటీ రాజకీయం ఎక్కువ' అని విమర్శించారు. అప్పట్లో 2018 కల్లా పూర్తి చేస్తామన్నారని, మధ్యలో కాంట్రాక్టర్లను మార్చి సమయాన్ని వృథా చేశారని దుయ్యబట్టారు. అడిగినన్ని నిధులు రీయింబర్స్ చేసినా అప్పటి ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. టీడీపీకి చేత కాదని ప్రజలు వైఎస్సార్‌సీపీకి అధికారం అప్పగించినా.. నాలుగేళ్లలో ప్రాజెక్టులో పనులు జరగకపోగా.. చేసిన పనుల్నే మళ్లీ చేయాల్సి వస్తోందని విమర్శించారు.

బీసీలకు జగన్ ఏమీ చేయలేదు: లోకేశ్



సాక్షి ప్రతినిధి, బాపట్ల: బీసీలకు సీఎం జగన్ ఏమీ చేయలేదని టీడీపీ నాయకుడు లోకేశ్ విమర్శించారు. జిల్లాలో ఆయన నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర ఆదివారం అద్దంకిలో సాగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ బీసీలకు తనపై ఆరోపణలు చేయడానికి మైకులు ఇస్తున్నారు తప్ప.. ముఖ్యమంత్రి వారికోసం ఏమీ చేయడంలేదని చెప్పారు. ప్రస్తుతం అభివృద్ధి ఎక్కడా కనిపించడంలేదన్నారు. టీడీపీ పాలనలో అభివృద్ధి జరిగిందని, ఇప్పుడు విధ్వంసం జరుగుతోందని పేర్కొన్నారు.


బీసీలను వెన్నెముక వర్గాలుగా తీర్చిదిద్దిన సీఎం : మారేష్



సాక్షి, అమరావతి: రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు బీసీలకు చేసింది ఏమీలేదని, రెండు కత్తెరలు, ఒక ఇస్త్రీ పెట్టె ఇచ్చి అదే అభివృద్ధి అంటూ బీసీలను మోసం చేస్తూ వచ్చారని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్ విమర్శించారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో కుల సంఘాలకు చెందిన నేతలతో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. మారేష్ మాట్లాడుతూ బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకుని ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ప్రతిసారి వారిని హేళనగా మాట్లాడటం చంద్రబాబుకి అలవాటుగా మారిందన్నారు. బీసీలపై చంద్రబాబు కపట ప్రేమ చూపిస్తున్నారని, ఆయన బాటలోనే పవన్ నడుస్తున్నారని విమర్శించారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చి బీసీలను వెన్నెముక వర్గాలుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

రాష్ట్రంలో స్వచ్ఛ ఇం‘ధనం’

- గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఎంపికైన పది రాష్ట్రాల్లో ఏపీ
- దేశవ్యాప్తంగా 4.5 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రాలకు టెండర్లు
- గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియాకి ప్రత్యేక పాలసీ రూపొందించిన రాష్ట్రం
- ఈ పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- వచ్చే ఐదేళ్లలో ఏటా 0.5 ఎంటీ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యం
- 2 ఎంటీ గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి లక్ష్యం
- ఒక మిలియన్ టన్నుల ఉత్పత్తితో 12 వేల మందికి ఉద్యోగాలు



సాక్షి, అమరావతి: గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అనుకూలమైన రాష్ట్రాల్లో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ ఎంపికైంది. స్వచ్ఛ ఇంధనం ఉత్పత్తికి అవసరమైన అన్ని వనరులు ఉండటం, ఇందు కోసం రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక పాలసీని తేవడంతో కీలకమైన గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు రాష్ట్రానికి రానున్నాయి. వీటి ద్వారా పెద్ద ఎత్తున పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రాష్ట్రాభివృద్ధికి మరింతగా చేయూతనిస్తాయి. ప్రకృతి పరిరక్షణకు ప్రపంచ దేశాలు చేసుకున్న ఒప్పందంలో భాగంగా మన దేశంలో స్వచ్ఛ ఇంధన ఉత్పత్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు కొత్త పథకాలు, పాలసీలు తెస్తున్నాయి. వాటి ద్వారా ఈ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాయి. ఇందులో భాగంగా దేశంలో 4.5 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర పభుత్వం టెండర్లు పిలిచింది. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఏపీ సహా 10 రాష్ట్రాలు అనుకూలమని తేల్చింది. దీంతో త్వరలోనే రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది.

'సైట్'తో ప్రోత్సాహకాలు

ఏటా 125 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనంతో పాటు 5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి సాధించాలనే లక్ష్యంతో నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ని కేంద్రం తీసుకువచ్చింది. ఇందులో భాగంగా, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేసే పరిశ్రమలకు ఆర్థిక తోడ్పాటునందించడానికి స్ట్రాటజిక్ ఇంటర్వెన్షన్ ఫర్ గ్రీన్ హైడ్రోజన్ ట్రాన్సిషన్ ప్రోగ్రామ్ (సైట్) పథకాన్ని గత నెలాఖరులో ప్రవేశపెట్టింది. ఉత్పత్తిదారులకు ఆర్థికంగా చేయూతనందించేందుకు రూ.19,744 కోట్లు కేటాయించింది. 2029–30 వరకు ఈ పథకం అమలులో ఉంటుంది. తొలి ఏడాది రూ.4,440 కోట్లు, రెండో ఏడాది రూ.3,700 కోట్లు, మూడో ఏడాది రూ.2,960 కోట్లు, నాలుగో ఏడాది రూ.2,220 కోట్లు, ఐదో ఏడాది రూ.1,480 కోట్లు చొప్పున ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తుంది.

ఏపీ సొంత పాలసీ

రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా ఉత్పత్తిని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రత్యేక పాలసీని రూపొందించింది. ఈ ఏడాది కేంద్రం పాలసీని తేవడానికి ఒక రోజు ముందే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పాలసీని తీసుకొచ్చింది. రాష్ట్రంలో ప్రస్తుతం గ్రీన్ హైడ్రోజన్ డిమాండ్ ఏడాదికి దాదాపు 0.34 మిలియన్ టన్నులు (ఎంటీ) ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రానున్న ఐదేళ్లలో సంవత్సరానికి 0.5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్, 2 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఒక మిలియన్ టన్ను గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయగలిగితే 12 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేసింది. ఈ పాలసీ ఐదేళ్లపాటు లేదా కొత్త పాలసీ జారీ అయ్యే వరకు అమలులో ఉంటుంది. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్‌ని ఉపయోగించడం ద్వారా నీటి నుంచి గ్రీన్ హైడ్రోజన్ లేదా గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయాలనుకునే డెవలపర్లు ఈ పాలసీ పరిధిలోకి వస్తారు. ఈ పాలసీ అమలుకు న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. ప్రభుత్వ విధానం, ప్రోత్సాహకాలతో రాష్ట్రానికి తప్పకుండా ప్రాజెక్టులు వస్తాయని నిపుణులు చెబుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు

- ప్రాజెక్టు ప్రారంభించిన తేదీ నుంచి ఐదేళ్లపాటు గ్రీన్ హైడ్రోజన్ అమ్మకంపై డెవలపర్లకు స్టేట్ జీఎస్టీలో 100 శాతం తిరిగి చెల్లింపు
- గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి ఉపయోగించే పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుకు వాణిజ్య ఆపరేషన్ తేదీ నుంచి ఐదేళ్ల పాటు విద్యుత్ సుంకంపై 100 శాతం మినహాయింపు
- ఇంట్రాస్టేట్ ట్రాన్స్‌మిషన్ ఛార్జీల్లో 25 శాతం రీయింబర్స్‌మెంట్
- క్రాస్–సబ్సిడీ సర్‌చార్జి ఐదేళ్లు వెనక్కు
- ప్రాజెక్టుకు భూమిని ప్రభుత్వమే నోడల్ ఏజెన్సీ ద్వారా నామ మాత్రపు ధరకు లీజుగా కేటాయింపు
- భూ వినియోగ మార్పిడి ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ నుంచి మినహాయింపు

దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తున్న మోదీ

కర్షక, కార్మిక సదస్సులో మేధా పాట్కర్



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తోందని సామాజిక ఉద్యమ కార్యకర్త మేధా పాట్కర్ ఆరోపించారు. సంయుక్త కిసాన్ మోర్చా, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో కర్షక, కార్మిక సదస్సు నిర్వహించారు. మేధా పాట్కర్ మాట్లాడుతూ పేదలకు నిత్యావసర వస్తువులను అందించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతుల పంటకు కనీస మద్దతు ధర రావడంలేదని, అదానీ, అంబానీలకు మాత్రం రూ.వేల కోట్లు ఆదాయం వస్తోందన్నారు. ఆదివాసీల హక్కులను దెబ్బతీస్తూ అటవీ పర్యావరణ పరిరక్షణ చట్టంలో మార్పులు చేస్తున్నారన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు హన్నన్ ముల్లా మాట్లాడుతూ మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని 13 నెలలపాటు రైతులు చేసిన ఉద్యమం సందర్భంగా ప్రధాని ఇచ్చిన హామీల అమలు కోసం ఆగస్టులో ఆందోళనలను నిర్వహిస్తామన్నారు. రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆల్ ఇండియా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి అతుల్‌కుమార్ అంజన్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ విభాగం జాతీయ అధ్యక్షుడు సుఖ్‌పాల్ సింగ్ ఖైరా, రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు.

‘పట్టు’ తప్పిన రాతలు..

వాస్తవాలను విస్మరించి ‘పట్టు రైతుకు కుచ్చుటోపీ’ అంటూ ఈనాడు కట్టుకథలు

సాక్షి, అమరావతి: ముడిపట్టు ఉత్పత్తిలో దేశంలోనే రెండోస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ప్రోత్సాహంతో గడచిన నాలుగేళ్లుగా పట్టుసాగు విస్తరిస్తుండడమే కాదు.. ఆ రైతులు గతంలో ఎన్నడూలేని రీతిలో లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రభుత్వ చర్యల ఫలితంగా నాలుగేళ్లలో కొత్తగా 39,640 ఎకరాల్లో పట్టుసాగు విస్తరించగా, బైవోల్టిన్ రకం పట్టుగూళ్ల ఉత్పత్తి మరో 13,905 టన్నులు పెరిగింది. 2018–19లో పట్టుగూళ్ల ధర (కకూన్స్) కిలో రూ.380 రావడం గగనంగా ఉండేది. కానీ, నేడు సగటున రూ.470 నుంచి రూ.620 వరకు లభిస్తోంది. అయినా, ప్రభుత్వంపై బురద జల్లడమే ఈనాడు లక్ష్యంగా పెట్టుకుంది. 'పట్టు రైతుకు కుచ్చుటోపీ' అంటూ నిసిగ్గుగా అబద్ధాలు అచ్చేసింది. ఈనాడు కథనంలో వాస్తవాలు ఏమిటో ఒక్కసారి చూద్దాం..

రాష్ట్రంలో 76,395 మంది 1,37,420 ఎకరాల్లో మల్బరీ సాగుచేస్తున్నారు. 600 సిల్క్ రీలర్ కుటుంబాలు ముడిపట్టును ఉత్పత్తి చేస్తుంటే ఈ రంగంపై ఆధారపడి 14లక్షల మంది జీవనోపాధి పొందుతున్నారు. పట్టు రైతులకు మెరుగైన ఆదాయకల్పన లక్ష్యంతో పట్టుగూళ్ల మార్కెట్లలో ఈ–మార్కెటింగ్ వ్యవస్థను తీసుకురావడమే కాదు.. పట్టుసాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సాహకాలు, రాయితీలు ఇస్తోంది.



పట్టు రైతుకు కుచ్చుటోపీ!



రైతులు, రీలర్లకు ఏటా ప్రోత్సాహకాలు..

ఇలా నాలుగేళ్లలో పట్టు రైతులకు రూ.19.41 కోట్ల బైవోల్టిన్ కకూన్ ఇన్సెంటివ్‌ను అందజేసింది. ఈ ఏడాది మరో రూ.7.12 కోట్లు విడుదల చేసింది. అలాగే, పట్టు రీలర్లకు నాలుగేళ్లలో రూ.8.20 కోట్ల ఇన్సెంటివ్ ఇచ్చారు. ఈ ఏడాది మరో రూ.6 కోట్లు విడుదల చేశారు. మరోవైపు.. పట్టు రైతులు నిర్మించుకున్న 1,186 షెడ్లకు ప్రభుత్వం ఇప్పటికే రూ.37.88 కోట్ల రాయితీనందించగా, మరో రూ.11.97 కోట్ల రాయితీని విడుదల చేసేందుకు ఏర్పాట్లుచేసింది. పట్టు పురుగుల పెంపకపు షెడ్ల నిర్మాణానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద రావాల్సిన బకాయిలన్నీ రైతుల ఖాతాలో జమచేశారు. అలాగే, పట్టుసాగులో అవసరమైన క్రిమిసంహార మందుల కొనుగోలు కోసం నాలుగేళ్లలో రూ.1.46 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. మరోవైపు.. కొత్తగా ఐదు ఆటోమేటిక్ రీలింగ్ మెషినరీ యూనిట్లు ఏర్పాటుచేస్తున్నారు.

పట్టు సాగుబడుల ద్వారా శిక్షణ..

చాకీ పురుగులు నూరు శాతం సరఫరా చేయడం, రీరింగ్ షెడ్లలో టర్బో వెంటిలేటర్లు, కూలింగ్ సిస్టమ్స్ ఏర్పాటుచేయడం, షూట్ రీరింగ్ పద్ధతులపై ఆర్బీకేల ద్వారా నిర్వహిస్తున్న పట్టుసాగు బడుల ద్వారా అవగాహన కల్పించడం వలన సమయంతో పాటు కూలీల ఖర్చు 40 శాతం వరకు తగ్గింది. పైగా 15–20 శాతం మేర మల్బరీ ఆదా అవుతోంది. ఫలితంగా ఈ రైతులు మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. ఇలా ప్రభుత్వ చర్యల ఫలితంగా 2019–23 మధ్యలో కొత్తగా 39,640 ఎకరాల మేర సాగులోకి వచ్చింది. గతేడాది రికార్డు స్థాయిలో రూ.4,075 కోట్ల విలువైన 55,363 టన్నుల క్రాస్‌బ్రీడ్ పట్టుగూళ్లు, 12,542 టన్నుల బైవోల్టిన్ పట్టుగూళ్లు ఉత్పత్తి కాగా, రూ.3,687.15 కోట్ల విలువైన 9,311 టన్నుల నాణ్యమైన ముడిపట్టును సిల్క్‌రీలర్లు ఉత్పత్తి చేశారు. 2021–22లో స్థూలాదాయం (జీవీఏ) రూ.11,638 కోట్లు సాధించగా, 2022–23లో రూ.12,098 కోట్లు సాధించి పట్టు పరిశ్రమ కొత్త రికార్డు నెలకొల్పింది.

ఏటా రికార్డు స్థాయి ధరలు..

గడిచిన నాలుగేళ్లలో గరిష్టంగా బైవోల్టిన్ రకం పట్టుగూళ్లకు కిలోకి రూ.881 లభించింది. నాలుగేళ్లలో రైతులు పొందిన సగటు ధరను పరిశీలిస్తే కిలో రూ.470 నుంచి రూ.620 మధ్య పలికింది. ఈ ఏడాది గడిచిన మూడునెలల్లో సగటు ధర కిలో రూ.400 నుంచి రూ.480 మధ్య ఉంది. సాధారణంగా ఏటా సెప్టెంబరు నుంచి ఫిబ్రవరి వరకు పట్టుగూళ్లకు మంచి ధర లభిస్తుంది. ప్రస్తుతం ఉన్న ధరలు వచ్చే మూడునెలల్లో గరిష్ట స్థాయికి చేరే అవకాశముంది. ఇక ఈ ఏడాది (2023–24) 12వేల ఎకరాల్లో మల్బరీ విస్తరణ ద్వారా 15వేల టన్నుల బైవోల్టైన్ పట్టుగూళ్లు, 65వేల టన్నుల క్రాస్‌బ్రీడ్ పట్టుగూళ్ల ఉత్పత్తి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఇందుకోసం ఎస్సీ, ఎస్టీ, ఇతర పట్టు రైతులకు ఈ ఏడాది రాయితీలిచ్చేందుకు రూ.25 కోట్ల వరకు ఖర్చుచేయడానికి కార్యాచరణను సిద్ధం చేసింది.

పట్టుసాగు విస్తరణకు ఇచ్చే రాయితీలు (ఎకరాకు.. రూపాయల్లో)..

పని	ఎస్సీ, ఎస్టీలకు..	ఇతరులకు
మొక్కలు నాటడం	12,600	10,500
రీరింగ్ షెడ్ల నిర్మాణం	3,60,000	3,00,000
పరికరాల కొనుగోలు	67,500	56,250
మందుల కొనుగోలు	4,500	3,750



ఈనాడు ఆరోపణల్లో నిజంలేదు..



పట్టు రైతులకు కుచ్చుటోపీ అంటూ ఈనాడు కథనాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ధరలు పడిపోయాయని, రైతులకు, రీలర్లకు ప్రోత్సాహకాలు, క్రిమిసంహారక మందులకయ్యే వ్యయాన్ని నిలిపి వేసిందనడంలో ఎలాంటి వాస్తవంలేదు. నిజాలు తెలుసుకోకుండా బురద జల్లడం ఈనాడుకు సరికాదు.

– డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్, కమిషనర్, పట్టు శాఖ

29 ఏళ్లుగా వేధిస్తున్నారు..

- టీడీపీ మాజీమంత్రి నారాయణపై రాయదుర్గం పీఎస్‌లో కృష్ణప్రియ పొంగూరు ఫిర్యాదు
- బావ నారాయణ, భర్త మణి అరాచకాలకు పాల్పడ్డారు
- పెళ్లి అయిన రెండో రోజు నుంచే నారాయణ సాధింపు
- లొంగకపోవడంతో వేధింపులు
- నారాయణపై మరోసారి ఆయన మరదలు తీవ్ర ఆరోపణలు



హైదరాబాద్: ఏపీ మాజీమంత్రి పొంగూరు నారాయణపై ఆయన తమ్ముడు సుబ్రహ్మణ్యం భార్య కృష్ణప్రియ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 29 ఏళ్లుగా నారాయణ, భర్త సుబ్రహ్మణ్యం అలియాస్ మణి తనను మానసికంగా, లైంగికంగా వేధిస్తున్నారని ఆదివారం ఉదయం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న తాను ఎదుర్కొన్న అనుభవాలను పోస్టు చేశానని, రాజకీయంగా వారికి ఇబ్బంది కలుగుతోందని భావించి తన ఇన్‌స్టాగామ్ అకౌంట్‌ను మూసివేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గచ్చిబౌలిలోని బాంబూస్ మీనాక్షి విల్లాస్ ఎదుట కృష్ణప్రియ మీడియాతో మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే.. పెళ్లైన రెండో రోజు నుంచే బావ నారాయణ లైంగిక వేధింపులు మొదలుపెట్టాడు. ఆయనకు లొంగకపోవడంతో 29 ఏళ్లుగా ఆయన పెట్టే బాధలు భరిస్తున్నాను. ఆయన స్త్రీలోలుడు. నారాయణ విద్యా సంస్థల్లో పనిచేసే కొందరు మహిళలు ఆయన దగ్గరకు వెళ్లాల్సిందే. సోదరి వరుసైన వారు స్నానం చేస్తున్నప్పుడు బాత్‌రూమ్‌లోకి తొంగి చూసేవాడు. ఈ విషయం మొదట్లో వాళ్ల వాళ్లే చెప్పారు. నేను లొంగకపోవడంతో వేధింపులు ప్రారంభించాడు. నాకు మానసిక సమస్య ఉన్నట్లుగా నా భర్త తప్పుడు సర్టిఫికెట్లు చూపించి యూట్యూబ్ వేదికగా ప్రచారం చేయడం చాలా బాధేసింది. నారాయణ మెడికల్ కాలేజీలో పనిచేసే డాక్టర్ శేషమ్మ నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకురావడం వారికి పెద్ద సమస్య కాదు. అలాగే, నారాయణ పిల్లలకు మానసిక సమస్యలు ఉన్నాయి. డాక్టర్ విరించి వారికి చికిత్స చేస్తున్నారు. విరించి నుంచి కూడా సర్టిఫికెట్ తేవడం పెద్ద కష్టమేమి కాదు. ఒకరోజు మా నాన్నపై అరుస్తుంటే గుంటూరులో ఓ డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. నిద్రలేమితో నిద్రమాత్రలు వేసుకుంటున్నట్లు డాక్టర్‌కు చెప్పాను. మానసిక ఒత్తిడితోనే నిద్రలేమి సమస్య ఉండవచ్చని డాక్టర్ చెప్పారు. నేను ఇటీవల ఏఐజీ ఆస్పత్రిలో చేరిన విషయం నిజమే. ఇక రక్త సంబంధం ఉంది కాబట్టే నారాయణకు నా భర్త పెట్‌గా మారాడు.

కేసు నమోదు చేయలేదు: సీఐ

కృష్ణప్రియ ఫిర్యాదును పరిశీలిస్తున్నామని, ఇప్పటివరకు ఎలాంటి కేసు నమోదు చేయలేదని రాయదుర్గం సీఐ మహేష్ తెలిపారు.

మదనపల్లె టీడీపీ కార్యాలయంలో

జై జగన్ నినాదాలు

చంద్రబాబును బూతులు తిట్టిన టీడీపీ నేత

మదనపల్లె: జై జగన్.. జై జగన్.. ఈ నినాదాలు ఇచ్చింది వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాదు.. అభిమాని అంతకంటే కాదు. ఆయన టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు విద్యాసాగర్ కావడం విశేషం. అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేశ్ కార్యాలయంలో జరిగిన ఈ సంఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. టీడీపీ కార్యాలయంలో కూర్చున్న పార్టీ ముగ్గురు సీనియర్ నాయకుల సంభాషణల్లో టీడీపీని అమ్మ నా బూతులు తిట్టడమే కాకుండా.. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును సైతం ఇష్టం వచ్చినట్లు పత్రికలో రాయలేని విధంగా మాట్లాడారు. చంద్రబాబు మూసుకుని బీజేపీతో ఉండి ఉంటే తమకు ఈ బాధ ఉండేది కాదు.. అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఆయనకు 75 ఏళ్ల వయసు దాటడంతో వేపకాయంత వెర్రి వచ్చిందని.. చంద్రబాబు వెర్రి నా... అంటూ వ్యాఖ్యానించారు. జగన్ తమకేమీ ద్రోహం చేయలేదన్నారు. జై జగన్.. అంటూ నినాదాలు చేశారు. ఒకవేళ టీడీపీ అధికారంలోకి వచ్చి నువ్వు పసుపు జెండా దగ్గరకు వస్తే ఏం చేయాలని మరొకరు ప్రశ్నిస్తే... బస్టాండ్‌లో టీడీపీ జెండా తగలబెడతానంటూ విద్యాసాగర్ ఆగ్రహంగా మాట్లాడారు. టీడీపీ అధికార ప్రతినిధి, రైతు నాయకుడు రాటకొండ మధుబాబు కల్పించుకుని.. అంగళ్ల వద్ద కారు అద్దాలు పగులగొడితే ఓ నాయకుడికి తెలుగుయువత అధ్యక్ష పదవి ఇచ్చారని, తల పగిలితే ఏ పదవి ఇస్తారంటూ ఎద్దేవా చేశారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కార్యాలయంలోనే సీనియర్ నాయకులు విద్యాసాగర్, రాటకొండ మధుబాబు, క్రిస్టియన్ సెల్ దేవా రమేశ్‌ల సంభాషణ టీడీపీ గ్రూపులో వైరల్ అవుతోంది. ఇప్పటికే నియోజకవర్గంలో మసకబారుతున్న టీడీపీ ప్రతిష్ట.. నాయకుల సంభాషణలతో మరింత దిగజారిపోయిందని ఆ పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

కృష్ణప్రియ మానసిక స్థితి బాగోలేదు

వీడియో విడుదల చేసిన నారాయణ తమ్ముడు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తన భార్య కృష్ణప్రియ మానసిక స్థితి బాగోలేదని టీడీపీ మాజీ మంత్రి నారాయణ తమ్ముడు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. తన బావ నారాయణ తనను తీవ్రంగా వేధిస్తున్నారని కృష్ణప్రియ వరుసగా వీడియోలు విడుదల చేసింది. అలా వీడియోలు రిలీజ్ చేయొద్దని నారాయణ శతవిధాలా ప్రయత్నించినా ఆమె ససేమిరా అనడంతో ఇక గత్యంతరంలేని పరిస్థితుల్లో కృష్ణప్రియ భర్త, తన సోదరుడు సుబ్రహ్మణ్యంతోనే ఆమె మానసికస్థితి బాగోలేదని వీడియో విడుదల చేయించారని తెలుస్తోంది. తన భార్య మాటలు ఎవరూ పట్టించుకోవద్దని సుబ్రహ్మణ్యం విడుదల చేసిన వీడియోలో ప్రజలను కోరారు.

పట్టణాలపై ‘అమృత్’ జల్లులు



భీమవరం పట్టణ వ్యూ

రూ.285.54 కోట్లతో అమృత్ 2.0 పనులు

- పశ్చిమగోదావరి జిల్లాలోని ఐదు పట్టణాలు ఎంపిక
- తాగునీరు, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం
- వచ్చేనెలలో టెండర్ల ప్రక్రియ

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని పట్టణాల్లో తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థలను మరింత మెరుగుపరిచేందుకు అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) 2.0 పథకంలో రూ.286.54 కోట్లు ఖర్చు చేయనున్నారు. తాగునీటి సురక్షిత పట్టణాలుగా మార్చడంలో భాగంగా నిధులు మంజూరు చేసి వేగంగా పనులు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

జిల్లాలోని ఐదు చోట్ల..

భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, తణుకు, ఆకివీడు పట్టణాల్లో కుళాయి కనెక్షన్లు ఇవ్వడం, పైప్‌లైన్ల విస్తరణ, శుద్ధి చేసిన మురుగునీటిని రీసైకిల్ చేయడం (ఎస్‌టీపీల నిర్మాణం), నీటి సంరక్షణ, అండర్ గ్రాండ్ డ్రైనేజీ అభివృద్ధి, వాటర్ ట్యాంకుల నిర్మాణం, జగనన్న కాలనీల్లో ఎస్‌టీపీల నిర్మాణం తదితర పనులు చేపట్టనున్నారు.

మూడు ఎస్‌టీపీలు

జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెంలో మూడు చోట్ల ఎస్‌టీపీలు (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు) నెలకొల్పనున్నారు. తాడేపల్లిగూడెం, భీమవరం జగనన్న కాలనీల్లో రూ.28.58 కోట్లతో రెండు, తాడేపల్లిగూడెం పట్టణంలో రూ.100.20 కోట్లతో మరో ప్లాంట్ నిర్మించనున్నారు.

వచ్చే నెలలో టెండర్ల ప్రక్రియ



జిల్లాలో ఐదు పట్టణాలకు అమృత్ 2.0 పథకం కింద నిధులు మంజూరయ్యాయి. తాగునీరు సరఫరా, ఎస్‌టీపీల నిర్మాణం, మురుగునీటి వ్యవస్థ మెరుగుదల తదితర పనులకు డీపీఆర్‌ల ఆమోదం పొందిన వెంటనే వచ్చేనెలలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపడతాం. ఈ పథకం 2025–26 వరకు కొనసాగుతుంది.

–పి.ప్రశాంతి, కలెక్టర్

పట్టణాల వారీగా పనులు


భీమవరం: ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్లు, ఇంటింటికీ కుళాయిలు, 24 గంటల పాటు తాగునీటి సరఫరా తదితర పనుల కోసం రూ.47.29 కోట్లు కేటాయించారు. భీమవరం జగనన్న లేఅవుట్‌లో ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణం కోసం రూ.13.39 కోట్లు ఖర్చు చేయనున్నారు.

తాడేపల్లిగూడెం: నీటి సరఫరా అభివృద్ధి పనులకు రూ.41.79 కోట్లు, జగనన్న కాలనీలో ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణానికి రూ.12.19 కోట్లు, పట్టణంలో మరో ఎస్‌టీపీ ప్లాంట్ కోసం రూ.100.20 కోట్లు ఖర్చు చేయనున్నారు.

నరసాపురం: నీటి సరఫరా అభివృద్ధి పనులకు రూ.21 కోట్లు కేటాయించారు.

ఆకివీడు: నీటి సరఫరా అభివృద్ధి పనులకు రూ.5.29 కోట్లు, మరో రూ.26.50 కోట్లతో తదితర పనులు చేపట్టనున్నారు.

తణుకు: తణుకు జగనన్న కాలనీలో నీటి సరఫరా అభివృద్ధి పనులకు రూ.8.36 కోట్లు కేటాయించారు.



గ్రంథాలయం కలిగివున్న ఇంటిలో ఆత్మ ఉంటుంది.
– ప్లేటో

సాక్షి
సోమవారం, 31 జూలై 2023

ట్రంకుపెట్టె పిల్లలు

'ఒరే మోహన్‌గా! మన అమ్మలకి మనం పుట్టుండంరా! నిజంగా మనల్ని కనే ఉంటే మనల్ని రోజూ కళ్లెదురుగా నూసుకోకుండా ఉండగలుగుతారా! మనల్నిలాగా ఈ నరకంలో వదిలేసి ఎళ్లిపోగలుగుతారా?'...

ఆరు నుంచి పది వరకు హాస్టల్‌లో ఉండే ప్రతి పిల్లాడు ఇలా ఎప్పుడో ఒకప్పుడు అనుకోకుండా ఉండడు. ఎదిగీ ఎదగని వయసులో హాస్టల్‌లో ఏదెలా ఉన్నా అక్కడ పూడ్చలేని వెలితి– తల్లితండ్రులు లేకపోవడం. అమ్మ గోరుముద్దలు, నాన్న ప్రేమపూర్వక గదమాయింపులు, శుభ్రమైన పక్కబట్టలు, రేడియో పాట, సయించే భోజనం, అన్నింటికి మించి భద్రమైన ఇంట్లో ఒళ్లెరుగకపోయే నిద్ర. ఇవేవీ హాస్టల్‌లో ఉండవు!

పిల్లలు చదువుకోవడానికే పుట్టి ఉండవచ్చు. చదువుకోవడానికి మాత్రమే పుట్టలేదు. కాని చదువుకుంటే తప్ప పుట్టగతులు ఉండవు. తొమ్మిది నెలల తర్వాతే పిల్లలందరూ భూమ్మీద పడ్డా ఆ భూమిని బట్టి వారి అదృష్టం ఆధారపడి ఉంటుంది. అగ్రహారం అయితే ఒకలాగా, రెడ్ల ఇలాకా అయితే ఒకలాగా, కామందుల వీధైతే ఒకటి, శెట్టిగారి బజారైతే ఒకటి. ఇవి గాకుండా వేరే వీధులు, వెలివాడలు ఉంటాయి. ఆ భూమ్మీద పుట్టిన పిల్లలు తిండికి, చదువుకు గతి లేకపోతే ఇదిగో ఇలా ప్రభుత్వ హాస్టళ్లలో ఉండి చదువుకోవాలి. అమ్మను తిట్టుకోవాలి. ఆక్రోశించాలి.

హాస్టల్‌లో ఉన్న కన్నబిడ్డను ఆదివారం వచ్చి చూసుకునే వీలు తల్లికి ఉంటుంది. అదీ ఇదీ వండుకొని, బిడ్డ కడుపుకు ఇంత తినిపించుకుని, తల దువ్వి, పేన్లు చూసి, ఒళ్లో పరుండబెట్టుకుని కబుర్లు చెప్పి, వదల్లేక వదల్లేక ఆ తల్లి పోతూ ఉంటే అప్పటికే ఔట్‌బెల్లు టైమైపోయిందని తల్లి కళ్ల ముందే కన్నకొడుకును నాలుగు పీకుతాడు హాస్టల్ బాధ్యుడు. అప్పుడు తల్లేమైనా భద్రకాళి అవుతుందా? నా కొడుకును ఈ బందీఖానాలో ఉంచను అని తీసుకెళ్లి పోతుందా? 'మీరు కొట్టి సంపేత్తాకి కనలేదు సారు మేము బిడ్డల్ని. మా గచ్చంతరం బాగోక ఇక్కడొదిలేసాం' అంటా నడుసుకుంటా ఎలిపోతుంది.

'ప్రపంచం మొత్తాన్ని తెచ్చి క్లాస్‌రూమ్‌లో కుదించలేము. క్లాస్‌రూమ్‌నే ప్రపంచంలోకి తీసుకెళ్లాలి' అని 1912లో జర్మనీలో మొదటి హాస్టల్‌ను మొదలెట్టాడు రిచర్డ్ షిర్మన్ అనే స్కూల్ టీచరు. విహారాలకు వెళ్లే పిల్లలు తక్కువ ఖర్చులో బస చేయడానికి వీలుండటం లేదని తన స్కూల్‌లోనే తొలి హాస్టల్ కట్టాడు. అతని వల్ల ప్రపంచమంతా యూత్ హాస్టల్స్, దరిమిలా రెసిడెన్షియల్ స్కూల్స్ వచ్చాయి. విషాదమేమంటే ఏ ఉద్దేశంతో రిచర్డ్ షిర్మన్ హాస్టల్స్ మొదలెట్టాడో దానికి పూర్తి విరుద్ధంగా ఏ విహారమూ లేని బందీఖానాలుగా అవి మారాయి.

'అందరికన్నా ముందు పరిగెత్తి కంచం పట్టుకుని లైన్లో నిలబడ్డా. అన్నం డేక్షాలొచ్చేసున్నాయ్. పాప్పుది, సాంబారుది, మజ్జిగిది గిన్నిలొత్తే వడ్డన మొదలెట్టేత్తారు. అన్నం డేక్షా మీద మూత లేదేమో ఈగలన్నీ అల్నియ్. అన్నియ్యా ఈగలోల్తనాయ్ అని పిలిత్తే ఆ ఈగల్ని తోలకుండానే దాని మీద మూత పడేసాడు వర్కరు. పారిపోయే దారిలేక ఆ ఈగలందులోనే సచ్చి అన్నంలో కలిసిపోనియ్. కంచంలో ఏత్తే హస్తానికో ఈగ పడింది నా కంచంలో'....

పాత భవనాలు, పెచ్చులూడిపోయే సీలింగులు, ఊరికి దూరంగా మనిషి అలికిడి లేని బీడు పరిసరాలు, సరిపోని నీళ్లు, కడుపులో దేవే పాయిఖానాలు, అపరిశుభ్ర ఆహారం, దుప్పట్లు ఇవ్వని చలికాలం, తప్పని తీట.. తామర, చీటికి మాటికి ఘోరంగా చావగొట్టే సిబ్బంది, ముళ్లతీగల ఫెన్సింగ్.... ఇవీ కొన్ని చోట్ల సంక్షేమ హాస్టళ్లు.

తెలుగు సాహిత్యంలో హాస్టల్ లైఫ్ చెదురు మదురుగా కనిపిస్తుంది. నవీన్ 'అంపశయ్య', కేశవరెడ్డి 'సిటీ బ్యూటిఫుల్', కొమ్మూరి వేణుగోపాలరావు 'హౌస్ సర్జన్', వడ్డెర చండీదాస్ 'అనుక్షణికం' హాస్టల్ జీవితాన్ని కొద్దో గొప్పో చూపుతాయి. అయితే అవన్నీ పోస్ట్ మెట్రిక్ విద్యార్థుల జీవితాలు. కాని రచయిత మోహన్ తలారి 'హాస్టల్ లైఫ్' కథలు ప్రీ మెట్రిక్ విద్యార్థుల భౌతిక మనోలోకాల్లో హాస్టల్ రేపగల కల్లోలాన్ని గట్టిగా పట్టి ఇస్తాయి. ఇరవై ఏళ్ల క్రితం తాడేపల్లిగూడెం సమీపంలోని ఆరుగొలను గురుకుల పాఠశాలలో తాను గడిపిన హాస్టల్ జీవితపు పచ్చి జ్ఞాపకాల ధార ఈ కథలు. కర్కశపు చారలు ఈ కథలు. ఇరవై ఏళ్ల తర్వాత, నేడు, ఇరు రాష్ట్రాల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, గురుకుల పాఠశాలల, హాస్టళ్ల అధికారులు ఈ పుస్తకాన్ని ఒక కొలతగా గనక తీసుకుంటే, అప్పటికీ ఇప్పటికీ ఏం మారిందో, ఎంత మారిందో చూసుకుంటే చేయవలసిన పని తెలుస్తుంది. చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే లక్షలాది నిరుపేద బాలల పెదాలపై చిర్నవ్వు మొలుస్తుంది.

నిజానికి ఇంటర్, కాలేజీ హాస్టళ్ల విద్యార్థులకు అంతో ఇంతో ఎరుక, ఎదురీదే సామర్థ్యం ఉంటాయి. కాని 15 లోపు పసివయసు విద్యార్థులు ఉండే, తల్లితండ్రులను వదలి ఉండే, పేదరికం కారణంగానో నిస్సహాయ పరిస్థితుల వల్లనో హాస్టళ్లల్లో ఉండి చదువుకోక తప్పని వర్గాల పిల్లలుండే హాస్టళ్లు ఎంతో ఆదరణీయంగా ఉండాలి. ఆత్మీయంగా ఉండాలి. అక్కున జేర్చుకునేలా ఉండాలి. అలా ఉన్నదా? నీ పిల్లలు ఉండే చోటు ఎలా ఉండాలనుకుంటావో... ఆ పిల్లలు ఉండే చోటు అలా ఉండాలనుకుంటున్నావా?

'అంకుల్ టామ్స్ కేబిన్' అనే ఒక్క పుస్తకం నల్ల బానిసల జీవితాల్లో సమూలంగా మార్పు తెచ్చింది. మన దేశంలో ఎన్ని పుస్తకాలు వస్తే సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే – దేవునితో తప్ప మరెవరితోనూ మొత్తుకునే వీలులేని– ట్రంకుపెట్టె పిల్లల జీవితాలు మారతాయి?

పరిషత్తులో అంబేడ్కరే లేకుంటే?!

కామెంట్



కరణ్ థాపర్

"స్వాతంత్ర్య పోరాటంలో అంబేడ్కర్ పోషించిన పాత్రేమీ లేకపోవడం ఆయన అద్భుతమైన జీవన ప్రగతిలో అత్యంత వివాదాస్పదమైన అంశం" అంటాడు అశోక్ లాహిరి. ఇదొక్కటే కాదు లాహిరి పుస్తకం 'ఇండియా ఇన్ సెర్చ్ ఆఫ్ గ్లోరీ' అంబేడ్కర్ గురించి వెల్లడించిన నమ్మశక్యం కాని నిజం. రాజ్యాంగ పరిషత్తుకు అంబేడ్కర్ ఏనాడూ నేరుగా ఎన్నికవలేదన్నదీ అలాంటి వాస్తవమే. 1945–46 ఎన్నికల్లో అంబేడ్కర్ రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నిక కాలేకపోయినప్పుడు ఆయనకు స్థానం కల్పించడం కోసం ముస్లిం లీగ్ శాసనసభ్యుడు జోగేంద్రనాథ్ మండల్ తన స్థానాన్ని త్యాగం చేశారు. అంబేడ్కర్ ఆనాడు పరిషత్తు సభ్యుడిగా లేకుంటే భారతదేశానికి ఎలాంటి రాజ్యాంగం తయారై ఉండేదో ఊహించండి. ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి అని మనం నేడు చెప్పుకుంటున్న దేశం తన రాజ్యాంగ పితను కోల్పోయి ఉండేది.

మన జాతిరత్నాల గురించి నిజంగా మనకు తెలుసునా? వాళ్లను మనం పీఠాలపై ప్రతిష్ఠించుకుని గౌరవించుకుంటాం. వారి గురించి తరచుగానూ, అనర్గళంగానూ మాట్లాడుకుంటూ ఉంటాం. వాళ్ల మాటల్ని కూడా యథాతథంగా స్వీకరించి మన జీవితాలకు బాటలు పరుచుకుంటాం. అయితే అదంతా వేరు, వాళ్ల గురించి తెలియడం వేరు.

ఇటీవల నేను చదివిన ఒక పుస్తకం బి.ఆర్.అంబేడ్కర్ గురించి నాకు తెలియని అనేకమైన విషయాలను వెల్లడించింది. అవేవీ వాస్తవ విరుద్ధమైనవి కావు. అలాగే సుప్రసిద్ధమైనవి కూడా! అయితే అవి అందరికీ తెలిసిన మనిషిగా అంబేడ్కర్‌లో భాగమై ఉన్నవి కావు.

ఎలాంటివంటే, నిజంగా ఆయనొక స్వాతంత్ర్య సమరయోధుడు కాదని మీకు తెలుసా? 1942 నుండి 1946 వరకు ఆయన వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో కార్మిక శాఖ మంత్రిగా ఉన్నారు. అంతకు ముందు, 1931లో ఆయన: "బ్రిటిష్ వారి నుండి భారత ప్రజలకు తక్షణ అధికార మార్పిడి జరగాలని అణగారిన వర్గాలవారు (అప్పుడు షెడ్యూల్డ్ కులాలు అని పిలిచేవారు) నిరసించలేదు. నినదించలేదు. ఉద్యమించలేదు" అని వ్యాఖ్యానించి ఉన్నవారు.


ఈ విషయాన్ని నేను అశోక్ లాహిరి పుస్తకం 'ఇండియా ఇన్ సెర్చ్ ఆఫ్ గ్లోరీ' నుంచి గ్రహించాను. "స్వాతంత్ర్య పోరాటంలో అంబేడ్కర్ పోషించిన పాత్రేమీ లేకపోవడం అన్నది ఆయన అద్భుతమైన జీవన ప్రగతిలో అత్యంత వివాదాస్పదమైన అంశం" అంటాడు అశోక్ లాహిరి. అది నన్నెంతో విస్మయానికి గురి చేసిందని నేను ఒప్పుకొని తీరాలి.

అయితే ఇదొక్కటి మాత్రమే కాదు లాహిరి పుస్తకం బహిర్గతం చేసిన నమ్మలేని నిజం. అంబేడ్కర్ అసలు రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికే కాలేదని తెలుస్తోంది. 1945–46 ఎన్నికల్లో ఆయన పార్టీ 'ఆలిండియా షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్' (ఎస్.సి.ఎఫ్.) 151 రిజర్వుడు సీట్లలో కేవలం రెండింటిని మాత్రమే గెలుచుకుంది. 'బాంబే ప్రావిన్షియల్ అసెంబ్లీ' నుంచి ఎస్.సి.ఎఫ్. ఒకే ఒక్క సీటును గెలుచుకున్న ఫలితంగా అంబేడ్కర్ రాజ్యాంగ పరిషత్తు సభ్యుడు కాలేకపోయారు.

దాన్ని మించిన పరాజయం... అంబేడ్కర్‌కు మద్దతు ఇచ్చేందుకు ఎవరూ సిద్ధంగా లేకపోవడం! "డాక్టర్ అంబేడ్కర్‌కు రాజ్యాంగ పరిషత్తు తలుపులతో పాటుగా కిటికీలు కూడా మూసి వేయబడ్డాయి" అని సర్దార్ పటేల్ ప్రకటించారు. "చూద్దాం... రాజ్యాంగ పరిషత్తులోకి అతడెలా ప్రవేశిస్తాడో" అని కూడా అన్నారు.



వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో కార్మిక శాఖ మంత్రిగా బి.ఆర్. అంబేడ్కర్



ఆ పరిస్థితుల్లో ముస్లిం లీగ్ శాసన సభ్యుడు జోగేంద్రనాథ్ మండల్ కాస్తా అంబేడ్కర్ వైపు నిలబడ్డారు. అంబేడ్కర్ కోసం తన సీటును త్యాగం చేశారు. అలా మండల్‌తో పాటు ఒకరిద్దరు ఎస్సీ ఎమ్మెల్యేలు, ఒకటీ లేదా రెండు ఆంగ్లో–ఇండియన్ ఓట్లతో బెంగాల్ నుంచి అంబేడ్కర్ రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికయ్యారు.

1947 జూలైలో మళ్లీ ఆయన ఇబ్బందుల్లో పడ్డారు. బ్రిటిష్ పార్లమెంటు భారత స్వాతంత్ర్య చట్టాన్ని ఆమోదించిన తర్వాత ఇండియాకు ఒకటి, పాకిస్థాన్‌కు ఒకటిగా రాజ్యాంగ పరిషత్తు విభజన జరిగింది. పర్యవసానంగా బెంగాల్ నుంచి అనేకమంది సభ్యులు తమ భారత రాజ్యంగ పరిషత్తు సభ్యత్వాన్ని కోల్పోయారు. వారిలో అంబేడ్కర్ ఒకరు.

అయితే మళ్లొకసారి ఆయన్ని ఊహించని అదృష్టం కాపాడింది. కాంగ్రెస్ పార్టీతో విభేదాల కారణంగా ఎం.ఆర్. జయకర్ రాజీనామా చేయడంతో ఆయన స్థానం ఖాళీ అయింది. అంతేకాదు... ఈసారి భారతదేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులు అంబేడ్కర్ సభ్యత్వానికి తోడ్పాటును అందించేందుకు సిద్ధమయ్యారు.

వారిలో రాజ్యాంగ పరిషత్తు ఛైర్మన్ రాజేంద్ర ప్రసాద్ ఒకరు. అప్పటి బొంబాయి ప్రధానమంత్రి బి.జి.ఖేర్‌కు ఆయన లేఖ రాశారు. "ఏ ఇతర పరిగణనలతోనూ నిమిత్తం లేకుండా తన సేవలను ఎవరూ వదులుకోలేని విధంగా ఉన్న ఆయన పనితీరును మాత్రమే గుర్తిస్తూ రాజ్యాంగ పరిషత్తులో, వివిధ కమిటీలలో ఆయన నియామకానికి ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. ఆయన బెంగాల్ నుంచి ఎన్నికయ్యారని మీకు తెలిసిందే! ఆ ప్రావిన్సు విభజన వల్ల 1947 జూలై 14 నుంచి ఆయన తన రాజ్యాంగ పరిషత్తు సభ్యత్వాన్ని కోల్పోవలసి వచ్చింది కనుక వెంటనే ఆయనను ఎన్నుకోవలసిన అవసరం ఉంది" అని అంబేడ్కర్‌కు ఆసరాగా నిలిచారు.

చివరికి పటేల్ కూడా అంబేడ్కర్ పట్ల తన వైఖరి మార్చుకున్నారు. అంబేడ్కర్‌కు సభ్యత్వం ఇప్పించేందుకు ఖేర్‌ను ఒప్పించడంతో పాటు, జయకర్ రాజీనామా వల్ల ఏర్పడిన ఖాళీని భర్తీ చేయబోయిన జి.వి. మావలంకర్‌కు నచ్చజెప్పి, ఆయన్ని పక్కకు తప్పించడంలో పటేల్ కీలకమైన పాత్ర పోషించారని లాహిరి రాశారు.

అంటే దేశానికి ఇది త్రుటిలో తప్పిన ముప్పు. అంబేడ్కర్ కనుక ఆనాడు రాజ్యాంగ పరిషత్తులో సభ్యుడిగా లేకపోయుంటే ఎలాంటి రాజ్యాంగం తయారై ఉండేదో ఊహించండి. ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి అని మనం నేడు చెప్పుకుంటున్న దేశం తన రాజ్యాంగ పితను కోల్పోయి ఉండేది.

ఈ పుస్తకంలోని నమ్మశక్యం కాని వాస్తవాలు నాలా మీలోనూ జనింపజేసే అవకాశం ఉన్న ఒక ప్రశ్నను లేవనెత్తడం ద్వారా నేను ఈ వ్యాసాన్ని ముగిస్తాను. అంబేడ్కర్‌కు, బహుశా భారతదేశానికి కూడా మార్గనిర్దేశం చేసిన హస్తం ఏదైనా ఉండిందా? అంబేడ్కర్ మన రాజ్యంగ పరిషత్తులో భాగం అని నిర్ధారించడానికి ఎవరిదైనా, లేదా ఏదైనా గట్టిగా ప్రభావం ఉన్నట్లు కనిపిస్తోంది. వాళ్లెవరు? అది ఏమిటి? అన్నదే ఆ ప్రశ్న.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా



సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సింపుల్!



ఒకరికి వ్యతిరేకంగా బయటినుంచి ద్వేషం, కోపం వస్తున్నప్పుడు, ఆ ఒకరు ఆ భావనలను లోపలికి అనుమతించకూడదు.

– మౌలానా వహీదుద్దీన్ ఖాన్, ఇస్లాం స్కాలర్

పాత్రలే కీలకం



ఒక రచయిత ఫిక్షన్ రాస్తున్నా, నాన్‌–ఫిక్షన్ రాస్తున్నా ఆ పుస్తకానికి పాత్రలే ప్రాణం. ఏవో కొన్ని మినహాయింపులను వదిలేస్తే, అన్ని పుస్తకాలకూ పాత్రలే కేంద్రంగా ఉంటూ ఆ కథకు ప్రాణం పోస్తాయి. వాటి కోరికలు, ప్రేరణలు, లోపాలు... ఇవే కథనాన్ని ముందుకు నడుపుతాయి.

– మేరూ గోఖలే, పబ్లిషర్

అవి వేరు!



డాక్టర్: "మీకు మద్యం, పొగ, ఇంకా అలాంటి అలవాట్లు ఏమైనా ఉన్నాయా?" పేషెంట్: "లేవు డాక్టర్, నేను ప్యూర్ వెజిటేరియన్." కారణం ఏదైనా గానీ ఇండియాలో పొగ తాగేవాళ్లు, మద్యం తాగేవాళ్ల విభాగంలోకే మాంసాహారులు కూడా వస్తారని నమ్ముతుంటారు.

– ప్రవీణ్ త్రిపాఠీ, సైకియాట్రిస్ట్

ఘోరం



టర్కీ 1952లో 'నాటో' సభ్యత్వం పొందింది. ఆ తర్వాత 22 ఏళ్లకు, అంటే 1974 జూలై 20న సైప్రస్ రిపబ్లిక్‌ను టర్కీ దురాక్రమించింది. ఇప్పటికి కూడా ఆ ద్వీపంలోని 36 శాతం అక్రమంగా టర్కీ అధీనంలోనే ఉంది. సైప్రస్ ఉత్తర భాగంలోని మొత్తం టర్కీయేతర తెగలందరినీ టర్కీ నిర్మూలించింది.

– ఉజయ్ బులూత్, ఫెలో

భవిష్యత్ పటం



రెండు దశాబ్దాల లోపల, పాకిస్తాన్ కంటే ఇండియా పరిస్థితి దారుణంగా తయారవుతుంది. తన బ్రిటిష్ వ్యవస్థలను నిర్వీర్యం చేసి పాకిస్తాన్ పరియా విధించింది. ఆ పని చేయని బంగ్లాదేశ్, ఇండియా కంటే మెరుగవుతోంది. మిగిలి వున్న బ్రిటిష్ వ్యవస్థలను హిందూయిజపు అవ్యవస్థలతో ఇండియా పునఃస్థాపిస్తోంది. ఇది ఉపశమనం లేని దారుణం.

– జయంత్ భండారీ, ఎనలిస్ట్

సనాతన సత్యం



ఎవరు సనాతనీ? ప్రకృతి సూత్రాలు, ప్రాచీన వివేకం, రుషులు, సాధువులు, శాస్త్రవేత్తలు, కళాకారులు, ఆస్తికులు, నాస్తికుల ద్వారా కావ్యాలు, పురాణాల రూపంలో ప్రవహించిన జ్ఞానం నుంచి పరిణామం చెందినదే సనాతన ధర్మం. సనాతనం అంటే శాశ్వతమైనది. సనాతనానికి వ్యతిరేకంగా పోవడమంటే ప్రకృతి సూత్రాలకు వ్యతిరేకంగా పోవడమే! మనుషుల్ని మనుషులు గెలవగలరు. కానీ మనుషులు ప్రకృతిని ఎప్పటికీ గెలవలేరు.

– ఖాలిద్ ఉమర్, లౌకిక మానవవాది

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

కవిత

తప్పి పోయింది!

ఎవరక్కడ..?
నా కుక్క తప్పిపోయింది / తక్షణం వెతికిపెట్టండి
ఎన్ని సార్లు చెప్పినా / మీరు జాగ్రత్త వహించలేదు
నిర్లక్ష్యంగా వ్యవహరించారు

ప్రజల సొమ్ము తింటున్న / మీకు విశ్వాసం లేదు
ఉద్యోగం మీద ధ్యాస లేదు / ప్రభుభక్తి అసలే లేదు

మిమ్మల్ని ఉద్యోగం నుంచి
తొలగించాలని ఆదేశిస్తున్నాను
దాన్ని వెతికి తెస్తె సరే సరి
లేదంటే / మీ ఉద్యోగాలు పోతాయి
మీ బతుకు / కుక్క బతుకు అవుతుంది.

ఎవరక్కడ...
నా కుక్కని వెదికి / వెంటనే ప్రవేశపెట్టండి!!
అది లేకపోతే / నాకు భోజనం సహించదు
నిద్ర కూడా పట్టదు

:::

అయ్యా...
మా శక్తి సామర్థ్యాలను ఉపయోగించి
మా పరిశోధనా పాటవాలను ప్రయోగించి
మీ కుక్కను దొరికించుకున్నాం!
విశ్వాసానికి ప్రతీక అయిన కుక్క
మీ మీద విశ్వాసం చూపించడం లేదు!
అది మీ ఉప్పు తినలేదో
మీ తెంపరితనం దానికి నచ్చలేదో
రానంటే రానని మొండికేస్తోంది!
బంధించి / ఇక్కడే ఉంచమంటారా?
మీరున్న నగరానికి తీసుకొని రమ్మంటారా?
లేదా / ఎన్ కౌంటర్ చెయ్యమంటారా?
ఏదో ఒకటి చెప్పండి!

– జింబో

సారాంశం
సరికొండ చలపతి

రెయిన్‌–పెయిన్... సేమ్ సీన్!

ముందుమాట

"రండి రండి.. మీ కోసమే చూస్తున్నాం. పోయి నేడాది ఇదే సమయం ఇదే వానల్లో వచ్చారుగా.. ఫొటోలు వీడియోలు తీసుకున్నారుగా.. మమ్మల్ని నానాప్రశ్నలు వేశారుగా! ఏమైంది? ఏమన్నా మారిందా? మాకు చెప్పడం మీరు వినడం అంతేగా. మీరు అటు వెళ్లగానే ఓ మంద వస్తది.. పావలా అర్ధ ఇస్తరు.. సరుకులు మొహాన కొడతరు.. ఫొటోలు దిగుతరు.. అంతే మా బాధలు మావి.. అంతా మునుగుడే.. ఎందుకీ సోదంతా.. మా పరిస్థితి మారేదిలేదు.. మా గురించి ఎవరూ పట్టించుకునేది లేదు. మళ్లీ వచ్చేయేడు రండి మాట్లాడుకుందాం."

– వరదల బాధలు రిపోర్ట్ చేయడానికి వచ్చిన టీవీ రిపోర్టర్‌పై ఓ మహిళ ఫైరింగ్.

ఇంట్లో నీళ్లు... కంట్లో నిప్పులు

రోటికాడ పాట

వానల్లు కురవాలి వానదేవుడా –
వరిచేలు పండాలి వానదేవుడా
చెరువులన్నీ నిండాలి వానదేవుడా –
చేలన్నీ పండాలి వాన దేవుడా

అని కరువు రోజుల్లో తెలుగులో.. రెయిన్ రెయిన్ గో అవే–కమ్ ఎగైన్ ఎనదర్ డే.. అని వరదల కాలంలో.. ఇంగ్లిషులో పాడుకునేది పిల్లలే కాదు.. ఇంకో సెక్షన్ కూడా ఉంది. వానలు పడగానే రెయిన్‌కోట్లు వేసుకుని హడావిడిగా నీళ్లు నిండిన ఇళ్ల వద్ద మందీ మార్బలంతో, అనుచర, అధికార గణంతో, గొడుగులతో ప్రాజెక్టుల వద్ద ప్రత్యక్షమయ్యే సెక్షన్.

గాంధారి వాన

వానల కోసం రెండు నెలలుగా ఎదురు చూస్తుండగా వారం పదిరోజులు దంచి కొట్టి కసి తీర్చుకున్న వాన.. కుండపోత వాన అనుకున్నాం కదా! ఒక్క కుండపోతే కాదు... ఇలాంటి వానలు పాతిక రకాలుంటాయట...

మాపుసారి వాన, మీసర వాన, దుబ్బురు వాన, సూరునీల్ల వాన, బట్టదడుపు వాన, తెప్పె వాన, సాలు వాన, ఇరువాలు వాన, మడికట్టు వాన, కుండపోత వాన, ముసురు వాన, దరోదరి వాన, కప్పదాటు వాన, సాలేటి వాన, సాలుపెట్టు వాన, గాంధారి వాన... "కుండపోత వాన కాదు. మనకు పడే ప్రతి వానా.. గాంధారి వానే! ధృతరాష్ట్ర పాలన కదా! వానా కనపడదు..బాధలూ కనపడవు."

– సర్కారు సెలవులిస్తే ఇంట్లో కూర్చుని మిర్చీ బజ్జీ తింటూ, టీవీల్లో చూపే జనాల బాధలు చూసి ఒకాయన చిటపటలు.

...

'సాయం' కాలం మాట

'సర్! ప్రతిసారీ ఇలా వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఇలా పదో పరకో సాయం చేసే బదులు ..చిన్న చిన్న డ్రైనేజీ సమస్యలే కదా.. తక్కువ ఖర్చుతో పోతుంది కదా చేయిస్తే పోలా' అని ఓ ప్రజా ప్రతినిధిని ఆయన పీఏ ప్రశ్నిస్తే...'అన్ని సమస్యలూ తీరిస్తే వచ్చే ఎన్నికల్లో హామీ ఇవ్వడానికి ఏం మిగులుతాయి..' అని ఆ ప్రజాప్రతినిధి ఎదురు ప్రశ్న.

పూర్తిగా సమస్యలు తీరడం వీరికి ఇష్టం ఉండదన్న మాట, దానితో పాటు డబ్బులు ఖర్చుపెట్టడం కూడా ఇష్టం ఉండదట.. దానికీ ఓ జోక్ ఉంది.

"ప్రజా ప్రతినిధి.. అంటేనే ప్రజల ప్రతినిధీ తినేవాడు అని..'

– ఈ అర్థం జీర్ణం చేసుకున్నాక సమస్యలు తీర్చడానికి డబ్బులేం మిగులుతాయి.. అని ఓ నిష్ఠూరం.



...

కాటకాల ఆట

ధృతరాష్ట్ర పాలన గాంధారి వానలను విస్మరించినా, తాత్కాలికంగా ఏమార్చే ప్రయత్నం చేసినా... ఎన్నికల కురుక్షేత్రంలో జనం దాని తాలూకు రుచి చూపుతూనే ఉంటారు. అధికార పార్టీల ఆశలపై 'నీళ్లు' చల్లుతూనే ఉన్నారు. అలా మన దేశంలో వరదలు, కరువు పరిస్థితులు కొన్నిసార్లు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ రాజకీయ పరిణామాలనే మార్చేశాయి. అలాంటివి కొన్ని చూడండి.

■ 1960వ దశకం మొదట్లో దేశంలో కరువు పరిస్థితులు నెలకొనడం మొదలైంది. 1966 నాటికి తీవ్ర కరువు ఏర్పడింది. దేశంలో ఆహార ధాన్యాల దిగుబడి ఏకంగా 23.5 శాతం తగ్గిపోయింది. దీనితో ధరలు పెరిగిపోయి ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభ పరిస్థితి తలెత్తింది. దీనిని చక్కదిద్దడానికి అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం 1966 జూన్ 6న రూపాయి విలువ (డాలర్‌తో మారకంలో)ను తగ్గించింది. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో ఇందిరాగాంధీపై వ్యతిరేకత పెరిగింది. ఇది 1969లో జాతీయ కాంగ్రెస్‌లో చీలికకు దారితీసింది. ఇందిరాగాంధీ సొంతంగా పార్టీ పెట్టుకోవాల్సి వచ్చింది.

■ 1973లోనూ భారత్‌లో మరోసారి తీవ్ర కరువు వచ్చింది. దానికి చమురు ధరల మంట తోడై.. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లింది. అంతకు రెండేళ్ల ముందు 'అపర కాళిక'గా కీర్తింపబడిన ఇందిరాగాంధీపై ఇటు ప్రజల్లోనూ వ్యతిరేకత మొదలైంది. ప్రతిపక్షాలు ఒక్కసారిగా యాక్టివ్‌గా మారాయి. జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో ప్రతిపక్షాల ఉద్యమాలు మొదలయ్యాయి. వాటిని అణచడానికి ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించడం, ఆ ప్రభావంతో చిత్తుగా ఓడిపోయి.. జనతా పార్టీ సంకీర్ణ సర్కారు ఏర్పడటం అందరికీ తెలిసిందే.

■ కరువు పరిస్థితులు 1986లోనూ జాతీయ రాజకీయాల్లో గట్టి ప్రభావం చూపాయి. జనంలో అప్పటి ప్రభుత్వంపై, ప్రధాని రాజీవ్ గాంధీపై వ్యతిరేకత పెరగడాన్ని పసిగట్టిన వీపీ సింగ్.. కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చి సొంత పార్టీ పెట్టుకున్నారు. బీజేపీ సహా పలు ప్రతిపక్షాలను కూడగట్టి.. కాంగ్రెస్ పార్టీని ఓడించి ప్రధాని అయిపోయారు.

■ 2002లో వచ్చిన కరువు దేశ రాజకీయాల్లో మరోసారి మార్పులకు దారితీసింది. 20 శాతం లోటు వర్షపాతంతో, దేశంలో ఏకంగా 30 శాతం భూభాగం కరువు బారినపడటం, ధరలు పెరగడం... కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. దేశంలో బీజేపీ నేతృత్వంలో ఏర్పడిన తొలి ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి గట్టి దెబ్బ తగిలింది. 2004 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలోకి వచ్చింది.

ఓటుకాడ 'స్పాట్'

కరువులు, వరదలు ఎన్నికలను ఎలా ప్రభావితం చేస్తాయి? పార్టీలు, ప్రభుత్వాల చేతుల్లో లేని కరువు, వరదల కారణంగా ప్రజలు ఆగ్రహంగా ఉండటం ఏమిటి? అన్న అంశాలపై కొద్దికాలం క్రితం ఓ సంస్థ అధ్యయనం చేసింది. మన దేశంలో జాతీయ, రాష్ట్ర, స్థానిక ఎన్నికలు, మధ్యంతరాలు, ఉప ఎన్నికలు వంటి వన్నీ కలిపి ఇప్పటివరకు వేలాది ఎన్నికలు జరిగాయి. వాటన్నింటినీ విశ్లేషించగా.. కరువులు, వరదలతో ఏర్పడే పరిస్థితులతో పాటు, అప్పుడు అధికారంలో ప్రభుత్వాలు ఎలా స్పందించాయనే అంశం కూడా ప్రజల మూడ్‌ను ప్రభావితం చేస్తున్నట్టు తేలింది.

ముఖ్యంగా ఎన్నికలు సమీపంలో ఉన్న సమయంలో వచ్చిన కరువు లేదా వరదలను ఎదుర్కొనేందుకు సదరు ప్రభుత్వం ఏ స్థాయిలో సహాయ కార్యక్రమాలు చేపట్టింది? ప్రజలకు నేరుగా ఎంత మేర ప్రయోజనం కలిగించింది అన్నది కీలకమని అధ్యయనం గుర్తించింది. ఉపశమన చర్యలు, సంక్షేమం కోసం ఎక్కువ ఖర్చు చేసిన ప్రభుత్వాలపై వ్యతిరేకత తక్కువగా ఉందని తేల్చింది.

అందుకే... ఆన్ ది స్పాట్..

వర్షాలు లేక విత్తనాలు మొలకెత్తకపోతే వీరికి ఓట్లు పండవు.

వరదొచ్చి ఇళ్లలోకి నీళ్లు వస్తే,,, పీఠం కిందికి నీరు వస్తుందని భయం!

టీవీల నిండా, పేపర్ల నిండా నీళ్లతో పాటు బాధితుల కళ్లలో నీళ్లు, గొంతులో నిప్పులు కనపడేసరికి కంగారు పడి స్కూళ్లకు, విద్యా సంస్థలకు కాసిన్ని సెలవులు, అక్కడక్కడ కాసింత సాయం, మరికొన్ని హామీలతో సమస్య కాస్త తగ్గించే హడావిడి కనిపిస్తుంది.

– పైన గృహిణి చెప్పినట్టు మళ్లీ వర్షాలకు సేమ్‌సీన్.

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: శు.చతుర్దశి రా.3.07 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం: పూర్వాషాఢ సా.6.34 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా.2.07 నుండి 3.36 వరకు, దుర్ముహూర్తం: ప.12.33 నుండి 1.24 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.57 వరకు, అమృతఘడియలు: ప.2.06 నుండి 3.30 వరకు : రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 5.42, సూర్యాస్తమయం: 6.31.

క్లుప్తంగా...

బంగాళాఖాతంలో అల్పపీడనం

సాక్షి, అమరావతి: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. వచ్చే నెల రెండోతేదీ నాటికి ఇది ఉత్తరాంధ్ర-ఒడిశా మధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావం రాష్ట్రంపై పెద్దగా ఉండే అవకాశం లేదని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ తీరం దాటిన తర్వాత కూడా ఇది నేలపైన కొనసాగితే ఉత్తరాంధ్రలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని తెలిపారు.

అగ్నిగుండంలో దూకి.. వ్యక్తి ప్రాణాలు కాపాడి!

- అన్నమయ్య జిల్లాలో ఓ వలంటీర్ సాహసం


చికిత్స పొందుతున్న కల్లూరి బాషా


గాయాలపాలైన వలంటీర్ సురేష్

రైల్వేకోడూరు: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలంలోని ఓ.కొత్తపల్లిలో శనివారం రాత్రి పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో కల్లూరి బాషా అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పడిపోయాడు. అక్కడే ఉన్న వలంటీర్ చాపల సురేష్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా గుండంలో దిగి బాషా ప్రాణాలు కాపాడాడు. ఈ సంఘటనలో బాషా వీపు భాగం బాగా కాలిపోవడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. వలంటీర్ కాళ్లు కాలిపోవడంతో కోడూరులో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. పీర్లచావిడి అగ్నిగుండం వద్ద జరిగిన ఈ సంఘటనను వందలాది మంది చూస్తున్నారే తప్ప బాషా ప్రాణాలను కాపాడేందుకు ఎవ్వరూ ముందుకు రాలేకపోయారు. కానీ వలంటీర్ సురేష్ సాహసం చేసి గుండంలో పడిపోయిన బాషా ప్రాణాలు కాపాడి అందరి మన్ననలు పొందాడు.

ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

బిట్రగుంట: నర్సాపూర్ నుంచి ధర్మవరం జంక్షన్ వెళుతున్న (ధర్మవరం ఎక్స్‌ప్రెస్-12747)కు ప్రమాదం తప్పింది. ఈ రైలు శనివారం అర్ధరాత్రి 12.01 గంటలకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి రైల్వేస్టేషన్ దాటి ముసునూరు వినాయకనగర్ కాలనీ సమీపంలోకి వచ్చే సరికి కిలోమీటరు నంబరు 220 (19-17) వద్ద రైలు పట్టాల మధ్యలో 1.5 మీటర్ల పొడవున్న రైలు పట్టా ముక్క ఒకటి నిలువుగా పడి ఉంది. దానిని లోకో పైలట్ గుర్తించి రైలు వేగాన్ని అదుపు చేశారు. రైలు పట్టా ముక్క ట్రాక్ మధ్య నిలువుగా ఉండడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. అనంతరం రైలును బిట్రగుంటలో నిలిపివేసి ఈ ఘటనపై లోకో పైలట్ రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. రైల్వే, జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ముసునూరు సమీపంలోని ఎల్‌సీ గేటు-150 వద్ద భద్రపరిచిన పాత రైలు పట్టా ముక్కను దొంగిలించి తీసుకువెళుతూ సాధ్యంకాక ఇక్కడ వదిలి వెళ్లినట్లుగా అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కొన్ని మీడియా, యూట్యూబ్ చానల్స్‌లో తప్పుడు కథనాలు, స్క్రోలింగ్‌లు ప్రసారం చేయడంపై రైల్వే అధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

వేడుకగా ఛత్రస్థాపనోత్సవం



తిరుమల: తిరుమల నారాయణగిరి శ్రీవారి పాదాల వద్ద ఛత్రస్థాపనోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీవారి పాదాల వద్ద టీటీడీ అర్చక బృందం ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్ఠించారు. తొలుత తిరుమల శ్రీవారి ఆలయం నుంచి పూజా సామగ్రి, పుష్పాలు, నైవేద్యం, గొడుగుతో మంగళవాయిద్యాల నడుమ ఆలయ మాడ వీధుల గుండా అర్చక బృందం మేదరమిట్టకు చేరుకుంది. అక్కడి నుంచి నారాయణగిరికి విచ్చేసింది. ముందుగా శ్రీవారి పాదాలకు తిరుమంజనం చేపట్టారు. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం అలంకారం, పూజ చేసి నైవేద్యం సమర్పించారు. వేదపారాయణదారులు ప్రబంధ శాత్తుమొర నిర్వహించారు.

బావిలో పడిన కొండచిలువ


బావిలో కొండచిలువ

దువ్వూరు: వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలంలోని సి.బయనపల్లె గ్రామ పొలాల్లోని బావిలో 30 అడుగుల కొండ చిలువ పడింది. వంక గట్టున రైతులు ఏర్పాటు చేసుకున్న ఈ బావి ప్రస్తుతం ఎండిపోయింది. నీరు లేని ఈ బావి నుంచి బయటికి రాలేక అవస్థలు పడుతోంది. నాలుగైదు రోజులుగా కొండ చిలువ అక్కడే ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వే వద్ద పడవలపై తీర గ్రామాల ప్రజల రాకపోకలు


అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండల కేంద్రం ప్రధాన సెంటర్లో నీట మునిగిన ఇళ్లు

ధవళేశ్వరం వద్ద గోదావరి దూకుడు

బ్యారేజ్‌లోకి 16.43 లక్షల క్యూసెక్కుల ప్రవాహం.. 16 అడుగులకు చేరిన నీటిమట్టం

- ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- బ్యారేజ్ నుంచి 16.32 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలు సముద్రంలోకి విడుదల
- ఈ సీజన్‌లో ఇప్పటికే 831.357 టీఎంసీల గోదావరి జలాలు కడలిపాలు
- వర్షాల తెరపితో ఎగువన గోదావరిలో వరద ప్రవాహం తగ్గుముఖం
- భద్రాచలం వద్ద 50.9 అడుగులకు తగ్గిన నీటిమట్టం
- మూడో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ


రాజమహేంద్రవరం రోడ్ కం రైల్వే బ్రిడ్జి వద్ద గోదావరి పరవళ్లు

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గోదావరి వరద ఉధృతి దూకుడు ప్రదర్శిస్తోంది. ఆదివారం సాయంత్రం బ్యారేజ్‌లోకి 16,43,480 క్యూసెక్కులు (142.02 టీఎంసీలు) చేరుతుండటంతో నీటిమట్టం 16 అడుగులకు చేరుకుంది. దీంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు కొనసాగిస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి వచ్చిన గరిష్ట ప్రవాహం ఇదే కావడం గమనార్హం. గోదావరి డెల్టాకు 10,700 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగిలిన 16,32,780 క్యూసెక్కులను (141.09 టీఎంసీలను) సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఈ నీటి సంవత్సరంలో అంటే జూన్ 1 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు 831.357 టీఎంసీల గోదావరి మిగులు జలాలు కడలిపాలవడం గమనార్హం. నదీ పరీవాహక ప్రాంతంలో వర్షాలు తెరిపి ఇవ్వడంతో ఎగువన వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజ్ నుంచి 5.71 లక్షలు, తుపాకుల గూడెం బ్యారేజ్ నుంచి 9.15 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. దీంతో భద్రాచలం వద్ద వరద ప్రవాహం గంటగంటకు తగ్గుతోంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్దకు వస్తున్న ప్రవాహం 13.06 లక్షల క్యూసెక్కులకు తగ్గింది. నీటిమట్టం 50.9 అడుగులకు తగ్గింది. దీంతో మూడో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. భద్రాచలం నుంచి పోలవరం ప్రాజెక్టులోకి 13,80,216 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటిమట్టం స్పిల్ వేకు ఎగువన 34.28, దిగువన 26.21, ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద 35.43, దిగువ కాఫర్ డ్యామ్ వద్ద 25.47 మీటర్లకు చేరుకుంది. స్పిల్ వే 48 గేట్లను పూర్తిగా ఎత్తేసి 13.80 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఎగువన వరద ప్రవాహం తగ్గిన నేపథ్యంలో సోమవారం నుంచి పోలవరం ప్రాజెక్టు, ధవళేశ్వరం బ్యారేజ్‌లలోకి చేరే ప్రవాహం కూడా తగ్గుముఖం పట్టనుంది.

➤ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని విలీన మండలాల్లో గోదావరి, శబరి నదుల వరద తగ్గుముఖం పట్టింది. గోదావరి వరద శనివారం అర్ధరాత్రి నుంచి తగ్గుతుండగా శబరినది వరద ఆదివారం మధ్యాహ్నం నుంచి తగ్గసాగింది. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లోని పలు గ్రామాల్లో ఇళ్లలోకి వరదనీరు చేరడంతో బాధితులు ఇళ్లను ఖాళీచేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలతో పాటు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. చింతూరు మండలంలో వరదనీరు జాతీయ రహదారులపై నిలిచిపోవడంతో ఆంధ్రా నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

➤ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నాలుగు రోజులుగా ప్రజలను, అధికారులను ఆందోళనకు గురిచేసిన వరద ప్రభావం ఆదివారం తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద ఉగ్రరూపం దాల్చిన గోదావరి వరదతో ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలో పలు ఇళ్లు నీట మునిగాయి. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం వద్ద గల తమ్మిలేరు రిజర్వాయర్‌లోకి 833 క్యూసెక్కుల నీరు ఎగువ నుంచి వస్తోందని ఏఈఈ పరమానందం తెలిపారు. రిజర్వాయర్ ఎడమ కాల్వ ద్వారా 20 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. రిజర్వాయర్ పూర్తి నీటిమట్టం 355 అడుగులు కాగా ప్రస్తుతం 348.27 అడుగుల మట్టంలో నీరు ఉంది. జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలోకి గంటకు 881 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఏలూరు మండలం కోమటిలంక గ్రామం వద్ద నాగరాజు కోడు (పోలరాజు డ్రెయిన్) వద్ద కాజ్‌వేపై వరద నీరు ప్రమాదకర పరిస్థితిలో ప్రవహిస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి వద్ద గోదావరి నిలకడగానే ప్రవహిస్తోంది. నరసాపురం పట్టణంలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ ప్రాంతాల్లో అధికారులు ఏటిగట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం సిద్ధాంతం వద్ద గోదావరి వరద ఉధృతి పెరగడంతో లంక గ్రామాల్లోకి వరద నీరు చేరింది. ఆచంట మండలంలో అయోధ్యలంక, మర్రిమూల, పెదమల్లంలంక గ్రామాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరింది.

➤ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 9 మండలాల్లోని 30 గ్రామాలు వరద బారిన పడ్డాయి. ఇక్కడ శనివారం కన్నా ఆదివారం ఒక అడుగు ఎత్తున ముంపు పెరిగింది. ముమ్మిడివరం మండలం గురజాపులంకలో ఇళ్లలోకి వరద నీరు చేరింది. సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంకలోకి వరద నీరు పెద్ద ఎత్తున చేరింది. పి.గన్నవరం పాత అక్విడెక్టు, అన్నంపల్లి అక్విడెక్టుల వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే మూడుచోట్ల కాజ్‌వేలు మునిగిపోగా, కొత్తగా పలు కాజ్‌వేల మీదకు వరద నీరు చేరింది. పి.గన్నవరం, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి, అయినవిల్లి మండలాల్లో వరద తీవ్రత ఎక్కువగా ఉంది.

వరద బాధితులకు కొండంత అండ

▶ మొదటి పేజీ తరువాయి

ప్రణాళిక రూపొందించారు. అందుకనుగుణంగా చకచకా పునరావాస ఏర్పాట్లు జరిగాయి. గతంలో మాదిరిగా వరద ప్రభావం తగ్గిన తర్వాత తాపీగా అరకొర నిధులు విడుదల చేయడం కాకుండా.. ఐదుజిల్లాలకు అవసరమైన రూ.12 కోట్లు వెంటనే విడుదల చేశారు. ఫలితంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కార్యకలాపాలు పక్కాగా అమలవుతున్నాయి.

216 గ్రామాలకు వరద ముంపు

అల్లూరి సీతారామరాజు, ఏలూరు, అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 216 గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. ఆ గ్రామాల నుంచి 52,753 మందిని తరలించారు. వీరిలో 48,345 మంది ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. 79 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. వరద ముంపు ప్రభావం అల్లూరి సీతారామరాజు జిల్లాపై ఎక్కువగా ఉండడంతో అక్కడ నాలుగు మండలాల పరిధిలోని 96 గ్రామాల ప్రజల కోసం 51 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిల్లో 43,587 మంది ఆశ్రయం పొందుతున్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

వరద తగ్గిన తర్వాత బాధితులు పునరావాస కేంద్రాల నుంచి తిరిగి తమ ఇళ్లకు వెళ్లేటప్పుడు వారికి రూ.వెయ్యి నుంచి రూ. 2 వేల ఆర్థికసాయం అందించాలని సీఎం వైఎస్ జగన్ స్పష్టంగా ఆదేశాలు జారీచేయడంతో అధికారులు అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ డబ్బు పంపిణీ కోసం ఇప్పటికే రెవెన్యూ శాఖ ఉత్వర్వులు జారీచేసింది. బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, కిలో చొప్పున కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, లీటర్ పామాయిల్ ఇస్తున్నారు. ఐదు వరద ప్రభావిత జిల్లాల్లో దెబ్బతిన్న ఇళ్లకు ఇచ్చే పరిహారాన్ని కూడా సీఎం వైఎస్ జగన్ రూ.10 వేలకు పెంచారు. గతంలో ఇది రూ.5 వేలు ఉండగా సీఎం సూచనతో దాన్ని రూ.10 వేలకు పెంచుతూ జీవో జారీ అయింది. గ్రామ వలంటీర్లు చురుగ్గా పనిచేస్తూ స్థానికంగా ఉన్న పరిస్థితిపై ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారమిస్తున్నారు.

➡ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లోని ముంపు గ్రామాల్లో అధికారులు ముమ్మరంగా సహాయక చర్యలు చేపడుతున్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. చింతూరు కేంద్రంగా డివిజన్లోని ముంపు ప్రాంతాలకు లాంచీలు, మరబోట్ల ద్వారా బియ్యం, కందిపప్పు, కూరగాయలు, పాలప్యాకెట్లు, కొవ్వొత్తులు, టార్పాలిన్లు సరఫరా చేస్తున్నారు. వరద బాధితులకు పంపిణీ చేసేందుకు పట్టణ ప్రాంతాల నుంచి ఎప్పటికప్పుడు తాజా కూరగాయలు రప్పిస్తున్నారు. వరదలకు చింతూరు డివిజన్లో 250 గ్రామాలకు చెందిన 17 వేల కుటుంబాలు ప్రభావితమైనట్లు అధికారులు తెలిపారు. ఎటపాక మండలం నెల్లిపాకకు చెందిన దేదారి రాముడు (50) అనే వ్యక్తి పశువులు మేపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ వరదనీటిలో పడి మృతిచెందాడు.


కోనసీమ జిల్లా బోడసకుర్రు పల్లిపాలెంలో బాధితులకు భోజన సదుపాయం

➡ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో వరద బాధితులకు సహాయ పునరావాస కార్యక్రమాలను అధికారులు ముమ్మరం చేశారు. పునరావాస కేంద్రాలు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. బాధితులకు ఆహార, తాగునీటి అవసరాలు తీరుస్తూ, అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నారు.

➡ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 1,321 కుటుంబాలకు చెందిన 3,787 మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్థానికుల రాకపోకలకు అనువుగా 172 పడవలు ఏర్పాటు చేశారు. వరదలకు బాధితులకు పునరావాసం కల్పించడంతోపాటు భోజన ప్యాకెట్లు అందిస్తున్నారు. కె.గంగవరం మండలం కోటిపల్లి వద్ద మత్స్యకార కాలనీ ముంపు బారిన పడింది. ఇక్కడ 300 మందికి భోజన వసతి కల్పించారు. ఐ.పోలవరం మండలం కేశనకుర్రులో 700 మందికి ఆహార పొట్లాలు అందించారు. మామిడికుదురు మండలం పాశర్లపూడి, పాశర్లపూడిలంకల్లో సుమారు 400 మందికి భోజన ప్యాకెట్లను పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పంపిణీ చేశారు. జిల్లాలో 20 పునరావాస కేంద్రాలు నడుస్తుండగా, బాధితులకు 21,756 భోజన ప్యాకెట్లు అందజేశారు. 33 వేల మంచినీటి ప్యాకెట్లు, 4,400 వరకు 20 లీటర్ల వాటర్ టిన్నులను అందించారు.


ఏలూరు జిల్లా కివ్వాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో బాధితులకు కూరగాయలు పంపిణీ


తూర్పు గోదావరి జిల్లా మద్దూరులోని శిబిరంలో బాధితులతో మాట్లాడుతున్న హోం మంత్రి వనిత

విద్యుత్ శాఖ అప్రమత్తం

- వర్షాలు, వరదల వల్ల విద్యుత్ సరఫరాకు, ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు
- డిస్కంల పరిధిలోని అన్ని సర్కిళ్లలో పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు


పెదవేగిలో విద్యుత్ వైర్లు సరిచేస్తున్న సిబ్బంది

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, సంభవిస్తున్న వరదల వల్ల ప్రజలకు ఎలాంటి సమస్య తలెత్తకుండా విద్యుత్ శాఖ అప్రమత్తమైంది. ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మాజనార్దనరెడ్డి, కె.సంతోషరావు 'సాక్షి'తో మాట్లాడారు. వర్షాకాలంలో విద్యుత్‌తో సంబంధమున్న ఏ వస్తువునైనా.. ఒకటికి రెండు సార్లు పరిశీలించిన తర్వాతే తాకాలని ప్రజలకు సూచించారు. ఆక్వా రైతులు ఏరియేటర్స్‌ను పట్టుకోవద్దని, గృహ వినియోగదారులు సర్వీస్ వైర్లను, వాటితో వేలాడే ఇనుప తీగలను, కరెంట్ స్తంభాలను, ఇనుప స్తంభాలను, లైన్ల మీద పడిన చెట్టు కొమ్మలను పట్టుకునే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. పొలాల్లో తెగిపడిన, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని.. ముఖ్యంగా 11 కేవీ, 33 కేవీ విద్యుత్ తీగల కింద, 132/220 కేవీ సరఫరా టవర్ల దగ్గరలో నిల్చోవద్దని సూచించారు. విద్యుత్‌కు సంబంధించిన సమస్య ఉంటే.. వెంటనే సిబ్బందిని సంప్రదించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు తమ సిబ్బందికి వాకీ టాకీ సెట్‌లు అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే టోల్ ఫ్రీ నంబర్-1912 అందుబాటులో ఉందన్నారు. దానికి అదనంగా పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలతో పాటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం తదితర సమస్యల పరిష్కారం కోసం పర్యవేక్షణ కేంద్రాల నంబర్లను సంప్రదించాలని సూచించారు. ప్రజల రక్షణకు, విద్యుత్ పునరుద్ధరణ పనులకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక అధికారులను, సహాయక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు తదితర విద్యుత్ సామగ్రిని.. జేసీబీలు, ట్రీ కట్టర్లు, జనరేటర్లు, రవాణా వాహనాలు, కార్మికులను సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. జిల్లా/సర్కిల్ వారీగా పర్యవేక్షణ కేంద్రాల ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచారు.

జిల్లా/సర్కిల్	ఫోన్ నంబర్లు
ఏలూరు	9440812702
రాజమహేంద్రవరం	9440812583
విశాఖపట్నం	9440812487
విజయనగరం	9440812447
శ్రీకాకుళం	9440812386
విజయవాడ	9440817561
గుంటూరు	9440817526, 0863-2237755
సీఆర్డీఏ	8331092947
ఒంగోలు	9440817491, 0859-2233248
నెల్లూరు	9440817468
తిరుపతి	9440817412
కడప	9440817440
అనంతపురం	9491067446
కర్నూలు	7382614308


కృష్ణాలో తగ్గిన వరద

శ్రీశైలంలోకి 82,055 క్యూసెక్కుల ప్రవాహం

846.7 అడుగుల్లో 73.23 టీఎంసీలకు చేరిన నిల్వ

- మూసీ నుంచి పులిచింతలలోకి 11,755 క్యూసెక్కులు
- మున్నేరు, కట్టలేరు, బుడమేరుల్లో వరద తగ్గుముఖం
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 48,696 క్యూసెక్కులు కడలిలోకి
- వర్షాల తెరపితో ఆల్మట్టి, నారాయణపూర్‌లలోకి తగ్గిన వరద
- ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టుల గేట్లు మూత
- ఆ మూడు ప్రాజెక్టుల్లో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు నీరు విడుదల
- తుంగభద్ర డ్యామ్‌లోకి తగ్గిన ప్రవాహం

సాక్షి, అమరావతి: పరీవాహక ప్రాంతంలో వర్షాలు తెరిపి ఇవ్వడంతో కృష్ణానదిలో వరద ప్రవాహం తగ్గింది. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు శ్రీశైలం ప్రాజెక్టులోకి 82,055 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటిమట్టం 846.7 అడుగులకు పెరిగింది. నీటినిల్వ 73.23 టీఎంసీలకు చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 885 అడుగులు. పూర్తినిల్వ 215.81 టీఎంసీలు. శ్రీశైలం ప్రాజెక్టు నిండాలంటే ఇంకా 142 టీఎంసీలు అవసరం. కృష్ణా ప్రధానపాయపై ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లు ఇప్పటికే నిండుకుండలుగా మారిన నేపథ్యంలో.. ఇకపై కురిసే వర్షాల వల్ల ఆ డ్యామ్‌లలోకి వచ్చే ప్రవాహాన్ని దిగువకు విడుదల చేయాల్సిందే. ఈ నేపథ్యంలో శ్రీశైలంతోపాటు, నాగార్జునసాగర్ కూడా ఆగస్టులో నిండుతాయని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. పులిచింతల ప్రాజెక్టులోకి మూసీ నుంచి 11,755 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 32 టీఎంసీలకు చేరింది. ఈ ప్రాజెక్టు నిండాలంటే ఇంకా 13 టీఎంసీలు అవసరం. మున్నేరు, కట్టలేరు, బుడమేరు తదితర వాగులు, వంకల్లో ప్రవాహం తగ్గడంతో ప్రకాశం బ్యారేజ్‌లోకి చేరుతున్న వరద తగ్గింది. ప్రకాశం బ్యారేజ్‌లోకి 48,696 క్యూసెక్కులు చేరుతుండగా.. అంతేస్థాయిలో గేట్లద్వారా అధికారులు సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఈ నీటి సంవత్సరంలో అంటే జూన్ 1 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ప్రకాశం బ్యారేజ్ నుంచి 46.715 టీఎంసీల కృష్ణా మిగులు జలాలు కడలిలో కలిశాయి. ఇవన్నీ మున్నేరు, కట్టలేరు వరద జలాలే కావడం గమనార్హం. ఇక పశ్చిమ కనుమల్లో వర్షపాత విరామం ఏర్పడటంతో.. కృష్ణా ప్రధానపాయలో ఎగువన వరద మరింత తగ్గింది. ఆల్మట్టిలోకి 1.16 లక్షలు, నారాయణపూర్‌లోకి 60 వేల క్యూసెక్కులు చేరుతుండటంతో గేట్లను మూసేశారు. ఆ రెండు డ్యామ్‌లలో విద్యుత్‌ను పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేస్తూ దిగువకు 55 వేల క్యూసెక్కులను వదిలేస్తున్నారు. జూరాలలోకి వరద ప్రవాహం 63,563 క్యూసెక్కులకు తగ్గడంతో గేట్లను మూసేసి.. విద్యుదుత్పత్తి చేస్తూ 41,252 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం శ్రీశైలంలోకి వచ్చే ప్రవాహం మరింతగా తగ్గనుంది. ఇక కృష్ణా ప్రధాన ఉపనది అయిన తుంగభద్రలోను వరద తగ్గింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 42,376 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 72.36 టీఎంసీలకు చేరుకుంది. ఈ డ్యామ్ నిండాలంటే ఇంకా 33 టీఎంసీలు అవసరం.


846.70 అడుగులకు చేరిన శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం

కరువు తీర్చిన అల్పపీడనం

- సమృద్ధిగా కురిసిన వర్షాలు
- లోటు నుంచి సాధారణ స్థాయికి వర్షపాతం
- కృష్ణా, విశాఖపట్నం జిల్లాల్లో అధికం
- అత్యల్పంగా తిరుపతి జిల్లాలో 42 శాతం లోటు

సాక్షి, విశాఖపట్నం: ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులకు చెక్ పెట్టింది. నైరుతి రుతుపవనాల సీజనులోకెల్లా అధిక వర్షపాతంతో కరువు తీర్చింది. సాధారణంగా రాష్ట్రంలో జూన్ నుంచే వర్షాలు మొదలై జూలైలో ప్రభావం చూపుతాయి. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా జూన్‌లోను వడగాడ్పులతో కూడిన ఎండలు మండిపోవడంతోపాటు వర్షాల జాడ లేదు. జూలై మూడోవారం వరకు రాష్ట్రంలో అరకొర వానలే కురిశాయి. దీంతో రాష్ట్రంలో జూలై మూడోవారంలోను సాధారణంకంటే 25 శాతం లోటు వర్షపాతం కొనసాగింది. తొలుత ఈనెల 20న ఏర్పడిన అల్పపీడనం రాష్ట్రంలో మోస్తరు వర్షాలు కురిపించింది. 24న ఏర్పడిన మరో అల్పపీడనం బలపడింది. దీనికి ఉపరితల ఆవర్తనం, రుతుపవనాల ద్రోణి తోడయ్యాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీవర్షాలు, కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాలు నాలుగైదురోజులు కొనసాగాయి. కొన్ని ప్రాంతాల్లో 15 నుంచి 20 సెంటీమీటర్ల వర్షపాతం కూడా నమోదైంది. అల్పపీడనం ఏర్పడడానికి ముందు రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఐదారు మినహా మిగతా జిల్లాలన్నీ లోటులోనే ఉన్నాయి. అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీవర్షాలు అప్పటి వరకు ఉన్న లోటు వర్షపాతాన్ని భర్తీచేశాయి. ఫలితంగా ఇప్పుడు కేవలం నాలుగు (ఎస్పీఎస్సార్ నెల్లూరు, అన్నమయ్య, తిరుపతి, వైఎస్సార్) జిల్లాలే లోటు వర్షపాతంలో ఉన్నాయి. ఈ రుతుపవనాల సీజను ఆరంభమైన జూన్ 1 నుంచి ఈనెల 29 వరకు రాష్ట్రంలో నమోదైన వర్షపాతాన్ని పరిశీలిస్తే.. సాధారణంకంటే 75 శాతం అధిక వర్షపాతం కృష్ణాజిల్లాలో, 45 శాతం అధిక వర్షపాతం విశాఖ జిల్లాలో నమోదయ్యాయి. తిరుపతి జిల్లా 42 శాతం లోటుతో రాష్ట్రంలో అత్యల్ప వర్షపాతం నమోదైన జిల్లాగా ఉంది. జిల్లా సాధారణంకంటే అధిక వర్షపాతం నమోదైన జిల్లాల్లో కృష్ణా, విశాఖలతో పాటు గుంటూరు, అల్లూరి సీతారామరాజు, విజయనగరం ఉన్నాయి. అనకాపల్లి, బీఆర్ అంబేడ్కర్, బాపట్ల, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, పల్నాడు, పార్వతీపురం మన్యం, ప్రకాశం, శ్రీకాకుళం, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాలు సాధారణ వర్షపాతం నమోదైన జిల్లాల జాబితాకు చేరుకున్నాయి. దీంతో రాష్ట్రంలో ఇప్పటివరకు 25 శాతంగా ఉన్న వర్షపాతం లోటు మూడుశాతానికి తగ్గింది. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలతో చెరువులు, జలాశయాల్లో నీరు సమృద్ధిగా చేరింది. ఇన్నాళ్లు అరకొరగా కురిసిన వానలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఏర్పడతాయేమోనన్న రైతుల బెంగను ఈ వర్షాలు తీర్చాయి.

రొట్టె పట్టగా.. కోర్కె తీరగా..!

- వేడుకగా కొనసాగుతున్న రొట్టెల పండగ
- ఘనంగా గంధ మహోత్సవం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద నిర్వహించే రొట్టెల పండగ ఆదివారం వేడుకగా కొనసాగింది. కోర్కెల రొట్టెలను పట్టుకునేందుకు లక్షలాదిగా రావడంతో రొట్టెలు మార్చుకునే భక్తులతో స్వర్ణాల చెరువు జనసంద్రమైంది. అక్కడ స్నానమాచరించి కోర్కెల రొట్టెలను పట్టుకున్నారు. అర్ధరాత్రి తర్వాత దర్గా ప్రాంగణంలో గంధ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గంధాన్ని షహీదుల సమాధులకు సమర్పించి భక్తులకు పంచిపెట్టారు. రొట్టెల పండగకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వచ్చారు. దీనికి వస్తున్నవారు జిల్లాలోని అనుమసముద్రం పేట, కసుమూరు దర్గాలను దర్శించుకుంటున్నారు. కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి తదితరులు నిరంతర పర్యవేక్షణతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.


భక్తులతో జనసంద్రమైన స్వర్ణాల చెరువు

క్లుప్తంగా...

పాక్‌లో ఆత్మాహుతి దాడి.. 44 మంది మృతి



పెషావర్: పాకిస్తాన్‌లో ఓ అతివాద రాజకీయ పార్టీ సభలో సూసైడ్ బాంబు పేలిన ఘటనలో 44 మంది చనిపోగా మరో 200 మంది గాయాలపాలయ్యారు. పాక్–అఫ్గాన్ సరిహద్దుల్లోని ఖైబర్ ఫక్తున్వా ప్రావిన్స్‌లో ఆదివారం సాయంత్రం ఈ విషాదం చోటుచేసుకుంది. బజౌర్ జిల్లా కేంద్రం ఖర్‌లో జమియత్ ఉలేమా ఇ ఇస్లామ్ ఫజుల్(జేయూఐ–ఎఫ్) కార్యకర్తల సమావేశం జరుగుతుండగా శక్తివంతమైన పేలుడు సంభవించింది. క్షతగాత్రుల్లో అత్యధికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. పేలుడుకు ఆత్మాహుతి దాడే కారణం కావచ్చని పోలీసులు తెలిపారు. ఘటన వెనుక ఐసిస్ ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మూడేళ్లలో..13.13 లక్షల మంది మహిళలు మిస్సింగ్

న్యూఢిల్లీ: దేశంలో 2019–21 సంవత్సరాల మధ్య 13.13 లక్షల మంది బాలికలు, మహిళలు కనిపించకుండాపోయారని కేంద్రం తెలిపింది. ఇందులో మధ్యప్రదేశ్ నుంచి అత్యధికంగా సుమారు 2 లక్షల మంది ఉన్నారని, ఆ తర్వాతి స్థానంలో పశ్చిమ బెంగాల్ ఉందని పేర్కొంది. గత వారం పార్లమెంట్‌లో కేంద్ర హోం శాఖ ఇందుకు సంబంధించి నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) నమోదు చేసిన గణాంకాలను వెల్లడించింది. మూడేళ్ల కాలంలో మిస్సయిన మొత్తం 13.13 లక్షల మందిలో బాలికలు 2,51,430 మంది కాగా, 18 ఏళ్లు పైబడిన వారి సంఖ్య 10,61,648 అని వివరించింది. 2019–2021 మధ్య మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా 1,60,180 మహిళలు, 38,234 మంది బాలికలు అదృశ్యమయినట్లు ఆ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆ తర్వాతి స్థానంలో ఉన్న పశ్చిమబెంగాల్‌లో 1,56,905 మంది మహిళలు, 36,606 మంది బాలికలు మిస్సయ్యారని తెలిపింది. ఇదే సమయంలో మహారాష్ట్రలో 1,78,400 మంది మహిళలు, 13,033 మంది బాలికలు.. ఒడిశాలో 70,222 మంది మహిళలు, 16,649 మంది బాలికలు..ఛత్తీస్‌గఢ్‌లో 49,116 మంది మహిళలు, 10,817 మంది బాలికలు కనిపించకుండాపోయారు. 2019–21 మధ్య ఢిల్లీలో 61,054 మంది మహిళలు, 22,919 మంది బాలికలు కనిపించకుండాపోయారు.

ఇస్రో మరో వాణిజ్య విజయం

పీఎస్‌ఎల్‌వీ సిరీస్‌లో 56వ సారి విజయకేతనం ● 23 నిమిషాల్లోనే పూర్తయిన ప్రయోగం ● అంతరిక్ష వ్యర్థాలను తగ్గించే ప్రయోగం సక్సెస్

సూళ్లూరుపేట: పీఎస్‌ఎల్‌వీ సీ–56 ఉపగ్రహ వాహకనౌక ఆదివారం ఉదయం 6.31 గంటలకు విజయవంతంగా అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. దీంతో ఈ ఏడాదిలో ఇస్రో మూడో వాణిజ్య విజయాన్ని సొంతం చేసుకున్నట్లయింది. భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో), న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ సంయుక్తంగా తిరుపతి జిల్లా సతీస్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి దీనిని ప్రయోగించాయి. పీఎస్‌ఎల్‌వీ రాకెట్ సిరీస్‌లో చేపట్టిన 58 ప్రయోగాల్లో ఇది 56వ విజయం కావడం గమనార్హం. పీఎస్‌ఎల్‌వీ సీ–56 రాకెట్‌కు శనివారం ఉదయం 5.01 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించి 25.30 గంటల కౌంట్‌డౌన్ అనంతరం ఆదివారం ఉదయం 6.31 గంటలకు నింగిలోకి దూసుకెళ్లింది. నాలుగు దశల ప్రయాణాన్ని విజయవంతంగా సాగిస్తూ 23 నిమిషాల వ్యవధిలో (1,381 సెకన్లకు) సింగపూర్‌కు చెందిన ఏడు ఉపగ్రహాలను భూమికి 535 కిలోమీటర్లు ఎత్తులోని నియో ఆర్బిట్ (భూ సమీప కక్ష్య)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. 352 కిలోలు బరువు కలిగిన డీఎస్–ఎస్ఏఆర్ (షార్ట్ ఫర్ సింథటిక్ ఆపార్చర్ రాడార్) అనే ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్, 23.58 కిలోల ఆర్కేడ్, 23 కేజీల బరువున్న వెలాక్స్–ఏఎం, 12.8 కిలోల ఓఆర్‌బీ–12 స్ట్రయిడర్, 3.84 కేజీల గలాసియా–2, 4.1 కేజీల స్కూబ్–11, 3.05 కేజీల బరువైన న్యూలయన్ అనే ఉపగ్రహాలను నియో ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. షార్ నుంచి చేసిన 90వ ప్రయోగమిది.

అంతరిక్ష వ్యర్థాలను తొలగించే కొత్త ప్రయోగం

పీఎస్‌ఎల్‌వీ సీ–56 రాకెట్‌లోని నాలుగో దశ (పీఎస్–4)తో అంతరిక్షంలో పెరిగిపోతున్న వ్యర్థాలను తొలగించేందుకు సరికొత్త ప్రయోగం చేపట్టినట్లు ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. భూమికి 535 కిలోమీటర్లు ఎత్తులో ఉపగ్రహాలను ప్రవేశపెట్టిన తర్వాత పీఎస్–4 అక్కడ నుంచి 300 కిలోమీటర్ల స్థాయికి దిగి వస్తుంది. ఈ ఎత్తులో ఉండటం వల్ల ఇది త్వరగానే భూ కక్ష్యలోకి ప్రవేశించి మండిపోతోంది. దీంతో అంతరిక్షంలో ఇలాంటి ప్రయోగాల తదుపరి చెత్త తగ్గుతుంది. ఒకవేళ 530కి.మీ.ల ఎత్తులోనే ఉంటే కింది కక్ష్యలకు వచ్చి పడిపోవడానికి దశాబ్దాల కాలం పడుతుంది. ఇప్పుడు కిందిస్థాయిలోనే ఉంది కనుక కేవలం రెండునెలల్లో పడిపోతుంది.



ఆ కీలక భాగాల తయారీదారు హైదరాబాద్ సంస్థే

పీఎస్‌ఎల్‌వీ సి–56లోని కీలక భాగాలు, వ్యవస్థలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్(ఏటీఎల్) రూపొందించినవే కావడం విశేషం. ఈ విషయాన్ని ఆ సంస్థ వ్యవస్థాపకుడు పావులూరి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. పీఎస్‌ఎల్‌వీ సి–56 లాంఛ్ వెహికల్‌లో వాడిన నావిగేషన్ ఇంటర్‌ఫేస్ మాడ్యూళ్లు, ఇనెర్షియల్ సెన్సింగ్ యూనిట్లు, ఇంట్రా మాడ్యూల్ హార్నెస్, కంట్రోల్ ఎలక్ట్రానిక్స్, పైరో కంట్రోల్ సిస్టమ్స్, ట్రాకింగ్ ట్రాన్స్‌పాండర్, ఇంధన వ్యవస్థల రూపకల్పనలో తమ సంస్థ భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. ఇస్రో లాంఛ్ వెహికల్స్, శాటిలైట్లు, స్పేస్ క్రాఫ్ట్ పేలోడ్స్, గ్రౌండ్ సిస్టమ్స్‌ను తాము ఉత్పత్తి చేస్తున్నామన్నారు. పీఎస్‌ఎల్‌వీ సి–56తో కలిపి ఇప్పటి వరకు అయిదు పీఎస్‌ఎల్‌వీ మిషన్లలో అత్యంత కీలకమైన సబ్ అసెంబ్లీ ప్రక్రియను ఏటీఎల్ నిపుణులు చేపట్టినట్లు వివరించారు.

అంటార్కిటికాలో కరిగిపోతున్న మంచు

అర్జెంటీనా విస్తీర్ణంతో సమానమైన హిమం మాయం



వాషింగ్టన్: ఉత్తరార్ధ గోళంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో వడగాలులు వీచాయి. ఫలితంగా అంటార్కిటికా ఖండంలో పెద్ద ఎత్తున మంచు కరిగిపోయింది. ఈసారి అక్కడ రికార్డు స్థాయిలో మంచు ఫలకలు కరిగినట్లు శాస్త్రవేత్తలు తేల్చారు. వాస్తవానికి అంటార్కికాలో వేసవి కాలంలో మంచు కరిగి, శీతాకాలంలో మళ్లీ భారీ మంచు ఫలకలు ఏర్పడుతుంటాయి. కానీ, ఈసారి అలా జరగలేదు. గత 45 ఏళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ స్థాయిలో హిమం ఉంది. నేషనల్ స్నో అండ్ ఐస్ డేటా సెంటర్ (ఎన్ఎస్ఐడీసీ) గణాంకాల ప్రకారం.. అంటార్కిటికాలో 2022 శీతాకాలంతో పోలిస్తే ఇప్పుడు 16 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మంచు కరిగిపోయింది. అలాగే 1981–2010 మధ్య సగటు విస్తీర్ణం కంటే ఈ ఏడాది జూలై మధ్యలో 26 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం మేర మంచు తక్కువగా ఉంది. ఇది అర్జెంటీనా దేశ విస్తీర్ణంతో సమానం. అమెరికాలోని టెక్సాస్, కాలిఫోర్నియా, న్యూమెక్సికో, అరిజోనా, నెవడా, ఉతాహ్, కొలరాడో రాష్ట్రాల ఉమ్మడి విస్తీర్ణంతో సమానం. అంటార్కిటికాలో సముద్రపు మంచు కొన్ని దశాబ్దాలుగా రికార్డు స్థాయి నుంచి కనిష్టానికి పడిపోతోంది. ఇది చాలా అసాధారణ పరిణామమని, 10 లక్షల ఏళ్లకోసారి ఇలా జరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూతాపం, వాతావరణ మార్పులు అంటార్కిటికాను మరింతగా ప్రభావితం చేస్తాయని అంటున్నారు.

అమెరికా రక్షణ పరికరాల్లో చైనా మాల్‌వేర్!

అత్యవసర సమయాల్లో విద్యుత్, నీటి సరఫరాను అడ్డుకొనే అవకాశం
డ్రాగన్ హ్యాకర్ల దుశ్చర్య



వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత బలమైన సైన్యం, ఆయుధాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ ఉన్న అమెరికాను ఇప్పుడు చైనా మాల్‌వేర్ బెంబేలెత్తిస్తోంది. ఓ అజ్ఞాత మాల్‌వేర్‌ను తమ రక్షణ పరికరాల్లో చైనా ప్రవేశపెట్టిందని అమెరికా సైనికాధికారులు అనుమానిస్తున్నారు. ఈ విషయాన్ని అమెరికా కాంగ్రెస్ అధికారి ఒకరు నిర్ధారించారు. తమ రక్షణ వ్యవస్థపై చైనా హ్యాకర్లు కన్నేశారని, రక్షణ శాఖ పరికరాల్లోకి ఓ కంప్యూటర్ కోడ్‌ను(మాల్‌వేర్) ప్రవేశపెట్టారని భావిస్తున్నారు. సైన్యానికి చెందిన నెట్‌వర్క్ కంట్రోలింగ్ పవర్ గ్రిడ్‌లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్, సైనిక కేంద్రాలకు నీటిని సరఫరా చేసే వ్యవస్థల్లోకి ఈ మాల్‌వేర్ రహస్యంగా చేరినట్లు అంచనా వేస్తున్నారు. దీనివల్ల అత్యవసర, సంక్షోభ సమయాల్లో సైన్యానికి అవసరమైన సరఫరాల్లో అంతరాయం కలిగించేందుకు ఆస్కారం ఉంటుంది.

టైం బాంబులాంటిదే

మాల్‌వేర్ వ్యవహారం తొలుత ఈ ఏడాది మే నెలలో బయటపడింది. గువామ్‌లో అమెరికా ఎయిర్ బేస్‌కు చెందిన టెలికమ్యూనికేషన్స్ వ్యవస్థల్లో అనుమానాస్పద కంప్యూటర్ కోడ్‌ను తాము గుర్తించినట్లు మైక్రోసాఫ్ట్ సంస్థ వెల్లడించింది. మరో కీలక ప్రాంతంలో ఉన్న కంప్యూటర్లలోనూ ఇది ఉన్నట్లు పేర్కొంది. ఓల్ట్ టైఫూన్ అనే చైనా హ్యాకింగ్ సంస్థపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రక్షణ పరికరాల్లో చైనా మాల్‌వేర్ అనేది నిజంగా టైంబాంబు లాంటిదేనని అమెరికా కాంగ్రెస్ అధికారి చెప్పారు. సైనిక స్థావరాలకు విద్యుత్, నీటి సరఫరాను, సమాచార మార్పిడిని హఠాత్తుగా నిలిపివేయడానికి ఈ మాల్‌వేర్‌ను ఉపయోగిస్తుంటారని చెప్పారు. దీనివల్ల సైన్యంలో పనివేగం తగ్గిపోతుందని అన్నారు. కేవలం అమెరికాలోనే కాదు, విదేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాల్లోని పరకరాల్లోకి చైనా హ్యాకర్లు మాల్‌వేర్‌ను పంపించినట్లు ప్రచారం సాగుతోంది. తైవాన్ విషయంలో ఇటీవలి కాలంలో చైనా దూకుడు పెంచింది. ఈ దేశంలో సమీపంలో తరచుగా వైమానిక విన్యాసాలు నిర్వహిస్తోంది. తమ దేశంలో తైవాన్ ఒక అంతర్భాగమని వాదిస్తోంది. మరోవైపు తైవాన్‌కు అమెరికా అండగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా రక్షణ పరికరాల్లోకి చైనా మాల్‌వేర్ ప్రవేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది.



‘మేరీ మాటీ.. మేరీ దేశ్’

- అమరుల స్మరణకు ఆగస్టు 15 దాకా ప్రత్యేక కార్యక్రమం
- పవిత్ర మట్టితో ఢిల్లీ దాకా అమృత్ కలశ్ యాత్ర
- ‘మన్ కీ బాత్’లో మోదీ

న్యూఢిల్లీ: మన అమర జవాన్లను, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పౌరులను గౌరవించుకోవడానికి స్వాతంత్య్ర దినోత్సవం(ఆగస్టు 15) వరకూ దేశవ్యాప్తంగా మేరీ మాటీ.. మేరీ దేశ్ (నా మట్టి.. నా దేశం) పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. వారి జ్ఞాపకార్థం ప్రతి గ్రామ పంచాయతీలో స్మారకాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం ‘మన్ కీ బాత్’లో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు. మేరీ మాటీ.. మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా అమృత్ కలశ్ యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. దేశమంతటా వివిధ ప్రాంతాల నుంచి 7,500 కలశాల్లో పవిత్ర మట్టిని, దాంతోపాటు మొక్కలను దేశ రాజధాని ఢిల్లీకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఆ పవిత్ర మట్టితో ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం సమీపంలో ‘అమృత్ వాటిక’ను నిర్మించబోతున్నట్లు చెప్పారు. అక్కడే మొక్కలను నాటనున్నట్లు వివరించారు. ఈ అమృత్ వాటిక ‘ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్’కు ఒక గొప్ప చిహ్నం అవుతుందని స్పష్టం చేశారు. మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...



ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి

‘‘ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఇప్పటికే 2 లక్షలకుపైగా కార్యక్రమాలు నిర్వహించుకున్నాం. అమృత్ మహోత్సవ్ నినాదం అంతటా ప్రతిధ్వనిస్తోంది. గత ఏడాది ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమం కోసం దేశమంతా ఒక్కతాటిపైకి వచ్చింది. ప్రజలంతా తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాలు ఎగరేశారు. ఆ సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నా. ఇలాంటి ప్రయత్నాలతో మన బాధ్యతలను మనం గుర్తించగలుగుతాం. దేశ స్వాతంత్య్రం కోసం జరిగిన బలిదానాలను స్మరించుకుంటాం. స్వేచ్ఛా స్వాతంత్య్రాల విలువను గుర్తిస్తాం. అందుకే ప్రతి పౌరుడూ ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి. ప్రజల్లో సాంస్కృతి చైతన్యం ఇనుమడిస్తోంది. పుణ్య క్షేత్రాలను సందర్శించే యాత్రికుల సంఖ్య భారీగా పెరుగుతోంది. కాశీని ప్రతిఏటా 10 కోట్లకు పైగా యాత్రికులు సందర్శిస్తున్నారు. అయోధ్య, మథుర, ఉజ్జయిని లాంటి క్షేత్రాలను సందర్శించే భక్తుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. దీనివల్ల లక్షలాది మంది పేదలకు ఉపాధి లభిస్తోంది.

మరో 50,000 అమృత్ సరోవరాలు

ఇటీవల దేశంలో భారీ వర్షాలు కురిశాయి. వరదలు ముంచెత్తాయి. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. జనం చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ప్రకృతి విపత్తుల నుంచి కాపాడుకోవడానికి వారు కలిసికట్టుగా పని చేశారు. అలాగే జల సంరక్షణ కోసం జనం కృషి చేయడం సంతోషకరం. ఉత్తరప్రదేశ్‌లో ఒక్కరోజులో 30 లక్షల మొక్కలు నాటారు. జల సంరక్షణ కోసం దేశంలో ఇప్పటికే 60,000 అమృత్ సరోవరాలు నిర్మించారు. మాదక ద్రవ్యాలకు ప్రజలు దూరంగా ఉండాలని కోరుతున్నా. భవిష్యత్తు తరాలను కాపాడుకోవాంటే డ్రగ్స్‌ను దూరం పెట్టాల్సిందే. ఇందుకోసం 2020 ఆగస్టు 15న ‘నషా ముక్త్ భారత్ అభియాన్’ ప్రారంభించాం. 11 కోట్ల మందికి పైగా జనం ఈ అభియాన్‌తో అనుసంధానమయ్యారు. రూ.12,000 కోట్ల విలువైన 10 లక్షల కిలోల డ్రగ్స్‌ను అధికారులు ధ్వంసం చేశారు. ఇదొక విశిష్టమైన రికార్డు. మధ్యప్రదేశ్‌లోని బిచార్పూర్ అనే గిరిజన గ్రామం ఒకప్పుడు అక్రమ మద్యం, డ్రగ్స్‌కు అడ్డాగా ఉండేది. ఇప్పుడు ఆ గ్రామస్థులు వ్యసనాలు వదిలేశారు. ఫుట్‌బాల్ ఆటలో నిష్ణాతులుగా మారారు. మనసుంటే మార్గం ఉంటుంది’ అని మోదీ ఉద్ఘాటించారు.

కళాఖండాలు తిరిగొచ్చాయి

మన దేశానికి చెందిన వందలాది అరుదైన, ప్రాచీన కళాఖండాలు ఇటీవలే అమెరికా నుంచి తిరిగివచ్చాయి. అమెరికా వాటిని తిరిగి మనకు అప్పగించింది. దీనిపై సోషల్ మీడియాలో చాలా చర్చ జరిగింది. అమెరికా నుంచి వచ్చిన వాటిలో 2,500 నుంచి 250 ఏళ్ల క్రితం నాటికి కళాఖండాలు ఉన్నాయి. 2016, 2021లో అమెరికాలో పర్యటించా. మన కళాఖాండలను వెనక్కి తీసుకురావడానికి కృషి చేశా.

చిన్నారుల అక్రమ రవాణాలో యూపీ టాప్

న్యూఢిల్లీ: దేశంలో చిన్నారుల అక్రమ రవాణాలో ఉత్తరప్రదేశ్, బిహార్, ఆంధ్రప్రదేశ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. కోవిడ్ తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో చిన్నారుల అక్రమ రవాణా కేసుల్లో 68 శాతం పెరుగుదల నమోదైంది. 2016–22 సంవత్సరాల మధ్య గణాంకాల ఆధారంగా ప్రభుత్వేతర సంస్థ నిర్వహించిన అధ్యయనంలో తేలింది. జిల్లా వారీగా చూస్తే.. దేశంలోనే అత్యధికంగా జైపూర్ సిటీలో అత్యధికంగా చైల్డ్ ట్రాఫికింగ్ కేసులు నమోదవుతున్నాయి. టాప్ నాలుగు జిల్లాల్లో దేశ రాజధాని ఢిల్లీ ఉండటం గమనార్హం. 2016–22 మధ్య 18 ఏళ్లలోపు 13,549 మంది చిన్నారులను అక్రమ రవాణా నుంచి రక్షించగలిగారు. వీరిలో 9 ఏళ్లలోపు చిన్నారులు 2 శాతం మంది ఉండటం ఆందోళన కలిగించే అంశమని అధ్యయనకర్తలు పేర్కొన్నారు. చిన్నారులను అత్యధికంగా పరిశ్రమల్లోనే వినియోగిస్తున్నట్లు తేలింది. హోటల్, ధాబాల్లో ఉండే సిబ్బందిలో 15.6% మంది, రవాణారంగంలో 13% మంది, వస్త్ర రంగంలో 11.18% మంది చిన్నారులు పనిచేస్తున్నారు. కాస్మెటిక్స్ పరిశ్రమల్లో 5, 8 ఏళ్ల బాలల్ని వాడుకుంటున్నట్లు నివేదిక తెలిపింది. కోవిడ్ అనంతరం చిన్నారులను పనిలో పెట్టుకోవడం అనేక రెట్లు పెరిగింది. కర్ణాటకలో చైల్డ్ ట్రాఫికింగ్ 18 రెట్లు ఎక్కువైనట్లు వెల్లడించింది.

‘అవిశ్వాసం’ పూర్తయ్యేదాకా సభలో బిల్లులు ఆమోదించొద్దు

కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంపై పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన తర్వాత ఇతర బిల్లులను ఆమోదించడం సరైంది కాదని కాంగ్రెస్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి మనీశ్ తివారీ అభిప్రాయపడ్డారు. అవిశ్వాసంపై చర్చ, ఓటింగ్ జరిగి ఫలితం తేలిన తర్వాతే ఇతర బిల్లును ప్రవేశపెట్టడం లేదా ఆమోదించడం చేయాలని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంపై లోక్‌సభలో విపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. నిబంధనల ప్రకారం దీనిపై 10 రోజుల్లోగా చర్చ, ఓటింగ్ నిర్వహించాల్సి ఉంది. బిల్లులను ఇష్టారాజ్యంగా ఆమోదింపజేసుకోవడానికి ఈ గడువును వాడుకోవద్దని మనీశ్ తివారీ హితవు పలికారు. అలా చేయడం పార్లమెంటరీ సంప్రదాయాలకు, నైతిక విలువలకు విరుద్ధమన్నారు.

కోర్టు ధిక్కరణ కేసుల్లో అతి సున్నితత్వం వద్దు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కోర్టు ధిక్కరణ కేసుల్లో విచారణ, తీర్పునిచ్చే విషయంలో న్యాయస్థానాలకు అతి సున్నితత్వం పనికిరాదని, బాహోద్వేగాలకు లోను కావొద్దని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సంజయ్ కరోల్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. న్యాయబద్ధంగా వ్యవహరించాలని సూచించింది. కోర్టు ధిక్కరణ కేసులో ఓ వైద్యుని లైసెన్స్‌ను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వును సుప్రీంకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. జరిమానాగా లైసెన్స్ రద్దు సరైంది కాదని పేర్కొంది.

నేరుగా సముద్రంలోనే ల్యాండింగ్..

మార్సెయిల్(ఫ్రాన్స్): ఇంజిన్ వైఫల్యం చెందడంతో ఓ పైలట్ విమానాన్ని సముద్రంలోనే అర్ధాంతరంగా దించేశాడు. విమానం మునిగిపోయినా అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఫ్రాన్సులోని మధ్యధరా సముద్ర తీరం ఫ్రెజుస్ వద్ద ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో చోటుచేసుకుంది. తీరానికి మరో 600 మీటర్ల దూరం ఉండనంగా సెస్నా 177 రకం చిన్నపాటి పర్యాటక విమానం ఇంజిన్‌లో లోపం ఏర్పడింది. దీంతో, పైలట్ సముద్ర జలాల్లోనే అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అత్యవసర విభాగం సిబ్బంది అక్కడికి చేరుకునే అందులోని ముగ్గురినీ రక్షించారు. ‘ఫ్రెజుస్ బీచ్‌లో జనం రద్దీ ఎక్కువగా ఉంది. బీచ్‌లో అత్యవసర ల్యాండింగ్ వారికి అపాయం కలుగుతుందని పైలట్ భావించాడు. దీంతో, సమయస్ఫూర్తితో వ్యవహరించి బీచ్‌లో కాకుండా దగ్గర్లోని సముద్ర జలాల్లో ల్యాండ్ చేశాడు. ఇందుకు ఎంతో నైపుణ్యం కావాలి. అదృష్టమూ కలిసి రావాలి’ అని సహాయక సిబ్బంది తెలిపారు. ఈ ఘటనలో విమానం సముద్రంలో మునిగిపోయింది.

మాస్కోపై మళ్లీ డ్రోన్ దాడి

మాస్కో: రష్యా రాజధాని మాస్కోలో ఆదివారం వేకువజామున డ్రోన్ దాడి జరిగింది. ఈ ఘటనలో ఒకరు గాయపడ్డారు. రాజధాని నగరంలోని నాలుగు ఎయిర్‌పోర్టుల్లో ఒక దానిని తాత్కాలికంగా మూసివేశామని అధికారులు తెలిపారు. కాగా, మాస్కోపై డ్రోన్ దాడి జరగడం ఈనెలలో నాలుగోసారి కావడం గమనార్హం. మాస్కో దిశగా దూసుకొచ్చిన మూడు డ్రోన్లలో ఒక దానిని వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేయగా, మరో రెండింటిని జామర్లు నిర్వీర్యం చేశాయి. ఆ రెండు డ్రోన్లు మాస్కోలోని వాణిజ్య రాజధాని ప్రాంతంలో కూలాయని అధికారులు వివరించారు. కీవ్ ప్రభుత్వ ఉగ్రదాడియత్నంగా రష్యా రక్షణ శాఖ అభివర్ణించింది. మాస్కోలోని ఓ బహుళ అంతస్తుల భవనం పై ఫ్లోర్ దెబ్బతిన్న దృశ్యాలు కనిపించాయి. అయితే, ఈ దాడులతో రెండు భవనాల వెలుపలి భాగాలకు కలిగిన సాధారణ నష్టం జరిగినట్లు మాస్కో మేయర్ చెప్పారు. ఈ ఘటన అనంతరం మాస్కో శివారులోని వినుకోవో ఎయిర్ పోర్టును గంటపాటు అధికారులు మూసివేశారు. మాస్కో, చుట్టుపక్కల ప్రాంతాల్లో గగనతలాన్ని కొద్దిసేపు మూసివేశారు. డ్రోన్ కూలిన ప్రాంతంలోని రహదారిని మూసివేశారు. ఘటనపై ఉక్రెయిన్ పరోక్షంగా స్పందించింది. ఉక్రెయిన్‌పై జరుగుతున్న యుద్ధం దుష్ఫలితాలను రష్యా ప్రజలు చూస్తున్నారంటూ వ్యాఖ్యానించింది. శనివారం రాత్రి ఆక్రమిత క్రిమియా గగనతలంలో 16 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా తెలిపింది. మరో 8 డ్రోన్లను తమ జామర్లు నిర్వీర్యం చేశాయని తెలిపింది.



అఫ్గానిస్తాన్‌లో మహిళల హక్కుల్ని కాలరాస్తున్న తాలిబన్ పాలకుల నిషేధాజ్ఞలు తాజాగా సంగీతంపై పడ్డాయి. సంగీతం అనైతికమని దీని కారణంగా యువత పెడదోవ పడుతుందని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆదివారం హీరట్ ప్రావిన్స్‌లో లక్షల విలువైన గిటార్, తబలా వంటి సంగీత పరికరాలను స్వాధీనం చేసుకుని స్థానిక అధికారులు ఇలా అగ్నికి ఆహుతి చేశారు.

హింస నివారణలో ప్రభుత్వం విఫలం

- మణిపూర్ అంశంలో ప్రధాని మోదీ ఉదాసీన వైఖరి
- గవర్నర్‌కు ‘ఇండియా’ కూటమి వినతిపత్రం

ఇంఫాల్: మణిపూర్‌లో జాతి వైషమ్యాలను అదుపుచేయడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని ప్రతిపక్ష ‘ఇండియా’ కూటమి ఆరోపించింది. మణిపూర్ సమస్యను పరిష్కరించడంలో ప్రధాని మోదీ తీవ్ర ఉదాసీనతను ప్రదర్శిస్తున్నారని పేర్కొంది. సత్వరమే పరిష్కరించకుంటే దేశ భద్రతకు సైతం సమస్యగా మారొచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన 21 మంది ఎంపీలు ఈ మేరకు ఆదివారం రాష్ట్ర మహిళా గవర్నర్ అనసూయ ఉయికేకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. వారు శని,ఆదివారాల్లో మణిపూర్‌లో సుడిగాలి పర్యటన చేశారు. బాధిత ప్రజలకు తక్షణమే పునరావాసం కల్పించాలని, రాష్ట్రంలో శాంతి సామరస్యాలను నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా నిరంతరాయంగా కాల్పులు, గృహదహన ఘటనలు కొనసాగుతుండటాన్ని బట్టి ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్న విషయంలో ఎలాంటి సందేహం లేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. గడిచిన మూడు నెలలుగా రాష్ట్రంలో ఇంటర్నెట్ సేవలపై నిషేధం కొనసాగుతుండటంతో వదంతులు వ్యాప్తి చెంది జాతుల మధ్య విభేదాలు మరింతగా పెరిగాయన్నారు. జాతుల మధ్య పెరిగిన వైషమ్యాలను తక్షణమే చల్లార్చాల్సిన అవసరముందన్నారు. ఈ విషయంలో ప్రధాని మోదీ మౌనం వహించడాన్ని వారు తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్రంలో తక్షణమే సాధారణ పరిస్థితులను పునరుద్ధరించాల్సిన అవసరాన్ని కేంద్ర ప్రభుత్వానికి వివరించాలని గవర్నర్‌కు విపక్ష ఎంపీలు విజ్ఞప్తి చేశారు.



మహిళా గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విపక్ష ఎంపీలు

మణిపూర్‌లో బయోమెట్రిక్ సర్వే

2021 సంవత్సరంలో మయన్మార్ దేశంలో సైనిక జుంటా అధికారంలోకి వచ్చాక ఈశాన్య రాష్ట్రాల్లోకి పెరిగిన వలసలపై కేంద్రం అప్రమత్తమైంది. అక్రమంగా ప్రవేశించిన మయన్మార్ దేశస్తులను గుర్తించేందుకు బయోమెట్రిక్ సర్వే చేపట్టాలంటూ కేంద్రప్రభుత్వం ఇటీవల మణిపూర్, మిజోరం రాష్ట్రాలను ఆదేశించింది. మిజోరంలోని మొత్తం 11 జిల్లాల్లో కలిపి 30 వేల మందికిపైగా మయన్మార్ దేశస్తులున్నట్లు అంచనా. కేంద్రం నుంచి అందిన ఆదేశాల మేరకు ప్రస్తుతం సహాయక శిబిరాల్లో సర్వే చేపట్టినట్లు మిజోరం ముఖ్యమంత్రి లాల్ థంగ్లియానా ఆదివారం చెప్పారు. సెప్టెంబర్ 30వ తేదీలోగా మయన్మార్ దేశస్తుల నమోదు పూర్తి చేయాలని కేంద్ర హోం శాఖ కోరిందన్నారు. తమ వర్గానికి చెందిన వారే అయినందున తిరిగి మయన్మార్ పంపించలేక వారికి మానవతాదృక్పథంలో ఆశ్రయం కల్పిస్తున్నట్లు తెలిపారు. కొందరు బంధువుల వద్ద, అద్దె ఇళ్లలో ఉంటుండగా ఎక్కువ మంది సహాయ శిబిరాల్లోనే తలదాచుకుంటున్నారని చెప్పారు.

నలుగురు అదనపు ఎస్పీలకు పదోన్నతి

సాక్షి,చెన్నై : నలుగురు అదనపు ఎస్పీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్పీలుగా పదోన్నతి కల్పించింది. వివరాలు.. తమిళనాడు తిరుచ్చి స్పెషల్ పోలీసు బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్‌గా ఏఎస్పీ హోదాలో పనిచేస్తున్న రవిచంద్రన్ తిరుచ్చి నగర డిప్యూటీ పోలీసు కమిషనర్‌గా, విల్లుపురం పోలీసు రిక్రూట్ మెంట్‌స్కూల్ ఏఎస్పీ హెచ్ రమేష్ బాబును చెన్నై హైకోర్టు భద్రతా విభాగం డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతిపై నియమించారు. అలాగే అరియలూరు ఏఎస్పీ వి. మల్లై స్వామిని చెన్నై ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ ఎన్ ఫోర్సుమెంట్ సెల్ ఎస్పీగా, సేలం సైబర్ క్రైం ఏఎస్పీ ఏసీ చెల్ల పాండియన్‌ను ఆవడి పోలీసు బెటాలియన్ కమాండెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ హోం శాఖ కార్యదర్శి పి. అముదా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

న్యూస్‌రీల్

200 కేజీల టమాటాల చోరీ



సాక్షి, చెన్నై: తిట్టకుడి మార్కెట్‌లో 200 కేజీల టమటాలు చోరీకి గురయ్యాయి. బాధిత వ్యాపారులు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. వివరాలు.. తంజావూరు జిల్లా తిట్టకుడి మార్కెట్‌లో పదికి పైగా టమాటా దుకాణాలున్నాయి. శనివారం రాత్రి దుకాణాలను మూసి వేసి ఇళ్లకు వ్యాపారులు వెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చి చూడగానే అనేక దుకాణాల తలుపులు పగుల కొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఒక్కో దుకాణంలో 20 కేజీలు చొప్పున 200 కేజీల టమాటాలు చోరీకి గురైనట్లు విచారణలో తేలింది. దీంతో టమాటా దొంగలను పట్టుకునేందుకు ఆ పరిసర్లాలోని నిఘా కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కాగా, రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా టమాటా ధరలు అమాంతం పెరుగుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం కిలో టమాటా కొన్నిచోట్ల రూ. 170, మరికొన్ని చోట్ల రూ. 200 ధర పలకడంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.

అప్పీల్‌కు ఎంపీ రవీంద్రనాథ్

సాక్షి, చెన్నై: సామాన్యుడి దెబ్బకు పదవీ గండం ఏర్పడడంతో.. తేని ఎంపీ రవీంద్రనాథ్ అప్పీల్‌కు వెళ్లారు. సుప్రీంకోర్టులో తాజాగా ఆయన తరఫున పిటిషన్‌ను న్యాయవాదులు దాఖలు చేశారు. వివరాలు.. మాజీ సీఎం పన్నీరు సెల్వం తనయుడు రవీంద్రనాథ్ 2019 ఎన్నికల్లో తేని నుంచి లోక్ సభకు ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే ఆయన నామినేషన్ ప్రమాణ పత్రంలో సమర్పించిన వివరాలు తప్పుల తడకని, ఆయన వాస్తవాలన్నీ దాచి పెట్టినట్టుగా పేర్కొంటూ ఆ నియోజక వర్గ ఓటు మిలానీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు రవీంద్రనాథ్ ఎన్నికను రద్దు చేస్తూ ఇటీవల ప్రకటించింది. దీంతో రవీంద్రనాథ్ ఎంపీ పదవికి గండం ఏర్పడినట్లయ్యింది. అదే సమయంలో తీర్పును నెల రోజులు నిలుపుదల చేస్తూ, అప్పీల్ అవకాశం కల్పించారు. దీంతో న్యాయ నిపుణులతో గత కొద్ది రోజులుగా తీవ్ర చర్చలు జరిపిన రవీంద్రనాథ్ సుప్రీం కోర్టును ఆశ్రయించేందుకు నిర్ణయించారు. ఇదే రకంగా తండ్రి పన్నీరుతో పాటు తనపై దాఖలైన మరో కేసులో గత వారం ఊరట కల్గిన అంశాన్ని అస్త్రంగా చేసుకుని ప్రస్తుతం సుప్రీంకోర్టు తలుపు తట్టారు. తాను ఏ తప్పు చేయలేని, అన్ని రకాల వివరాలను నామినేషన్ పత్రంలో పేర్కొన్నట్లు వివరించడమే కాకుండగా, గత వారం తనకు ఊరట కలిగే విధంగా మరో కేసులు వచ్చిన ఉత్తర్వులను పేర్కొంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆయన తరఫున న్యాయవాదులు ఢిల్లీ వెళ్లి ఆదివారం సుప్రీం కోర్టులో ఈ పిటిషన్ వేశారు.

మత్తులో ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కిన మందుబాబు

– కరెంట్ షాక్‌తో తీవ్ర గాయాలు

తిరువొత్తియూరు: మైలాపూర్ ప్రాంతంలో మద్యం మత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌తో తీవ్రగాయాల పాలయ్యాడు. వివరాలు.. చెన్నై మైలాపూర్ లాల తోటమ్ ప్రాంతానికి చెందిన శరత్ కుమార్ (30)కు మద్యం తాగే అలవాటు ఉంది. ఆదివారం మద్యం తాగిమత్తు ఇంటికి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మీదికి ఎక్కాడు. ఆ సమయంలో విద్యుత్ షాక్ తగలడంతో అతను కిందపడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు శరత్ కుమార్‌ను రాయపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం కీల్పాక్కం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు.

ముదిరిన బ్యానర్ పంచాయితీ

- పుదుచ్చేరిలో మంత్రి, ఎమ్మెల్యే అనుచరుల మధ్య ఫైట్

సాక్షి, చెన్నై: బ్యానర్ ఏర్పాటు విషయంలో మంత్రి వర్సెస్ ఎమ్మెల్యే అనుచరులు పుదుచ్చేరి పరిధిలోని కారైక్కాల్‌లో ఆదివారం గొడవకు దిగారు. ఫలితంగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడడంతో పోలీసులు రంగంలోకి దిగారు. వివరాలు.. పుదుచ్చేరి సీఎం రంగస్వామి బర్త్‌డే వేడుకలు ఆగస్టు 4వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా జరగనున్నాయి. ఎన్ఆర్‌కాంగ్రెస్ వర్గాలు ఈసారి తమ సీఎం జన్మదినాన్ని కోలాహలంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లులో పోటీ పడి నిమగ్నమై ఉన్నారు. ఇందులో భాగంగా కారైక్కాల్ ఉత్తరం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే తిరుమురుగన్ మద్దతుదారులు ఆ పరిసరాల్లో సీఎంకు శుభకాంక్షలు తెలిపే విధంగా బ్యానర్లు ఏర్పాటు చేశారు. వీటిని తొలగించి మంత్రి చంద్ర ప్రియాంక మద్దతుదారులు తమ తరఫున బ్యానర్లు ఏర్పాటు చేయడం వివాదానికి దారి తీసింది. ఈ సమాచారంతో ఎమ్మెల్యే మద్దతు దారుల మంత్రి అనుచరులపై విరుచుకుపడ్డారు. ఆ బ్యానర్లను తొలగించారు. ఈ సమాచారంతో మంత్రి అనుచరులు వీరంగం సృష్టించారు. ఒకే పార్టీకి చెందిన ఇరు శిబిరాలు తన్నుకోవడం, రగడ సృష్టించడంతో కారైక్కాల్ పరిధిలో ఉద్రిక్తత నెలకొంది. చివరకు పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

నిర్లవణీకరణ పథకాన్ని చెన్నైలో సమర్థంగా నిర్వహిస్తున్నామని సీఎస్ శివదాస్ మీన తెలిపారు. నెమ్మెలిలో కొత్త ప్లాంట్ పనులు శరవేగంగా సాగుతున్నాయని, ఇక్కడి నుంచి చెన్నైకు 150 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేయనున్నామని, త్వరలో ఇది వినియోగంలోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

- నెమ్మెలిలో శరవేగంగా పనులు
- త్వరలో చెన్నైకు అదనంగా 150 మిలియన్ లీటర్ల నీరు
- పనులను పరిశీలించిన సీఎస్ శివదాస్ మీన


నీటి పంపింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ప్రధాన కార్యదర్శి శివదాస్ మీన

నిర్లవణీకరణ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి

సాక్షి, చెన్నై: రాజధాని నగరం చెన్నై నీటి అవసరాలను తీర్చడంలో నిర్లవరణీకరణ పథకం ముఖ్య పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. నగరానికి రిజర్వాయర్లు ద్వారా రోజుకు 1000 మిలియన్ లీటర్ల నీరును పంపిణీ చేస్తున్నారు. అలాగే ఇప్పటికే ఉత్తర చెన్నై పరిధిలోని మీంజూరులో రోజుకు 120 మిలియన్ లీటర్ల సముద్రపు నీటిని శుద్దీకరించి ఆ పరిసరాలకు పంపిణీ చేస్తున్నారు. ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని నెమ్మెలిలో మరో ప్లాంట్ పనులు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి రోజుకు 150 మిలియన్ లీటర్లను ఉత్పత్తి చేసి దక్షిణ చెన్నై పరిధిలోని ప్రాంతాలకు సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. చెన్నై మెట్రో పాలిటన్ వాటర్ బోర్డు నేతృత్వంలో జరుగుతున్న ఈ పనులను ఆదివారం సీఎస్ శివదాస్ మీన పరిశీలించారు. అన్ని చోట్ల సమగ్రంగా పరిశీలించిన సీఎస్ సంతృప్తిని వ్యక్తం చేశారు. పనులన్నీ తుది దశకు చేరినట్లు సీఎస్‌కు నిర్మాణ విభాగంలోని అధికారులు వివరించారు.


ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న సీఎస్, అధికారులు

రూ. 1,516 కోట్లతో పనులు

ప్రాజెక్టు పనులకు సంబంధించి సీఎస్ శివదాస్ మీన మాట్లాడుతూ, నెమ్మెలిలో 150 మిలియన్ లీటర్ల ఉత్పత్తి సామర్థ్యమే లక్ష్యంగా రూ. 1,516.82 కోట్లతో నిర్లవరణీకరణ పథకాన్ని చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుతం మెకానికల్, ఎలక్ట్రికల్ పనులు ప్రస్తుతం చేపడుతున్నట్లు వివరించారు. సముద్రం నుంచి పంపింగ్ స్టేషన్‌కు నీటి సరఫరా, శుద్దీకరణ అనంతరం విడుదల చేసే నీటిని బయటకు పంపించేందుకు ప్రత్యేక నిర్మాణాలు, పైప్‌లైన్లు జరిగినట్టు తెలిపారు. మైక్రోఫిల్టర్, నెగిటివ్ ఓస్మోసిస్ డిఫ్యూజన్ స్టేషన్, నీటి నిల్వకు అతి పెద్ద ట్యాంక్‌లు, పరిపాలనా భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఇక్కడ నిర్మాణాలు, నిర్లవణీకరణ పథకంలో ఉపగించబోతున్న టెక్నాలజీ దేశంలోనే ప్రపథమంగా ఉండడమే కాకుండా, దేశంలోనే అతి పెద్ద ప్రాజెక్టుగా నెమ్మెలి నిలవబోతోందని వివరంచారు. నెమ్మెలి నుంచి నీటి పంపిణీ కోసం 48.10 కి.మీ దూరం చైన్నై షోళింగనల్లూరు ఫిల్లింగ్‌స్టేషన్ వరకు పైప్‌లైన్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయని తెలిపారు. అన్ని పనులు నిర్ణీత గడువులోపు ముగించే విధంగా అధికారులను ఆదేశించామన్నారు.

ఐటీ సంస్థలకు లబ్ధి

ఈ ప్రాజెక్టు నుంచి లభించే తాగునీరు, దక్షిణ చెన్నై ప్రాంతాలైన వేళచ్చేరి, ఆలందూరు, సెయింట్ థామస్ మౌంట్, మేడవాక్కం, కోవిలంబాక్కం, నన్మంగళం, కీల్ కట్టలై, మూవరసన్ పేట, షోళింగనల్లూరు, ఉల్లగరంతో పాటు తాంబరం కార్పొరేషన్ పరిధిలోని పల్లవరం, ఓఎంఆర్ రోడ్డులోని ఐటీ సంస్థల పరిసరాలకు లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ పరిశీలనలో సీఎస్ వెంట మెట్రో వాటర్ బోర్డు అధికారి కిర్లోష్ కుమార్, చెంగల్పట్టు కలెక్టర్ ఏఆర్ రాహుల్‌నాథ్, నీటి పారుదల అధికారులు, ఇంజినీర్లు కందస్వామి ఉన్నారు.

కలైంజ్ఞర్ పేరు..

కాగా, మరికొన్ని నెలల్లో నెమ్మెలి నిర్లవణీకరణ ప్రాజెక్టు పనులు ముగించే అవకాశాలు ఉన్నాయి. ఈ దివంగత డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పేరు పెట్టే అవకాశాలు ఉన్నాయి. ఆయన శత జయంతి ఉత్సవాలు ప్రస్తుతం జరుగుతున్న నేపథ్యంలో కలైంజ్ఞర్ పేరు పెట్టమే కాకుండా, ఈ ఉత్సవాల స్మారకంగా ఇక్కడి నీటిని దక్షిణ చెన్నై వాసులకు పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

మహానాడు విజయవంతం కావాలని పూజలు


పాలబిందెల ఊరేగింపులో డాక్టర్ సునీల్ తదితరులు


కొరుక్కుపేట: అన్నాడీఎంకే ఎంజీఆర్ యువజన విభాగం జాయింట్ సెక్రటరీ డాక్టర్ వి. సునీల్ ఆధ్వర్యంలో 690 మంది పార్టీ మహిళలు చెన్నై టీ.నగర్‌లోని ముప్పాత్తమ్మన్ ఆలయానికి పాల బిందెలతో పాదయాత్రగా వెళ్లి మొక్కుబడులు చెల్లించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి, తమిళనాడు ప్రతిపక్ష నేత మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళణిస్వామి ఆధ్వర్యంలో మదురైలో నిర్వహించనున్న స్వర్ణ జయంతి చైతన్య మహానాడు విజయవంతంగా జరగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ ప్రజాసంక్షేమ పాలన ఎడప్పాడి పళణిస్వామితోనే సాధ్యమని పేర్కొన్నారు. మదురైలో తలపెట్టిన మహానాడను విజయవంతం చేయాలని ఆకాంక్షిస్తూ ఈ పాలబిందెలతో ఊరేగింపు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మాజీ మంత్రి, పార్టీ ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పంజెట్టి కె. నటరాజన్, త్యాగరాయ నగర్ ఏరియా పార్టీ కార్యదర్శి ఎం. ఉదయ, అన్నా కార్మిక సంఘం పేరవై సౌత్ చెన్నై నార్త్ వెస్ట్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి ఏఏ అర్జునన్ పాల్గొన్నారు.

వేలాంగణి, పళనికి పోటెత్తిన భక్తులు

కొరుక్కుపేట: నాగపట్నంలోని వేలాంగణి మేరీ మాత, పళని ఆలయాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆగష్టు 29 నుంచి వేలాంగణి కేథడ్రల్‌లో వార్షికోత్సవాన్ని జెండా ఎగురవేసి జరుగుపుకోనున్నారు. దాదాపు 10 రోజులు పాటు జరుపుకునే వేడుకల్లో పర్యాటకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు ఈ క్రమంలో శని, ఆదివారాల్లో క్రైస్తవులు, పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ ఉదయం వేలంకన్ని ఆలయం, బీచ్‌లు పర్యాటకులతో కిటకిటలాడాయి. ఇక సెలవుదినం కారణంగా పళని ధండాయుధపాణి స్వామి ఆలయాన్ని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఫలితంగా సన్నతివీధి, గిరివీధి, అయ్యంపుల్లి రోడ్లపై భక్తుల రద్దీ నెలకొంది. వించ్, రోప్‌కార్ స్టేషన్ల వద్ద ఘాట్‌కు భక్తులు భారీగా క్యూకట్టారు. అయితే ఆదివారం ఈదురు గాలుల కారణంగా రోప్‌కార్ సర్వీసులు నిలిచిపోయాయి.

కార్లమార్క్స్‌కు కుటుంబం అంటే ఇష్టం లేదు!

- గవర్నర్ ఆర్ఎన్ రవి వ్యాఖ్య
- సీపీఐ నేతల ఆగ్రహం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్ ఆర్ఎన్‌రవి

సాక్షి, చెన్నై: కార్లమార్క్స్‌కు కుటుంబంతో గడపడం అంటే ఇష్టం లేదని గవర్నర్ ఆర్ఎన్ రవి వ్యాఖ్యానించారు. కుటుంబం వ్యక్తిగత అభివృద్ధికి అడ్డు.. అని ఆయన భావించే వారని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను సీపీఐ తీవ్రంగా ఖండించింది. వివరాలు.. రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్‌రవి తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం తమిళ పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేయడం పరిపాటిగా మారింది. ఈసారి ఆయన ఏకంగా ఆర్థిక, సామాజిక వేత్త కార్ల మార్క్స్‌తో పాటు ఆర్యులు, ద్రవిడులు అన్న పదాలపై మాట్లాడి తమిళ పార్టీల ఆగ్రహానికి గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదివారం చెన్నైలో జరిగిన దీన దయాళ్ ఉపాధ్యాయ పుస్తకావిష్కరణలో ఆర్ఎన్ రవి ప్రసంగించారు. ఇందులో కార్ల మార్క్స్ గురించి ప్రస్తావిస్తూ, ఆయన కుటుంబం అంటే ఇష్టం ఇష్టం లేదని, కుటుంబంతో గడిపే వారు కాదని పేర్కొన్నారు. అలాగే, ఆంగ్లేయులు భారత దేశాన్ని విడిచి వెళ్లినానంతరం కొత్త మతాలు, కులాలు పుట్టుకొచ్చాయని పేర్కొంటూ, ఆర్యులు, ద్రవిడులు అన్న పదాలే అప్పట్లో లేవని వ్యాఖ్యానించారు. ఇండియా అంటే ఒక చెట్టు అని ఇందులో వేలాది ఆకులు భారతీయులని, అందరం ఒకే కుటుంబం అని వ్యాఖ్యానించారు. ఇక కార్ల మార్క్స్‌పై గవర్నర్ వ్యాఖ్యలను సీపీఐ నేత ముత్తరసన్ తీవ్రంగా ఖండించారు. కార్ల్ మార్క్స్ గురించి ఆయనకు ఏం తెలుసునని ప్రశ్నించారు. గవర్నర్‌కు తన బాధ్యతలు తప్పా, ఇతర వ్యవహారాలపై మక్కువ ఎక్కువైందని మండిపడ్డారు.

అన్నామలై యాత్రలో కార్యకర్తల హంగామా


పాదయాత్రలో అభివాదం చేస్తున్న అన్నామలై

సాక్షి, చెన్నై: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పాదయాత్రలో ఆదివారం ఆ పార్టీ వర్గాలు హంగమా సృష్టించాయి. కొన్నిచోట్ల బస్సులను నిలిపి వేయడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. వివరాలు.. నా మట్టి.. నాప్రజలు నినాదంతో అన్నామలై రామేశ్వరం నుంచి పాదయాత్రకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఆదివారం పాదయాత్ర రామనాథపురం జిల్లా ముదుగళత్తూరుకు చేరుకుంది. అన్నామలైకు ఘన స్వాగతం పలికే విధంగా ఆ పరిసరాల్లో బీజేపీ వర్గాలు ఏర్పాట్లు చేశాయి. ఉదయం తొమ్మిది గంటలకు అన్నామలై యాత్రం పరముకుడి – ముదుగళత్తూరు – కొముది కూడలిలోని గాంధి విగ్రహం వద్దకు చేరుకోవాల్సి ఉంది. అయితే, రెండు గంటలు ఆలస్యంగా అక్కడకు యాత్ర వచ్చింది. ఈ రెండు గంటల పాటు బీజేపీ వర్గాలు హంగమా సృష్టించారు. అటువైపుగా వాహనాలను అ నుమతించకుండా అడ్డుకున్నారు. దీంతో ప్రయాణికులు సమీపంలోని బస్టాండ్‌కు రెండు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓ దశలో బీజేపీ నాయకులపై డీఎస్పీ మణిగండన్ నేతృత్వంలోని పోలీసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు అన్నామలై యాత్ర అక్కడి నుంచి ముందుకు సాగినానంతరం ఆ పరిసరాల్లో ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు. కాగా, ఈ యాత్రలో అన్నామలైతో సెల్ఫీలు దిగేందుకు పలువురు ఆసక్తి చూపారు. అలాగే, అన్నామలై యాత్రలోని హైలెట్స్‌కు సంబంధించి రోజువారీ నివేదికను రూపొందించి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు పంపించేందుకు ప్రత్యేక బృందం రంగంలోకి దిగడం గమనార్హం.

భారీ మాల్‌కు చిక్కులు

- మూసివేయాలని ఏయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాలు
- న్యాయ పోరాటానికి సిద్ధమైన యాజమాన్యం

సాక్షి, చెన్నై: చెన్నై మీనంబాక్కం విమానాశ్రయాన్ని అనుసంధానిస్తూ రూపుదిద్దుకున్న భారీ మాల్ నిర్వహణకు చిక్కులు తప్పడం లేదు. ఈ మాల్, సినిమా కాంప్లెక్స్ కారణంగా విమానాశ్రయం వద్ద కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఏయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) గుర్తించింది. దీంతో ఆ మాల్‌ను మూసివేయాలంటూ ఆదేశాలు జారీ చేయడం తాజాగా వెలుగు చూసింది. వివరాలు.. చెన్నై మీనంబాక్కం విమానాశ్రయం నుంచి స్వదేశంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో అన్ని ప్రధాన నగరాలకు , దేశాల రాజధానులకు విమానాల సేవలు అందుతున్న విషయం తెలిసిందే. రూ. 2400 కోట్లతో ఈ విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిద్దే పనులు జరుగుతున్నాయి. తొలి దశ పనులు ఏప్రిల్‌లో ముగించగా, ప్రస్తుతం రెండో దశ పనులు మొదలెట్టి ఉన్నారు. అలాగే, విమానాశ్రయం పరిసరాల్లో పార్కింగ్ కోసం భారీ భవనం ఏర్పాటు చేశారు. ఇక్కడ 2400 కార్లు తదితర వాహనాలు పార్కింగ్ చేసే విధంగా ఇక్కడ నిర్మాణాలు జరిగాయి. రూ. 250 కోట్లతో ఆరు అంతస్తులతో ఈ నిర్మాణం చేపట్టారు.


మాల్, థియేటర్

భద్రతా పరమైన కారణాలతో..

విమానాశ్రయం స్వదేశీ, విదేశీ టెర్మినల్స్‌కు మధ్య భాగంలో ఆరు అంతస్తులతో భారీ మాల్‌కు రూపకల్పన చేశారు. ఇక్కడ ప్రయాణికులకు వినోదాన్ని పంచే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు, ఫుట్‌కోట్‌లు, పలు బ్రాండ్లకు సంబంధించిన దుకాణాలు ఇక్కడ కొలువు దీర్చారు. అంతే కాకుండా ప్రముఖ సంస్థ నేతృత్వంలో సినిమా థియేటర్లు ఏర్పాటు చేశారు. వర్తక, వినోద కేంద్రంగా ఉన్న ఇక్కడకు నిత్య జనం తాకిడి పెరగడం విమానాశ్రయానికి కొత్త చిక్కులను సృష్టించి ఉంది. ఇక్కడకు వచ్చే వారి వాహనాలతో ఆ కాంప్లెక్స్‌నిండి పోవడంతో పాటు విమానాశ్రయ పరిసరాలను ఆక్రమిస్తున్నట్టు తేలింది. అలాగే విమానాశ్రయానికి ఏదేని భద్రతా పరంగా సమస్య తలెత్త వచ్చనే అనుమానాలను చెన్నై ఏయిర్ పోర్టు వర్గాలు ఢిల్లీలోని ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు సమాచారం అందించినట్లు తెలిసింది. ఇదే మాల్ నుంచి ఓ మహిళ కిందకు దూకి ఆత్మహత్య సైతం చేసుకోవడం వంటి పరిణామాలను, ఇక్కడకు నిత్యం తరలివస్తున్న ప్రేక్షకుల సంఖ్యతో భద్రతా సమస్యలే కాకుండా, పార్కింగ్‌కు మరింత ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని గుర్తించారు. దీంతో భారీ మాల్, థియేటర్లను మూసి వేయాలనే ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే పూర్తిస్థాయి కారణాలను తెలియ జేయకుండా ఏకపక్షంగా మూసి వేయాల్సిందేనంటూ ఆదేశాలు జారీ చేయడంపై సంబంధింత మల్టిప్లెక్స్ సంస్థ న్యాయ పోరాటానికి సిద్ధమైనట్లు తెలిసింది.

మత్తు.. జీవితం చిత్తు



మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ఈరోడ్‌లో తొలిసారిగా నిర్వహించిన బన్ స్ట్రీట్ కార్యక్రమంలో 5 వేల మందికి పైగా యువత, ప్రజలు పాల్గొన్నారు. ఈరోడ్ జిల్లాలో తొలిసారిగా బన్ స్ట్రీట్ పేరుతో ఆదివారం హ్యాపీ స్ట్రీట్ నిర్వహించారు. ఇందులో మత్తు పదార్థాల వాడకం, వాటి ప్రభావాలు, నివారణ పద్ధతులపై ఈ అవగాహన కల్పించారు. ఈరోడ్ పెరియార్ నగర్‌లోని 80 అడుగుల రోడ్డులో జరిగిన ఈ బన్ స్ట్రీట్ కార్యక్రమంలో దాదాపు 5 వేల మందికి పైగా యువకులు, ప్రజలు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాగంగా తమిళ సంప్రదాయ కళలతో పాటు సిలంబం, గుమ్మి ఆటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చెన్నై, కోయంబత్తూరు తర్వాత ఈరోడ్‌లో నిర్వహించగా యువత నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా 200 మందికి పైగా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. – సేలం

క్లుప్తంగా

నేడు తిరుత్తణిలో విద్యుత్ అంతరాయం ఉండే ప్రాంతాలు

తిరుత్తణి: సుబ్రహ్మణ్యస్వామి తిరుత్తణి ఆలయంలో ఆగస్టు 7 నుంచి ఆడికృత్తిక ఉత్సవ వేడుకలు ప్రారంభం కానున్న క్రమంలో విద్యుత్ సేవలకు అంతరాయం కలగకుండా ముందస్తుగా అధికారులు మరమ్మతులు చేస్తున్నారు. ఫలితంగా సోమవారం తిరుత్తణి పట్టణంలోని ఎగువ తిరుత్తణి, మురుగూరు, శేఖర్‌వర్మనగర్, కామరాజర్‌నగర్, పెరియార్ నగర్, అన్నామలైనగర్, పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డివిజినల్ విద్యుత్‌శాఖ అధికారి పారిరాజన్ ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆసియా పసిఫిక్ సదస్సుకు చెన్నై విద్యార్థులు

సాక్షి, చెన్నై: అకడమిక్ ఎక్స్‌లెన్స్, పరిశోధనా నైపుణ్యాలలో సత్తా చాటడమే లక్ష్యంగా చెన్నై శివార్లలోని ఎస్ఐఎంఏటీఎస్ ఇంజినీరింగ్‌కు చెందిన 40 మంది విద్యార్థులు విదేశీ సదస్సుకు ఎంపికయ్యారు. వీరు మలేషియాలోని ఆసియా పసిఫిక్ విశ్వవిద్యాలయాల నేతృత్వంలో జరగనున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొనున్నారు. వివిధ డొమైన్‌లలో విస్తరించిన పరిశోధనా పత్రాలను, విద్యా కార్యక్రమాలు ప్రదర్శనలను ఈ సదస్సులో ఇవ్వనున్నారని ఎస్ఐఎంఏటీఎస్ ఇంజినీరింగ్ వర్గాలు ఆదివారం ప్రకటించాయి. సాంకేతికత, కృత్రిమ మేధస్సు, కఠినమైన పరిశోధన, సవాళ్లను పరిష్కరించేందుకు వీలుగా ఈ విద్యార్థులకు మరికొద్ది రోజుల్లో జరగనున్న ఆసియా పసిఫిక్ సదస్సు కొత్త పరిష్కారాలకు మార్గంగా నిలవబోతోందన్నారు.

ఉరి వేసుకుని నవ వరుడి ఆత్మహత్య

అన్నానగర్: ఆడి నెల సందర్భంగా భార్య తన పుట్టింటికి వెళ్లిందని ఆవేదన చెంది ఓ నవవరుడు ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. పట్టాభిరామ్ భీమారావుతేరుకు చెందిన విఘ్నేష్ (25) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనికి కొన్ని నెలల క్రితం వివాహమైంది. భార్య ఆడి నెల కాబట్టి అమ్మగారి ఇంటికి వెళ్లింది. దీంతో విఘ్నేష్ తీవ్ర డిప్రెషన్‌కు లోనయ్యాడు. ఈ స్థితిలో అతడు ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పట్టాభిరామ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విఘ్నేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నైలోని కీల్పాక్కానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెంగోల్ సృష్టికర్తలకు ఘన సత్కారం



సెంగోల్ సృష్టికర్తలను సత్కరిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

కొరుక్కుపేట: మనదేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక.. సెంగోల్(రాజదండం) అని కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ జాతీయ సలహామండలి సభ్యుడు, సదరన్ ట్రావెల్స్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఏ. కృష్ణ మోహన్ అన్నారు. సెంగోల్ ప్రతీ భారతీయుడి హృదయం ఓ ప్రత్యేక స్థానం కలిగి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా ఉమ్మిడి బంగారు జ్యూవెలర్స్ కళాత్మకంగా రూపొందించిన సెంగోల్‌ను ప్రధాని నరేంద్ర మోడీ ఆవిష్కరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు చెన్నైలోని ఆర్యవైశ్య ప్రముఖులు కలసి సెంగోల్ సృష్టికర్తలైన ఉమ్మిడి యతిరాజ్, ఉమ్మిడి సుధాకర్, ఉమ్మిడి రఘునాథ్, ఉమ్మిడి కుప్పురాజ్ లను ఆదివారం ఘనంగా సత్కరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణ మోహన్ పాల్గొని సృష్టికర్తల సేవలను కొనియాడారు.సెంగోల్‌ను భారతీయ ప్రజలు తరతరాలుగా ఆరాధిస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దూరదృష్టితో సెంగోల్‌కు ప్రాముఖ్యత నివ్వటం గొప్ప విషయమన్నారు. దేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అయిన సెంగోల్‌ను వెలుగులోకి తీసుకుని వచ్చి కొత్త పార్లమెంట్ భవనంలో ఏర్పాటు చేయటం ఒక్క ఉమ్మిడి బంగారు కుటుంబానికే మాత్రమే కాకుండా యావత్ దేశ ప్రజలకు గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు జీఆర్‌టీ గ్రూప్ సంస్థల అధినేత జి. రాజేంద్రన్, ఉమ్మిడి లలితా సుధాకర్, అజంతా డాక్టర్ కె. శంకర రావు, విజయలక్ష్మీ, పువ్వాడ అశోక్ కుమార్, జి. కస్తూరి రంగన్, మురళీ సముద్రాల, గోపురం కుంకుమ అధినేత వైవీ హరికృష్ణ, తాడేపల్లి రాజశేఖర్, తంగుటూరి రామకృష్ణ, కేకే త్రినాథ్ కుమార్, శరత్ చంద్రకుమార్, ఎంవీ నారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అత్తిమాంజేరిపేటలో పోలీస్ స్టేషన్ ప్రారంభం



అవుట్‌పోస్టు పోలీస్ స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

పళ్లిపట్టు: అత్తిమాంజేరిపేట పరిసర ప్రాంతాల్లో నేరాలు అదుపు చేసేందుకు వీలుగా అవుట్‌పోస్టు పోలీస్ స్టేషన్‌ను ఎమ్మెల్యే చంద్రన్ ఆదివారం ప్రారంభించారు. పొదటూరుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అత్తిమాంజేరిపేట మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో పాటు పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో గ్రామాలున్నాయి. షోళింగర్ పళ్లిపట్టు రాష్ట్ర రహదారి మార్గంలోని అత్తిమాంజేరిపేటలో బ్యాంకులు, పాఠశాలలు, కాళాశాల ఉన్నందున నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో సమస్యలు ఏర్పడితే 10 కి.మీ దూరంలోని పొదటూరుపేట పోలీస్ స్టేషన్ ఆశ్రయించాల్సి ఉంది. దీంతో నేరాలు అధికమించే అవకాశాలు అధికమిస్తున్నాయి. ఈక్రమంలో అవుట్ పోస్టు పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని గ్రామీణుల వినతికి స్పందించిన తిరుత్తణి డీఎస్పీ విఘ్నేష్ అవుట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు అనుమతిచ్చారు. పంచాయతీ సర్పంచ్ సొంత ఖర్చులతో అవుట్‌పోస్టు స్టేషన్‌కు భవనాన్ని నిర్మించారు. ఆదివారం నిర్వహించిన ప్రారంభోత్సవంలో తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్, డీఎస్పీ విఘ్నేష్ పాల్గొని అవుట్‌పోస్టు స్టేషన్ ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వసంతప్రకాశం, మాజీ జిల్లా కౌన్సిలర్ పీ.రవీంద్రనాథ్‌రెడ్డి, యూనియన్ కార్యదర్శులు బీడీ.చంద్రన్, సీజే.శ్రీనివాసన్, దేవరాజు, ఎత్తిరాజు, గోవర్ధన్‌నాయుడు,కదిరవన్, మురళిసేన పాల్గొన్నారు.

చెత్తకుప్పల్లో ఆడ శిశువుల మృతదేహాలు

అన్నానగర్: దిండుక్కల్ కార్పొరేషన్ మేట్టుపట్టి ప్రాంతంలో ఆదివారం ఇద్దరు ఆడశిశువులను చెత్తకుండీలో పడేసిన విషయం వెలుగు చూసింది. వివరాలు.. దిండుక్కల్ జిల్లా కార్పొరేషన్ పరిధిలోని మేట్టుపట్టి ప్రాంతంలో ఫిలోమెలై ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ పాఠశాల ప్రహరీ గోడ దగ్గర, ఆ ప్రాంతంలో సేకరించిన చెత్తను వేయడానికి కార్పొరేషన్ ద్వారా పెద్ద చెత్త డబ్బాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం చెత్త కుండీలో చెత్తను సేకరించేందుకు వెళ్లిన క్లీనర్లు చెత్త కుండీ దగ్గర నేలపై పడి ఉన్న ఇద్దరు శిశువుల మృతదేహాలను చూసి దిగ్భ్రాంతి చెందారు. దీనికి సంబంధించి కార్పొరేషన్ పరిశుభ్రత కార్యకర్త నగర్ సౌత్ స్టేషన్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు అంబులెన్స్‌లో పసికందుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పసికందుల మృతదేహాలను అమానవీయంగా చెత్తకుండీలో పడేసి.. అదృశ్యమైన వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి నిద్ర చాలా అవసరం



చర్చా కార్యక్రమం ప్రారంభోత్సవంలో వైద్యులు నీలినా, డాక్టర్ ప్రియాంక తదితరులు

కొరుక్కుపేట: సంపూర్ణ ఆరోగ్యానికి నిద్ర చాలా అవసరం అని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్లీప్ సైన్సెస్ అసోసియేట్ కన్సల్టెంట్ డాక్టర్ నీలినా తెలిపారు. ఈ మేరకు చెన్నై అన్నానగర్ శాంతి కాలనీలో ది స్లీప్ కంపెనీ సంస్థ ఆధ్వర్యంలో నిద్ర ఆరోగ్యంపై ఆసక్తిని, అవగాహనను పెంచడానికి స్లీప్ సైన్స్‌పై ప్రత్యేక చర్చా కార్యక్రమం ఆదివారం జరిగింది. ఇందులో వైద్యులు డాక్టర్ నీలినాతో పాటు స్పోర్ట్స్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బి.ప్రియాంక , స్లీప్ కంపెనీ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రిపాల్ చోప్రాలు పాల్గొన్నారు. ఆ సందర్భంగా వారు పేర్కొటూ శారీరక మానసిక ఆరోగ్యానికి నిద్ర చాలా ముఖ్యమన్నారు. కనీసం 7గంటల పాటు నిద్ర అవసరమని సూచించారు. సెల్‌ఫోన్‌లు వచ్చిన తరువాత అధిక సమయం వాటితోనే గడపడం వల్ల తగినంత నిద్ర పోవడం లేదని దీనివల్ల అనారోగ్య సమస్యలతోపాటు ఆర్థోపెడిక్ సమస్యలు కొనితెచ్చుకుంటున్నారని తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

తిరువళ్లూరు: పురుగుల మందు తాగి అపస్మార స్థితికి చేరిన వ్యక్తిని బంధువులు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తిరువళ్లూరు జిల్లా పొన్నేరి తాలుకా పెరుంబేడు గ్రామానికి చెందిన సురేష్(39)కు భార్య షాలినితో పాటు పిల్లలూ ఉన్నారు. ఈ నేపథ్యంలో కడుపునొప్పిగా ఉందని తననూ వైద్యశాలకు తీసుకెళ్లాలని చెబుతూ స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే షాలినీని బంధువులతో కలిసి సురేష్‌ను పొన్నేరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే సురేష్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. అనంతరం శవపరీక్ష నిర్వహించగా ప్రాథమిక విచారణలో విషం తాగినట్టు తేలింది. కాగా మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పొన్నేరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

3వ అంతస్తు నుంచి పడి వ్యాపారి..

అన్నానగర్: కోయంబత్తూరు జిల్లా కినతుకడవు ప్రాంతానికి చెందిన నాగరాజ్ (67) పరుపుల వ్యాపారి. ఇతను వడపళని వేల్ మురుగన్ స్ట్రీట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లోని 2వ అంతస్తులో నివాసం ఉంటున్న తన కుమార్తె పరమేశ్వరి ఇంటికి కొద్దిరోజుల క్రితం వచ్చాడు. పరమేశ్వరి ఇంటి పక్కనే ఉన్న బ్లాక్‌లో నివాసముంటున్న నారాయణన్ మూడు నెలల క్రితం నాగరాజ్ నుంచి పరుపు కొనుగోలు చేశాడు. కానీ ఆ పరుపు పరిమాణం సరైనది కాదని తెలుస్తోంది. దాన్ని సరిచేయమని నాగరాజ్‌ని కోరాడు. ఈ నేపథ్యంలో ఆదివారం నాగరాజ్ 3వ అంతస్తులోని కిటికీ పక్క గోడపైకి ఎక్కి 2వ అంతస్తులోని నారాయణన్ ఇంటి నుంచి తాడు కట్టి పరుపును కిందకు దించేందుకు యత్నించాడు. ఈ క్రమంలో అనూహ్యంగా నాగరాజ్ 3వ అంతస్తు నుంచి కింద పడిపోయాడు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పోలీసు వాహనాన్ని ఢీ కొట్టిన కారు

- యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై వళ్లువర్ కోట సమీపంలో మద్యం మత్తులో కారు వేగంగా నడుపుతూ నిలిపి ఉంచిన పోలీసు వాహనాన్ని కారుతో ఢీకొట్టిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. శనివారం రాత్రి 12 గంటల సమయంలో పోలీసులు తనిఖీ చేస్తుండగా.. అతివేగంగా వచ్చిన ఓ కారు పోలీసులు నిలిపేందుకు యత్నించారు. కానీ అతను నిలపకుండా తప్పించుకోవడానికి యత్నించాడు. ఈ క్రమంలో పోలీసుల గస్తీ వాహనాన్ని ఢీకొట్టాడు. కాగా మద్యం మత్తులో ఉన్నట్లు తెలియడంతో డ్రైవర్ రాయపేటకుకు చెందిన రియాజ్ అహ్మద్ (28)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

భర్తను కడతేర్చిన భార్య

అన్నానగర్: నామక్కల్ పాళయం సమీపంలో మద్యం తాగి వచ్చి వేధింపులకు పాల్పడిన భర్తను భార్య కొడవలితో నరికి చంపింది. వివరాలు.. తిరుపూర్ జిల్లా తారాపురం సమీపంలోని పూదూర్, నంజియాంబలై గ్రామానికి చెందిన బాలు (63). ఇతని భార్య ఈశ్వరి (58). వీరు రెండు నెలల క్రితం ఈరోడ్ జిల్లా చెన్నిమలైలోని నామక్కల్ పాళయం అనే గ్రామంలో అద్దె ఇంట్లోకి మారారు. అక్కడ పాల వ్యాపారం చేస్తున్నారు. మద్యానికి బానిసైన బాలు రోజూ తాగి ఇంటికి వచ్చి భార్య ఈశ్వరిని కొట్టి వేధిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కూడా ఎప్పటిలానే బాలు తాగి ఇంటికి వచ్చాడు. భార్య ఈశ్వరితో గొడవ పడ్డాడు. దీంతో ఈశ్వరి ఇంట్లోని కొడవలి తీసుకుని బాలు మెడపై నరికి చంపింది. స్థానికుల సమాచారంతో పోలీసులు బాలు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని పరారీలో ఈశ్వరి కోసం గాలిస్తున్నారు.

నకిలీ పట్టాతో కొరటూరు చెరువు కబ్జా

– తల్లీ, కుమారుడి అరెస్ట్

తిరువొత్తియూరు: ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన తల్లీ కొడుకును పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. చెన్నై, విల్లివాక్కం సబ్ రిజిస్ట్రార్ రాజా మాణిక్యం సెంట్రల్ క్రైమ్ పోలీసులకు ఇటీవల ఓ ఫిర్యాదు చేశారు. అందులో ప్రభుత్వానికి సొంతమైన కొరటూరు చెరువులోని 1,316 చదరపు అడుగుల స్థలానికి నకిలీ పట్టా తయారు చేసి చూలైమేడుకు చెందిన రాజా కుమారి (64) విల్లివాక్కంలో నివాసం ఉంటున్న ఆమె కుమారుడు సతీష్ (39) ఆక్రమించినట్లు పేర్కొన్నారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఈ పిటిషన్‌పై సెంట్రల్ క్రైమ్ విభాగం సహాయ కమిషనర్ ఆనంద రామన్ ఇన్‌స్పెక్టర్ మేరీ రాణి తదితరులు విచారణ చేపట్టారు. ఇందులో తల్లి కుమారుడు ఇద్దరూ కలిసి స్థలం ఆక్రమించినట్లు తెలిసింది. దీంతో నిందితులు రాజకుమారి, సతీష్‌ను ఆదివారం అరెస్టు చేశారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

కోలీవుడ్ టాక్స్

బ్రహ్మాండానికి 30 ఏళ్లు



జెంటిల్‌మెన్ 30 వసంతాల వేడుకలో కేక్ కట్ చేస్తున్న శంకర్

తమిళసినిమా: చిత్ర పరిశ్రమలో అందరూ సినిమాను ప్రేమించే వారే. అయితే సినిమానే శ్వాసగా, భావించేవారు కొందరే ఉంటారు. అలాంటి వారిలో దర్శకుడు శంకర్ ఒకరు. తొలి చిత్రంతోనే స్టార్ దర్శకుడుగా పేరు తెచ్చుకున్నారు. ఈయన తొలిచిత్రం జెంటిల్మెన్. అర్జున్, మధుబాల జంటగా నటించిన ఈ చిత్రం విడుదలై నేటికి 30 వసంతాలు పూర్తి చేసుకుంది. తొలి ప్రయత్నంలోనే శంకర్ ఒక బలమైన సామాజిక అంశాన్ని తీసుకొని కమర్షియల్ అంశాలు జొప్పించి ఒక ప్రయోజనాత్మక, జనరంజక కథా చిత్రంగా జెంటిల్‌మెన్‌ను మలిచారు. ఆ తర్వాత కూడా శంకర్ తన చిత్రాల్లో సామాజిక అంచాలను తెరపై ఆవిష్కరించడాన్ని విస్మరించలేదు. ఇక ఒక దర్శకుడిగా 30 ఏళ్ల క్రితం ఉదయించిన శంకర్ ఇప్పటికి 13 చిత్రాలు మాత్రమే చేశారు. ప్రస్తుతం ఈయన తమిళంలో ఇండియన్– 2, తెలుగులో గేమ్ ఛేంజర్ చిత్రాలను చేస్తున్నారు. అలా తక్కువ చిత్రాలు చేసినా నేడు టాప్ 10 దర్శకుల్లో ఒకరిగా రాణించటం శంకర్‌కే చెల్లింది. ఇప్పటి వరకు ముదల్‌వన్, బాయ్స్, ఇండియన్, ఎందిరన్, శివాజీ, రోబో –2, నన్బన్ తదితర చిత్రాలు బ్రహ్మాండానికి నిదర్శనంగా నిలిచాయి. అందుకే శంకర్‌ను బ్రహ్మాండ చిత్రాల దర్శకుడు అని పేర్కొంటారు. కాగా జెంటిల్‌మెన్ చిత్రం 30 వసంతాలను పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన శిష్య బృందం (జెంటిల్మెన్ , ఇండియన్ 2, గేమ్ ఛేంజర్ చిత్రాలకు పనిచేసిన సిబ్బంది) ఆదివారం చెన్నైలోని శంకర్ కార్యాలయంలో ఆనందంగా సెలబ్రేషన్స్ చేసుకున్నారు. ఈ వేడుకలో శంకర్ పాల్గొని కేకను కట్ చేశారు.

త్రిషకు అడ్డు పడుతోంది ఆ హీరోనేనా?



త్రిష

తమిళసినిమా: ఎవరైనా సక్సెస్ వెనుక పరిగెత్తం సాధారణ విషయమే. ఇక చిత్రాల విషయాని కొస్తే క్రేజ్ చాలా అవసరం. నటుడు అజిత్ కూడా ఈ పాలసీనే ఫాలో అవుతున్నారా..? అంటే అయ్యుండొచ్చు అనే బదులు కోలీవుడ్ వర్గాల నుంచి వినిపిస్తోంది. ఈయన నటించిన తాజా చిత్రం తుణివు విడుదలై దాదాపు ఏడాది కావస్తోంది. ఇంతవరకు ఆయన తదుపరి చిత్రం ప్రారంభం కాలేదు. విడాముయిర్చి అనే చిత్రంలో నటిస్తున్నట్లు ప్రకటించి చాలా కాలమే అయ్యింది. దీనికి ఆది నుంచి ఆటంకాలే ఎదురవుతున్నాయి. మొదట నటి నయనతార భర్త విగ్నేష్ శివన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించడానికి సిద్ధమయ్యారు. అందుకు సలహాలు కూడా చేసుకున్నారు. అలాంటి దశలో అనుహ్యంగా ఆయన్ని చిత్రం నుంచి తొలగించడం జరిగింది. ఈ విషయంలో అజిత్ ప్రమేయం ఉందనే ప్రచారం జరిగింది. వాస్తవం ఏమిటి అన్నది తెలియకపోయినా ఆ తరువాత విడాముయిర్చి చిత్ర యూనిట్ లోకి దర్శకుడు మగిళ్ తిరుమేణి వచ్చారు. దీంతో ఈ చిత్ర షూటింగ్ ప్రారంభ పనులు వేగవంతం అవుతాయని అందరూ భావించారు. అయితే ఈ చిత్ర షూటింగ్ ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడింది. ఇంతకుముందే ఆగస్టు తొలి వారంలో విడాముయిర్చి సెట్స్ పైకి వెళుతుందని చెప్పారు. అయితే ఇది మరోసారి వాయిదా పడినట్టు, సెప్టెంబర్ నెలలో ప్రారంభం కానున్నట్లు తాజా సమాచారం. అసలు ఈ చిత్రం విషయంలో ఏం జరుగుతుందనే గందరగోళ వాతావరణం అజిత్ అభిమానుల్లో నెలకొంది. ఇకపోతే ఈ చిత్రం షూటింగ్ పలుమార్లు వాయిదా పడటంతో ఇందులో నాయకిగా నటించాల్సిన త్రిష ఇతర చిత్రాలతో బిజీ అవ్వడం జరిగిపోయింది. ఆమె అజిత్ చిత్రానికి కాల్ షీట్స్ సర్దుబాటు చేయలేని పరిస్థితి అనీ అయినప్పటికీ కాస్త ఆలస్యం అయినా ఎలాగో అలా విడాముయిర్చి చిత్రంలో నటిస్తానని త్రిష చెప్పినట్లు సమాచారం . అయితే నటుడు అజిత్ ఆమెకు అడ్డుపడుతున్నట్లు తాజాగా సామాజిక మాధ్యమాలలో వైరలవుతోంది. ఆయన దృష్టి ఇప్పుడు నటి తమన్నపై పడిందట. కారణం జైలర్ చిత్రంలోని కావాలా పాటతో ఫుల్ క్రేజ్ తెచ్చుకోవడమే అని టాక్ . కాగా అజిత్ చిత్రంలో నటించే నాయకి ఎవరన్నది చిత్రవర్గాలు ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించకపోవడం గమనార్హం.

సంగీత దర్శకుడిగా సెంచరీ



నటుడు, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్‌కుమార్

తమిళసినిమా: సంగీత దర్శకుడిగా, నటుడుగా, గాయకుడిగా, నిర్మాతగా రాణిస్తున్న బహుముఖ ప్రతిభాశాలి జీవీ ప్రకాష్ కుమార్. ఈయన అతి చిన్న వయసులోనే సంగీత దర్శకుడిగా రంగ ప్రవేశం చేశారు. అలా 25 ఏళ్ల వయసులోనే 25 చిత్రాలకు పనిచేసిన సంగీత దర్శకుడుగా ముద్ర వేసుకున్నారు. వెయిల్ చిత్రంతో మ్యూజిక్ డైరెక్టర్‌గా చిత్రం రంగ ప్రవేశం చేసి విజయాన్ని అందుకున్నారు. ఆ తరువాత డార్లింగ్ చిత్రంతో కథానాయకుడిగా పరిచయమైన జీవీ ప్రకాష్ కుమార్ మదయానై కూట్టం చిత్రం ద్వారా నిర్మాతగాను అవతారం ఎత్తారు. అలా సంగీత దర్శకుడిగా సెంచరీ కొట్టిన ఈయన కథానాయకుడిగా 25 చిత్రానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ నెలలో సెట్ పైకి వెళ్లనున్నట్లు సమాచారం. ఈ చిత్రం ద్వారా నవ దర్శకుడు పరిచయం పరిచయం అవుతున్నట్లు తెలిసింది ఈ చిత్రానికి ఆయన నిర్మాతగా కూడా వ్యవహరించనట్లు సమాచారం. జి స్టూడియోస్ సంస్థతో కలిసి ఆయన ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. కాగా జీవీ ప్రకాష్ కుమార్ 2013లో నిర్మాతగా మారి మదయానై కూట్టం చిత్రాన్ని నిర్మించారు. ఆ తర్వాత ఆయన మళ్లీ నిర్మాతగా చేస్తున్న చిత్రం ఇదే అవుతుంది. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో కూడిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

కావాలాతో అది వర్కవుట్ అవుతుందా?




తమన్నా

తమిళసినిమా: చిత్ర పరిశ్రమంలో సెంటిమెంట్‌కు చాలా ప్రాధాన్యత ఉంటుంది. ఒక చిత్రం హిట్ అయితే ఆ తరహాలోనే చిత్రాలను నిర్మించడానికి ఆసక్తి చూపుతుంటారు. ఇకపోతే ప్రస్తుతం జైలర్ చిత్రంలో తమన్నా నటించిన కావాలా పాట ట్రెండింగ్‌గా మారింది. రజినీకాంత్ కథానాయకుడిగా నటించిన చిత్రం జైలర్. ఇందులో కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్, బాలీవుడ్ స్టార్ జాకీ ష్రాఫ్, తెలుగు నటుడు సునీల్, యోగిబాబు, రమ్యకృష్ణ, మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తదితరులు ముఖ్యపాత్ర పోషించారు. అయితే వీటన్నింటినీ తమన్నా నటించిన కావాలా పాట పక్కకు నెట్టేసింది. ఇంతకుముందు ఇదేవిధంగా తెలుగు చిత్రం పుష్పాలు సమంత నటించిన ఐటెం సాంగ్ ఊ అంటావా మామ ట్రెండ్ సెట్టర్ గా మారింది. పలువురు స్టార్ హీరోయిన్ల నుంచి విదేశీ భామల వరకు ఈ పాటకు డాన్స్ చేసి ముచ్చట తీర్చుకున్నారు. ఇప్పుడు తమన్నా నటించిన కావాలా పాట కూడా కొత్త ట్రెండ్ సెట్ చేస్తోంది. 52 ఏళ్ల రమ్యకృష్ణ కూడా ముచ్చటపడి ఈ పాటకు డాన్స్ చేయడం విశేషం . ఇకపోతే ఈ చిత్ర కథానాయకుడు రజనీకాంత్ కూడా కావాలా పాటపై తన అసూయను వ్యక్తం చేశారు. ఆరు రోజులు చిత్రీకరించిన ఈ పాటలో తనకు ఒక పూట కూడా నటించే అవకాశాన్ని కల్పించలేదనే నిష్టూరాన్ని ఇటీవల జరిగిన ఆడియో వేడుకలో వెలిబుచ్చారు. మరో విషయం ఏమిటంటే ఈ చిత్రంలో కావాలా అంటూ తెలుగు పదాలతో ఈ పాట మొదలవుతుంది. ఇంతకుముందు కూడా రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన చంద్రముఖి చిత్రంలో దేవుడ దేవుడా అనే పాట తెలుగు పదాలతో మొదలవుతుంది. ఆ పాట సూపర్ హిట్ కావడంతో పాటు చిత్రం కూడా ఘన విజయం సాధించింది. ఇప్పుడు ఆ సెంటిమెంట్ జైలర్ చిత్రానికి కూడా వర్క్ అవుట్ అవుతుందా..? లేదా..? అనే విషయం త్వరలో తేలిపోనుంది.

మూడోసారి మహిళగా..

తమిళసినిమా: పాత్రకు తగ్గట్టుగా మేకోవర్ అవడంలో నటుడు కమలహాసన్ తర్వాతే ఎవరైనా అని పేర్కొనవచ్చు. ఒకే చిత్రంలో పది పాత్రలు పోషించిన నటుడు ఎవరైనా ఈ దేశంలో ఉన్నారంటే అది విశ్వనటుడు కమలహాసన్ ఒకరే. పాత్రకు అవసరమైతే మేకప్ కోసమే గంటల తరబడి సమయాన్ని వెచ్చిస్తారాయన. అందుకు దశావతారం చిత్రమే ఒక ఉదాహరణ. అందులో పది పాత్రలు పోషించిన ఆయన ఒక్కో పాత్రలకు ఒక్కో విధంగా తయారైన తీరు అద్భుతమనే చెప్పాలి. ఆ చిత్రంలో ఒక వృద్ధ మహిళా పాత్ర కోసం కమలహాసన్ మేకోవర్ అయిన విషయం సంచలమనే చెప్పాలి. కాగా అదేవిధంగా అవ్వై షణ్ముకి చిత్రంలో నడివయసు స్త్రీ పాత్రను పోషించి నేర్పించారు. పలువురు హీరోలు స్త్రీ పాత్రలు పోషించినా పూర్తిస్థాయి మహిళా పాత్రల్లో నటించింది మాత్రం కమలహాసనే. కాగా తాజాగా ఆయన ఇండియన్– 2 చిత్రంలో మరోసారి మహిళగా అవతారం ఎత్తబోతున్నట్లు సమాచారం. 28 ఏళ్ల క్రితం కమలహాసన్ కథానాయకునిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇండియన్. కాగా ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. కమలహాసన్, శంకర్ల కాంబినేషన్లో



ఇండియన్-2 చిత్రంలో కమలహాసన్

లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. పలు అద్భుతాలతో రూపొందుతున్న ఈ చిత్రంలో కథలో భాగంగా కమలహాసన్ స్త్రీ పాత్రలో కనిపించబోతున్నారన్నది తాజా సమాచారం. దీంతో ఇప్పుడు ఈ చిత్రంలో కమల్ స్త్రీ గెటప్ ఎలా ఉంటుందని ఆసక్తి నెలకొంది.

క్లుప్తంగా

కరెంటు షాక్‌తో యువకుడి మృతి

తిరువొత్తియూరు: తిరుపూరు సమీపంలో ఆలయ ఉత్సవంలో నాటిన జండా కొయ్యను తీస్తున్న సమయంలో కరెంట్ షాక్ తగిలి యువకుడు మృతి చెందాడు. తిరుపూరు యూనియన్ నావులూరు పంచాయతీకి చెందిన ఇదయకని (30) ముల్లి పాకం గ్రామం ఆలయంలో జరుగు అగ్నిగుండం ఉత్సవం కోసం శుక్రవారం స్నేహితుడు సుధాకర్ ఇంటికి కుటుంబంతో సహా వెళ్లాడు. అగ్నిగుండం ఉత్సవం కోసం ఏర్పాటుచేసిన ఇనుప జెండాను తొలగించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో హైవోల్టేజ్ తీగకు తగలడంతో విద్యుత్ షాక్ తగిలి స్పృహ తప్పి కిందపడ్డాడు. అక్కడున్నవారు అతన్ని చెంగల్పట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిశీలించిన డాక్టర్లు ఇదయకని అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ప్రమాదంలో బ్యాంకు అధికారి..

తిరువొత్తియూరు: తంజయ్ అబికారం పాండితర్ నగర్‌కు చెందిన సీతారామన్ (36) తంజైలో ఉన్న ప్రైవేటు బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తూ ఉన్నారు. కోవైలో జరిగిన మేనేజర్ల సమావేశంలో పాల్గొని శనివారం కారులో తంజైకి తిరిగి వస్తున్నారు. ఇతనితో తిరుచ్చిలో ఉన్న ప్రైవేటు బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్న విగ్నేష్ (30) కూడా ఉన్నాడు. శనివారం అర్ధరాత్రి కరూర్ జిల్లా పులి తలై సమీపము తెరిచి – కరూర్ బైపాస్ రోడ్డులో వస్తుండగా తైలపుదుంగల లోడు లారీ సీతారామన్ కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయమైన సీతారామన్ సంఘటన స్థలంలో మృతి చెందాడు. విగ్నేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని తిరుచ్చిలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సకు అనుమతింపజేశారు. దీని గురించి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. నిండు గర్భిణిగా వున్న సీతారామన్ భార్య ప్రసవం కోసం తంజావూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అనుమతింపజేసి ఉన్నట్లు తెలిసింది.

రైలు ఢీకొని మహిళ మృతి

తిరువొత్తియూరు: ఆవడి సమీపంలో రైలు ఢీకొని మహిళ మృతి చెందింది. ఆవడి సమీపంలోని అన్ననూరు పొన్నియమ్మన్ ఆలయ వీధికి చెందిన జ్యోతి బాస్, రమ్య (37) దంపతులకు ద్వార కేశ (13) అనే కుమారుడు, తాన్య(10) అనే కుమార్తె ఉన్నారు. శుక్రవారం సాయంత్రం వీరి కుమార్తె పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. తరువాత స్నేహితురాలిని చూడడానికి వెళ్లిన రమ్య ఇంటికి తిరిగి రాలేదు. ఆమె స్నేహితురాలు ఇంటికి వెళ్లలేదని తెలిసింది. పలు ప్రాంతాలలో గాలించినప్పటికీ రమ్య కనబడలేదు ఈ క్రమంలో ఆవడి- అన్ననూరు రైల్వే స్టేషన్ మధ్య రైలు పట్టాల మధ్య విద్యుత్తు రైలు ఢీకొని రమ్య శవంగా పడి ఉంది. ఆవడి రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని రమ్య మృతదేహాన్ని శవ పరీక్షకు తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి రమ్య పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని మృతి చెందిందా? లేక ఆత్మహత్య చేసుకుందా? అనే కోణంతో విచారణ చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు దుర్మరణం

తిరువొత్తియూరు: విద్యుత్ కనెక్షన్ మార్చేందుకు ప్రయత్నించిన రైతు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన పుదుకోట జిల్లాలో జరిగింది. పుదుకోట జిల్లా మనపట్టికి చెందిన మురుగన్ (78) రైతు. ఇతను శనివారం ఉదయం 8 గంటల సమయంలో వ్యవసాయ తోటకు విద్యుత్ కనెక్షను కట్ కావడంతో సరిచేయడానికి పాన్ అమరావతి – మనపట్టికి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫారంపైకి ఎక్కాడు. విద్యుత్ కనెక్షన్ మార్చడానికి ప్రయత్నించాడు. విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. అతని మృతదేహం విద్యుత్ పోల్‌పై వేలాడింది. దీనిపై సమాచారం అందుకున్న విద్యుత్ బోర్డ్ అధికారులు, విద్యుత్ ప్రసారాన్ని నిలుపుదల చేసి మురుగన్ మృతదేహాన్ని కిందకు దింపారు. ఈ సంఘటన ప్రాంతంలో సంచలనం కలిగించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తూ ఉన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

తిరువొత్తియూరు: ఆరుంబాకం ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు శనివా రం రాత్రి అరెస్టు చేశారు. చెన్నై ఆరుంబాకం పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ ప్రభు, సహాయ ఇన్‌స్పెక్టర్ రాజా ప్రభు నేతృత్వంలో పోలీసులు శనివారం రాత్రి గస్తీ చేపట్టారు. ఆరంబాకం –అమరావతి నగర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. విచారణలో వారు ఆరుంబాక్కం ప్రాంతానికి చెందిన బాల మురుగన్(26), చూలై మేడు ప్రాంతానికి చెందిన హర్షిత్ (24), అంబత్తూరు ప్రాంతానికి చెందిన ప్రశాంత్ (24)గా తెలిసింది. వీరు ఇంజినీరింగ్ పూర్తి చేసి ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఆంధ్రా నుంచి గంజాయి తీసుకుని వచ్చి ఐటీ కంపెనీ ఉద్యోగులు, స్నేహితులకు విక్రయిస్తున్నట్టు తేలింది. వారి నుంచి కిలో గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, బైకు స్వాధీనం చేసుకున్నారు.

నడిరోడ్డులో కారు దగ్ధం

తిరువొత్తియూరు: సెయింట్ థామస్ మౌంట్ వద్ద నడి రోడ్డులో కారుకు నిప్పు అంటుకుని దగ్ధమైంది. చెన్నై ట్రిపుల్‌కేన్‌కు చెందిన గుణనిధి (28) పెరుంగుడిలో ఉన్న ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. ఇతని భార్య షర్మిల (26) షోలింగనల్లూరులో ఉన్న ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నారు. గుణనిధి తన భార్యతో కలిసి కారులో పల్లావరం నుంచి గిండి మార్గంగా తిరువెళ్లికేనికి వస్తున్నారు. సెయింట్ థామస్ మౌంట్, ఆలందూరు కూడలి సిమెంటు రోడ్డు వద్ద వస్తుండగా కారు ముందు భాగం నుంచి హఠాత్తుగా పొగ వచ్చింది. గుణనిధి, భార్య అతను కిందకు దిగారు. క్షణాల్లోనే కారుకు మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న సైదాపేట అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అయినప్పటికీ కారు పూర్తిగా దగ్ధమైంది.

తిరుత్తణి ఆలయంలో కావళ్ల కోలాహలం

- ఒక్కరోజులో మొక్కు చెల్లించిన 70 వేల మంది భక్తులు


విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి


కావళ్లతో క్యూలో వేచివున్న భక్తులు

తిరుత్తణి: ఆడినెల ఆదివారం సందర్భంగా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కావళ్ల సందడి నెలకొంది. ఫలితంగా భక్తులు మూడు గంటల పాటు క్యూలో వేచి ఉండి భక్తులు స్వామిని దర్శించుకుని కావళ్లు చెల్లించారు. ఆడినెల ఆదివారం సెలవుదినంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కావళ్లలతో తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి కొండ ఆలయానికి చేరుకున్నారు. దీంతో ఘాట్ రోడ్డు మార్గంలో వాహనాలు స్తంభించాయి. మెట్లమార్గంలో భక్తులు కావళ్లతో కొండ ఆలయానికి చేరుకున్నారు. భక్తులు తమ మొక్కులు తీర్చుకునే విధంగా తలనీలాలు సమర్పించి శరవణపొయగై పుస్కరిణిలో స్నానాలు ఆచరించి తొలి మెట్టుకు పూజలు చేసి కొండకు చేరుకున్నారు. ఆలయ మాడ వీధుల్లో మురుగన్ భక్తి పాటలు పాడుతూ, కావళ్లతో ప్రదిక్షణలు చేసి స్వామి వారినికి దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆదివారం ఒక్కరోజే 70 వేలకు పైగా భక్తులు స్వామిని దర్శించున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆడికృత్తిక వేడుకలకు సమయం దగ్గరపడుతున్న క్రమంలో కావళ్లతో కొండకు వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం ముందస్తు ఏర్పాట్లు భారీ స్థాయిలో చేస్తున్నట్లు తెలిపారు.

కాట్పాడి రైల్వే స్టేషన్‌లో సీఐఎస్ఎఫ్ జవాన్ల సందడి


కాట్పాడి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న సీఐఎస్ఎఫ్ జవాన్లు

వేలూరు: వేలూరు జిల్లా కాట్పాడి మార్గంలో ప్రతి రోజూ ప్రయాణికులతో పాటు గూడ్స్ వాహనాలు వెళుతుంటాయి. కాట్పాడిలో కేంద్ర రైల్వే జంక్షన్‌గా ఉండటంతో ప్రతి రోజూ 24 గంటల పాటు తరచూ రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి సీఐఎస్ఎఫ్ జవాన్లు సుమారు వంద మందికి పైగా అక్కడికి చేరుకున్నారు. దీంతో సందడి నెలకొంది. సీఐఎస్ఎఫ్ వీరుల కమాండర్లు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో జరిగే స్థానిక ఎన్నికల బందోబస్తు కోసం బెంగళూరు లో విధులు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ జవాన్లు వెళుతున్నట్లు తెలిపారు. వీరు అక్కడ ఎన్నికల విధులు పూర్తి చేసుకొని తిరిగి బెంగళూరు చేరుకుంటారని పేర్కొన్నారు.

కోర్టుల్లో ఉద్యోగాలు తీసిస్తామని మోసం

- వ్యక్తి అరెస్టు

తిరువొత్తియూరు: కోర్టుల్లో ఉద్యోగం తీసిస్తామని చెప్పి రూ.కోటి మోసం చేసిన వ్యక్తిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. మదురై తిరుప్పావై ప్రాంతానికి చెందిన జయచంద్రన్ పేరండీ సమీపంలో ఉన్న టోల్ గేట్‌లో పనిచేస్తున్నాడు. అతనికి వాయ్యాం కులంకు చెందిన సతీశ్వరన్ పరిచయమయ్యాడు. అతను మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం కార్యాలయంలో పార్ట్‌టైం సహాయక ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో న్యాయమూర్తులు రిజిస్ట్రర్లు తనకు బాగా తెలుసని, హైకోర్టులో సహాయక ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని రూ.3 లక్షలు ఇస్తే ఉద్యోగం తీసిస్తామని జయచంద్రన్‌కు చెప్పాడు. జయచంద్రన్ నగలను తాకట్టు పెట్టి రూ.3 లక్షలు సతీశ్వరన్‌కు ఇచ్చాడు. అలాగే బంధువులు, స్నేహితుల తదితరులు 30 మంది వద్ద సుమారు రూ.కోటి తీసుకుని నియామక పత్రాలు ఇచ్చాడు. జయచంద్రన్, తక్కిన వారు మదురై హైకోర్టు వెళ్లి ఉద్యోగం నియామక పత్రాలను చూపించగా అవి నకిలీవని తేలింది. దీంతో జయచంద్రన్ హైకోర్టు క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు విచారణ చేయగా న్యాయమూర్తి సంతకం ఫోర్జరీ చేసి మోసం చేసిన సతీశ్వరన్‌ను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అతనికి సహకారం అందిస్తున్న రాధాకృష్ణన్, రామలింగం తదితరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.కోటి విలువైన స్థలం విక్రయం


అరెస్టయిన మహ్మద్ రఫీ

తిరువళ్లూరు: నకిలీ డాక్యుమెంట్‌లను సృష్టించి రూ.కోటి విలువ చేసే స్థలాన్ని విక్రయించి పరారీలో వున్న వ్యక్తిని ఆరు నెలల తరువాత పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చెన్నై అన్నానగర్ చెందిన కన్నప్పన్ భార్య అరుణ(62)కు తిరువళ్లూరు జిల్లా కొరట్టూరులోనీ లక్ష్మీ అమ్మన్ నగర్‌లో రూ.కోటి విలువ చేసే ఇంటి స్థలం వుంది. రెండు సంవత్సరాలుగా అరుణ కుటుంబం విదేశాలకు వెళ్లి అక్కడే వుంటున్నారు. జనవరిలో తమ ఇంటి వివరాలను ఆన్‌లైన్‌లో చెక్ చేయగా తమ పేరుపై వున్న భూమి వేరే వ్యక్తి పేరుకు మారడంతో షాక్‌కు గురయ్యారు. వారు ఆవడి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో అంబత్తూరుకు చెందిన మహ్మద్ రఫీ అనే వ్యక్తి నకిలీ డాక్యుమెంట్‌లను సృష్టించడంతో పాటు వ్యక్తులను మార్చి స్థలాన్ని విక్రయించినట్టు తేలింది. మహమ్మద్‌రఫీ కోసం గత ఆరునెలలుగా గాలింపు చర్యలు చేపట్టి అరెస్టు చేసి శనివారం రాత్రి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

నకిలీ దస్తావేజులతో రూ.3 కోట్ల ఇళ్లు స్వాహా

తిరువొత్తియూరు: చెన్నై చింతాద్రి పేటలో నకిలీ దస్తావేజులు తయారుచేసి రూ.3 కోట్లు విలువ చేసే ఇంటిని అపహరించిన తల్లి, కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. కాంచీపురం జిల్లా బి.ఎస్.కె వీ ధికి చెందిన అక్కా,చెల్లెలు అయిన లక్ష్మీబాయి, పద్మబాయి ఇద్దరు చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అందులో చెన్నై చింతాద్రిపేట కాక్స్ వీధిలో తమకు 1083 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు ఇళ్లు ఉన్నాయని తెలిపారు. వాటి విలువ రూ.3 కోట్లు ఉంటుందన్నారు. వాటిని అదే ప్రాంతానికి చెందిన కలై సెల్వి(49), ఆమె కుమారుడు అన్బు (27), మరో మహిళ సుశీల కలిసి నకిలీ దస్తావేజులు తయారుచేసి తమ పేరుకు మార్చుకున్నారని తెలిపారు. దీనిపై చెన్నై సెంట్రల్ క్రైమ్ పోలీసు సహాయ కమిషనర్ రాజాపాల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మురుగేశ్వరి తదితరులు విచారణ చేయగా నకిలీ దస్తావేజులతో ఇళ్లను తమ పేరుతో మార్చుకున్నట్టు తేలింది. దీంతో కలైసెల్వి, ఆమె కుమారుడు అన్బును అరెస్టు చేశారు. మరో మహిళ సుశీల కోసం గాలిస్తున్నారు.

పట్టుకోటై ఆస్పత్రిలో ఆరోగ్యశాఖ మంత్రి తనిఖీలు



వైద్యులకు సూచనలిస్తున్న మంత్రి ఎం. సుబ్రమణియన్

సాక్షి, చెన్నై: తంజావూరు జిల్లా పట్టుకోటై ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్ తనిఖీలు చేశారు. తంజావూరు పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం ఆయన పట్టుకోటైకు వెళ్లారు. ఇక్కడి ఆస్పత్రిలోని అత్యవసర విభాగం, సిటీ స్కాన్ సెంటర్లు, యోగా, సిద్ధా విభాగాలు, మహిళా చికిత్స విభాగాలు, సీఎం ఆరోగ్య బీమా వార్డు తదితర ప్రాంతాలలో తనిఖీలు చేశారు. రోగులతో మాట్లాడారు. అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం పట్టుకోటై ఆస్పత్రిలో రూ. 10 కోట్లతో నిర్మిస్తున్న ప్రసూతి ఆస్పత్రి పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు ముగించి, రోగులకు అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆస్పత్రిలో ఆధునిక వైద్య పరికరాల కొనుగోలు, సిద్ధ వైద్య విభాగానికి ప్రత్యేక విభాగం ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అనంతరం ఆలడికుమలై పంచాయతీలోని సమత్తువపురంలో రూ. 20 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. గర్భిణి మహిళలకు వైద్యసహాయకాలను అందజేశారు. పౌష్టికా హారంతో కూడిన కిట్లను అందజేశారు.

యువకుడిపై దాడి

తిరువొత్తియూరు: ప్రియురాలిని చూడడానికి వచ్చిన యువకుడిపై దాడి చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై చిందాద్రిపేట ప్రాంతానికి చెందిన లక్ష్మణ్ కార్తీక్ (21) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఇతను అంబత్తూరు మన్నూరుపేటకు చెందిన యువతిని ప్రేమిస్తున్నాడు. తమ ప్రాంతానికి చెందిన యువతిని ఎందుకు ప్రేమిస్తున్నావని సూర్య (21), అరుణ్ (19), సుధాకర్ (20) లక్ష్మణ్ కార్తీక్‌తో గొడవ పడ్డారు. కొన్ని రోజుల క్రితం లక్ష్మన్ కార్తీక్ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యాడు. తర్వాత ప్రియురాలిని చూడడానికి మన్నూరు పేటకు వచ్చాడు. ఆ సమయంలో అతన్ని చూసిన ముగ్గురు అతనిపై తీవ్రంగా దాడి చేశారు. లక్ష్మణ్ కార్తీక్ గాయపడ్డాడు. ఇరుగుపొరుగు వారు అతన్ని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి సూర్య, అరుణ్, సుధాకర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

గ్యాస్ సిలిండర్ పేలి 15 మందికి గాయాలు

తిరువొత్తియూరు: మైలాడుదురై ప్రాంతంలో ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలి 15 మందికి గాయాలయ్యాయి. మైలాడుదురై జిల్లా పెరియ చావడి కులం ప్రాంతానికి చెందిన కలైవానన్(40) కూలి కార్మికుడు. ఇతను తన కుటుంబంతో గుడిసె ఇంటిలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి హఠాత్తుగా అతని ఇంటికి నిప్పు అంటుకుంది. ఇరుకు పొరుగు వారు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో కలైవానన్ ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో జయ ప్రతాప్ (40), జయ కుమార్ (45), మణికంఠన్ (48), జగదీష్ (27), వినోద్ రాజు (34), రాజేష్ (36), ఇన్నై పెరుమాల్ (43), మదన్ (19), ప్రేమ (28), సురేష్ (40), కరుణానిధి (48), శరవనన్ (43) కలై పెరుమాళ్ (68), సురేష్ కుమారు (19), నట్రాజన్ (23) గాయాలయ్యాయి. వారిని మైలాడుదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ముగ్గురు రౌడీల అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై నెర్కుంద్రం ప్రాంతంలో కత్తులు పట్టుకుని తిరుగుతున్న ముగ్గురు రౌడీలను పోలీసులు అరెస్టు చేశారు. నెర్కుంద్రం ప్రాంతంలో ప్రజలకు భీతి కలిగించే విధంగా కొందరు యువకులు తిరుగుతున్నట్లు కోయంబేడు పోలీసులకు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ రమేష్ కన్నా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వారిని చూసి ముగ్గురు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని వెంటాడి పట్టుకున్నారు. విచారణలో వారు నెర్కుంద్రంకు చెందిన రౌడీలు శంకర్ (19), సెల్వ (22), మదన్ రాజు (21)గా తేలింది. వారు ఒకటిన్నర నెల క్రితం మధురైవాయిల్ ప్రాంతంలో హత్యకు గురైన ప్రముఖ రౌడీ రాజేష్ (22) అనుచరులని గుర్తించారు. శంకర్, మదన్ రాజుపై హత్య, దౌర్జన్యం కేసుల నమోదు ఉన్నాయి. ఈ క్రమంలో ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి గంజాయి, కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

చదురగిరిలో నిప్పు అంటించిన వ్యక్తి అరెస్టు

తిరువొత్తియూరు: చదురగిరి అటవీ ప్రాంతంలో రెండు రోజులుగా మండుతున్న సంఘటన సంబంధించి నిప్పు పెట్టిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. విరుదునగర్ జిల్లాలో పశ్చిమ కనుమలు కొండల ప్రాంతం చదురగిరిలో సుందరంగా లింగం స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం సమీపంలో శుక్రవారం సాయంత్రం హఠాత్తుగా మంటలు అంటుకున్నాయి. కొండ ఆనుకొని ఉన్న చదురగిరి ప్రాంతం వరకు మంటలు వ్యాపించాయి. మంటలను అదుపు చేసేందుకు అధికారులు నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి నిప్పు పెట్టడం వల్లే మంటలు చెలరేగినట్టు సమాచారం అందింది. విచారణలో రామ్‌నగర్ కాలనీకి చెందిన యానై కరుప్పాన్నన్ నిప్పు పెట్టినట్టు తేలడంతో అరెస్టు చేశారు. విచారణలో చదురగిరికి వెళ్లే మార్గంలో ప్రదోషం, అమావాస్య, పౌర్ణమి తదితర రోజుల్లో తాత్కాలిక దుకాణాలకు అనుమతి ఇవ్వలేదని, దీంతో కొండ దిగువలో వున్న ప్రజలు పశువులు మేపుకునేందుకు నిషేధించారని, అందువల్లే నిప్పు పెట్టినట్లు అంగీకరించాడు.

తిరుచ్చి వైపు కుష్బు చూపు


కుష్బు

సాక్షి, చెన్నై : సినీ నటి, బీజేపీ నేత కుష్బు తిరుచ్చి లోక్‌సభ నుంచి పోటీ చేయనున్నట్లు ప్రచారం ఊపందుకుంది. ఈమేరకు ఆమె తిరుచ్చిపై పూర్తిస్థాయిలో దృష్టి సారంచినట్లు తెలుస్తోంది. వివరాలు..సినీ నటి కుష్బు వాక్ చాతుర్యం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తొలుత డీఎంకేలో ఆ తర్వాత కాంగ్రెస్‌లో చివరకు బీజేపీలో ఆమె చేరారు. గతంలో ఎన్నడూ ఆమెకు ఎన్నికల్లో పోటీచేసే అవకాశం దక్కలేదు. అయితే, బీజేపీలో చేరినానంతరం అసెంబ్లీ ఎన్నికలలో తొలిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. తొలుత ఆమె ట్రిప్లికేన్ నియోజకవర్గాన్ని గురిపెట్టి ప్రజల మన్ననలు పొందే విధంగా విస్తృత కార్యక్రమాలు చేశారు. అయితే, చివరి క్షణంలో బీజేపీకి ఆ సీటును అన్నాడీఎంకే ఇవ్వలేదు. దీంతో చివరి క్షణంలో పక్కనే ఉన్న థౌజండ్ లైట్స్‌ను ఆమెకు కేటాయించారు. ఇక్కడి నుంచి పోటీకి దిగిన ఆమె ఓటమి పాలయ్యారు. అయితే ఆమెకు ఓట్లు భారీగా వచ్చాయి. తర్వాత బీజేపీలో జాతీయ కమిటీ సభ్యురాలుగా కొనసాగుతూ వచ్చారు. ఇటీవల ఆమెకు జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలి పదవి దక్కింది. ఈ పరిస్థితులలో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కొన్ని నియోజకవర్గాలను ఇప్పటికే ఎంపిక చేసుకుని ఉంది. ఇందులో వేలూరు, దక్షిణ చెన్నై, రామనాథపురం, కన్యాకుమారి, కోయంబత్తూరు, నీలగిరి, తిరుచ్చి ఉన్నాయి. తిరుచ్చిలో ఈ సారి కుష్బును పోటీకి దింపాలని బీజేపీ సిద్ధమవుతోన్నట్టు సంకేతాలు వెలువడ్డాయి. ఇందుకు కారణం ఆమెకు అక్కడ అభిమానులు భారీగా ఉండడమే. కుష్బుకు గతంలో తిరుచ్చి మండయూరులో ఆలయం సైతం అభిమానులు నిర్మించారు. దీంతో అభిమానుల మద్దతు, కూటమి బలంతో కుష్బును రంగంలోకి దించే ప్రయత్నాలు జోరందుకున్నాయి. ఇందుకు అనుగుణంగా ముమ్మందు కుష్బు తిరుచ్చిలో తిష్ట వేసి ప్రజాకర్షక కార్యక్రమాలను విస్తృతం చేయనున్నట్లు బీజేపీ నాయకులు చెబుతున్నారు.

చిన్నారులకు భగవద్గీతను నేర్పించాలి


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో స్వస్వరూపానందగిరి స్వామి

కొరుక్కుపేట: చిన్నతనం నుంచే చిన్నారులకు భగవద్గీతను నేర్పించాలని తిరుపతిలోని శ్రీనివాసమంగాపురానికి చెందిన స్వస్వరూపానందగిరి స్వామి తెలిపారు. చెన్నై పాత చాకలిపేటలోని కన్నికలమ్మ దేవాలయంలో ఆదివారం శ్రీ కృష్ణగీతా సమాజం ఆధ్వర్యంలో చిన్నారులకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. స్వస్వరూపానందగిరి స్వామి భగవద్గీత శ్లోకాలు చెప్పి ప్రతిభనుచాటుకున్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీతను పఠించడం ద్వారా పిల్లలు సన్మార్గంలో నడవటంతోపాటు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 5వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మాండూక్యోపనిషత్ ఉపన్యాసాలు, సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 8 వరకు గుణత్రయ విభాగయోగం ఆధ్యాత్మిక ఉపన్యాస కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు.

మేట్టూరు డ్యామ్‌లో 18,058 అడుగులకు చేరిన నీటి మట్టం

తిరువొత్తియూరు: కర్ణాటక రాష్ట్రంలోని కావేరి పరీవాహక ప్రాంతంతోపాటు కేరళ రాష్ట్రంలోని వాయనాడ్‌లో నైరుతి రుతుపవనాల కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కర్ణాటకలోని కబిని, కృష్ణరాజసాగర్ డ్యామ్‌లు నిండుకుండలా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ డ్యామ్‌ల నుంచి నీటిని కావేరి నదిలోకి వదులుతున్నారు. 20 వేల క్యూబిక్ అడుగులకు పైగా అదనపు నీటిని విడుదల చేయడంతో కావేరిలో నీటి ప్రవాహం పెరిగింది. శనివారం 20 వేల క్యూబిక్ అడుగుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. అక్కడ ప్రధాన జలపాతం, సినీ బాల్స్, ఐదు జలపాతాలు ఉప్పొంగుతున్నాయి. ఈ కారణంగా శనివారం 5వ రోజు పరిసల్, జలపాతాలలో స్నానం చేయడంపై అధికారులు నిషేధం విధించారు. అదేవిధంగా మెట్టూరు డ్యామ్ నుంచి నీటి ప్రవాహం పెరిగింది. గురువారం ఉదయం 12,444 క్యూబిక్ అడుగులున్న నీటి ప్రవాహం సాయంత్రం 5 గంటలకు 15,232 క్యూబిక్ అడుగులకు పెరిగింది. శుక్రవారం ఉదయం 8 గంటల వరకు సెకనుకు 18,058 క్యూబిక్ అడుగుల నీరు ప్రవహిస్తోంది. డెల్టా సాగునీటి కోసం డ్యామ్ నుంచి సెకనుకు 12 వేల క్యూబిక్ అడుగుల నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం 65.01 అడుగులున్న నీటిమట్టం శనివారం 65.53 అడుగులకు చేరుకుంది. నీటినిల్వ 28.98 అడుగులు ఉన్నట్టు అధికారులు తెలిపారు.

బెయిల్‌పై విడుదలైన నిందితుడి ఆత్మహత్య

తిరువళ్లూరు: హత్య కేసులో అరెస్టయి ఇటీవల విడుదలైన యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెన్నై వ్యాసార్‌పాడి కక్కన్ కాలనీకి చెందిన సంజయ్(19) హత్య కేసులో అరెస్టు ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యాడు. వ్యాసార్‌పాడిలో వుండడం ఇష్టం లేక గుమ్మిడిపూండి సమీపంలోని ఎలావూర్‌కు నివాసాన్ని మార్చారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం సంజయ్ తల్లిదండ్రులు వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. అతను ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు తలుపులు తీయడానికి ప్రయత్నించినా సాధ్యం కాలేదు. కిటికి నుంచి చూడగా సంజయ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి వుండడాన్ని గుర్తించి షాక్‌కు గురయ్యారు. వెంటనే సమాచారాన్ని గుమ్మిడిపూండి పోలీసులకు అందించారు. సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. కాగా హత్యకేసులో ప్రధాన నిందితుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానికంగా కలకలం రేపింది.

ఆకట్టుకున్న సాహిత్యంలో సంశయావస్థ ఉపన్యాసం


శ్రీరామరావును సత్కరిస్తున్న జేకే రెడ్డి, మధు

కొరుక్కుపేట : వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస కార్యక్రమంలో సాహిత్యంలో సంశయావస్థపై ఉపన్యాస కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. స్థానిక టి.నగర్‌లోని ఆదివారం రాత్రి ఆస్కా క్లబ్ కృష్ణా హాలు వేదికగా జరిగిన ఈ ఉపన్యాస కార్యక్రమానికి వక్తగా నరసాపురం విశ్రాంత ప్రధాన అధ్యాపకులు పొన్నపల్లి శ్రీరామరావు పాల్గొన్నారు. వేద విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి కందనూరు మధు స్వాగతోపన్యాసం చేయగా, వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి వక్తను సభకు పరిచయం చేసి నూతన వస్త్రాలు, చందనపు మాలతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. అనంతరం వక్త శ్రీరామారావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి ఎంతో విశిష్టమైన చరిత్ర ఉందని వ్యాఖ్యానించారు. ఎంచుకున్న అంశం సాహిత్యంలో సంశయావస్థపై మాట్లాడడం ఒక సాహసమేనని అన్నారు. సాహితీ వేత్తలు, రచయితలు, కవులు తమ రచనలు చేసే సమయంలో ఎన్నో రకాల సంశయాలను అనుభవించారని చెప్పారని తెలిపారు. గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నాటిక గొప్పనాటిక అని వ్యాఖ్యానించారు. సాహిత్యంలో సంశయావస్థపై సుదీర్ఘంగా సాగిన ఉపన్యాస కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకుంది. తెలుగు సాహితీ ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యజమానిని బెదిరించి రూ.16 లక్షల దోపిడీ

కొరుక్కుపేట: తిరుపూర్‌లో గృహోపకరణాల దుకాణం యజమానిని కత్తితో బెదిరించి రూ.16 లక్షలు దోపిడీ చేసిన ఏడుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ముఠా తప్పించుకున్న సీసీటీవీ ఫుటేజీ ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. బళ్లా డ్యామ్ రోడ్ విద్యాలయం వద్ద బందిపోటు దొంగలు కారును ఆపి పారిపోతున్న దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. దుకాణంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు .వారు అకస్మాత్తుగా కత్తులతో సహా హజ్మత్ సింగ్‌ను బెదిరించి డబ్బు డిమాండ్ చేశారు. హజ్మత్ సింగ్ డబ్బును తిరస్కరించటంతో కోపోద్రిక్తులైన దుండగులు అతనిపై దాడి చేసి దుకాణంలో ఉన్న రూ.16 లక్షలు, సెల్ ఫోన్ దోచుకెళ్లి కారు ఎక్కి పరారయ్యారు. ఇంతలో బల్లడం రోడ్డు విద్యాలయం ప్రాంతంలో కిడ్నాప్‌కు ఉపయోగించిన కారును దొంగల ముఠా ఆపి పారిపోయినట్టు తెలిసింది. పోలీసులు ఫోరెన్సిక్ నిపుణులకు సమాచారం అందించారు. అక్కడికి వెళ్లిన ఫోరెన్సిక్ నిపుణులు కారుపై వేలిముద్రలను నమోదు చేశారు. కారు రిజిస్ట్రేషన్ నంబర్, వీసాతో కారు యజమాని శక్తివేల్‌ను పోలీసులు పట్టుకున్నారు

వీసీకే పార్టీకి నూతన కన్వీనర్లు


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళపతి సుందర్, నీలమేఘం, అరుణ్‌గౌతమ్ తదితరులు

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లాకు వీసీకే పార్టీ నూతన కన్వీనర్లుగా ఎన్నికైన ఐదుగురు ఆదివరం స్థానికంగా వున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తిరువళ్లూరు జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాలకు ఐదుగురిని జిల్లా కన్వీనర్లుగా నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు తిరుమావళవన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో కన్వీనర్లు నీలమేఘం, అరుణ్‌గౌతమ్, దళపతి సుందరంతో పాటు పలువురు ఆయిల్ మిల్ వద్ద వున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తిరువళ్లూరు-రాణిపేట జిల్లాల కోఆర్డినేటర్ నీలవానత్తునిలవన్ మాట్లాడుతూ కొత్త కన్వీనర్లు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీలో వున్న చిన్నపాటి సమస్యలను సైతం పరిష్కరించుకోవడంతో పాటు సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వెంకట్రావు, కరికళవాక్కం విజీ, పూండి ఇళవరసు పాల్గొన్నారు.

• తెలంగాణ

ప్రాథమికదశలో గుర్తిస్తే లంగ్‌కేన్సర్ నయం చేయొచ్చు

జాతీయ సదస్సులో వైద్యనిపుణులు

సాక్షి, హైదరాబాద్(రాంగోపాల్‌పేట్): ''లంగ్ కేన్సర్‌ను ప్రాథమికదశలో గుర్తిస్తే.. ఆధునిక చికిత్సతో నయం చేయవచ్చు. పల్మొనాలజీ, ఆంకాలజీ, రేడియాలజీ మరియు పెథాలజీ విభాగాలకు చెందిన వైద్యులంతా కలిసి పనిచేయాలి'' అని వైద్యులు సూచించారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్‌సన్‌షైన్ హాస్పిటల్ పల్మొనాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం లంగ్ కేన్సర్ –2023 పేరిట జాతీయ సదస్సు నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 150మంది వైద్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు. జాతీయ సదస్సును కిమ్స్‌సన్ షైన్ హాస్పిటల్ ఆర్‌సీఓఓ సాబర్ గుప్తా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. లంగ్ కేన్సర్‌కు సంబంధించి చాలా వరకు చివరిదశలో అంటే నాలుగో స్టేజ్‌లో డాక్టర్‌ను సంప్రదించడం వల్ల రికవరీ చాలా కష్టంగా మారుతుందన్నారు. ప్రస్తుతం టార్గెట్ థెరపీ, ఇమ్యూనో థెరపీ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, టార్గెట్ థెరపీని రోగికి ట్యాబెట్ రూపంలో కూడా అందజేయవచ్చని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ డాక్టర్లు జె.రఘునాథ్‌రెడ్డి, వి.లక్ష్మణ్ బాబు, కె.యుగవీర్‌గౌడ్‌లు తెలిపారు.

బతికుండగానే డెత్ సర్టిఫికెట్!

• జప్తు చేసిన ట్రాక్టర్‌ను విడిపించుకునేందుకు అడ్డదారులు

బాన్సువాడ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన ట్రాక్టర్‌ను విడిపించుకోవడంతోపాటు ఇన్సూరెన్స్ డబ్బులకోసం ఇద్దరు వ్యక్తులు బతికున్న వ్యక్తి పేరుతో నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించారు. కామారెడ్డి జిల్లా బోర్లం క్యాంపు తండాకు చెందిన బోడ రాంచందర్ మూడేళ్ల క్రితం తన ట్రాక్టర్‌ను నిజామాబాద్‌లోని షోరూంలో ఎక్స్ఛేంజ్‌లో అమ్మేశాడు. షోరూం నిర్వాహకులు ఆ ట్రాక్టర్‌ను రుద్రూర్‌కు చెందిన సాగర్ అనే ఇన్సూరెన్స్ ఏజెంట్‌కు విక్రయించారు. సాగర్ ట్రాక్టర్‌ను తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకోకుండా రెండేళ్లు వాడుకుని, ఏడాది క్రితం గంగాప్రసాద్ అనే వ్యక్తికి విక్రయించాడు. గంగాప్రసాద్ వద్ద ట్రాక్టర్ ఉన్న సమయంలో ఓ ఆటోను ఢీకొట్టడంతో మహారాష్ట్రకు చెందిన ఉస్మాన్ మృతిచెందాడు. బోధన్ పోలీసులు ట్రాక్టర్‌ను జప్తు చేశారు. పత్రాలు పరిశీలించి గంగాప్రసాద్‌పై కేసు నమోదు చేశారు.ట్రాక్టర్‌ను విడిపించుకోవడంతో పాటు ఇన్సూరెన్స్ డబ్బుల కోసం సాగర్, గంగాప్రసాద్ అడ్డదారి తొక్కారు. పాత ఓనర్ రాంచందర్ చనిపోయినట్లు ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించి, ట్రాక్టర్‌నువిడిపించుకున్నారు. తాను చనిపోయినట్లు నకిలీ పత్రాలు సృష్టించినట్లు తెలుసుకున్న రాంచందర్ నెలరోజుల క్రితం బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సాగర్, గంగాప్రసాద్‌లపై కేసు నమోదు చేశారు.



అ'ధర'గొట్టిన మిర్చి ఎగుమతులు

అంతర్జాతీయ విపణిలో గుంటూరు మిర్చికి మంచి గిరాకీ

- రూ.10,445 కోట్ల విలువైన ఎగుమతులు
- ప్రస్తుతం 20 దేశాలకు ఎగుమతి
- ఇతర మసాలా దినుసులపైనా ఎగుమతిదారుల కన్ను

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు మిర్చి ధరతో పాటు ఎగుమతుల్లోనూ తనకు పోటీ లేదని నిరూపి ంచుకుంటోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు రూ.10,445 కోట్ల మార్కును దాటా యి. మిర్చి ఎగుమతుల చరిత్రలోనే ఇదో సరికొత్త రికార్డు కావటం విశేషం. ఎగుమతుల పరంగా పరిమాణంలో కొంతమేర తగ్గినప్పటికీ.. ధర ఎక్కువ గా ఉండటంతో గత ఏడాది కంటే రూ.1,861 కోట్ల ఆదాయం అధికంగా లభించింది. మిర్చి ఉత్పత్తిలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మిర్చి సాధారణ సాగు విస్తీర్ణం 78 వేల హెక్టార్లు కాగా.. 2022- 23లో అత్యధికంగా 84,861 హెక్టార్లలో సాగు చేశారు.

అంతర్జాతీయంగా పెరిగిన గిరాకీ

ప్రస్తుతం మన దేశం నుంచి చైనా, శ్రీలంక, మలేషియా, థాయ్‌లాండ్, స్పెయిన్, అమెరికా, ఇంగ్లండ్, నేపాల్, నెదర్లాండ్స్, నైజీరియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ సహా సుమారు 20 దేశాలకు మిర్చి ఎగుమతి అవుతోంది. కారం, విత్తనాలను సైతం ఎగుమతి చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఇతర దేశాల్లోని మార్కెట్లపైనా గురిపెట్టేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. రెండేళ్లలో గుంటూరు జిల్లాను అన్నిరకాల మిర్చికి ఎగుమతుల హబ్‌గా తయారు చేసేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లా ఎగుమతుల కార్యాచరణ ప్రణాళిక (డీఈఏపీ)లో రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ప్రతిపాదించింది. మిర్చితో పాటు పసుపు, అల్లం, ఇతర మసాలా ఉత్పత్తులతోపాటు పత్తి, నూలు ఎగుమతులపైనా దృష్టి సారించాలని నిర్ణయించింది.

మిర్చి ఎగుమతులు ఇలా..

సంవత్సరం	ఎగుమతి అయిన మిర్చి (టన్నుల్లో)	విలువ (రూ.కోట్లలో)
2018-19	4,68,500	5,411
2019-20	4,96,000	6,710
2020-21	6,49,815	9,241
2021-22	5,57,144	8,584
2022-23	5,16,185	10,445

ఎక్స్‌పోర్టు హబ్‌గా మారుస్తాం



గుంటూరును మిర్చి ఎక్స్‌పోర్ట్ హబ్‌గా మారిస్తే మౌలిక సదుపాయాల కల్పన, కనెక్టివిటీ, ముడి పదార్థాల లభ్యత పెంపు, నైపుణ్యం పెంపు, సాంకేతికత బదిలీ జరుగుతుంది. టూరిజాన్ని అభివృద్ధి చేయడం, అంతర్జాతీయ మార్కెటింగ్ ఈవెంట్స్ నిర్వహించడం వంటి కార్యక్రమాల ద్వారా ఎగుమతులకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది.

– ఎం.వేణుగోపాలరెడ్డి, కలెక్టర్, గుంటూరు

చిల్లీస్ బోర్డు ఏర్పాటు చేయాలి



స్పైసెస్ బోర్డులో అత్యధిక విదేశీ ఆదాయాన్ని సమకూరుస్తున్న మిర్చి పంట కోసం కేంద్రం ప్రత్యేకంగా చిల్లీస్ బోర్డును ఏర్పాటు చేయాలి. పంట చేతి కొచ్చిన తర్వాత విదేశాలకు ఎగుమతులపై దృష్టి పెడుతున్న బోర్డు, రైతులకు కావాల్సిన మంచి విత్తనం, దీనికి సంబంధించిన పరిశోధనలపై దృష్టి పెట్టడం లేదు. అందుకే చిల్లీస్‌కు ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేయాలి.

– తోట రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి, చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్

ధర 'తేజో'మయమే

ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డులో మిర్చికి మంచి గిట్టుబాటు ధర లభిస్తోంది. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర క్వింటాల్‌కు రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలుకుతోంది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి ధర గరిష్టంగా రూ.25 వేల వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.12,500 నుంచి రూ.23,500 వరకు, ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.14 వేల నుంచి రూ.25,500 వరకు ధర లభిస్తోంది. కారం తయారీకి అధికంగా ఉపయోగించే 341, దేవనూరు డీలక్స్, 334 రకాల మిర్చి క్వింటాల్ రూ.23 వేలకు పైగా పలుకుతోంది.



గుంటూరు యార్డులో మిర్చి బస్తాలు

కరోనా సమయంలో బాబు, పవన్ ఎక్కడ దాక్కున్నట్టు?

• బహుజన పరిరక్షణ సమితి నేతలు
• 1036వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

తాడికొండ: రాష్ట్రంలో కులవాద రాజకీయాలు చేస్తున్న బాబు అండ్ కోను రాష్ట్రం నుంచి బహుజనులు తరిమికొట్టడం ఖాయమని బహుజన పరిరక్షణ సమితి నేతలు హెచ్చరించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1036వ రోజుకు చేరాయి. శిబిరాన్ని పలువురు నాయకులు సందర్శించి, ప్రసంగించారు. అన్ని రంగాల్లో నేడు ఏపీ వృద్ధి రేటు సాధిస్తోందని కేంద్ర గణాంకాలు వెల్లడిస్తుంటే.. బాబు, ఎల్లో మీడియా దుష్ప్రచారానికి దిగడం సిగ్గుచేటన్నారు. కరోనా కష్ట కాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు, పవన్ ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు పులి దాసు, శ్యామ్యూల్, ఆదాం, గురునాథం, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ నేతన్న నేస్తంతో చేనేతల జీవితాల్లో వెలుగులు

• చేనేత పరిశ్రమ అభివృద్ధికి సీఎం జగన్ కృషి
• ప్రపంచ సదస్సు–2023లో వక్తలు



చేనేత ప్రపంచ సదస్సులో మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

మంగళగిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిందని పలువురు చేనేత ప్రముఖులు ప్రశంసించారు. నగరంలోని జాతీయ రహదారి వెంట గల ఆర్‌ఆర్ కన్వెన్షన్‌లో ఆదివారం వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ సదస్సు–2023 నిర్వహించారు. ముఖ్య అతిథి, కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని, నేతన్నలంతా ఆయనకు అండగా నిలవాలని కోరారు. వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు అంజన్ కర్నాటి మాట్లాడుతూ చేనేత కార్మికుల కోసం వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ సహాయ సహకారాలు అందిస్తోందని, కార్మికులకు అవసరమైన మగ్గాలు, రాట్నాలతో పాటు పేద కార్మికులను ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, పోతుల సునీత, పంచుమర్తి అనురాధ, ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు అంజన్ కర్నాటి(అమెరికా), డాక్టర్ హరనాథ్ పోలిచర్ల(డెట్రాయిట్), రమేష్ మునుకుంట్ల(కెనడా), రాజ్ అడ్డగట్ల (చికాగో), సారథి కార్యంపూడి(డల్లాస్), మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ పి నరహరి, పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, కుర్ణిశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బుట్టా శారద, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర చేనేత సంస్థలను పునరుద్ధరించాలి

సదస్సులో ప్రతినిధులు పలు తీర్మానాలు చేశారు. అన్ని రాజకీయ పార్టీలు చేనేత సామాజిక వర్గాలకు చట్ట సభల్లో తగినన్ని సీట్లు కేటాయించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. చీరాల, రాజమహేంద్రవరం రూరల్, ఎమ్మిగనూరు, వెంకటగిరి, మంగళగిరి, ధర్మవరం, గాజువాక, పిఠాపురం అసెంబ్లీ స్థానాలతో పాటు, హిందూపురం, కర్నూలు, రాజమండ్రి పార్లమెంట్ స్థానాలను చేనేతలకు కేటాయించాలని తీర్మానించారు. చేనేత ఉత్పత్తులు చిలపల నూలుపై జీఎస్టీ పూర్తిగా తొలగించాలని, నేషనల్ హ్యాండ్‌లూమ్ బోర్డుతో పాటు కేంద్ర ప్రభుత్వ చేనేత సంస్థలను పునరుద్ధరించాలని, చేనేత సహకార సంఘాల బకాయిలు వెంటనే చెల్లించాలని తీర్మానించారు.

ప్రభుత్వంపై ఆరోపణలు రామోజీకి మామూలే

• 'ఈనాడు'పై ఎప్పుడైనా దివంగత వైఎస్సార్, సీఎం జగన్ దాడి చేశారా?
• మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వ్యాఖ్యలు

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ఈనాడు రామోజీరావుకు సర్వసాధారణమైపోయిందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. దివంగత సీఎం వైఎస్సార్, ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్ ఈనాడు కార్యాలయాలపై దాడులు చేయించారా? అని ప్రశ్నించారు. రామోజీ అతి పెద్ద పారిశ్రామికవేత్త కాబట్టి ఆయనకు వ్యతిరేకంగా ఏమైనా జరిగితే చంద్రబాబు, బీజేపీ, కమ్యూనిస్టులు, కాంగ్రెస్ నేతలకు కోపం వస్తుందని ఎద్దేవా చేశారు. 'ఈనాడు'తనకు వచ్చే ఎన్నికల్లో ఉపయోగపడుతుందని చంద్రబాబు భావిస్తున్నట్లున్నారని అభిప్రాయపడ్డారు. మార్గదర్శిపై చర్యల్లో తప్పేముందంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి సమర్థించారని గుర్తు చేశారు. రాజమహేంద్రవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రామోజీరావు తప్పు చేసినా.. ఆయన తప్పు చేశారని మాట్లాడటం తప్పే అవుతోందన్నారు. ఆయనకు ఎవరు వ్యతిరేకంగా మాట్లాడినా కొందరు విరుచుకుపడుతున్నారని, రవిప్రకాష్ లాంటి జర్నలిస్టును అరెస్ట్ చేస్తే వీళ్లంతా ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రవిప్రకాష్ కు ఓ న్యాయం..రామోజీకో న్యాయమా అని ప్రశ్నించారు. ఆర్థిక నేరాల్లో ఉన్న వారి వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలే తప్ప అరెస్టులు చేయడం అనవసరమన్నారు. ఉమ్మడి రాజధాని, పోలవరం అంశాలను చేర్చి రాష్ట్ర విభజన తీర్మానం చేసి పదేళ్లయినా కేంద్రం ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దుగరాజపట్నం పోర్ట్, కడప స్టీల్‌ప్లాంట్, పెట్రో కెమికల్ రిఫైనరీ, విశాఖ- చెన్నై పారిశ్రామిక కారిడార్, విజయవాడ, వైజాగ్‌ల్లో మెట్రో రైళ్లు, ఏపీకి ప్రత్యేక రైల్వే జోన్..ఇలా ఏ హామీలు అమలు కాలేదన్నారు. గుజరాత్‌లో ముస్లింల ఊచకోత తర్వాతే ఇమేజ్ పెరిగి మోదీ ప్రధాని అయ్యారని, ఇదే విధానాన్ని మణిపూర్‌లో అమలు చేస్తున్నట్లు అర్థమవుతోందన్నారు. కాకపోతే మిలిటరీ ఎందుకు స్పందించటం లేదని, మోదీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రాష్ట్రానికి రెవెన్యూలోటు రూ.35,000కోట్లు మంజూరు చేయాలని సీఎం జగన్ కోరారని గుర్తుచేశారు. ఏపీకి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన అడ్డగోలుగా జరిగి, తెలంగాణకు షోరూం.. ఆంధ్రాకు గోడౌన్ మిగిలిందని వ్యాఖ్యానించారు.

నర్సరీ పెట్టు.. కాసులు పట్టు

నాణ్యమైన మల్బరీ మొక్కలను అందించే లక్ష్యంగా అడుగులు

- కిసాన్ మల్బరీ నర్సరీ సాగుతో అధిక ఆదాయం
- ప్రైవేటు నర్సరీ నిర్వహణకు ప్రభుత్వ ప్రోత్సాహం
- నర్సరీ సాగుకు ఎస్సీ, ఎస్టీలకు 90, ఇతరులకు 75 శాతం సబ్సిడీ
- ఆరు నెలల్లో రూ.2 లక్షలకుపైగా ఆదాయం
- ఊటుకూరు, వనిపెంటల్లో ప్రభుత్వ నర్సరీల్లో మొక్కల సాగుకు శ్రీకారం
- జిల్లాలో ఈ ఏడాది 4 వందల ఎకరాల మల్బరీ సాగు లక్ష్యం



కడప అగ్రికల్చర్: తక్కువ పెట్టుబడితో అనతికాలంలో అధిక ఆదాయాన్ని అందించేందుకు ప్రభుత్వం కిసాన్ మల్బరీ నర్సరీ సాగుకు ప్రోత్సాహాన్ని అందిస్తోంది. ఈ కిసాన్ మల్బరీ నర్సరీ సాగుతో ఆరు నెలల్లో పెట్టుబడికి రెట్టింపు ఆదాయం పొందే అవకాశం కల్పిస్తుంది. ఇందుకు చేయూతగా నర్సరీ సాగుకు ప్రభుత్వం సబ్సిడీని కూడా అందిస్తుంది. మల్బరీ సాగుకు అయ్యే ఖర్చులో ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం సబ్సిడీ, ఓసీ, బీసీలకు 75 శాతం సబ్సిడీ అందిస్తుంది. ఆసక్తి ఉన్న రైతులు నర్సరీ సాగుకు ముందుకు రావాలని సూచిస్తోంది. జిల్లాలో మల్బరీ సాగుకు మొక్కల కోసం ముందుగా నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలను పెంచి రైతులకు అందించేందుకు ప్రోత్సహిస్తోంది.

ఎకరాకు నర్సరీకి 1,60,000 మొక్కలు...

మల్బరీకి సంబంధించి ఒక ఎకరా కిసాన్ నర్సరీలో 1,60,000 మొక్కలను నాటితే ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుంది. ఈ నర్సరీలో 4 నుంచి 5 నెలలపాటు మల్బరీ మొక్కలను పెంచి తరువాత రైతులు మొక్కలను విక్రయించాల్సి ఉంటుంది. నర్సరీ నుంచి తెచ్చుకున్న మొక్కలను రైతు తమ పొలంలో సాగు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు నర్సరీలో ఒక్కో మొక్కకు రైతు రూ. 2 చెల్లించి కొనుగోలు చేయాలి. తెచ్చుకున్న మొక్కలను తమ పొలంలో సాగు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ఎకరాకు సాగుకు మొక్కలను నాటేదాన్ని బట్టి 4500 నుంచి 10 వేల మొక్కల వరకు నాటి సాగు చేస్తారు.

ప్రభుత్వ సబ్సిడీ ఇలా..

నర్సరీ మొక్కల సాగుకు ప్రభుత్వం ఒక యూనిట్‌కు రూ.1,50,000 అందిస్తుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం సబ్సిడీతో రూ.1,35,000 ఉచితంగా అందిస్తుంది. అలాగే ఓసీ, బీసీలకు 75 శాతం సబ్సిడీతో రూ.1,12,500 ఉచితంగా అందిస్తుంది. మిగతా మొత్తాన్ని రైతు భరించాల్సి ఉంటుంది. నర్సరీ సాగు పూర్తయ్యాక (ఓసీ, బీసీ రైతులకు) రైతుకు ఒక్కో మొక్కను 2 రూపాయలతో విక్రయిస్తే రూ.2,40,000 రాబడి వస్తుంది. అలాగే ప్రభుత్వం అందించే సబ్సిడీ రూ.1,12,500 కలుపుకుని మొత్తం రూ.3,12,500 కాగా ఇందులో రూ.1,50, 500 ఖర్చు పోను నికరంగా రైతుకు రూ.2,02,500 లాభం వస్తుందని మల్బరీ అధికారులు తెలిపారు. అలాగే (ఎస్సీ, ఎస్టీ రైతులకు) సంబంధించి రైతు రాబడి రూ.2,40,000, ప్రభుత్వ సబ్సిడీ రూ.1,35,000 కలుపుకుని మొత్తం రూ.3,75,000 కాగా ఇందులో రూ.1,50, 500 ఖర్చు పోను రైతుకు నికరంగా రూ.2,25,000 లాభం వస్తుందని అధికారులు తెలియజేస్తున్నారు.

ప్రభుత్వ నర్సరీల ద్వారా...

మల్బరీ నర్సరీ మొక్కల సాగుకు సంబంధించి ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు నర్సరీ కేంద్రాలలో పెంపకాన్ని చేపడుతున్నారు. ఇందులో ఒకటి కడప నగర శివార్లలోని ఊటుకూరు కేంద్రంలో ఒకదానిని, మైదుకూరు మండలం వనిపెంట పట్టు పరిశ్రమలశాఖ క్షేత్రంలో మరొక మల్బరీ నర్సరీ సాగును చేపడుతున్నారు. ఇందులో భాగంగా 2023–24 సంవత్సరానికి ప్రతి నర్సరీలో 2 లక్షల మల్బరీ మొక్కలను సాగు చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. ఇందులో ఊటుకూరు క్షేత్రంలో ఇప్పటికే 1,50,000 మొక్కలను నాటించారు. త్వరలో వనిపెంట నర్సరీలో కూడా నాటించనున్నారు. ఈ ఏడాది జిల్లాలో 4 వందల ఎకరాల మల్బరీ సాగు లక్ష్యంగా ప్రభుత్వం కేటాయించింది. ఈ రెండు నర్సరీల ద్వారా రైతులకు కావాల్సిన మొక్కలను అందజేయనున్నారు. ఇందులో ఒక్కో మొక్క రూ. 2కు అందజేస్తారు.

ఈ ఏడాది 4 వందల ఎకరాలు

ఈ ఏడాది జిల్లాలో 4 వందల ఎకరాల మల్బరీ సాగును లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇందు కోసం కడప ఊటుకూరుతోపాటు వనిపెంట నర్సరీలో మల్బరీ మొక్కల పెంపకాన్ని చేపట్టాము. ఇప్పటికే ఊటుకూరు నర్సరీలో 1,50,000 మొక్కలను సాగు చేశాము. మిగతా వాటిని కూడా త్వరలో నాటి కావాల్సిన రైతులకు అందిస్తాము.

– అన్నపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, జిల్లా పట్టు పరిశ్రమలశాఖ అధికారి.

యూనిట్	నాటాల్సిన మొక్కలు	ఇచ్చే డబ్బులు	సబ్సిడీ (శాతం)
1 ఎకరం	1,60,000	రూ. 1,35,000	90 (ఎస్సీ, ఎస్టీ)
1 ఎకరం	1,60,000	రూ. 1,12,500	75(ఇతరులు)



వ్యాధి రహిత పట్టు పురుగుల పెంపకం..

వ్యాధి రహిత పట్టు పురుగులను(చాకీ పురుగుల పెంపకం) అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం మైసూరులోని జాతీయ పట్టు గుడ్ల ఉత్పత్తి కేంద్రం నుంచి గుడ్లు తెప్పించి పెంచుతోంది. ఇందులో 100 గుడ్లను 13 వందలకు తెప్పించి వనిపెంటలోని సీడ్‌ఫామ్‌లో పెంచుతారు. అక్కడ 13 రోజుల తరువాత పగిలి చాకీ పురుగులు బయటకు వస్తాయి. వాటికి ఉదయం 6 గంటలకు, సాయంత్రం 6 గంటలకు ఇలా 3 రోజులపాటు 6 మేతలను అందిస్తారు. ఈ తరుణంలో వాటికి మొదటి జ్వరం వస్తుంది. తరువాత 2వ మేతను రెండున్నర రోజులు అందిస్తారు. తర్వాత 2వ జ్వరం వస్తుంది. తరువాత రైతులకు ఈ చాకీ పురుగులను సరఫరా చేస్తారు. ఇందులో 100 పట్టు గుడ్ల రేటు రూ.1300 కాగా 100 పట్టు పురుగులను 9 రోజులపాటు పెంచి ఇచ్చినందుకు ఈ ఖర్చు అవుతుంది. ఇలా రైతుకు 100 చాకీ పురుగులను అందించాలంటే రూ.2600 రైతు చెల్లించాల్సి ఉంటుంది. సంబంధిత చాకీ పురుగులను కడపతోపాటు గిద్దలూరు, ప్రకాశం ప్రాంతాలకు కూడా సరఫరా చేస్తున్నారు.

కార్పొరేట్‌ను తలదన్నేలా...

ఇక్కడ కనిపిస్తున్న రెండు ఫొటోల్లో మొదటిది బొబ్బిలి సామాజిక ఆరోగ్య కేంద్రం పాత భవనం. పక్క ఫొటోలో కనిపిస్తున్నది అదే ఆవరణలో రూ.3.50 కోట్లతో అత్యాధునిక వసతులతో నూతనంగా నిర్మించిన సీహెచ్‌సీ నూతన భవనం. ఇది కార్పొరేట్ ఆస్పత్రిని తలదన్నేలా నిర్మించింది. ఈ ఆస్పత్రే కాదు... వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రులను ఎనిమిదింటిని పూర్తి స్థాయి వసతులతో ఇలానే నిర్మిస్తున్నారు.



బొబ్బిలిలోని పాత సీహెచ్‌సీ



నూతనంగా నిర్మించిన బొబ్బిలి సీహెచ్‌సీ

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. నాడు – నేడు ద్వారా ఆస్పత్రులను అధునాతనంగా మార్చింది. ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా తీర్చిదిద్దింది. వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపట్టింది. రోగులకు కావాల్సినన్ని సదుపాయాలు కల్పించింది. దీంతో రోగులు కార్పొరేట్‌ను కాదని ప్రభుత్వ ఆస్పత్రుల వైపు అడుగులు వేస్తున్నారు.

- వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు
- కొత్త రూపు సంతరించుకోనున్న వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రులు
- రూ.58.58 కోట్లతో ఆస్పత్రుల నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వం
- పూర్తయిన బొబ్బిలి, చీపురుపల్లి సీహెచ్‌సీలు ప్రారంభం
- ఆధునిక ఆపరేషన్ థియేటర్, మేల్, ఫీమేల్ వార్డుల నిర్మాణం
- ఆస్పత్రుల రూపు రేఖలు మార్చేసిన జగన్ ప్రభుత్వం

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో గత టీడీపీ ప్రభుత్వం వైద్య రంగాన్ని పూర్తిగా గాలికొదేలిసింది. ఆస్పత్రుల్లో తగినంత మంది వైద్యులు, సిబ్బందిని నియమించక, కనీస వసతులు కల్పించక.. కావాలనే కార్పొరేట్‌ను ప్రోత్సహించేలా ఇలా వ్యవహరించిందన్న విమర్శలు అప్పట్లో లేకపోలేదు. ప్రస్తుతం పరిస్థితి మారింది. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యమే పరమావధిగా ఆస్పత్రుల రూపురేఖలనే సమూలంగా మార్చివేసింది. కార్పొరేట్‌ను తలదన్నేలా తీర్చిదిద్దింది. అవసరమైనంత మంది వైద్యులు, సిబ్బందిని నియమించి... ఆరోగ్యశ్రీ వంటి సేవలతో కార్పొరేట్‌కు దీటుగా మార్చేసింది. రూ.కోట్లు ఖర్చు పెట్టి వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రులను నిర్మిస్తోంది. ఇప్పటికే కొన్ని ఆస్పత్రుల నిర్మాణం పూర్తి కాగా.. మరికొన్ని నిర్మాణ దశలో దూసుకుపోతున్నాయి.



భోగాపురంలో ప్రారంభానికి సిద్ధమవుతున్న సీహెచ్‌సీ



ఎస్.కోటలో నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ గౌరీశంకర్



చీపురుపల్లిలో నూతనంగా నిర్మించిన సీహెచ్‌సీ

రూ.58.58 కోట్లతో 8 ఆస్పత్రుల నిర్మాణం

జిల్లాలో వైద్య విధాన్ పరిషత్‌కు చెందిన 8 ఆస్పత్రులను రూ.58.58 కోట్లతో నిర్మాణం చేపట్టారు. పాత ఆస్పత్రి ఆవరణలో కొత్తగా నిర్మాణం చేపట్టారు. వీటిలో బొబ్బిలి, చీపురుపల్లి ఆస్పత్రుల నిర్మాణం పూర్తయి ఇప్పటికే ప్రారంభించారు. భోగాపురం ఆస్పత్రి నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చింది. త్వరలోనే దీన్ని ప్రారంభించనున్నారు. ఎస్.కోట, బాడంగి, నెల్లిమర్ల, రాజాం, గజపతినగరం ఆస్పత్రులు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటి నిర్మాణాలు కూడా వేగవంతం అయ్యే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఆస్పత్రులు ఇలా...

ప్రతి ఆస్పత్రిలోని క్యాజువాలటీ, ఓపీ విభాగం, మేల్, ఫీమేల్ వార్డులు, చేంజింగ్ రూమ్, ల్యాబొరేటరీ, అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే విభాగం, కార్యాలయ నిర్మాణాలు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నిర్మిస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఆస్పత్రులను నిర్మిస్తున్నారు. నాణ్యతలో రాజీ పడకుండా రోగులకు సేవలే లక్ష్యంగా దూసుకుపోతున్నారు.

ఆస్పత్రుల వారీగా వెచ్చించనున్న నిధులు

ఆస్పత్రి పేరు	వెచ్చించనున్న నిధులు రూ.కోట్లలో..
గజపతినగరం (ప్రాంతీయ ఆస్పత్రి)	రూ.17 కోట్లు
ఎస్.కోట (ప్రాంతీయ ఆస్పత్రి)	రూ.12.60 కోట్లు
బాడంగి (సీహెచ్‌సీ)	రూ.6.81 కోట్లు
నెల్లిమర్ల (సీహెచ్‌సీ)	రూ.4.42 కోట్లు
భోగాపురం (సీహెచ్‌సీ)	రూ.3.95 కోట్లు
రాజాం(ప్రాంతీయ ఆస్పత్రి)	రూ.6.80 కోట్లు
బొబ్బిలి (సీహెచ్‌సీ)	రూ.3.50 కోట్లు
చీపురుపల్లి (సీహెచ్‌సీ)	రూ.3.50 కోట్లు

అన్ని వసతులతో...

వైద్య విధాన్ పరిషత్ పరిధిలో 8 ఆస్పత్రులను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అన్ని వసతులతో రూ.58.58 కోట్లతో నిర్మిస్తున్నాం. రెండు ఆస్పత్రులు నిర్మాణం పూర్తవ్వడంతో వాటిని ప్రారంభించి వినియోగంలోకి తీసుకొచ్చాం. మరో ఆస్పత్రి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మిగిలిన ఆస్పత్రుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కలెక్టర్ ప్రతి నెల ఆస్పత్రుల నిర్మాణం పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్నారు.

– డాక్టర్ బి.గౌరీశంకర్, జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయధికారి (డీసీహెచ్ఎస్)

మంచిమాట

గెలవాలి అని మనం దృఢంగా నిర్ణయించుకోవాలి; మనం మన స్ఫూర్తిగా గెలుపును కోరుకోవాలి; మనం గెలిచేందుకు త్రికరణ శుద్ధిగా పూనుకోవాలి; మనం గెలవాలి. మనకు మనుగడ ఉంది అని అంటే అది గెలుస్తూ ఉండేందుకే అని తెలుసుకోవాలి. ఎన్ని అవరోధాలు ఉన్నా, ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా, ఎంత వ్యతిరేకత పైనపడినా మనం గెలవాలి అని నిలవాలి; మనం గెలుస్తూ మెరుస్తూ ఉండాలి.



గెలుపు.. గమనం.. మలుపు

'గెలుపును పొందాలని తలపోద్దాం; గెలుపును పొందుదాం. గెలుస్తూ ఉన్నవాళ్లమై తల ఎత్తుకుని మనుగడ చేద్దాం; మన తలలకు విలువను పొదువుకుందాం. గెలుపు మనకు అభిరుచి కావాలి; గెలుపును మనం చవి చూస్తూ ఉండాలి; మనం మనుగడకు చవిని చేకూర్చుకోవాలి'.

'యమే వైష వృణుతే తేన లభ్యస్తైష ఆత్మా వివృణుతే తనూమ్ స్వామ్' అని కఠోపనిషత్ చెబుతోంది. అంటే అతడి చేత ఏదైతే కోరుకోబడి అడగబడిందో దానివల్ల అతడు పొందబడతాడు; అతడికి ఆ ఆత్మ తన సహజ ప్రకృతిని తెరుస్తుంది అని అర్థం. ఈ సత్యాన్నే తెలియజేస్తూ 'అడుగుడీ మీకియ్యబడును; వెదకుడీ మీకు దొరకును; తట్టుడీ మీకు తియ్యబడును' అని చెప్పింది మత్తయి సువార్త. మనం గెలుపును కోరుకుని ప్రయత్నిస్తే మనకు గెలుపు తన తలుపును తెరుస్తుంది. మనం గెలుపును పొందాలనుకుని ఉద్యుక్తులం ఐతే మనం గెలుపు చేత పొందబడతాం.

మనం ఉన్న ఈ ప్రపంచం ఒక పద్మవ్యూహం. కానీ మనలో ఎవరూ అభిమన్యుడు కారాదు. ప్రతివ్యక్తీ అర్జునుడే అవాలి; అర్జునుడి తీరే మనకు ఆదర్శం కావాలి; మనకు మార్గదర్శకం కావాలి. తాను ఏ స్థితిలో ఉన్నా, శాపవశాత్తు తన స్థితే మారి తాను పేడిగా మారిపోయినా అర్జునుడు గెలుపునే కోరుకుని, గెలిచేందుకు పూనుకుని గెలుపు తలుపును తట్టాడు. గెలుపు తలుపు తెరుచుకోబడి ఆ గెలుపుచేత పొందబడ్డాడు; అర్జునుడు విజయుడుగా పేరు పొందాడు.

100% – నేను గెలిచాను.
90% – నేను గెలుస్తాను.
80% – నేను గెలవగలను.
70% – నేను గెలవగలను అని అనుకుంటున్నాను.
60% – నేను గెలవగలనేమో.
50% – నేను గెలవచ్చేమో అని అనుకుంటున్నాను.
40% – ఏది గెలుపు?
30% – నాకు గెలవాలని ఉంది.
20% – ఎలా గెలవాలో నాకు తెలియదు.
10% – నేను గెలవలేను.
0% – నేను గెలవను.

ఇది గెలుపునకు నిచ్చెన. మనిషి ఈ నిచ్చెనను ఎక్కాలి: తప్పకుండా ఈ నిచ్చెనను ఎక్కి తనను తాను మనిషిని అని నిరూపించుకోవాలి.

గెలుపు అనేది లక్ష్యమా? కాదు, కాదు. గెలుపు లక్ష్యంగా కాదు మనకు లక్షణంగా ఉండాలి. మనుగడ ఉన్నంతవరకూ మనం గెలుపు కోసమే, గెలుపుతోనే రోజుల్ని గడుపుతూ ఉండాలి. రోజు అనేది రావడమే ఒక గెలుపు. అదిగో ఆ రోజు రావడమే మనకు ప్రేరణ. రోజు లాగా మనుగడ ఆసాంతమూ మనకు గెలుపు అనేది వస్తూనే ఉండాలి. రోజు ఒక సారి మాత్రమే వచ్చేదే ఐతే కాల గమనమూ, ప్రపంచ గమనమూ ఎలా ఉంటుందో ఒకసారి ఊహించుకుందాం. అలా జరిగితే కాలానికి, ప్రపంచానికి గమనమే ఉండదు కదా? రోజు అనేది వస్తూ ఉండడమే గమనం జరుగుతోంది అన్నదానికి ఋజువు. మనకు గెలుపు వస్తూ ఉండడమే మనుగడ గమనాన్ని నిర్ధారణ చేస్తుంది. పొందే ప్రతి గెలుపు మనిషికి ఒక మలుపు. మలుపులు తిరుగుతూ పయనం సాగాలి. గెలుపులతో సాగడమే మనుగడకు సార్థకత.

మనుగడ అన్నది ఒక సాగే తీగ అయితే ఆ తీగకు గెలుపుల పూలు పూస్తూ ఉండాలి. మనుగడ గెలుపుల పూలు పూచే ఒక వల్లరి కావాలి లేదా మనుగడ గెలుపుల పుష్పగుచ్ఛం కావాలి. గెలుపుల పూల పరిమళానికి ఆకృతిగా మనిషి మంచి మాట కెక్కాలి.

– రోచిష్మాన్

సన్నిధి

గురువాణి

తప్పులు చేయకపోతే...???

సర్వసాధారణంగా లోకంలో ..ఎవరయినా విజయం సాధిస్తే..దానికి వారు ఎంత కష్టపడిందీ పదేపదే చెప్పుకుని పొంగిపోతుంటారు. అది సహజం కూడా. కానీ అపజయం ఎదురయితే మాత్రం... 'మనం చేయాల్సింది చేశాం కానీ ఫలితం లేకపోయింది' అంటారు.. అంటే విజయం అయితే తన స్వంతం. అదే వైఫల్యం చెందితే అందరినీ కలుపుకుంటారు. తన వైఫల్యాన్ని అంగీకరించరు..ఇది కూడా ఎక్కువగా చూస్తుంటాం. కానీ విశ్వవిఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ విజేత, రామన్ ఎఫెక్ట్ సష్టికర్త సర్ సివి రామన్ ఏమంటారంటే... ''ఎక్కడ నేను వైఫల్యం చెందానో దానికి యజమానిని నేను. నేనే కర్తను, నేనే భోక్తను, నేనే దానికి పూర్తిగా బాధ్యుణ్ణి. అసలు నేను వైఫల్యం చెందకపోతే .. నేను నేర్చుకోవడం ఎలా సాధ్యపడుతుంది!!!''– అని.

దిద్దుకుందామన్న స్పృహ లేకపోతే దోషం కానీ, దిద్దుకోవడానికి సిద్ధంగా ఉండి.. తాను పొందిన వైఫల్యాలను అనుభవంగా స్వీకరించి, అది నేర్పిన పాఠాలతో మరింత జాగ్రత్తగా తమ ప్రయత్నాలను కొనసాగిస్తానంటే... ఇక సమస్యే ముంది!!! నిజానికి అందరిలో ఉండాల్సిన లక్షణం అది.

సుందరకాండలో స్వామి హనుమ... ''నాలుగు అంగుళాలు కూడా వదలకుండా లంకా పట్టణమంతా గాలించేసాను. సీతమ్మ కనబడలేదు. అంటే సీతమ్మ ఇక్కడ లేదేమో.. సీతమ్మ క్షేమ సమాచారం లేకుండా నేను తిరిగి వెడితే..అక్కడ రాముడు



శరీరం వదిలేస్తాడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, కౌసల్య, సుమిత్ర, కైకేయి, కోసల రాజ్య ప్రజలు, వానర రాజ్యంలో ఉన్నవాళ్ళు...అందరూ హతాశులైపోతారు. నేను వెళ్ళి సీతమ్మ సమాచారం దొరకలేదని చెప్పి ఇంతమందిని బాధపెట్టడం కంటే ఈ సముద్రపు ఒడ్డున కూర్చుని ప్రాయోపవేశం చేస్తాను. శరీరం వదిలేస్తాను'' అన్నాడు... హనుమ అంత బలశాలి లంకంతా వెతికి సీతమ్మజాడ తెలియక పోతే... ఎంత నిరాశ, ఎంత నిస్పృహ ... అది కొద్దిసేపే... వెంటనే తన బాధ్యతలను గుర్తు చేసుకున్నాడు.. 'అసలు మనిషికి శోకం పొందకుండా ఉండడం, బాధ పడకుండా ఉండడం, వైఫల్యానికి బాధపడినా దాన్ని విడిచి మళ్లీ... దిద్దుకుని ఉత్సాహం పొంది ఎక్కడ వైఫల్యం చెందాడో అక్కడ తిరిగి విజయం అందుకోవడానికి సాధన మొదలుపెట్టడం ముఖ్యం' అనుకున్నాడు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఎక్కడ వస్తువు పోగొట్టుకున్నామో అక్కడ వెతికితే ఫలితం... ఎక్కడ వైఫల్యం చెందామో అక్కడ విజయం సాధిస్తే అది ఇచ్చే తృప్తి, అది నేర్పిన పాఠం, అది నేర్పిన అనుభవం ఎప్పటికీ గుర్తుండిపోతాయి... అటువంటి పరిస్థితులు ఎదురయినప్పుడు మరింత స్ఫూర్తినిస్తాయి... అన్న వివేకం మనల్ని ముందుకు నడిపించడమే గాక మరిన్ని విజయాలను రుచి చూపిస్తుంది. అంతే తప్ప నేనేది చేసినా ఇంతే... అయినా నాకా శక్తి ఎక్కడిది.. అని నిరాశపడితే జీవితం ముందుకు కదలదు.

మేడమీద ఉన్న కిటికీలోంచి ఇద్దరు వ్యక్తులు బయటికి చూస్తే... ఒకడికి కింద ఉన్న బురదనేల, మురికి కనిపించి నిరాశ పరిస్తే.. మరొకడికి ఆకాశంలో నక్షత్రాలు, చంద్రుడు, వెలుగులు కనిపించి మురిపిస్తాయి. వాళ్ళ దక్పథాల్లోనే తేడా.. ఆశావాదం ఉన్న వాళ్లు జీవితంలో వృద్ధిలోకి వస్తారు... నిరాశావాదులు నిరాశను ప్రయత్నపూర్వకంగా వదిలించుకోవాలి. రామన్ చెప్పినట్లు వైఫల్యాలను మనసారా అంగీకరిస్తే... అది మనల్ని ఎన్నటికీ నిరాశపరచకపోగా... కొత్త శక్తినిస్తుంది.

తాత్త్వికథ

తల్లి ప్రేమ

కార్తీక మాస సాయంత్రం. రాగి రంగులో శేషాచలం కొండ మెరుస్తూ ఉంది. కొందరు భక్తులు కపిల తీర్థం జలధార కింద స్నానం చేస్తున్నారు. మరికొందరు కోనేరు దగ్గర మట్టి ప్రమిదలలో నేతిదీపాలు వెలిగిస్తున్నారు. అక్కడే మెట్ల మీద కూర్చున్న ఓ పండితుడు తన శిష్యుడితో కార్తీకమాసం విశిష్టత గురించి వివరిస్తున్నాడు.

ఇంతలో ఆకాశంలోకి చందమామ తొంగి చూడటం ప్రారంభించాడు. వెండి వెలుగులో ఉన్న అక్కడి వారంతా వెన్నెల స్నానం చేస్తున్నట్లుగా ఉంది.

ఆ చల్లటి వెన్నెలకు పరవశించిన పండితుడు, తన శిష్యుడితో ''చంద్రుడి వెలుగుకు మించింది ఈ ప్రపంచంలో ఏదీ లేదు'' అన్నాడు.

అక్కడే దీపం వెలిగిస్తున్న ఓ మహిళ, పండితుడి మాటలు విని సరుక్కున తల తిప్పి చూసింది. ''అదేం మాట?'' అని చెప్పి తన పని తాను చేసుకుంటూ ఉంది.

పండితుడు లేచి ఆమె దగ్గరికి వెళ్ళి ''వెన్నెల మెరుపును మించింది ఏమైనా ఉంటే చెప్పమ్మా?'' అని ప్రశ్నించాడు.

ఇంట్లో చాలా పనులున్నాయని ఆ మహిళ కుటుంబ సభ్యులు ఆమెను అక్కడినుంచి ఇంటికి తీసుకెళ్ళిపోయారు.



మరుసటిరోజు కూడా ఆ పండితుడు తన శిష్యుడితోటి కపిలతీర్థం జలధార చూడటానికి వచ్చి అక్కడే కూర్చున్నాడు. పాలమీగడ పాయలుపాయలుగా వర్షిస్తున్నట్లుగా ఉంది జలధార.

ఆరోజు కూడా ఆ మహిళ అక్కడికి వచ్చింది. ఆమె చంకలో నెలల బిడ్డ ఉన్నాడు. భక్తిగా దేవుడికి మొక్కి దీపారాధన చేస్తోంది.

ఆమె పూజ అయ్యేంతవరకు ఆగిన పండితుడు ''ఏవమ్మా, నిన్న నేను చంద్రుడి వెలుగుకు మించింది లేదని చెబితే నువ్వు ఒప్పుకోలేదు. కారణం తెలియలేదు. నేను ఎన్నో గ్రంథాలు చదివాను. పెద్దల ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చాలా విన్నాను. నేనెక్కడా చంద్రుడికి మించిన వెలుగు, అంతటి మెరుపు ఉంటాయని చదవలేదు, వినలేదు. నువ్వు చెబితే తెలుసుకుందామని ఉంది'' అని అడిగాడు.

ఆ మహిళ చిరునవ్వు నవ్వుతూ తన చేతిలోని బిడ్డకు కోనేరులోని చందమామను చూపింది. ఆ పిల్లవాడు ముసిముసినవ్వులు నవ్వినాడు.

ఆ పిల్లవాడి చేతితో, నీటిలో కనిపించే చందమామను తాకించింది. అలలు అలలుగా చందమామ పక్కకి వెళ్ళిపోయాడు. చందమామను పట్టుకోవాలని ఆ పిల్లవాడు నీళ్ళమీద ధబీధబీమని కొట్టినాడు. చందమామ దొరకలేదు. ''అదుగో... పైకి పాయె చందమామ'' అంటూ ఆకాశంలోని చందమామను చూపింది. ఆ బిడ్డ బోసినవ్వుతో కేరింతలు కొట్టినాడు. బిడ్డ కాలి వెండి గొలుసులు చిన్నగా మోగాయి.

అప్పుడు ఆ మహిళ తన బిడ్డ నవ్వును పండితుడికి చూపిస్తూ ''ఈ ప్రపంచంలో నా బిడ్డ మెరుపు ఎవరికైనా వస్తుందా?'' అని అడిగింది.

ఆమె మాటలకు ఆశ్చర్య పోయాడు ఆ పండితుడు.

''నిజమే... తల్లి ప్రేమ అలాంటిది. ఏ తల్లికైనా తన బిడ్డ ముఖంలోని మెరుపు, వెలుగుతో సమానమైనవి ఏవీ ఉండవు కదా...' అనుకుని చిన్నగా అక్కడి నుంచి తన శిష్యుడిని వెంటబెట్టుకుని కదిలాడు.

వెనుకనే ఆ మహిళ బిడ్డనెత్తుకుని ఆకాశం వైపు చూపిస్తూ ''చందమామ రావే... జాబిల్లి రావే...'' అని పాడే పాట తెరలు తెరలుగా వినిపిస్తోంది.

– ఆర్.సి.కృష్ణ స్వామి రాజు

సినిమా



రజనీకాంత్

ఇక్కడ నేనే కింగ్!

రజనీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'జైలర్'. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 10న రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని 'హుకుమ్..' అంటూ సాగే పాట తెలుగు వెర్షన్ లిరికల్ వీడియోను హీరో వెంకటేష్ ఆదివారం షేర్ చేశారు. ''హే ఇక్కడ నేనే కింగ్.. నేను పెట్టినవే రూల్స్.. ఆ రూల్స్‌ని నేను అప్పుడప్పుడు ఇష్టానికి మారుస్తుంటాను. అది విని గప్‌చుప్‌గా ఫాలో అవ్వాలి, అది వదిలేసి ఏదైనా పిచ్చిపనులు చేయాలని చూశావో నిన్ను కండకండాలుగా నరికి విసిరిపారేస్తాను.. హుకుమ్.. టైగర్‌గా హుకుమ్..' అంటూ మొదలై, 'ఉరుముకి మెరుపుకి పుట్టాడురా.. పిడుగును పిడికిట పట్టాడు రా.. అడుగడుగున గుడి కట్టాలిరా... తర తర తరముల సూపర్ స్టార్ రా..' అంటూ సాగుతుందీ పాట. అనిరుధ్ రవిచంద్రన్ స్వరాలందించిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించారు.



ఎస్‌కేఎన్, వైష్ణవి చైతన్య, చిరంజీవి, విరాజ్ అశ్విన్, ఆనంద్ దేవరకొండ, సాయి రాజేష్

ఇండస్ట్రీకి కొత్త తరం రావాలి – చిరంజీవి

''సినిమా అభిమానులంటే ఒక రకమైన దురభిప్రాయం ఉన్నటువంటి సమయం నుంచి నేను ఈ పరిశ్రమను చూస్తున్నాను. ఈ హీరో ఫ్యాన్స్ ఆ హీరోని తిట్టుకోవడం, ఆ హీరో ఫ్యాన్స్ ఈ హీరోని తిట్టుకోవడం... ఈ క్రమంలో చదువులపై అశ్రద్ధ వహించి, జీవితంలో పైకి రావాలనే తపన లేకుండా ఉంటారని.. ఇలా సమాజంలో అభిమానుల గురించి దురభిప్రాయం ఉండేది. అలాంటివి నా చెవిన పడ్డాయి. అలాంటి సమయంలో నేను ఇండస్ట్రీలో నిలదొక్కుకుని నాకంటూ అభిమానులు ఏర్పడితే.. నా అభిమానులను చూసి, సమాజం గర్వపడేలా వారిని తీర్చిదిద్దాలని ఆ రోజు నేను నిర్ణయించుకున్నాను. అందులో భాగంగానే బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ వంటి మంచి సామాజిక కార్యక్రమాలు చేశాను. నా పిలుపు మేరకు వచ్చిన నా అభిమానుల గురించి వారి తల్లిదండ్రులు, సమాజం గర్వించేలా మాట్లాడటం చూస్తుంటే.. నా అభిమానులను చూసి నాకు ఎప్పుడూ గర్వంగానే ఉంటుంది'' అన్నారు చిరంజీవి. ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బేబి'. మాస్‌మూవీ మేకర్స్ పతాకంపై సాయిరాజేష్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ చిత్రం జూలై 14న విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 'బేబీ'విజయోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి మాట్లాడుతూ– ''పాత తరంతోనే ఇండస్ట్రీ ఉంటే అది వెనకబడిపోతుంది. కొత్త తరం రావాలి. అప్పుడే మన పరిశ్రమ నిరంతరం ముందుకు సాగిపోతూ ఉంటుంది. రాజమౌళివంటి దిగ్గజ దర్శకులు ఉన్నారు కాబట్టే మన తెలుగు సినిమాలు అంతర్జాతీయ స్థాయికి, ఆస్కార్ స్థాయికి వెళ్తున్నాయి. ఇది మనందరం గర్వించదగ్గ విషయం. వాళ్లను యువ దర్శకులు స్ఫూర్తిగా తీసుకుని కొత్త కంటెంట్‌తో రాగలిగితే అంతకు మించిన ప్రత్యుపకారం ఇండస్ట్రీకి మరొకటి ఉండదు. ఎస్‌కేఎన్, సాయి రాజేష్, మారుతి.. ఇలా నా అభిమానులను చూస్తుంటే నాకు ఎనలేని సంతోషం కలుగుతుంది. నా అభిమానులు చేసిన 'బేబి' ప్రయత్నం ప్రజాశీస్సులు పొంది, ఇంతటి విజయాన్ని సాధించింది. ఈ ఆనందంలో భాగం కావాలనే నేను ఇక్కడికి వచ్చాను. 'బేబి' ఎడ్యుకేషనల్ ఫిల్మ్‌లా అనిపించింది. చాలామంది యువత సోషల్ మీడియా ఆకర్షణలో పడిపోయి, సెల్ ఫోన్‌కు ఎడిక్ట్ అవుతున్నారు. యువతే కాదు..వారి తల్లిదండ్రులు కూడా ఈ మూవీని చూసి, ఇప్పుడున్న పరిస్థితులకు అన్వయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలి'' అన్నారు. ''చిరంజీవిగారిని స్ఫూర్తిగా తీసుకుని ఇండస్ట్రీకి వచ్చిన మాకు, ఆయన మా సినిమా సక్సెస్‌మీట్‌కు రావడం సంతోషంగా ఉంది'' అని 'బేబి' చిత్రయూనిట్ పేర్కొంది.

స్టార్ట్ యాక్షన్



ఎన్టీఆర్

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ మూవీలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కల్యాణ్‌రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో 'దేవర' లోని ఓ యాక్షన్ షెడ్యూల్ పూర్తయింది. ఈ సినిమా కొత్త షెడ్యూల్ షూటింగ్ ఆగస్టు తొలివారంలో ప్రారంభం అవుతుందనీ, ఓ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తారని టాక్. ఈ ఫైట్ ఇంట్రవెల్ సమయంలో వస్తుందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. స్టంట్ కొరియోగ్రాఫర్ పీటర్ హెయిన్స్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేయనున్నట్లు టాక్. అలాగే ఈ సినిమాలోని ప్రధాన తారాగణం అయిన సైఫ్ అలీఖాన్, జాన్వీకపూర్‌లతో పాటు, కొందరు కీలక పాత్రధారులపై ఈ షెడ్యూల్‌లోనే కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారట కొరటాల. 'దేవర' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల కానుంది.



శ్రీలీల

స్పెషల్ ఆఫర్?

యంగ్ బ్యూటీ శ్రీలీలకు 'పుష్ప: ది రూల్' సినిమాలో యాక్ట్ చేసే ఓ స్పెషల్ ఆఫర్ వచ్చిందట. కథ రీత్యా ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్‌కు స్కోప్ ఉందట. ఈ పాటలో శ్రీలీల అయితే బాగుంటుందని సుకుమార్ అండ్ కో ఆమెను సంప్రదించారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. మరి.. ఈ స్పెషల్ ఆఫర్‌కు శ్రీలీల ఊ అంటారా..? ఊహూ అంటారా? అనేది తెలియాలంటే కొంత సమయం వేచి ఉండక తప్పదు. ఇక 'పుష్ప' చిత్రం తొలిపార్టు 'పుష్ప: ది రైజ్' లోని స్పెషల్ సాంగ్ 'ఊ అంటావా మావ.. ఊహూ అంటావా మావ..' పాటకు సమంత అదిరిపోయే స్టెప్పులు వేసిన సంగతి గుర్తుండే ఉంటుంది. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'పుష్ప:ది రూల్'ను మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇందులో రష్మికా మందన్నా హీరోయిన్. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

పోటీ లేదులే..



'కింగ్ ఆఫ్ కోత'లో ఓ దృశ్యం

'కొత్త ఊరిలో తోపు మనమే.. పోటీ లేదులే... కొట్టలేరులే..' అంటూ సాగే పాట 'కింగ్ ఆఫ్ కోత' చిత్రం లోనిది. దుల్కర్ సల్మాన్ హీరోగా అభిలాష్ జోషి దర్శకత్వంలో రూపొందిన మలయాళ యాక్షన్ చిత్రం 'కింగ్ ఆఫ్ కోత'. జీ స్టూడియోస్, వేఫేరర్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టులో విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'హల్లా మచారే' పాట తెలుగు వెర్షన్ లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందించగా, కృష్ణ కాంత్ సాహిత్యం సమకూర్చారు. ఎల్వీ రేవంత్, సింధూజ శ్రీనివాసన్ పాడారు.



రిటైర్ అయిపోతే మంచిది

– కంగనా రనౌత్

'కరణ్ జోహార్.. ఫస్ట్ నువ్వు రిటైర్ అయిపో.. ప్రతిభ ఉన్న కొత్త వాళ్లకు అవకాశాలు కల్పించు.. వారు అద్భుతాలు సృష్టిస్తారు' అంటూ బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్ అన్నారు. రణవీర్ సింగ్, ఆలియా భట్ జంటగా కరణ్ జోహార్ దర్శకత్వం వహించిన 'రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ' ఈ నెల 28న విడుదలైంది. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కరణ్ జోహార్‌పై మండిపడ్డారు కంగనా రనౌత్. ''భారతీయ ప్రేక్షకులు మూడు గంటల సినిమాలో ఎన్నో వింతలు చూస్తున్నారు. కొందరు అద్భుతాలు సృష్టిస్తుంటే ఈ నెపోటిజం గ్యాంగ్ మాత్రం రూ.250 కోట్ల బడ్జెట్‌తో డైలీ సీరియల్స్ తీస్తున్నారు. 1990లలో తాను తీసిన చిత్రాలనే కాపీ కొట్టి రూ.250 కోట్ల బడ్జెట్‌తో సినిమా చేసినందుకు కరణ్ సిగ్గుపడాలి.. డబ్బులు ఎందుకు వృథా చేస్తున్నావ్? ప్రతిభ ఉన్న ఎంతో మంది యువత సరైన వనరులు లేక సినిమాలు తీయలేకపోతున్నారు. అలాంటి వాళ్లకి అవకాశం కల్పిస్తే కొత్త కథలతో మూవీస్ తీసి విప్లవాత్మక మార్పు తీసుకొస్తారు'' అన్నారామె. అలాగే రణ్‌వీర్ సింగ్‌ని ఉద్దేశించి–''డ్రెస్సింగ్ విషయంలో కరణ్‌ను ఫాలో కావొద్దు. ధర్మేంద్ర, వినోద్ ఖన్నా వంటి పెద్దలను స్ఫూర్తిగా తీసుకో. దక్షిణాది నటులను చూసి తెలుసుకో.. వాళ్ల లుక్‌లో ఓ డిగ్నిటీ, ఇంటిగ్రిటీ ఉంటాయి'' అన్నారు కంగనా.

టీఎఫ్‌సీసీ అధ్యక్షునిగా 'దిల్' రాజు



'దిల్' రాజు

తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి (టీఎఫ్‌సీసీ) నూతన అధ్యక్షునిగా నిర్మాత 'దిల్' రాజు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని ఫిలించాంబర్ వద్ద ఆదివారం టీఎఫ్‌సీసీ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. 2023–2025 సంవత్సరాలకు (రెండేళ్లు) నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో నిర్మాతలు 'దిల్' రాజు, సి.కల్యాణ్ ప్యానల్స్ పోటీ పడ్డాయి. 'టీఎఫ్‌సీసీ'లోని నాలుగు విభాగాలకు చెందిన వారిలో 48 మంది సభ్యులు వేసే ఓట్లలో మేజిక్ ఫిగర్ 25 ఓట్లు దక్కించుకున్న వారు విజేతలవుతారు. ఈ క్రమంలో 'దిల్' రాజుకు 31 ఓట్లు వచ్చాయి. సి.కల్యాణ్‌కి 17 ఓట్లు వచ్చాయి. దీంతో అధ్యక్షుడిగా 'దిల్' రాజు విజయం సాధించారు. 'టీఎఫ్‌సీసీ' ఉపాధ్యక్షులుగా ముత్యాల రాందాసు, కొల్లి రామకృష్ణ, శ్రీనివాస్, కార్యదర్శిగా దామోదర ప్రసాద్, కోశాధికారిగా ప్రసన్నకుమార్‌లను ఎన్నుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు ఎన్నికలు జరిగాయి. సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగ్గా రాత్రి తుది ఫలితాలు వెలువడ్డాయి.

ఎన్నికల అనంతరం 'దిల్' రాజు మాట్లాడుతూ–''ఈ ఎన్నికలు రాజకీయ ఎన్నికలు కావు. సినిమా అన్నది వ్యాపారం. మా మధ్య పోటీ అన్నది ఈ ఒక్కరోజు మాత్రమే, రేపటి నుంచి అంతా కలిసి పనిచేస్తాం'' అన్నారు. ''ఈ ఎన్నికల్లో ఎగ్జిబిటర్లు 'దిల్' రాజుకు అమ్ముడు పోయారు.. అయినా నా మద్దతు 'దిల్' రాజుకి ఉంటుంది'' అని సి.కల్యాణ్ అన్నారు. ఇదిలా ఉంటే.. టీఎఫ్‌సీసీలోని 4 విభాగాల్లో (ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్, స్టూడియో, ఎగ్జిబిటర్స్) 2262 మంది సభ్యులకుగాను 1339 మంది ఓటు వినియోగించుకున్నారు. ప్రొడ్యూసర్స్ విభాగం అధ్యక్షుడిగా శివలెంక కృష్ణప్రసాద్, డిస్ట్రిబ్యూటర్స్ విభాగం అధ్యక్షుడిగా మిక్కిలినేని సుధాకర్, స్టూడియో విభాగం అధ్యక్షుడిగా ఈవీఎస్ చారి, ఎగ్జిబిటర్స్ విభాగం అధ్యక్షుడిగా టీఎస్ రాంప్రసాద్ ఎన్నికయ్యారు.



సిద్ధాంత గొగోయ్‌కు స్వర్ణం

ఆసియా యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో పురుషుల 61 కేజీల విభాగంలో భారత లిఫ్టర్ సిద్ధాంత గొగోయ్ పసిడి పతకం సాధించాడు. గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ఈ పోటీల్లో ఆదివారం సిద్ధాంత మొత్తం 265 కేజీలు (స్నాచ్‌లో 116+క్లీన్ అండ్ జెర్క్‌లో 149) బరువెత్తి విజేతగా నిలిచాడు. ఈ విభాగంలో భారత్‌కే చెందిన శంకర్ లావుంగ్ (256 కేజీలు) కాంస్య పతకం గెల్చుకున్నాడు. మహిళల జూనియర్ 49 కేజీల విభాగంలో జ్ఞానేశ్వరి యాదవ్, మహిళల యూత్ 49 కేజీల విభాగంలో కోయల్ రజత పతకాలు సాధించారు.

అమన్-ప్రగతి జోడీకి పసిడి పతకం





ప్రపంచ విశ్వ విద్యాలయాల క్రీడల్లో భారత్‌కు నాలుగో స్వర్ణ పతకం లభించింది. ఆదివారం జరిగిన ఆర్చరీ ఈవెంట్‌లో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అమన్ సైని-ప్రగతి (భారత్) జోడీ పసిడి పతకం సాధించింది. ఫైనల్లో అమన్ సైని-ప్రగతి ద్వయం 157-156తో సువా చో-సెయుంగ్‌హూన్ పార్క్ (కొరియా) జోడీపై గెలిచింది. కాంపౌండ్ పురుషుల టీమ్ విభాగంలో భారత్‌కు కాంస్యం, మహిళల టీమ్ విభాగంలో భారత్‌కు రజత పతకం లభించాయి.

వెర్‌స్టాపెన్ జోరు

సీజన్‌లో వరుసగా ఎనిమిదో విజయం

స్పా-ఫ్రాంకోర్‌చాంప్స్ (బెల్జియం): ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ తనకు ఎదురేలేదన్నట్లు దూసుకుపోతున్నాడు. ఆదివారం జరిగిన బెల్జియం గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ చాంపియన్‌గా నిలిచాడు. 44 ల్యాప్‌ల రేసును ఆరో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంటా 22 నిమిషాల 30.450 సెకన్లలో ముగించి వరుసగా ఎనిమిదో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ సీజన్‌లో 12 రేసులు జరగ్గా వెర్‌స్టాపెన్ పది రేసుల్లో నెగ్గాడు. మరో రెండు రేసుల్లో రెడ్‌బుల్ జట్టుకే చెందిన సెర్జియో పెరెజ్ విజేతగా నిలిచాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్‌లో వెర్‌స్టాపెన్ పోల్ పొజిషన్ సాధించినా... నిబంధనలకు విరుద్ధంగా కొత్త గేర్ బాక్స్ మార్చినందుకు అతనిపై ఐదు గ్రిడ్‌ల పెనాల్టీని విధించారు. దాంతో ఆదివారం జరిగిన ప్రధాన రేసును వెర్‌స్టాపెన్ ఆరో స్థానం నుంచి మొదలుపెట్టాడు. పెరెజ్ రెండో స్థానంలో, చార్లెస్ లెక్‌లెర్క్ (ఫెరారీ) మూడో స్థానంలో నిలిచారు. సీజన్‌లోని తదుపరి రేసు డచ్ గ్రాండ్‌ప్రి ఆగస్టు 27న జరుగుతుంది.





విజేత భారత్

బార్సిలోనా: స్పెయిన్ హాకీ సమాఖ్య శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన మూడు దేశాల మహిళల టోర్నీలో భారత జట్టు విజేతగా నిలిచింది. డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగిన ఈ టోర్నీలో భారత జట్టు రెండు మ్యాచ్‌ల్లో గెలిచి, రెండు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని ఎనిమిది పాయింట్లతో అజేయంగా నిలిచి టైటిల్ సాధించింది. ఆదివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 3-0తో స్పెయిన్‌పై గెలిచింది. భారత్ తరఫున వందన కటారియా (22వ ని.లో), మోనిక (48వ ని.లో), ఉదిత (58వ ని.లో) ఒక్కో గోల్ చేశారు.

పురుషుల జట్టుకు కాంస్యం

ఇదే టోర్నీ పురుషుల విభాగంలో భారత జట్టు కాంస్య పతకాన్ని దక్కించుకుంది. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 2-1 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్‌పై గెలిచింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్ (15వ ని.లో), దిల్‌ప్రీత్ సింగ్ (50వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... నెదర్లాండ్స్ జట్టుకు థియరీ బ్రింక్‌మన్ (25వ ని.లో) ఏకైక గోల్ అందించాడు.

హర్ష భరతకోటి శుభారంభం



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ హర్ష భరతకోటి శుభారంభం చేశాడు. లెవాన్ పాంట్‌సులయ (జార్జియా)తో ఆదివారం జరిగిన తొలి రౌండ్ తొలి గేమ్‌లో హర్ష 40 ఎత్తుల్లో గెలిచాడు. గ్రిగరీ కైదనోవ్ (అమెరికా)తో జరిగిన తొలి రౌండ్ తొలి గేమ్‌ను ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ 38 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. భారత గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్, దొమ్మరాజు గుకేశ్, విదిత్, నిహాల్ సరీన్, ప్రజ్ఞానందలకు నేరుగా రెండో రౌండ్‌కు 'బై' కేటాయించారు.

మహిళల విభాగంలో మరీనా బ్రునెల్లో (ఇటలీ)తో జరిగిన తొలి రౌండ్ తొలి గేమ్‌ను ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నూతక్కి ప్రియాంక 27 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలిలకు నేరుగా రెండో రౌండ్‌కు 'బై' లభించింది.

బౌలింగ్‌లోనూ తడబాటే!

- రెండో వన్డేలో భారత్ ఓటమి
- విండీస్‌ను గెలిపించిన హోప్, కార్టీ
- 1-1తో సిరీస్ సమం

బ్రిడ్జ్‌టౌన్: స్వదేశంలో త్వరలో జరిగే వన్డే ప్రపంచకప్‌కు ముందు కరీబియన్ పర్యటనకు వచ్చిన భారత జట్టు టెస్టు సిరీస్ గెలిచేంత వరకు బాగానే ఉంది. కానీ కప్ సన్నాహకమైన కీలక వన్డే సిరీస్‌లో టీమిండియా ఆట ఏమాత్రం బాగోలేదు. తొలి వన్డేలో అర్థంలేని ప్రయోగాలను రెండో వన్డేలోనూ చేసింది. మొదటి మ్యాచ్‌లో గెలిచేందుకు కష్టపడింది. కానీ రెండో మ్యాచ్‌లో టీమిండియా ఎంత కష్టపడినా నెగ్గలేకపోయింది. తమ కెరీర్‌లో ఆఖరి వన్డే ప్రపంచకప్ అనుకుంటున్న కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ కోహ్లిలకు ప్రతీ మ్యాచ్ కీలకం కాగా... వీళ్లిద్దరు విశ్రాంతి తీసుకున్న వైనం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కానేకాదు. అందుకేనేమో మెగా టోర్నీకి అర్హత సాధించలేకపోయిన వెస్టిండీస్ జట్టు చేతిలో టీమిండియా అపహాస్యం కావాల్సి వచ్చింది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఈ రెండో వన్డేలో భారత్ ఆరు వికెట్ల తేడాతో విండీస్ చేతిలో పరాజయం చవిచూసింది. హార్దిక్ పాండ్యా సారథ్యంలోని భారత్ 40.5 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు ఇషాన్ కిషన్ (55 బంతుల్లో 55; 6 ఫోర్లు, 1 సిక్స్), శుబ్‌మన్ గిల్ (49 బంతుల్లో 34; 5 ఫోర్లు) మాత్రమే బాగా ఆడారు. తర్వాత పసలేని బౌలింగ్‌పై సులువైన లక్ష్యాన్ని వెస్టిండీస్ 36.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసి ఛేదించింది. కెప్టెన్ షై హోప్ (80 బంతుల్లో 63 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కీసీ కార్టీ (65 బంతుల్లో 48 నాటౌట్; 4 ఫోర్లు) విండీస్‌ను గెలిపించారు. భారత బౌలర్లలో శార్దుల్ ఠాకూర్ 3 వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్‌కు వికెట్ దక్కింది. నిర్ణాయక వన్డే రేపు టరోబాలో జరుగుతుంది.



శార్దుల్ రాణించినా...

భారత బౌలర్లలో శార్దుల్ ఠాకూర్ తన పేస్‌తో నిప్పులు చెరిగాడు. ఇన్నింగ్స్ 9వ ఓవర్లో జోరుమీదున్న ఓపెనర్లు మేయర్స్ (28 బంతుల్లో 36; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), బ్రాండన్ కింగ్ (23 బంతుల్లో 15; 3 ఫోర్లు)లను అవుట్ చేశాడు. కాసేపటికే వన్‌డౌన్‌లో వచ్చిన అతనెజ్ (6)కూ శార్దుల్ క్రీజులో నిలిచే అవకాశమివ్వలేదు. 72 పరుగులకే టాపార్డర్ వికెట్లన్నీ పడ్డాయి. వంద పరుగుల్లోపు మరో వికెట్ హెట్‌మైర్ (9) రూపంలో పడింది. కుల్దీప్‌కు ఈ వికెట్ దక్కింది. 17 ఓవర్లలో విండీస్ స్కోరు 91/4. ఈ దశలో భారత్‌కు గెలిచే అవకాశం కనిపించింది. కానీ కెప్టెన్ షై హోప్, కార్టీతో కలిసి ప్రత్యర్థి జట్టుకు ఆ చాన్సు ఇవ్వకుండా క్రీజ్‌లో పాతుకుపోయాడు. ఈ క్రమంలో హోప్ 70 బంతుల్లో అర్ధసెంచరీ సాధించగా... ఇద్దరు కలిసి అబేధ్యమైన ఐదో వికెట్‌కు 91 పరుగులు చేశారు. ఈ మ్యాచ్ విచిత్రమేంటంటే... భారత్ 90 పరుగుల వద్ద తొలి వికెట్‌ను కోల్పోయి 181 పరుగులకు ఆలౌటైంది. కానీ అదే విండీస్ 91 పరుగుల వద్ద నాలుగో వికెట్ కోల్పోయాక మళ్లీ వికెట్‌నే చేజార్చుకోలేదు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: 181; **వెస్టిండీస్ ఇన్నింగ్స్:** బ్రాండన్ కింగ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) శార్దుల్ 15; మేయర్స్ (సి) ఉమ్రాన్ (బి) శార్దుల్ 36; అతనెజ్ (సి) ఇషాన్ (బి) శార్దుల్ 6; షై హోప్ (నాటౌట్) 63; హెట్‌మైర్ (బి) కుల్దీప్ 9; కార్టీ (నాటౌట్) 48; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (36.4 ఓవర్లలో 4 వికెట్లకు) 182.** **వికెట్ల పతనం:** 1-53, 2-54, 3-72, 4-91. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 6.4-0-38-0, ముకేశ్ 3-0-17-0, ఉమ్రాన్ మాలిక్ 3-0-27-0, శార్దుల్ ఠాకూర్ 8-0-42-3, కుల్దీప్ యాదవ్ 8-0-30-1, జడేజా 6-0-24-0, అక్షర్ పటేల్ 2-1-4-0.

ఎదురులేని సౌత్‌జోన్

పుదుచ్చేరి: దేవధర్ ట్రోఫీ దేశవాళీ జోనల్ వన్డే క్రికెట్ టోర్నీలో సౌత్‌జోన్ జట్టు వరుసగా నాలుగో విజయం సాధించింది. ఈస్ట్‌జోన్ జట్టుతో ఆదివారం జరిగిన నాలుగో లీగ్ మ్యాచ్‌లో సౌత్‌జోన్ ఐదు వికెట్ల తేడాతో గెలిచి 16 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ముందుగా ఈస్ట్‌జోన్ 46 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌటైంది. విరాట్ సింగ్ (49; 4 ఫోర్లు, 1 సిక్స్), శుభ్రాన్షు సేనాపతి (44; 5 ఫోర్లు), ఆకాశ్‌దీప్ (44; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), ముక్తార్ హుస్సేన్ (33; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. సౌత్‌జోన్ బౌలర్లు సాయికిశోర్ (3/45), వాసుకి కౌశిక్ (3/37), విద్వత్ కావేరప్ప (2/40) ప్రత్యర్థి జట్టును కట్టడి చేశారు. అనంతరం సౌత్‌జోన్ 44.2 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 230 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (88 బంతుల్లో 84; 6 ఫోర్లు, 1 సిక్స్), సాయి సుదర్శన్ (67 బంతుల్లో 53; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించి సౌత్‌జోన్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇతర మ్యాచ్‌ల్లో సెంట్రల్ జోన్ ఎనిమిది వికెట్ల తేడాతో నార్త్‌ఈస్ట్ జోన్ జట్టుపై, వెస్ట్ జోన్ ఆరు వికెట్ల తేడాతో నార్త్‌జోన్‌పై విజయం సాధించాయి.



ఆసీస్ లక్ష్యం 384: ప్రస్తుతం 135/0

లండన్: ఈసారి యాషెస్ సిరీస్ మునుపెన్నడు లేని విధంగా పోటాపోటీగా జరుగుతోంది. ఇప్పుడు ఆఖరి మజిలీ కూడా రసవత్తరంగా మారింది. అయితే ఆటలో అరటిపండులా... రసపట్టుపై వాన చినుకులు అంతరాయం కలిగించాయి. ఆదివారం నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 389/9తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన మరో ఇంగ్లండ్ 6 పరుగులు చేసి ఆలౌటైంది. అండర్సన్ (8)ను అవుట్ చేసి మర్ఫీ (4/110) కూడా స్టార్క్ (4/100)తో సమంగా నిలిచాడు. అనంతరం 384 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా వర్షంతో ఆట నిలిచే సమయానికి 38 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 135 పరుగులు చేసింది. ఓపెనర్లు వార్నర్ (58 బ్యాటింగ్; 9 ఫోర్లు), ఉస్మాన్ ఖ్వాజా (69 బ్యాటింగ్; 8 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. మ్యాచ్ చివరిరోజు సోమవారం ఆసీస్ నెగ్గాలంటే మరో 249 పరుగులు చేయాలి. ఇంగ్లండ్ గెలవాలంటే పది వికెట్లు తీయాలి. లంచ్ బ్రేక్ దాకా 75/0 స్కోరు చేసిన ఆసీస్ రెండో సెషన్‌లోనూ అదే ఆటను కొనసాగించడంతో ఖ్వాజా, వార్నర్ అర్ధ సెంచరీలు పూర్తయ్యాయి. తర్వాత కాసేపటికే వర్షం ముంచెత్తింది. దీంతో ఈ సెషన్‌లో కేవలం 14 ఓవర్ల ఆటే సాధ్యపడింది. ప్రస్తుతం ఆసీస్ 2-1తో ఆధిక్యంలో ఉంది. గత యాషెస్ సాధించడంతో ఈ మ్యాచ్‌తో సంబంధం లేకుండానే సిరీస్‌ను నిలబెట్టుకుంది.



విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఐఏసీఎల్‌లో 450 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలో ఉన్న న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఎన్ఐఏసీఎల్).. దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐఏసీఎల్ శాఖల్లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(స్కేల్-1) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 450
» **పోస్టుల వివరాలు:** రిస్క్ ఇంజనీర్-36, ఆటో మొబైల్ ఇంజనీర్లు-96, లీగల్-70, అకౌంట్స్-30, హెల్త్-75, ఐటీ-23, జనరలిస్ట్స్-120.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేట్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.80,000 చెల్లిస్తారు.
» **వయసు:** 01.08.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రాథమిక రాతపరీక్ష, ప్రధాన రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.08.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.08.2023
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.newindia.co.in

కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో జూనియర్ ఇంజనీర్ పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థలు/శాఖల్లో గ్రూప్-బి(నాన్ గెజిటెడ్) జూనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** కేంద్ర జల సంఘం, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, విద్యుత్ రీసెర్చ్ స్టేషన్, మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, ఫరక్కా బ్యారేజ్ ప్రాజెక్టు, నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, డైరెక్టరేట్ ఆఫ్ క్వాలిటీ అస్యూరెన్స్, పోర్ట్స్, షిప్పింగ్-వాటర్‌వేస్ తదితర సంస్థల్లో సంబంధిత విభాగంలో పనిచేసే అవకాశం లభిస్తుంది.
» **అర్హత:** డిప్లొమా(సివిల్/మెకానికల్/ఎలక్ట్రికల్) తత్సమానం లేదా డిగ్రీ(సివిల్/మెకానికల్/ఎలక్ట్రికల్) చదివినవారు అర్హులు.
» **వయసు:** పోస్టులకు అనుగుణంగా 18 నుంచి 32 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. వివిధ కేటగిరీల వారికి గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** సెవెన్త్ పే స్కేలు ప్రకారం-.35,400 నుంచి రూ.1,12,400 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** పేపర్-1, పేపర్-2 రాతపరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** పరీక్ష రెండు అంచెల్లో ఉంటుంది. పేపర్-1, పేపర్-2 ఉంటాయి.
» పేపర్-1 ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుంది. ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పేపర్-2(డిస్క్రిప్టివ్) ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. పేపర్-1 పరీక్ష 200 ప్రశ్నలు -200 మార్కులకు ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు.
» పేపర్-2 మొత్తం 300 మార్కులకు జరుగుతుంది. ఈ పరీక్ష పెన్ అండ్ పేపర్ విధానంలో డిస్క్రిప్టివ్ పద్ధతిలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.08.2023.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ,విశాఖపట్నం, విజయనగరం
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** అక్టోబర్ 2023.
» **వెబ్‌సైట్:** https://ssc.nic.in

ఐపీపీబీ, న్యూఢిల్లీలో 132 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్(ఐపీపీబీ)..కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 132
» **అర్హత:** ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.30,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్/గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 26.07.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.08.2023
» **వెబ్‌సైట్:** www.ippbonline.com

డా.వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ, విజయవాడలో పీజీ, ఎండీఎస్ కోర్సుల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య, దంత వైద్య కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికిసంబంధించి అందుబాటులో ఉన్న పీజీ(ఎండీ/ఎంఎస్), ఎండీఎస్ కన్వీనర్ కోటా సీట్ల ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది.

» **అర్హత:** ఎంబీబీఎస్/బీడీఎస్ డిగ్రీతో పాటు నీట్ పీజీ-2023/నీట్ ఎండీఎస్-2023 ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.07.2023
» **వెబ్‌సైట్:** drysr.uhsap.in

ఎస్ఐ కొలువుల పిలుపు

» ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్ దళాల్లో 1,876 ఎస్ఐ ఉద్యోగాలు
» నియామక ప్రకటన విడుదల చేసిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్
» ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో దరఖాస్తుకు అర్హత
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ

పోలీస్ ఉద్యోగ అభ్యర్థులకు శుభవార్త! జాతీయ స్థాయిలో.. కీలకమైన విభాగాల్లో.. సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ) కొలువు సొంతం చేసుకునే అవకాశం వచ్చింది! స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. ఢిల్లీ పోలీస్ విభాగంతోపాటు సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్)లో.. మొత్తం 1,876 ఎస్ఐ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏదైనా డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. గ్రూప్-బి(నాన్-గెజిటెడ్), గ్రూప్-సి హోదాల్లో కొలువు సొంతమవుతుంది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..



మొత్తం 1,876 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజా నోటిఫికేషన్ ద్వారా ఢిల్లీ పోలీస్ విభాగంతోపాటు, కేంద్ర హోంశాఖ పరిధిలోని సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్‌లో మొత్తం 1,876 ఉద్యోగాలను భర్తీ చేయనుంది. ఇందుకోసం రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్‌లు నిర్వహించనుంది.

అర్హతలు

- ఆగస్ట్ 15, 2023 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి. ▪ **వయసు:** ఆగస్ట్ 1, 2023 నాటికి 20-25 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.
- ప్రారంభ వేతన శ్రేణి రూ.35,400-రూ.1,12,400గా ఉంటుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్ ఎస్ఐ పోస్టులకు మూడు దశల్లో ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష(పేపర్-1), ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్/ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్, రాత పరీక్ష (పేపర్-2).

రాత పరీక్ష పేపర్-1

- పేపర్-1 పరీక్ష మొత్తం 200 మార్కులకు నాలుగు విభాగాల్లో(జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్) జరుగుతుంది. ఒక్కో విభాగం నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 200 మార్కులు ఉంటాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కును తగ్గిస్తారు.

రెండో దశ.. ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్

- తొలిదశ రాత పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారికి రెండో దశలో ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో అర్హత సాధించేందుకు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.
- పురుష అభ్యర్థుల కనీస ఎత్తు 170 సెంటీ మీటర్లు ఉండాలి. అదే విధంగా ఛాతీ విస్తీర్ణం 80 సెంటీ మీటర్లు ఉండాలి(శ్వాస పీల్చినప్పుడు 85 సెంటీ మీటర్లకు విస్తరించాలి). మహిళా అభ్యర్థుల కనీస ఎత్తు 157 సెంటీ మీటర్లు ఉండాలి.

ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్

- ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌లో నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగిన అభ్యర్థులకు తర్వాత దశలో ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్(పీఈటీ) పేరుతో పలు ఈవెంట్స్‌లో పోటీ నిర్వహిస్తారు.
- **పరుగు పందెం:** పురుష అభ్యర్థులు 100 మీటర్ల పరుగును 16 సెకన్లలో, మహిళా అభ్యర్థులు 18 సెకన్లలో పూర్తి చేయాలి. దీంతోపాటు పురుష అభ్యర్థులు 1.6 కిలో మీటర్ల దూరాన్ని 6.5 నిమిషాల్లో, మహిళా అభ్యర్థులు 800 మీటర్ల పరుగును నాలుగు నిమిషాల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.
- **లాంగ్ జంప్:** పురుష అభ్యర్థులు 3.65 మీటర్ల దూరం,మహిళా అభ్యర్థులకు 2.7 మీటర్ల దూరం
- **హై జంప్:** పురుష అభ్యర్థులకు 1.2 మీటర్ల ఎత్తు, మహిళలు 0.9 మీటర్ల ఎత్తు.
- **షాట్‌పుట్:** పురుషులకు మాత్రమే ఈ ఈవెంట్ నిర్వహిస్తారు. అభ్యర్థులు 16 ఎల్‌బీ (7.26 కిలో గ్రామ్‌ల)ను 4.5 మీటర్ల దూరం విసరాల్సి ఉంటుంది.
- లాంగ్ జంప్, హై జంప్, షాట్‌పుట్ ఈవెంట్లలో నిర్దేశిత లక్ష్యాలను కనీసం మూడు ప్రయత్నాల్లో పూర్తి చేయాలి.

పేపర్-2 రాత పరీక్ష

ఫిజికల్ ఈవెంట్స్‌లో అర్హత సాధించిన వారికి పేపర్-2 పేరుతో రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌పై మొత్తం 200 ప్రశ్నలతో 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష కూడా పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పరీక్షకు లభించే సమయం రెండు గంటలు.

కొలువు ఖరారు

పేపర్-2 పరీక్షలోనూ మెరుగైన ప్రతిభ కనబరిచి తుది జాబితాలో నిలిస్తే.. ఎస్ఐ కొలువు ఖాయమైనట్లే! ఢిల్లీ పోలీస్ విభాగానికి ఎంపికైన వారికి గ్రూప్-సి హోదా, సీఏపీఎఫ్ దళాలకు ఎంపికైన వారికి గ్రూప్-బి(నాన్-గెజిటెడ్) హోదా కల్పిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న విభాగం ప్రాథమ్యతలు, వారు పొందిన మార్కులు ఆధారంగా ఆయా విభాగాలకు కేటాయిస్తారు.

శిక్షణలో ఉత్తీర్ణత తప్పనిసరి

నియామకాలు ఖరారు చేసుకుని శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు ఏడు ఫిజికల్ ఈవెంట్స్‌కు సంబంధించిన టెస్ట్‌లలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. వెర్టికల్ బోర్డ్‌పై జంపింగ్, రోప్ జంపింగ్, టార్జాన్ స్వింగ్, హారిజంటల్ బోర్డ్‌పై జంపింగ్, పార్లెల్ రోప్, మంకీ క్రాల్, వెర్టికల్ రోప్ ఈ వెంట్స్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అప్పుడే వారిని ఆయా దళాల్లో కొలువులకు పంపుతారు

సన్నద్ధత పక్కాగా

ఎంపిక ప్రక్రియలో కీలకమైన రాత పరీక్షలకు అభ్యర్థులు పక్కా ప్రణాళికతో సన్నద్ధత సాగించాల్సి ఉంటుంది. ముఖ్యంగా పేపర్-1, పేపర్-2లలో కనీస అర్హత మార్కుల నిబంధన ఉంది. అన్ రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు, ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులు 25% మార్కులు, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 20% మార్కులు పొందాల్సి ఉంటుంది. అప్పుడే సదరు అభ్యర్థులను తదుపరి దశకు పరిగణనలోకి తీసుకుంటారు.

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

ఈ విభాగంలో రాణించేందుకు వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. ముఖ్యంగా స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్

అభ్యర్థుల్లోని సామాజిక అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగే విభాగం ఇది. భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో రాణించాలంటే.. ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్, కాంప్రహెన్షన్

ఈ విభాగంలో రాణించడానికి.. బేసిక్ గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్,సినానిమ్స్,మిస్-స్పెల్ట్ వర్డ్స్,ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూటషన్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి. బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టుతోపాటు, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు అవసరం. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర వ్యాసాలు చదివి.. అందులోని ముఖ్యాంశాలతో సొంత శైలిలో పరీక్షలో నిర్దేశించిన మాదిరిగా క్రోడీకరించడానికి సాధన చేయాలి.

ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్

ఫిజికల్ ఈవెంట్స్‌లో రాణించడానికి.. అభ్యర్థులు రాత పరీక్ష ప్రిపరేషన్ దశ నుంచే ఆ దిశగా కృషి చేయాలి. ప్రతిరోజు కనీసం రెండు గంటలు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో పేర్కొన్న అంశాలపై శిక్షణ పొందాలి. ఈ ఫిజికల్ ప్రాక్టీస్ ఉదయం వేళల్లో చేస్తే శారీరక అలసటకు దూరంగా ఉండొచ్చు. ఇలా దరఖాస్తు సమయం నుంచే సన్నద్ధత పొందితే విజయావకాశాలు మెరుగవుతాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 15.08.2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** ఆగస్ట్ 16, 17 తేదీల్లో
- **పేపర్-1 రాత పరీక్ష:** అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, చీరాల, విజయనగరం, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
107	14
66,160	19,646

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి


విదేశీ సూచీలు

నాస్‌డాక్	14,316	△	267
డోజోన్స్	35,459	△	177
ఎఫ్‌టీఎస్ఈ 100	7,694	△	2
డాక్స్	16,470	△	64
షాంఘై	3,276	△	59
నికాయ్	32,759	▽	132

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారిన్ టూర్.. ఫారెక్స్ కార్డ్ బెటర్!

భారత్ నుంచి విదేశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగార్థులు, పర్యాటకుల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది. గతంతో పోలిస్తే **విదేశీ ప్ర**యాణం ఎంతో సౌకర్యంగా మారింది. విమానాశ్రయాలు, విమాన సర్వీసుల నెట్‌వర్క్ విస్తృతం అయింది. ఎక్కడి **నుంచి ఎక్కడి**కైనా వేగంగా, సులభంగా ప్రయాణించే వెసులుబాటు దక్కింది. మరి విదేశాలకు వెళ్లే వారు తమ వెంట ఆయా **దేశానికి చెందిన** కరెన్సీని కూడా తీసుకెళుతుంటారు. ఈ అవసరాన్ని తప్పించేదే ఫారెక్స్ కార్డ్. ఏ దేశానికి వెళితే ఆ దేశ కరెన్సీ రూపంలో ఈ కార్డ్ ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చు. ఫారెక్స్ కార్డ్ ఉంటే కరెన్సీ నోట్లు పాకెట్‌లో లేకపోయినా ఇబ్బంది పడే పరిస్థితి రాదు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ఇది చెల్లుతుంది. డెబిట్, క్రెడిట్ కార్డ్ కంటే ఫారెక్స్ కార్డ్ వల్ల ఎన్నో అనుకూలతలు ఉన్నాయి. ఈ ఫారెక్స్ కార్డుతో ప్రయోజనాలు? ఎలా పనిచేస్తుంది? ఇందులో ఎన్ని రకాలు? చార్జీలు తదితర విషయాలను తెలియజేసే కథనమే ఇది!



ఈ కార్డ్‌తో సౌకర్యంగా చెల్లింపులు • ఏటీఎం నుంచి నగదు ఉపసంహరణ కూడా..
ఒకేసారి ఎన్నో దేశాల కరెన్సీ లోడింగ్ • క్రెడిట్ కార్డ్ కంటే చార్జీలు తక్కువ
అన్ని దేశాల్లోనూ ఆమోదనీయం • కరెన్సీ తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు

ఫారెక్స్ కార్డ్ అంటే..?

ఇదొక ప్రీపెయిడ్ కార్డ్. మీరు వెళ్లాలనుకునే దేశ కరెన్సీ మారకంలో డిపాజిట్ చేసుకుని, వినియోగించుకునే సాధనం. ఈ కార్డ్‌తో విదేశాల్లో చెల్లింపులు చేయడమే కాకుండా, ఏటీఎం నుంచి ఆ దేశ కరెన్సీని ఉపసంహరించుకోవచ్చు. ఈ కార్డ్ ఉంటే వెంట భౌతిక రూపంలో కరెన్సీని తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు.

ఫారెక్స్ కార్డుల్లో రకాలు...

విదేశాలకు వెళ్లే వారికి క్రెడిట్, డెబిట్ కార్డ్‌లతో పోలిస్తే ఫారెక్స్ కార్డ్ ఎంతో ఉపయోగకరం అని చెప్పుకోవాలి. పర్యాటకుల అవసరాలకు అనుగుణంగా ఈ కార్డుల్లో పలు రకాలు ఉన్నాయి. సింగిల్ కరెన్సీ ఫారెక్స్ కార్డ్ ఇందులో ఒకటి. ఏదైనా ఒక దేశ కరెన్సీనే ఇందులో లోడ్ చేసుకోవచ్చు. మల్టీ కరెన్సీ ఫారెక్స్ కార్డ్ రెండో రకం. ఇందులో ఒకటికి మించిన దేశాల కరెన్సీలను లోడ్ చేసుకోవచ్చు. వివిధ దేశాలకు వెళ్లే వారికి మల్టీ కరెన్సీ ఫారెక్స్ కార్డ్ ఉపయోగకరం. దాదాపు ప్రముఖ బ్యాంకులన్నీ కూడా ఫారెక్స్ కార్డ్‌లను ఆఫర్ చేస్తున్నాయి.

ప్రయోజనాలు/సదుపాయాలు

విదేశాల్లో చెల్లింపులు సురక్షితంగా చేసేందుకు ఫారెక్స్ కార్డ్ అనుకూలం. క్రెడిట్ కార్డ్‌కు మాదిరే అన్ని రకాల సదుపాయాలు కూడా వీటిల్లో ఉంటాయి. ఇది ప్రీపెయిడ్ కార్డ్ కావడంతో, ముందుగానే బ్యాంక్ ఖాతా నుంచి లోడ్ చేసుకోవాలి. ఫలితంగా విదేశాల్లో వినియోగంపై స్వీయ నియంత్రణ ఉంటుంది. కావాల్సినంతే లోడ్ చేసుకోవచ్చు. అంతే మేర ఖర్చు చేసుకోవచ్చు. ఫారెక్స్ కార్డ్‌ను దాదాపు అన్ని చోట్లా ఆమోదిస్తారు కనుక సౌకర్యవంతగా ఉంటుంది. దీంతో ఏటీఎంలు లేదంటే ఇతర ప్రత్యామ్నాయ చెల్లింపుల సాధనాల కోసం చూసుకోవాల్సిన అవసరం రాదు. ముఖ్యంగా కరెన్సీని తీసుకెళ్లే అవసరాన్ని తప్పిస్తుంది. దీంతో నగదుతో పోలిస్తే సౌకర్యం, సురక్షితంగా ఉంటుంది. అంతేకాదు కరెన్సీ విలువల్లో అస్థిరతల ప్రభావం కూడా ఉండదు. లోడ్ చేసిన రోజు విలువే స్థిరంగా కొనసాగుతుంది. దాంతో రోజువారీ కరెన్సీ మారకం హెచ్చుతగ్గుల సమస్య ఉండదు. క్రెడిట్, డెబిట్ కార్డు చార్జీలతో పోలిస్తే ఫారెక్స్ కార్డ్ చౌక ఆప్షన్. క్రెడిట్ లేదా డెబిట్ కార్డ్‌ను ఉపయోగించిన ప్రతి సందర్భంలోనూ కరెన్సీ మారకం చార్జీ పడుతుంది. ఎందుకంటే ఏ దేశంలో ఉంటే ఆ దేశ కరెన్సీలోకి రూపాయిలను మార్చుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఈ మారకం చార్జీని కరెన్సీ మార్కప్ చార్జీగా పేర్కొంటారు. కార్డ్, బ్యాంక్ ఆధారంగా ఈ చార్జీ 2-5 శాతం మధ్య ఉంటుంది. ఫారెక్స్ కార్డుల్లో ఎన్నో సదుపాయాలు ఉండడంతో, సంప్రదాయ చెల్లింపు సాధనాలతో పోలిస్తే ఇవి ఆకర్షణీయమైనవని చెప్పుకోవచ్చు. మల్టీ కరెన్సీ ఫారెక్స్ కార్డ్ ఉంటే, ఒకేసారి ఒక దేశం తర్వాత మరో దేశానికి వెళ్లేట్టు అయితే ఉపయోగకరంగా ఉంటుంది. కావాల్సిన ప్రతిసారీ బ్యాంకుల్లో కరెన్సీని మార్చుకోవడం కంటే ఫారెక్స్ కార్డు తీసుకెళ్లడమే సౌకర్యం. బ్యాంకులకు సైతం ఫారెక్స్ కార్డులతో తక్కువ వ్యయం అవుతుంది. దీంతో అవి ఫారెక్స్ కార్డుదారులకు ఆ ప్రయోజనాలను అందిస్తుంటాయి. భౌతిక కరెన్సీతో పోలిస్తే ఫారెక్స్ కార్డులో లోడ్ చేసుకోవడం వల్ల మరింత మెరుగైన మారకం రేటు సాధ్యపడుతుంది. ఈ కార్డ్ పొందేందుకు ఆయా బ్యాంక్ ఖాతాదారు కావాల్సిన అవసరం లేదు. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాల్సిన అవసరం కూడా లేదు. ఇది ప్రీపెయిడ్ కార్డ్ కనుక, బ్యాంక్‌లు సులభంగా మంజూరు చేస్తుంటాయి. మార్కెట్లో వివిధ బ్యాంకులు ఎన్నో ఫీచర్లతో వీటిని ఆఫర్ చేస్తున్నాయి. వీటి గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాత, తమకు అనుకూలమైనది తీసుకోవచ్చు. ఒకవేళ ఫారెక్స్ కార్డ్‌ను ఎక్కడైనా కోల్పోతే, వెంటనే బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీకి కాల్ చేసి చెబితే మిగిలిన బ్యాలన్స్ దుర్వినియోగం కాకుండా ఫ్రీజ్ చేసేస్తారు. విదేశాల్లోని పీవోఎస్ మెషీన్ల వద్ద ఫారెక్స్ కార్డులను స్వైప్ చేస్తే ఎలాంటి చార్జీలు పడవు. కానీ అదే డెబిట్, క్రెడిట్ కార్డులను స్వైప్ చేసిన ప్రతిసారీ ఎంతో కొంత చార్జీ పడుతుంది. పైగా ఇతర సాధనాలతో పోలిస్తే ఫారెక్స్ కార్డులకు అంతర్జాతీయంగా ఎక్కువ ఆమోదం ఉంటుంది. అంతేకాదు విదేశాల్లో ఆన్‌లైన్ కొనుగోళ్లకు సైతం ఫారెక్స్ కార్డులతో చెల్లింపులు చేసుకోవచ్చు. క్రెడిట్ కార్డ్‌పై విదేశాల్లో ఖర్చు చేస్తే సకాలంలో చెల్లింపులు చేయకపోతే, భారీ వడ్డీ, లేట్ పేమెంట్ ఫీజులు పడతాయి. ఫారెక్స్ కార్డ్ ప్రీపెయిడ్ కార్డ్ కావడంతో ఈ సమస్య ఉండదు.

- ఒకేసారి ఒకటికి మించిన దేశాలను పర్యటించే వారు, ఆయా దేశాల కరెన్సీని వెంట తీసుకెళ్లే ఇబ్బంది లేకుండా, మల్టీ కరెన్సీ ఫారెక్స్ కార్డ్ ఎంపిక చేసుకోవడం నయం.
- కార్డ్‌లో బ్యాలన్స్ మిగిలి ఉంటే, స్వదేశానికి వచ్చిన తర్వాత ఆ మొత్తాన్ని తిరిగి నగదుగా మార్చుకోవచ్చు.
- విదేశీ పర్యటన ముగించి స్వదేశానికి వచ్చిన తర్వాత.. తిరిగి విదేశానికి వెళ్లేంత వరకు కార్డ్‌ను డీయాక్టివేట్ చేసుకోవచ్చు. మళ్లీ విదేశీ యాత్రకు ముందు యాక్టివేట్ చేసుకోవచ్చు. దీంతో వినియోగం లేకపోయినా చార్జీలు, పెనాల్టీలు పడవు. మెయింటెనెన్స్ చార్జీలు కూడా ఉండవు.
- ఫారెక్స్ కార్డ్‌లపై డీల్స్, డిస్కౌంట్లు వస్తుంటాయి.
- ఫారెక్స్ కార్డుల్లో చాలా వరకు లాక్డ్ ఇన్ ఎక్స్ఛేంజ్ రేట్ అనే ఫీచర్‌తో వస్తాయి. అంటే కరెన్సీ రేటులో అస్థిరతలను ఈ సదుపాయంతో అధిగమించొచ్చు. ఉదాహరణకు కార్డులో డాలర్లు లోడ్ చేసుకుంటే, ఆ రోజు ఉన్న విలువ ప్రకారమే లాక్ అవుతుంది. దాని విలువ బ్యాలన్స్ ముగిసే వరకు స్థిరంగా కొనసాగుతుంది.
- ఫారెక్స్ కార్డ్ లేకుండా వెళితే, విదేశాల్లో అవసరమైన చోట కరెన్సీని మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఇందుకోసం శ్రమపడాల్సి రావచ్చు. ఫారెక్స్ కార్డ్ అయితే ఉన్న చోట నుంచే కోరుకున్న మారకం రేటులో లోడ్ చేసుకోవచ్చు.
- అంతర్జాతీయ ఈ కామర్స్ పోర్టళ్లపై ఫారెక్స్ కార్డ్‌తో చెల్లింపులు చేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ వర్తకులు ఈ కార్డ్‌ను ఆమోదిస్తారు. విమాన టికెట్ బుకింగ్‌లు, హోటల్ బుకింగ్, డైనింగ్, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ షాపింగ్‌కు వాడుకోవచ్చు.
- ఫారెక్స్ కార్డ్‌తో ఏ దేశంలో ఏటీఎం నుంచి అయినా ఆ దేశ కరెన్సీని విత్‌డ్రా చేసుకోవచ్చు. ఏటీఎం లొకేషన్ ఆధారంగా ఏ దేశంలో ఉన్నారనేది కార్డ్ నెట్‌వర్క్ గుర్తిస్తుంది. సంబంధిత దేశ కరెన్సీని అందిస్తుంది.
- ఫారెక్స్ కార్డ్‌లలో ఎంబెడెడ్ చిప్ టెక్నాలజీ ఉంటుంది. సున్నితమైన సమాచారం ఎన్‌క్రిప్టెడ్‌గా ఉండటంతో మోసాల రిస్క్ చాలా తక్కువ.
- ఇవి కనీసం ఐదేళ్ల ఎక్స్‌పైరీ తేదీతో వస్తాయి.
- ఒక దేశానికి వెళుతూ కొంత బ్యాలన్స్‌ను లోడ్ చేసుకున్న తర్వాత, చివరికి మిగులు ఉందనుకోండి.. ఆ తర్వాత ఆ బ్యాలన్స్‌ను ఏ దేశంలో అయినా వినియోగించుకోవచ్చు.
- మల్టీ కరెన్సీ ఫారెక్స్ కార్డ్‌ల్లో 16-22 దేశాల కరెన్సీలను లోడ్ చేసుకోవచ్చు.

ఫీజులు/చార్జీలు..



కార్డ్ జారీ చేసే సంస్థ ఆధారంగా ఫీజులు, చార్జీలు వేర్వేరుగా ఉంటాయి. సింగిల్ కరెన్సీ కార్డ్‌తో పోలిస్తే మల్టీ కరెన్సీ కార్డ్ చార్జీలు కొంచెం ఎక్కువగా ఉంటాయి. కార్డు కోసం దరఖాస్తు చేసినప్పుడు ఇష్యూయన్స్ చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. ఇది రూ.100-500 మధ్య ఉంటుంది. రీలోడ్, రెన్యువల్ చార్జీలు కూడా చెల్లించుకోవాలి. కార్డులో కరెన్సీని లోడ్ చేసిన ప్రతిసారీ రీలోడ్ చార్జీ పడుతుంది. అదనపు కార్డ్ కావాలంటే యాడాన్ కార్డ్ తీసుకోవచ్చు. దీనికి విడిగా ఫీజు పడుతుంది. కార్డులో బ్యాలన్స్‌ను నగదు రూపంలో తీసుకున్న సందర్భంలోనూ చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. విదేశాల్లో కార్డ్ నుంచి నగదు తీసుకున్న ప్రతి సారీ చార్జీ విధిస్తారు. కార్డ్ బ్యాలన్స్ చెక్ చేసుకున్నా కూడా చార్జీ పడుతుంది. మీరు చెల్లింపులు చేసిన కరెన్సీ, కార్డ్‌లో లోడ్ అయి ఉన్న కరెన్సీ వేర్వేరు అయితే అప్పుడు క్రాస్ కరెన్సీ చార్జీ చెల్లించాల్సి వస్తుంది. ఇది 3.5 శాతం వరకు ఉంటుంది. అదే మల్టిపుల్ కరెన్సీ కార్డులో ఈ సమస్య ఉండదు. కార్డ్‌ను కోల్పోయి, తిరిగి తీసుకుంటే అప్పుడు కూడా చార్జీ పడుతుంది.

వీటిని గుర్తు పెట్టుకోవాలి..



- ప్రతి లావాదేవీ అనంతరం కార్డ్ బ్యాలన్స్ చెక్ చేసుకోవాలి.
- ఫారెక్స్ కార్డ్ ఎక్కడైనా పోగొట్టుకుంటే లేదా చోరీకి గురైనా వెంటనే బ్యాకప్ కార్డ్ తీసుకోవాలి.
- ప్రతీ పర్యటనకు ముందు ఏటీఎంకు వెళ్లి పిన్ మార్చుకోవాలి.
- ఫారెక్స్ కార్డ్‌ను విదేశాల్లో ఇల్లు, కారు, రూమ్ రెంటల్స్‌కు వినియోగించుకోవద్దు.
- కార్డ్‌లో లోడ్ చేసిన కరెన్సీ కాకుండా, మరో కరెన్సీలో చెల్లింపులు చేయకుండా ఉండడమే మంచిది. దీనివల్ల అనవసర వ్యయాలను నివారించుకోవచ్చు.
- టోల్ చార్జీలు చెల్లించేందుకు సైతం ఫారెక్స్ కార్డ్‌ను వాడుకోవద్దు.
- కొన్ని బ్యాంక్‌లు తక్కువ మార్కప్, లోడింగ్ చార్జీతో క్రెడిట్ కార్డులను ఆఫర్ చేస్తున్నాయి. వీటిపై రివార్డులను పరిగణనలోకి తీసుకున్నప్పుడు ఇవి కూడా ఆకర్షణీయంగానే కనిపిస్తాయి. కానీ, అన్నీ తెలుసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.

దరఖాస్తుకు ముందు..



ఫారెక్స్ కార్డ్ తీసుకునే ముందు వివిధ బ్యాంకులు ఆఫర్ చేస్తున్న పలు రకాల కార్డ్‌లు, వాటిల్లోని ఫీచర్లను పూర్తిగా తెలుసుకోవాలి. చార్జీల గురించి అడిగి తెలుసుకోవాలి. బ్యాంక్‌లు, పెద్ద ఆర్థిక సంస్థలు, ప్రముఖ ట్రావెల్ ఏజెన్సీల నుంచి ఈ కార్డ్ తీసుకోవచ్చు. బ్యాంకు శాఖకు వెళ్లి లేదంటే ఆన్‌లైన్ నుంచి అయినా కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దాదాపు అన్ని సంస్థలు ఒకటికి మించిన కార్డ్‌లను వివిధ రకాల ఫీచర్లతో ఆఫర్ చేస్తున్నాయి. కార్డ్ తీసుకునేందుకు కొన్ని రకాల డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుతోపాటు పాస్‌పోర్ట్ కాపీ (స్వయంగా అటెస్ట్ చేసింది), వీసా కాపీ, ఎయిర్‌లైన్ టికెట్ కాపీ, పాన్ కార్డ్ కాపీ ఇవ్వాల్సి వస్తుంది. డెబిట్ కార్డ్ మాదిరే ఫారెక్స్ కార్డుకు అనుబంధంగా పిన్ వస్తుంది. దీన్ని మొదటిసారి మార్చుకోవాలి. కార్డు జారీ చేసిన బ్యాంక్ ఏటీఎంకు వెళ్లి బ్యాలన్స్ చెక్ చేసుకోవచ్చు. ఇంటర్నెట్ బ్యాంకింగ్ నుంచి కూడా ఈ సదుపాయం ఉంది. ప్రతి లావాదేవీ అనంతరం వచ్చే ఎస్ఎంఎస్‌ను చూసి తెలుసుకోవచ్చు.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ఫలితాలు ఆకర్షణీయం

నికర లాభంలో 61 శాతం వృద్ధి

ముంబై: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ జూన్ త్రైమాసికానికి మెరుగైన ఫలితాలను ప్రకటించింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 61 శాతం వృద్ధితో రూ.765 కోట్లకు దూసుకుపోయింది. క్రితం ఏడాది ఇదే కాలానికి నికర లాభం రూ.474 కోట్లుగానే ఉంది. నికర వడ్డీ ఆదాయం 36 శాతం వృద్ధితో రూ.3,745 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో వడ్డీ ఆదాయం రూ.2,571 కోట్లుగా ఉంది. నిర్వహణ లాభం 45 శాతం వృద్ధితో రూ.1,427 కోట్లకు పెరిగినట్టు బ్యాంక్ తెలిపింది. రుణ ఆస్తుల నాణ్యత కూడా మెరుగుపడింది. స్థూల ఎన్‌పీఏలు 2.17 శాతానికి తగ్గాయి. ఇవి క్రితం ఏడాది ఇదే త్రైమాసికం చివరికి 3.36%గా ఉంటే, ఈ ఏడాది మార్చి చివరికి 2.51 శాతంగా ఉండడం గమనార్హం. నికర ఎన్‌పీఏలు 0.70 శాతానికి పరిమితమయ్యాయి. ''46.5% కాసా రేషియోతో బలమైన ఫ్రాంచైజీని నిర్మిస్తున్నాం. బలమైన బ్రాండ్, విలువలు, కస్టమర్ అనుకూలమైన ఉత్పత్తులు, డిజిటల్ ఆవిష్కరణలతో మా రిటైల్ డిపాజిట్లు చక్కగా వృద్ధి చెందుతున్నాయి''అని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఎండీ, సీఈవో వి.వైద్యనాథన్ తెలిపారు. ఫండెడ్ అసెట్స్ (రాబడినిచ్చే ఆస్తులు) 25% వృద్ధితో రూ.1,71,578 కోట్లకు పెరిగాయి. మొత్తం రుణ ఆస్తుల్లో ఇన్‌ఫ్రా రుణాలు 2.2 శాతానికి తగ్గాయి.

ఎన్‌టీపీసీ లాభం రూ.4,907 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ విద్యుదుత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.4,907 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.3,978 కోట్లతో పోలిస్తే 23 శాతం వృద్ధి చెందింది. ఆదాయం మాత్రం రూ.43,561 కోట్ల నుంచి రూ.43,390 కోట్లకు తగ్గింది. జూన్ క్వార్టర్‌లో 103.98 బిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఉత్పత్తి 104.42 బిలియన్ యూనిట్లుగా ఉంది. కోల్ ప్లాంట్లలో లోడ్ ఫ్యాక్టర్ 77.43 శాతంగా ఉంది.

సాక్షి స్టాక్స్

హావెల్స్ ఇండియా — కీనోట్ క్యాపిటల్ — కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 1,324 టార్గెట్: రూ. 1,553

ఎందుకంటే: దేశీ కన్జూమర్ ఎలక్ట్రికల్స్, అప్లయెన్సెస్ విభాగంలో కార్యకలాపాలు విస్తరించిన హావెల్స్ ఇండియా విభిన్న ప్రొడక్టులను రూపొందించి విక్రయిస్తోంది. స్విచ్‌గేర్లు, లైటింగ్, తత్సంబంధ ఉత్పత్తులు, కేబుళ్లు, వైర్లు, ఫ్యాన్లు, హోమ్ అప్లయెన్సెస్, వాషింగ్ మెషీన్లు, వాటర్ హీటర్లు, ఎయిర్ కండిషనర్లు తదితరాలను రూపొందిస్తోంది. ప్రొడక్టులలో 90 శాతంవరకూ దేశవ్యాప్తంగా కంపెనీకి గల 15 సొంత యూనిట్లలోనే తయారు చేస్తోంది. కంపెనీ సుప్రసిద్ధ హావెల్స్‌సహా.. ఇతర ప్రధాన బ్రాండ్లు క్రాబ్‌ట్రీ, స్టాండర్డ్, ఆర్ఈవో, లాయిడ్‌లను కలిగి ఉంది. పంపిణీలో దేశవ్యాప్తంగా 17,000కుపైగా ప్రత్యక్ష డీలర్లతోపాటు.. 2,20,000కుపైగా రిటైలర్లతో భారీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుంది. స్విచ్‌గేర్ ప్రొడక్టుల ద్వారా ఎగుమతి మార్కెట్లలో పట్టు సాధించిన కంపెనీ ఆపై నెమ్మదిగా కేబుళ్లు, వైర్లు, లైటింగ్, ఏసీలకూ విస్తరిస్తోంది. కొద్ది రోజులుగా విదేశీ మార్కెట్లలో కంపెనీ బ్రాండ్లకు గుర్తింపు పెంచుకోవడంపై దృష్టి సారించింది. తద్వారా మార్కెట్లలో మరింత విస్తరించే ప్రణాళికలు అమలు చేస్తోంది. కంపెనీ వృద్ధి బాటలో సాగడమేకాకుండా లాభదాయకతను మరింత మెరుగుపరచుకునేందుకు వీలుగా సొంత, ఇతరత్రా పలు విభాగాలను కలిగి ఉంది. క్యాష్‌ఫ్లో రన్‌రేట్ అంచనాల ప్రకారం ప్రతీ మూడు, నాలుగేళ్లలో ఒకసారి బ్యాలన్స్‌షీట్‌పై ఎలాంటి ఒత్తిడిని కలిగించకుండానే ఇతర కంపెనీలను కొనుగోలు చేసే అవకాశముంది. కంపెనీ ఇప్పటికే సొంతం చేసుకున్న లాయిడ్ నిలకడను అందుకోవడం, సొంత పురోభివృద్ధిని సాధించడం ద్వారా ఇలాంటి మరిన్ని అవకాశాలకు దారి ఏర్పడనుంది.

యాంబర్ ఎంటర్‌ప్రైజెస్ — యస్ సెక్యూరిటీస్ — కొనొచ్చు




ప్రస్తుత ధర: రూ. 2,434 టార్గెట్: రూ. 2,929

ఎందుకంటే: హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండిషనింగ్(హెచ్‌వీఏసీ) పరిశ్రమలో కార్యకలాపాలు విస్తరించిన యాంబర్ ఎంటర్‌ప్రైజెస్ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో ఉంది. ప్రధానంగా ఎయిర్ కండిషనింగ్ విభాగంలో పూర్తిస్థాయి సొల్యూషన్లు అందించే దిశలో కార్యకలాపాలను మెరుగుపరచుకుంటోంది. తద్వారా సొంత తయారీకి ప్రాధాన్యమిచ్చే ప్రధాన బ్రాండ్ల నుంచి వాలెట్ వాటాను పెంచుకోవడంపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా ఏసీ పరిశ్రమను మించి వృద్ధి బాటలో సాగగలమని కంపెనీ యాజమాన్యం విశ్వసిస్తోంది. ఇటీవల యాజమాన్యం వెల్లడించిన వివరాల ప్రకారం ఆర్ఏసీ విభాగంలో క్లిష్టమైన ఎలక్ట్రానిక్, మెకానికల్ పరికరాలలో ఆధారపడతగిన పరీక్షల(రెలియబిలిటీ టెస్టింగ్)ను పూర్తి చేసుకుంది. ఆర్డర్లను సాధిస్తోంది. అంతేకాకుండా సామర్థ్యాలను అందుకోవడంతోపాటు.. రైల్వేలకు అనుమతులు పొందుతోంది. ఏసీ కోచ్‌లను ప్రవేశపెట్టడంలో ఇటీవల రైల్వేలు అత్యంత ఆసక్తిని చూపుతున్న సంగతి తెలిసిందే. మూడేళ్ల కాలపు టెస్టింగ్‌ను పూర్తిచేసుకోవడం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో చిన్నస్థాయి ఎగుమతుల ఆర్డర్లను పొందనున్నట్లు అంచనా వేస్తోంది. టెలికం ప్రొడక్టులుసహా వేరబుల్స్, హియరబుల్స్ తదితర కొత్త ప్రొడక్టులను ప్రవేశపెడుతోంది. పెట్టుబడుల దశ పూర్తికావడంతో వినిమయం పెరిగి రిటర్న్ రేషియోలు మెరుగుపడనున్నాయి. ఆర్ఏసీ మార్కెట్లో ఔట్‌సోర్స్‌డ్ దిగ్గజంగా కంపెనీ సమీప భవిష్యత్‌లో పరిశ్రమను మించిన పనితీరు చూపే వీలుంది. ఇప్పటివరకూ అధిక పెట్టుబడుల కారణంగా కనిష్టస్థాయిల్లో నమోదైన ఆస్తులు ఇకపై మెరుగైన రిటర్నులు సాధించే అవకాశముంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే


6 కోట్ల ఐటీఆర్‌ల దాఖలు



న్యూఢిల్లీ: 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటివరకూ 6 కోట్ల పైచిలుకు ఆదాయ పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలయ్యాయి. ఒక్క ఆదివారం రోజే సాయంత్రం 6.30 గం. వరకు 27 లక్షల ఐటీఆర్‌లు దాఖలయ్యాయి. గతేడాది జూలై 31 నాటికి వచ్చిన ఐటీఆర్‌లతో పోలిస్తే ఈసారి ఇప్పటికే రిటర్నుల ఫైలింగ్ గణనీయంగా పెరిగింది. వేతన జీవులు, తమ ఖాతాలను ఆడిట్ చేయించుకోవాల్సిన అవసరం లేని వారు ఐటీఆర్‌లను ఫైల్ చేయడానికి జూలై 31 ఆఖరు తేదీ. ఐటీఆర్ ఫైలింగ్‌లో ట్యాక్స్‌పేయర్లకు సహాయం అందించేందుకు తమ హెల్ప్‌డెస్క్ వివిధ మాధ్యమాల ద్వారా నిరంతరాయంగా పనిచేస్తోందని ఆదాయ పన్నుల విభాగం పేర్కొంది.

ఇండెక్స్ ఫండ్ ఎంపిక ఎలా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

మంచి ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకునేందుకు ఎటువంటి అంశాలను పరిశీలించాలి? – శశాంక్

మ్యూచువల్ ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియోని చూడాలి. ఇండెక్స్‌తో పోలిస్తే రాబడుల తీరు ఎలా ఉందన్నది పరిశీలించాలి. వ్యాల్యూ రీసెర్చ్ పోర్టల్‌లో అన్ని పథకాలకు సంబంధించి పనితీరు ప్యారా మీటర్లను పరిశీలించుకోవచ్చు. ఇండెక్స్‌తో పోలిస్తే పథకం పనితీరు ఎలా ఉందన్న సమాచారం కూడా లభిస్తుంది. కొంత ట్రాకింగ్ లోపం ఉండే అవకాశం లేకపోలేదు. అంటే ఇండెక్స్ 2 శాతం పెరిగితే.. ఫండ్ పెట్టుబడుల విలువ అదే కాలంలో 2.01 శాతం, 1.99 శాతంగా చూపించొచ్చు. ముఖ్యంగా ఎక్స్‌పెన్స్ రేషియో కీలకం అవుతుంది. రెండు ఇండెక్స్ పథకాల్లో ఒకటి 10 బేసిస్ పాయింట్లు చార్జ్ చేస్తుంటే, మరో పథకం 25 బేసిస్ పాయింట్లు చార్జ్ తీసుకుంటుంటే.. అప్పుడు 10 బేసిస్ పాయింట్ల పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవడమే సరైనది.

నేను స్వల్పకాలం కోసం పెట్టుబడి పెట్టాలని అనుకుంటున్నాను. ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు? – గోపాల్ రామ్

ఇన్వెస్టర్లలో చాలా రకాలు ఉంటారు. కొందరు కేవలం రాబడుల వృద్ధిని చూస్తుంటారు. కొందరు పెట్టుబడి ద్వారా పన్ను తగ్గించుకోవాలని భావిస్తుంటారు. కొందరు క్రమం తప్పకుండా (రెగ్యులర్) ఆదాయం కోసం ఇన్వెస్ట్ చేస్తుంటారు. కొందరు స్వల్పకాలం కోసం పెట్టుబడులు పెడుతుంటారు. అయితే స్వల్పకాలం కోసం పెట్టుబడులు పెట్టే వారు ప్రధానంగా తమ పెట్టుబడిని కాపాడుకోవడానికి మొదట ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. పెట్టుబడి భద్రంగా ఉన్నప్పుడే రాబడులు సాధ్యపడతాయి. ఈ విషయంలో ఇన్వెస్టర్ల ముందు పలు ఆప్షన్లు ఉన్నాయి. బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఇన్వెస్ట్ చేయడం ఒక మార్గం. బ్యాంకు సేవింగ్స్ ఖాతాలో ఉంచడం వల్ల వచ్చే రాబడి (3 శాతం) కంటే ఎఫ్‌డీలో వచ్చే రాబడే ఎక్కువ. ఎఫ్‌డీలు ఎంతో సురక్షితమైనవి. బ్యాంకులు సంక్షోభంలో పడినా, ఒక్కో డిపాజిట్ దారునికి రూ.5 లక్షల వరకు బీమా రక్షణ ఉంటుంది. డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ (డీఐసీజీసీ) రూపంలో ఆర్‌బీఐ ద్వారా ఈ బీమా సదుపాయం లభిస్తుంది. కానీ, ఈ తరహా సందర్భాలు చాలా అరుదనే చెప్పుకోవాలి. ఎఫ్‌డీల రూపంలో వచ్చే వడ్డీ ఆదాయం సంబంధిత పెట్టుబడిదారుడి వార్షిక ఆదాయానికి కలుస్తుంది. కనుక ఎఫ్‌డీపై వచ్చే రాబడి పన్ను వర్తించే ఆదాయం కిందకే వస్తుంది. ఒకవేళ 30 శాతం పన్ను పరిధిలో ఉంటే, అటువంటి వారికి ఎఫ్‌డీ మెరుగైన సాధనం అని చెప్పలేం. ఎందుకంటే వచ్చే 7 శాతం రాబడిలో 30 శాతం పన్ను చెల్లించడానికే వెళుతుంది. ఇక స్వల్పకాల పెట్టుబడుల కోసం మరో మార్గం డెట్ మ్యూచువల్ ఫండ్స్. డెట్ ఫండ్స్ నుంచి పెట్టుబడిని వెనక్కి తీసుకున్నప్పుడే రాబడులపై పన్ను పడుతుంది. డెట్ ఫండ్‌లో పెట్టుబడిని మూడేళ్ల వరకు ఉంచితే వచ్చే లాభంపై పన్ను 20 శాతంగా ఉండేది. ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మినహాయించుకునే అవకాశం కూడా ఈ ఏడాది మార్చి వరకు అమల్లో ఉంది. కానీ, ఈ ప్రయోజనాన్ని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. కనుక డెట్ ఫండ్స్‌లో పెట్టుబడుల కాల వ్యవధి ఎంతన్న దానితో సంబంధం లేకుండా వచ్చే రాబడి వార్షిక ఆదాయానికి కలుస్తుంది. కనుక పన్ను పరంగా ఎఫ్‌డీలకు సమానంగా డెట్ మ్యూచువల్ ఫండ్స్‌ను కూడా కేంద్రం మార్చేసింది. కనుక ఇన్వెస్టర్లు వీటిల్లో తమకు ఏది సౌకర్యం అనిపిస్తే దానినే ఎంపిక చేసుకోవచ్చు. కొన్ని వారాల నుంచి కొన్ని నెలల కోసం అయితే మంచి లిక్విడ్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఒక ఏడాది అంతకుమించిన కాలానికి అయితే అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్, అంతకుమించిన కాలానికి అయితే షార్ట్ డ్యురేషన్ ఫండ్‌ను పరిశీలించొచ్చు. డెట్ ఫండ్స్ అన్నవి రాబడులకు కానీ, పెట్టుబడికి కానీ హామీ ఇవ్వవు. కానీ, ఎఫ్‌డీల్లో పెట్టుబడి, రాబడికి హామీ ఉంటుంది. అందుకని ఒక వేళ డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేట్టు అయితే అధిక నాణ్యమైన పథకాన్ని ఎంపిక చేసుకోవాలి. తక్కువ నాణ్యమైన పేపర్లలో పెట్టుబడులు పెట్టే డెట్ ఫండ్స్‌లో రాబడులతోపాటు రిస్క్ ఎక్కువ. డిఫాల్ట్ రిస్క్ కూడా ఉంటుంది.

క్లుప్తంగా...

అంజన్న సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి


సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్.వి.భట్

మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని బీటీ కాలేజీ మైదానం వద్ద ఉన్న వరాల ఆంజనేయస్వామిని ఆదివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ట్రస్టు సభ్యులు స్వాగతం పలికారు. ప్రసాదాలు అందజేశారు.

పుష్పగిరిలో హైకోర్టు న్యాయమూర్తి


చెన్నకేశవస్వామి సన్నిధిలో జస్టిస్ డీఎస్ఎస్ సోమయాజులు దంపతులు

వల్లూరు: వైఎస్సార్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీఎస్ఎస్ సోమయాజులు ఆదివారం సందర్శించారు. పుష్పగిరి కొండపైన ఉన్న శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి సతీసమేతంగా చేరుకున్న ఆయనకు ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ప్రధాన అర్చకుడు అఖిల్ దీక్షితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ చెన్నకేశవస్వామి, లక్ష్మీదేవి, సంతాన మల్లేశ్వర స్వాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్ర పాద ఆలయాన్ని సందర్శించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


ఆలయం వెలుపల జస్టిస్ గోపాలకృష్ణ

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణ, గుజరాత్ ఆధ్యాత్మిక గురువు మొరారిబాపు, కేంద్ర సహాయశాఖ మంత్రి భారతీ ప్రవీణ్‌పవార్, డ్రమ్స్ శివమణి తదితరులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

16 నుంచి ఏపీఎల్ సీజన్-2

ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి



విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రెండో సీజన్‌ను ఆగస్టు 16 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం విశాఖలో జరిగింది. ఆయన మాట్లాడుతూ ఏసీఏ ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆంధ్ర క్రికెట్‌కు సేవలందించిన ఆటగాళ్లు, కోచ్‌లు, సెలక్టర్లు, అడ్మినిస్ట్రేటర్లకు అభినందనలు తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందించాలన్నారు. మహిళా క్రికెట్‌ను ఏసీఏ ప్రోత్సహిస్తోందన్నారు. దానిలో భాగంగానే ఉమెన్ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఐదేళ్లుగా ఏసీఏలో రోజువారీ వేతనంపై పనిచేస్తున్నవారిని పర్మినెంట్ చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాచకొండ రచనలు చైతన్య దీపికలు

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): తాడిత, పీడిత వర్గాల జీవిత మూలాలే కథా వస్తువులుగా సమాజంలోని ఎన్నో సమస్యలకు అక్షర రూపాన్నిచ్చి కథలుగా మలిచిన మహామనీషి రాచకొండ విశ్వనాథశాస్త్రి అని పలువురు ప్రముఖులు కొనియాడారు. ప్రముఖ న్యాయవాది, రచయిత ఆర్వీ శాస్త్రి 101వ జయంతి వేడుకలు విశాఖ బీచ్ రోడ్‌లోని కిర్లంపూడి దగ్గర ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నగర ప్రముఖులు, న్యాయవాదులు, రచయితలు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. శాస్త్రి జీవితం నేటి యువత ప్రగతిలో ఓ కరదీపికగా పనిచేస్తుందని, ఆయన రచనలు సామాజిక చైతన్యానికి గుర్తుగా నిలుస్తాయని కొనియాడారు. కార్యక్రమానికి ఆర్వీ శాస్త్రి జూనియర్, ప్రముఖ న్యాయవాది శిష్టా శ్రీనివాసమూర్తి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది చీమలపాటి శ్రీరామ్మూర్తి, ప్రముఖ రచయిత డాక్టర్ రఘురామారావు, న్యాయమూర్తి డాక్టర్ టీవీ రమణ, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, ఉపాధ్యక్షురాలు బీఎస్ లత తదితరులున్నారు.

భారీ ప్రాజెక్టులతో విశాఖ కళకళ

రేపు సీఎం జగన్ చేతుల మీదుగా ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన

జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అభివృద్ధిలో దూసుకెళుతున్న విశాఖ నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగస్టు 1వతేదీన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. నగర అభివృద్ధితో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన, గౌరవ ప్రదమైన జీవన ప్రమాణాల్ని అందించే లక్ష్యంతో ఇవి రూపుదిద్దుకున్నాయి. రూ.600 కోట్లతో రహేజా గ్రూప్ నిర్మిస్తున్న ఇనార్బిట్ మాల్‌కు మంగళవారం విశాఖలో శంకుస్థాపన చేయనున్న సీఎం జగన్ అదేరోజు జీవీఎంసీ పరిధిలో మరో 50 పనులకు భూమి పూజ చేయనున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉపాధి, నైపుణ్య అవకాశాల్ని కల్పించే నాలుగు ప్రాజెక్టులను కూడా ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించనున్నారు.

ఐటీ టవర్స్‌పై సానుకూలం..

ఆర్థిక రాజధానిగా విరాజిల్లుతున్న విశాఖ నగరం కార్యనిర్వాహక రాజధానిగా అడుగులు వేస్తోంది. సిటీ ఆఫ్ డెస్టినీగా పిలిచే విశాఖను విశ్వ నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రణాళికలు, ప్రాజెక్టులను అమలు చేస్తోంది. ఐటీ హబ్‌గా మార్చేందుకు బీచ్ ఐటీ కాన్సెప్ట్‌తో దిగ్గజ సంస్థలను ఆహ్వానించిన ప్రభుత్వం పర్యాటక రంగంలోనూ అదే ఒరవడిని అనుసరిస్తోంది. ఇప్పటికే అన్నవరం సమీపంలో రూ.350 కోట్లతో ఒబెరాయ్ లగ్జరీ రిసార్టుల ప్రాజెక్టుకు భూమి పూజ జరిగింది. తాజాగా దిగ్గజ సంస్థ రహేజా గ్రూప్ భారీ మాల్‌ని నిర్మించనుంది. మాల్ శంకుస్థాపనకు ఆహ్వానించేందుకు రహేజా గ్రూప్స్ ప్రెసిడెంట్ నీల్ రహేజా ఇటీవలే ముఖ్యమంత్రి జగన్‌తో సమావేశమయ్యారు. 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్న మాల్‌ని మూడేళ్లలోగా పూర్తి చేయాలని రహేజా లక్ష్యంగా నిర్దేశించుకుంది. దీనిద్వారా 5 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. ఇనార్బిట్ మాల్ నిర్మాణంలో భాగంగా ఐటీ టవర్స్‌ను కూడా ఏర్పాటు చేయాలని సీఎం జగన్ రహేజా గ్రూప్ ప్రతినిధులకు సూచించారు. దీనిపై కంపెనీ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

రూ.135.88 కోట్లతో జీవీఎంసీ ప్రాజెక్టులు

ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన అనంతరం అదే ప్రాంగణంలో విశాఖ ప్రజలకు మౌలిక సదుపాయాలు, నగర సుందరీకరణ, వివిధ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన పలు ప్రాజెక్టులకు సీఎం జగన్ భూమి పూజ చేయనున్నారు. అమృత్ 2.0, స్మార్ట్ సిటీ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.135.88 కోట్లతో చేపట్టనున్న 50 పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు. శివారు, జీవీఎంసీ విలీన ప్రాంతాలైన మధురవాడ, లంకెలపాలెం, గాజువాక, అనకాపల్లి తాగునీటి కష్టాలను తీర్చేలా పైప్‌లైన్ ప్రాజెక్టులు, మురికివాడల్లో అభివృద్ధి పనులు, రూ.30 కోట్లతో జీవీఎంసీ పరిధిలోని 10 చెరువుల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారు. రూ.6.4 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో యూరోపియన్ స్టైల్‌లో సాగర్‌నగర్, డిఫెన్స్ కాలనీ వద్ద నిర్మించనున్న ఈట్ స్ట్రీట్స్‌తో పాటు రూ.6 కోట్లతో స్మార్ట్ స్ట్రీట్, రూ.12 కోట్లతో విశాఖ నగరంలోని పలు ప్రధాన రహదారులు, జంక్షన్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు సంబంధించిన జీవీఎంసీ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు.


ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్


ఫార్మా ఇంక్యుబేషన్ సెంటర్-ఎలిమెంట్

ఉపాధి, నైపుణ్యాలను పెంచేలా..

- ఉత్తరాంధ్ర విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పించడమే కాకుండా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేలా సీఎం జగన్ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. అందులో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రూ.129 కోట్లతో చేపట్టిన కీలక ప్రాజెక్టులను సీఎం ప్రారంభించనున్నారు. అనంతరం ఏయూ విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొంటారు.
- ఏయూలో రూ.21 కోట్లతో 30,000 చ.అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఏయూ స్టార్టప్ అండ్ టెక్నాలజీ ఇంక్యుబేషన్ హబ్(అ-హబ్)ని సీఎం ప్రారంభించనున్నారు. ఇందులో ప్రస్తుతం 121 స్టార్టప్ కంపెనీలకు చోటు కల్పించారు.
- రూ.44 కోట్లతో 55 వేల చ.అడుగుల విస్తీర్ణంలో బయోటెక్, ఫార్మా, జెనోమిక్స్ ఇంక్యుబేషన్, టెస్టింగ్ ల్యాబ్ కోసం నిర్మించిన ఎలిమెంట్ (ఏయూ ఫార్మా ఇంక్యుబేషన్ అండ్ బయోలాజికల్ మానిటరింగ్ హబ్)ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు.
- రూ.35 కోట్లతో 60 వేల చ.అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన అల్గారిథమ్ (ఏయూ డిజిటల్ జోన్ అండ్ స్మార్ట్ క్లాస్ రూమ్స్ కాంప్లెక్స్)ని సీఎం జగన్ విద్యార్థులకు అందుబాటులోకి తేనున్నారు.
- ఐఐఎంతో ఒప్పందంలో భాగంగా రూ.18 కోట్లతో 25 వేల చ.అడుగుల విస్తీర్ణంలో ఇంటర్నేషనల్ బిజినెస్ అండ్ అనలిటిక్స్‌లో ప్రత్యేక కోర్సులందించేందుకు నిర్మించిన ఏయూ-సిబ్(ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్)ని సీఎం ప్రారంభించనున్నారు.
- రూ.11 కోట్లతో అవంతి సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా రూ.11 కోట్లతో మెరైన్ అగ్రికల్చర్, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్‌లో యువతకు నైపుణ్యం అందించేందుకు నిర్మించిన ఏయూ అవంతి ఆక్వాకల్చర్ ఇన్నోవేషన్ అండ్ స్కిల్ హబ్‌ని ముఖ్యమంత్రి జగన్ అందుబాటులోకి తీసుకురానున్నారు.

సరికొత్త విశాఖ ఆవిష్కృతం

విశాఖ అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యలతో సరికొత్త నగరం ఆవిష్కృతమవుతోంది. ఇప్పటికే భారీ ప్రాజెక్టులకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు కూడా మొదలయ్యాయి. పర్యాటక ప్రాజెక్టులతో పాటు ఐటీ సంస్థల రాకతో నగరం కళకళలాడుతోంది. ఆగస్టు 1న దాదాపు రూ.865 కోట్ల విలువైన కీలక ప్రాజెక్టులకు సీఎం జగన్ శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయనున్నారు.

– డా.మల్లికార్జున, జిల్లా కలెక్టర్

జీవీఎంసీ ప్రాజెక్టులు ఇలా..

నిధులు	అంచనా వ్యయం రూ.కోట్లలో	ఎన్ని పనులు?
అమృత్ 2.0	107.42	32
స్మార్ట్‌సిటీ	16.10	07
15వ ఆర్థిక సంఘం	12.36	11
మొత్తం	135.88	50

ఇనార్బిట్ మాల్ ప్రత్యేకతలివీ..

నిర్మిస్తున్న సంస్థ : రహేజా గ్రూప్
విస్తీర్ణం : 17 ఎకరాలు (6 లక్షల చ.అడుగులు)
ఎక్కడ : విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని సాలిగ్రామపురంలో
ఎవరి స్థలం : విశాఖపట్నం పోర్టు అథారిటీ
లీజు వ్యయం: 30 ఏళ్లకు రూ.125 కోట్లు
శంకుస్థాపన : ఆగస్టు 1వ తేదీన
పూర్తి : మూడేళ్ల వ్యవధిలో
నిర్మాణం ఇలా: రెండు బేస్‌మెంట్ ప్లస్ 3 స్టిల్ట్ ఫ్లోర్స్, 5 ఫ్లోర్లు రీటైల్ కోసం, 6వ ఫ్లోర్ మల్టీలెవల్ కార్ పార్కింగ్ కోసం, 7, 8వ ఫ్లోర్లు ఆఫీస్ స్పేస్ కోసం, 9వ ఫ్లోర్‌లో హోటల్ నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు

భూగోళం.. ఇక మండే అగ్నిగోళం

▶ మొదటి పేజీ తరువాయి

వరదలు విధ్వంసం సృష్టిస్తున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అలాగే చైనా, దక్షిణ కొరియా, బ్రెజిల్, అమెరికా ఈశాన్య ప్రాంతాలు, జపాన్, భారత్, పాకిస్తాన్‌లో ఆకస్మిక వరదలు సంభవిస్తాయని వారు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ఎడారి ప్రాంతాల్లో పగటిపూటతో పోలిస్తే రాత్రి సమయాల్లో వాతావరణం కాస్త చల్లబడుతుంది. కానీ, కాలిఫోర్నియాలోని 'డెత్ వ్యాలీ'లో రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. అక్కడ జూలై నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అలాగే వాయవ్య చైనాలోనూ రికార్డు స్థాయిలో 52.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు ఉత్తరార్ధ గోళంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో వడగాడ్పులు వీచాయి. ఫలితంగా అంటార్కిటికాలో కూడా పెద్ద ఎత్తున మంచు కరిగిపోయింది. అలాగే ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, పోలాండ్ దేశాలను వడగాడ్పులు ఉక్కిరిబిక్కిరి చేశాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

పొంచి ఉన్న కరువు ముప్పు..!

దక్షిణ ఐరోపా, ఉత్తర ఆఫ్రికా, ఆసియా దేశాలు వసంత కాలం చివరి నుంచి అత్యధిక వేడిని ఎదుర్కొన్నాయని యూరోపియన్ కోపర్నికస్ నివేదిక చెబుతోంది. అమెరికాలోని దక్షిణ రాష్ట్రాల్లో క్రమం తప్పకుండా 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించింది. గ్రీస్, ఇటలీ, క్రొయేషియా, అల్జీరియా, కెనడాలో కార్చిచ్చులు చెలరేగి అడవులను దహించాయి. నాడాలో ఏకంగా నాలుగు వారాల్లో 46 వేల చదరపు మైళ్ల అడవులు బూడిదయ్యాయి. 60 శాతం దేశాల్లోని అడవుల్లో మంటలు చెలరేగాయని నివేదిక తెలిపింది. వీటి ఫలితంగా 1950తో పోలిస్తే ప్రపంచ భూభాగంలో దాదాపు మూడో వంతు ఏటా కరువు సంభవిస్తుందని.. ఇది 10 లక్షల మందిని తీవ్ర ఆకలిలోకి నెడుతుందని శాస్త్రవేత్తల నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ఈ ఏడాది చివరితో పాటు 2024లో ఎల్‌నినో ప్రభావం గరిష్ట స్థాయికి చేరుకుంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఫలితంగా బ్రిటన్, ఐర్లాండ్, బాల్టిక్ సముద్రం, జపాన్ సముద్రం, పసిఫిక్, పశ్చిమ హిందూ సముద్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. కాగా, ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ మేర కట్టడి చేసేందుకు ప్రపంచ దేశాలతో కలిసి ఐక్యరాజ్యసమితి చర్యలు చేపడుతోంది.

సీ ఫుడ్ ఫెస్టివల్‌కు విశేష ఆదరణ

- 20 వేల మందికిపైగా సందర్శన

సాక్షి, అమరావతి: విజయవాడలో భూమి ఆర్గానిక్స్ సౌజన్యంతో మత్స్యశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన దక్షిణ భారత స్థాయి సీ ఫుడ్ ఫెస్టివల్ సక్సెస్ అయ్యింది. రోజూ 20కుపైగా వంటకాలతో ఏర్పాటు చేసిన అన్‌లిమిటెడ్ బఫెట్ కోసం మాంసాహార ప్రియులు భారీగా పోటెత్తారు. పులస చేపలతో పాటు ఖరీదైన కూనం, టూనా చేపలు, రొయ్యలు, పీతలతో తయారు చేసిన వివిధ రకాల వంటకాల రుచులను ఆస్వాదించారు. విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఈ ఫెస్టివల్‌లో సుమారు 20వేల మందికి పైగా పాల్గొన్నట్లు సమాచారం. ఆరోగ్యంలో కీలక పాత్ర పోషించే ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉండే మత్స్య ఉత్పత్తుల వినియోగంపై వచ్చిన ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించారు. మరో వైపు ఫిష్ ఆంధ్ర-ఫిట్ ఆంధ్రా బ్రాండింగ్‌తో స్థానిక వినియోగం పెంచేందుకు ఏర్పాటు చేస్తున్న హబ్స్ అండ్ స్పోక్స్ మోడల్‌పై అవగాహన కల్పించారు. ఫిష్ ఆంధ్ర ద్వారా వ్యాపార అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు వివరించారు. ఇదేరీతిలో భూమి ఆర్గానిక్స్ సౌజన్యంతో ఆగస్టు 11 నుంచి 13 వరకు నెల్లూరులో, 25 నుంచి 27 వరకు రాజమహేంద్రవరంలో, సెప్టెంబర్ 8 నుంచి 10 వరకు కర్నూల్‌లో, 28 నుంచి 30 వరకు విశాఖలో సీ ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహించేందుకు మత్స్యశాఖ సన్నాహాలు చేస్తోంది.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తోంది

ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, శివారెడ్డి


రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు శ్రీనివాసరావు, శివారెడ్డి, ఉల్లి కృష్ణ తదితరులు

మచిలీపట్నంటౌన్: ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరిస్తూనే.. మరికొన్ని డిమాండ్లను కూడా నెరవేర్చేందుకు సీఎం జగన్ సానుకూలంగా స్పందిస్తున్నారని ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, కె.వి.శివారెడ్డి చెప్పారు. ఆదివారం విజయవాడలో వారు.. ఉద్యోగులతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి అంచెలంచెలుగా పరిష్కరిస్తున్నారని చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్‌పై త్వరలోనే జీవో రాబోతోందన్నారు. సీఎం జగన్.. ఇంతటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవటం అభినందనీయమన్నారు. ఉద్యోగులపై సీఎం జగన్ ప్రేమాభిమానాలు చూపుతున్నారనే దానికి ఇది ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. 33 ఏళ్లుగా కార్పొరేషన్ కింద ఉన్న ఏపీ వైద్య విధాన పరిషత్ ఉద్యోగులను సీఎం జగన్ 010 పరిధిలోకి తెచ్చారని వివరించారు. ఈ ఉద్యోగులు గతంలో ఎప్పుడు జీతం పడుతుందో తెలియక ఇబ్బందులు పడేవారని.. ఇప్పుడు ప్రతి నెలా 1వ తేదీనే జీతం అందుకుంటున్నారని చెప్పారు. సీపీఎస్ కాకుండా జీపీఎస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని.. ఇది కూడా ఉపయోగకరమేనన్నారు. 71 డిమాండ్లను ప్రభుత్వానికి నివేదించగా.. 65 డిమాండ్లపై సానుకూలంగా స్పందించారని.. మిగిలిన వాటిని కూడా సీఎం జగన్ పరిష్కరిస్తారనే ఆశాభావం తమకు ఉందన్నారు. ఆగస్టు 21, 22 తేదీల్లో ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే సంఘం మహాసభలను జయప్రదం చేయాలని ఉద్యోగులను కోరారు. ఈ సభలకు సీఎం జగన్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు కూడా హాజరవుతున్నారన్నారు. సమావేశంలో ఏపీఎన్జీవో సంఘం నాయకులు ఉల్లి కృష్ణ, ఎ.వెంకటేశ్వరరావు, దారపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త కోర్టులతో సత్వర న్యాయం అందాలి

జ్యుడిషియల్ సిబ్బందికి హైకోర్టు న్యాయమూర్తుల సూచన

- విజయనగరంలో అదనపు సీనియర్ సివిల్ కోర్టు ప్రారంభం



అదనపు సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానాన్ని ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తులు

విజయనగరం లీగల్: విజయనగరం జిల్లాలో కొత్తగా ఏర్పాటైన న్యాయస్థానాల ద్వారా ప్రజలకు సత్వర న్యాయం అందాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు అభిలషించారు. ఈ దిశగా న్యాయాధికారులు, న్యాయవాదులు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. విజయనగరంలోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో కొత్తగా మంజూరైన అదనపు సీనియర్ సివిల్ కోర్టుని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ ఉపమాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ దుప్పల వెంకటరమణ ప్రారంభించారు. న్యాయసేవా సదన్‌లో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కార్యాలయాన్ని జస్టిస్ ఏవీ శేషసాయి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువ న్యాయవాదులకు తగిన శిక్షణ ఇచ్చి మెరికల్లాంటి న్యాయవాదులను అందించాలని సీనియర్ న్యాయవాదులకు సూచించారు. న్యాయవాదులు, న్యాయాధికారులు పరస్పరం గౌరవించుకోవడం ద్వారా సమాజానికి మేలు చేయగలమన్నారు. జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ జిల్లా కోర్టు భవన సముదాయాలకు రూ.99 కోట్లతో మంజూరైన కొత్త భవనాలను నాణ్యతగా నిర్మించేలా బార్ కౌన్సిల్, యంత్రాంగం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా జడ్జి బి.సాయి కళ్యాణచక్రవర్తి, రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనతో కరెంటు తీగలకు లింకేంటి!

- తప్పుడు వార్తలు రాస్తే సహించేది లేదు
- ప్రభుత్వ సూచనల మేరకు విద్యుత్ ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు
- డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల ప్రమాద మరణాలు తగ్గాయి
- రైతులకు భద్రత కోసం స్మార్ట్ మీటర్లతోనే రక్షణ పరికరాలు
- విశాఖ ఇరుకు సందుల్లో ముందే మరమ్మతులు
- ఈనాడు కథనంపై మండిపడ్డ సీఎండీలు పృథ్వీతేజ్, పద్మజనార్దనరెడ్డి, సంతోషరావు


పెదవేగిలో పొలాల మధ్య వైర్లు సరిచేస్తున్న సిబ్బంది

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో లక్షల కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న విద్యుత్ తీగలకు సీఎం పర్యటనతో లింకు పెట్టి ఈనాడులో ఆదివారం ప్రచురించిన కథనంపై ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, జె.పద్మజనార్దనరెడ్డి, కె.సంతోషరావు మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన ఆదేశాలతో విద్యుత్ ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, వాస్తవాలు దాచి తప్పుడు వార్తలు రాస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. విద్యుత్ ప్రమాదాల్లో 85 శాతానికి పైగా మరణాలకు పంపిణీ వ్యవస్థలోని లోపాలే కారణమని రాసిన వార్తలో నిజం లేదంటున్న సీఎండీలు 'సాక్షి'కి వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

'ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా చర్యలు'

ఇటీవల అనంతపురం జిల్లాలో చోటుచేసుకున్న ఘటన దృష్ట్యా విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు తగిన జాగ్రత్తలను ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా రైతులకు పగటి పూట 9 గంటల నాణ్యమైన నిరంతర విద్యుత్ ఇస్తున్నాం. డిస్కంలో ప్రతి విద్యుత్ ఉద్యోగికి సరైన శిక్షణ ద్వారా అవగాహన కల్పించి, భద్రతా పరికరాలు అందించి, ఉద్యోగుల ప్రమాదాలు తగ్గించాం. ఎలక్ట్రికల్ షార్ట్ పోల్స్, లాంగ్ స్పాన్ ఉన్న చోట్ల మిడిల్ పోల్స్ ఏర్పాటు, ఒరిగిన స్తంభాలను సరిచేయడం, విద్యుత్ నియంత్రికల ఎత్తు పెంచడం, ఎర్తింగ్ ఏర్పాటు వంటివి క్రమం తప్పకుండా చేస్తున్నాం. సబ్ స్టేషన్లు, లైన్ల నిర్వహణ, లక్షలాది విద్యుత్ స్తంభాల మరమ్మతు పనులను చేపడుతున్నాం. నగరాలు, పట్టణాల్లో ఎక్కువ జనసాంద్రత కలిగిన ప్రదేశాలు, వ్యాపార ప్రాంతాలు, ఇరుకు రోడ్లలో 30 ఏళ్లు దాటిన పోల్స్ , కండక్టర్స్ మార్చడం ద్వారా విద్యుత్ ప్రమాదాలు నివారించే ప్రయత్నం చేస్తున్నాం. విజయవాడ శివాలయం వీధిలో కండక్టర్ లేని ఎంసీసీబీ బాక్స్‌తో కూడిన ఓవర్ హెడ్ కేబుల్ ఏర్పాటు చేసే పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాం. వర్షాల వల్ల పెదవేగి మండలం పినకమిడి పొలాల్లో నీరు నిలిచిన కారణంగా ఒరిగిపోయిన స్తంభాలను సరిచేశాం. విశాఖపట్నం పాత పోస్టాఫీస్ ప్రాంతంలో లక్ష్మి థియేటర్ దగ్గర వాడవీధిలో పోల్‌కి పోల్‌కి మధ్యలో ఉన్న బేర్ కండక్టర్ తొలగించి ఎల్‌టీ ఏబీ కేబుల్ వైరు అమర్చాం. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇదో నిరంతర ప్రక్రియ. ఈ చర్యల వల్ల ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే విద్యుత్ ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి.


పృథ్వీతేజ్


పద్మజనార్దనరెడ్డి


సంతోషరావు

ప్రయాస్ కొత్తగా చెప్పిందేమీ లేదు

సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 9 గంటల నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించడం రైతులకు ఒక వరం. దీనివల్ల రైతులకు విద్యుత్ ప్రమాదాలు తగ్గడమే కాకుండా చేలకు నీటిని కావలసిన విధంగా వాడుకుని పంటలు సంవృద్ధిగా పండిస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు పెట్టాలని నిర్ణయించిన రోజే రైతులు, మోటార్ల భద్రతను దృష్టిలో పెట్టుకుని భద్రతా పరికరాలను ప్రభుత్వమే తన ఖర్చుతో పెట్టాలని నిర్ణయించింది. మినీయేచర్ సర్క్యూట్ బ్రేకర్ (ఎంసీబీ), ఎర్త్ పైప్ పెట్టడం వల్ల రైతుకు, మోటార్‌కు, ఎలక్ట్రికల్ సామగ్రికి భద్రత ఉంటుంది. వోల్టేజీ హెచ్చుతగ్గులను కెపాసిటర్ నివారిస్తూ మోటార్ సామర్థ్యం పెంచుతుంది. విద్యుత్ వృథా కాకుండా నివారిస్తుంది. ఇవన్నీ సీఎం జగన్ ఎప్పుడో ఆలోచించారు. ఇక్కడ ప్రయాస్ కొత్తగా చెప్పింది ఏమీ లేదు.

'కండక్టర్‌లు మార్చాం'

గతేడాది నవంబర్ నుంచి ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో ఎల్‌టీ లైన్ కండక్టర్‌ను 2,403 కిలోమీటర్లు, 11 కేవీ లైన్ కండక్టర్ 2,256 కిలోమీటర్లు, 33 కేవీ లైన్ కండక్టర్ 256 కిలోమీటర్లు, ఎల్‌టీ కేబుల్ 1,089 కిలోమీటర్ల మేర మార్చాం. ఒరిగిన ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు 6,873, 11 కేవీ విద్యుత్ స్తంభాలు 7,498, 33 కేవీ విద్యుత్ స్తంభాలు 3,254 కొత్తవి వేశాం. విద్యుత్ లైన్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎల్‌టీ లైన్ల పరిధిలో 3,317 చోట్ల, 11 కేవీ లైన్ల పరిధిలో 3,383 చోట్ల, 33 కేవీ లైన్ల పరిధిలో 860 చోట్ల ప్రమాదాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేశాం. రోడ్డు క్రాసింగ్‌ల వద్ద ఎల్‌టీ లైన్ పరిధిలో 19,068, 11 కేవీ లైన్ల పరిధిలో 10,763, 33 కేవీ లైన్ల పరిధిలో 954 విద్యుత్ స్తంభాలను సరిచేశాం. సబ్‌స్టేషన్ల పరిధిలో ప్రొటెక్షన్‌ను పటిష్టం చేయడం ద్వారా లైన్‌లో ఎక్కడైనా ప్రమాదం జరిగితే సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరా వెంటనే ట్రిప్ అయ్యేలా ఏర్పాటు చేశాం. ఈపీడీసీఎల్ పరిధిలో అన్ని విద్యుత్ ఉప కేంద్రాలకు, 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ లైన్లు 2020 అక్టోబర్ నుంచి ఇప్పటివరకు సర్వే చేసి సరిదిద్దాం. ఈ క్రమంలో 38,850 వాలిన విద్యుత్ స్తంభాలను సరిచేసి వేలాడే వైర్ల మధ్యలో 7,454 మధ్యస్థ స్తంభాలను వేశాం. 31,324 విరిగిపోయిన స్తంభాలను మార్చి 2,557 కిలోమీటర్ల మేర వేలాడుతున్న వైర్లను సరిచేశాం.

'తరచూ శిక్షణ ఇస్తున్నాం'

డిస్కంల పరిధిలో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లకు తరచుగా భద్రత, లైన్ మరమ్మతులపై శిక్షణ ఇస్తున్నాం. రెండు నెలలుగా కురుస్తున్న భారీ వర్షాలు, పెనుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడం, లైన్లు దెబ్బతినడం లాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఇటువంటి సమస్యలను క్షేత్రస్థాయి సిబ్బంది గుర్తించి వెంటనే వాటిని పరిష్కరిస్తున్నారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడం, దెబ్బతినడం , లైన్లు వేలాడుతుండటం వంటి సమస్యలను గుర్తిస్తే వినియోగదారులు వెంటనే 1912 కాల్ సెంటర్‌కు సమాచారం అందిస్తే వెంటనే మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) }
RNI No:TNTEL/2008/25943